
'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 15 సంచిక: 241

మంగళవారం 16-5-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | VIJAYAWADA | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAJURI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



టైటాన్స్ క్వాలిఫై..
ప్లే ఆఫ్స్‌కు గుజరాత్.. నిష్క్రమించిన సన్‌రైజర్స్ హైదరాబాద్ - 12లో




5 నెలల గరిష్టానికి మార్కెట్
సెన్సెక్స్ 318 పాయింట్లు అప్.. నిఫ్టీ 84 పాయింట్లు పైకి - 13లో



అరుదైన అంతరిక్ష శిల అరుదెంచే..
అత్యంత అరుదైన కాన్‌డ్రైట్ అంతరిక్ష శిల (గ్రహ శకలం) అమెరికా న్యూజెర్సీ రాష్ట్రంలోని ఓ ఇంట్లోకొచ్చి పడింది.
వివరాలు 6లో ▸



హాజీ సలీం... డ్రగ్ లార్డ్
అరేబియా తీరంలో పట్టుబడ్డ రూ. 25 వేల కోట్ల విలువైన 2.5 టన్నుల డ్రగ్స్ మోస్ట్ వాంటెడ్ డ్రగ్స్ స్మగ్లర్‌దేనని నిర్ధారణ.
వివరాలు 6లో ▸



ఖర్గేపై పరువు నష్టం దావా
బజరంగ్‌దళ్‌కు సంబంధించి ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేపై హిందూ సురక్ష పరిషత్ రూ.100 కోట్లకు పరువు నష్టం దావా దాఖలు చేసింది.
వివరాలు 6లో ▸



నేడు నియామక పత్రాలు
దేశవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన 71 వేల మందికి ప్రధాని మోదీ నేడు నియామక పత్రాలు అందజేస్తారు.
వివరాలు 6లో ▸

కరకట్ట నివాసం ఎవరిది బాబూ?

- అది ప్రభుత్వానిదేనని గతంలో అసెంబ్లీ సాక్షిగా చెప్పిన బాబు
- లింగమనేని రమేశ్ నుంచి పూలింగ్‌లో తీసుకున్నామని వెల్లడి
- అవును నిజమే... ప్రభుత్వానికిచ్చేశామని రమేశ్ అంగీకారం
- అది ప్రభుత్వానిదైనా... ఆ విషయం రికార్డుల్లో లేకపోవటమే చిత్రం
- సీఎంగా దిగిపోయాక కూడా అదే ఇంట్లో ఉంటున్న బాబు
- ప్రభుత్వ అనుమతి లేదు.. ప్రభుత్వానికి కనీసం సమాచారమూ లేదు
- ఇపుడు ఇన్నర్ రింగ్ రోడ్ స్కామ్‌లో భాగంగా జప్తు చేస్తున్న సీఐడీ
- చంద్రబాబు ఇంటినెలా జప్తు చేస్తారంటూ రామోజీ, ఎల్లోమీడియా ఆక్రందనలు
- బాబుపై కక్ష సాధిస్తున్నారంటూ టీడీపీ నేతల డ్రామాలు

2లో

మలుపు తిప్పిన ముఠా!

చంద్రబాబు బృందం చెప్పినట్టుగానే ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్

సీఆర్‌డీఏ అధికారులను దూషించి మరీ మార్పులు

- ఎల్లో గ్యాంగ్ భూములను అనుకుని వెళ్లేలా ప్రణాళిక
- అమరావతి మాస్టర్ ప్లాన్‌లోనూ ముందే అదే అలైన్‌మెంట్
- అనంతరం కన్సల్టెన్సీ ద్వారా అదే ప్లాన్‌కు ఆమోదం
- అమాంతం పెరిగిన బాబు, లింగమనేని, నారాయణ భూముల విలువ
- ఈ అవినీతి పాపంలో పవన్‌కూ పిడికెడు వాటా..
- గత సర్కారు పెద్దల బరితెగింపు నిర్వాకాలు సీఐడీ దర్యాప్తులో వెలుగులోకి



క్విడ్ ప్రోకోకు పక్కా ఆధారాలు
నాడు కరకట్ట అక్రమ కట్టడాన్నే కూల్చివేస్తామని బాబు హడావుడి: సజ్జల
2లో

సాక్షి, అమరావతి: అమరావతి ముసుగులో నారా చంద్రబాబునాయుడు సాగించిన భూదందాలో ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ అంశం ఓ అవినీతి అధ్యాయమేనని వెల్లడైంది. అలైన్‌మెంట్ ప్రతి మెలికలోనూ పచ్చ గ్యాంగ్ అవినీతి గుట్టు రట్టవుతోంది. టీడీపీ హయాంలో సీఆర్‌డీఏ చైర్మన్‌గా ఉన్న చంద్రబాబు, వైస్ చైర్మన్ పొంగూరు నారాయణ అవినీతి బాగోతాలు విస్తుపోయే రీతిలో ఉన్నాయి. చంద్రబాబు సన్నిహితుడైన లింగమనేని రమేష్ భూముల మార్కెట్ విలువ రూ.177.50 కోట్ల నుంచి వెంటనే రూ.877.50 కోట్లకు... రాజధాని నిర్మాణం అనంతరం ఏకంగా రూ.2,130 కోట్లకు చేరేలా ఇన్నర్‌రింగ్ రోడ్ అలైన్‌మెంట్‌ను ఖరారు చేయడం ఎల్లో గ్యాంగ్ బరి తెగింపు వ్యవహారాలకు నిదర్శనంగా నిలుస్తోంది. ఈ అవినీతి పాపంలో చంద్రబాబు తన దత్తపుత్రుడు పవన్ కల్యాణ్‌కు కూడా పిడికెడు వాటా ఇవ్వడం కొసమెరుపు. అవినీతికి బాటలు వేసిన ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ వెనుక

మిగతా 2వ పేజీలో ▶

పేదల ఇళ్ల స్థలాలపై అడ్డుపడలేం!

హైకోర్టు ఉత్తర్వులపై 'స్టే' ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరణ

- ఆర్–5 జోన్‌కు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లను రాజధానుల వ్యాజ్యంతో జత చేసిన ధర్మాసనం
- పెండింగ్ పిటిషన్లను ప్రస్తావించిన న్యాయస్థానం
- సీజేఐ సూచనలు తీసుకోవాలని రిజిస్ట్రీకి ఆదేశం.. గురువారం రోజు విచారణకు వచ్చే అవకాశం



2లో

''మేం ఉండే చోట పేదలుండటానికి వీల్లేదు!. వాళ్లకు ఇక్కడ స్థలాలిస్తే 'సామాజిక తూకం' దెబ్బతింటుంది'' అంటూ న్యాయస్థానాలకు వెళ్లి ఓడిపోయిన వారు... మరిన్ని కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ మరిన్ని కోర్టులకు వెళుతున్నారు తప్ప... అవి పేదల ఇళ్లే కదా అని వదిలేయటం లేదు. సోమవారం కూడా వీరు పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వకుండా కనీసం 'స్టే' మంజూరు చేయాలంటూ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. తమ తరఫున వాదించడానికి గతంలో భారత సొలిసిటర్ జనరల్, అటార్నీ జనరల్‌గా పనిచేసిన హరీశ్ సాల్వే, ముకుల్ రోహత్గీ వంటి సీనియర్ న్యాయవాదులను పెట్టుకున్నారంటే... వీరి వెనక ఎంతటి ఆర్థిక బలమున్న మనుషులున్నారో తేలిగ్గానే అర్థం చేసుకోవచ్చు. అసలు రాజధాని రైతుల పేరిట దాఖలు చేస్తున్న పిటిషన్లను ఇంతటి ఖరీదైన న్యాయవాదుల్ని పెట్టుకుని మరీ హైకోర్టుల్లోను, సుప్రీం కోర్టుల్లోను ఎలా నడిపిస్తున్నారనేది అందరికీ ఆశ్చర్యంగానే ఉంది. తెలుగుదేశం కూడా వీళ్ల పిటిషన్లకు ఇన్నేసి కోట్ల రూపాయలు ఎందుకు ఖర్చుపెడుతోందో... ఒక వంక అలా చేస్తూ మరోవంక రాజధాని ప్రాంతంలో ఆందోళనల పేరిట శాంతిభద్రతలకు విఘాతం కలిగించే స్థాయికి ఎందుకు వెళుతోందో అర్థం కాని విషయం. అసలు ఆ ప్రాంతంలో పేదలకు ఎట్టి పరిస్థితుల్లోనూ స్థలాలివ్వకూడదని చంద్రబాబు నాయుడు ఎందుకు అనుకుంటున్నారు? ఇదేమీ ఆయన సొంత రియల్ ఎస్టేట్ వెంచర్ కాదు కదా? ఇంత దారుణంగా వ్యవహరిస్తున్నా ఆయన్ని రామోజీరావు ఎందుకు వెనకేసుకొస్తున్నారు? రాజధాని ప్రాంతంలో పేదలకు ఓ కాలనీ ఉంటే తప్పా? వారూ అందరితో పాటు అక్కడ బతికితే తప్పేంటి?

జగజ్జననీ చిట్‌ఫండ్‌లో సీఐడీ సోదాలు

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో టీడీపీ నాయకుడు ఆదిరెడ్డి అప్పారావుకు చెందిన జగజ్జననీ చిట్‌ఫండ్ కంపెనీలో సీఐడీ అధికారులు మరోసారి సోదాలు నిర్వహించారు. పలు కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

14లో

ఎంపీ అవినాశ్‌రెడ్డికి సీబీఐ నోటీసులు

సాక్షి, హైదరాబాద్/పులివెందుల: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో భాగంగా మరోసారి విచారణకు హాజరుకావాలని ఎంపీ అవినాశ్ రెడ్డికి సీబీఐ నోటీసు జారీ చేసింది. మంగళవారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని సీబీఐ కార్యాలయంలో హాజరుకావాలని సూచించింది. అలాగే మరికొంతమందికి కూడా సీబీఐ నోటీసులు పంపించినట్లు సమాచారం.

మాటేసిన మృత్యువు

- ఏడుగుర్ని బలిగొన్న ఘోర ప్రమాదం
- 8 మందికి గాయాలు.. ముగ్గురి పరిస్థితి విషమం
- వేగంగా వస్తున్న వాహనాన్ని ఢీకొట్టిన కారు.. వైఎస్సార్ జిల్లా రైల్వే ఏటూరు సమీపంలో దుర్ఘటన

3లో


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

8 మంది నూతన ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారం

స్థానిక సంస్థల కోటాలో ఎన్నికైన 8 మంది సభ్యులు అందరూ వైఎస్సార్‌సీపీ వారే.. ప్రమాణం చేయించిన శాసన మండలి చైర్మన్ మోషేన్ రాజు

3లో


ప్రమాణ స్వీకారం అనంతరం శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజుతో నూతన ఎమ్మెల్సీలు

వరుసగా ఐదో ఏడాది కూడా..



- నేడు బాపట్ల జిల్లా నిజాంపట్నంలో వైఎస్సార్ మత్స్యకార భరోసా నగదు జమచేయనున్న సీఎం వైఎస్ జగన్
- 1,23,519 మత్స్యకార కుటుంబాలకు రూ.123.52 కోట్ల ఆర్థిక సాయం
- ఓఎన్‌జీసీ పైపులైన్‌తో ఉపాధి కోల్పోయిన 23,458 మందికి కూడా రూ.108 కోట్లు

2లో

చందాదారుల భద్రతే లక్ష్యంగా 'ఈ–చిట్స్'

- లాంఛనంగా ప్రారంభించిన స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు
- ఈ విధానంతో చిట్‌ఫండ్ కంపెనీల మోసాలను అరికట్టవచ్చు
- చిట్ సంస్థలతో వచ్చిన సమస్యలపై ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయవచ్చు

14లో

నిప్పుల కొలిమి

తీవ్రమైన వేడి ప్రాంతంగా రాష్ట్రంలోని దక్షిణ కోస్తా జిల్లాలు

- ఆ జిల్లాల్లోని అన్ని మండలాల్లోనూ 40 డిగ్రీలకుపైనే ఉష్ణోగ్రతలు
- అత్యధికంగా నెల్లూరు జిల్లా కొండాపురంలో 46.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- కనిష్ట ఉష్ణోగ్రతలు సైతం పెరుగుదల.. వచ్చే 2 రోజులు ఇంకా పెరగనున్న వేడి


నిర్మానుష్యంగా ఉన్న రాజమహేంద్రవరం మెయిన్ రోడ్డు

సాక్షి, అమరావతి: భానుడి విశ్వరూపంతో రాష్ట్రం నిప్పుల కొలిమిని తలపిస్తోంది. అధిక ఉష్ణోగ్రతలు, వడగాలులు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం అన్ని జిల్లాల్లోనూ (శ్రీ సత్యసాయి మినహా) ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటిపోయాయి. దక్షిణ కోస్తా జిల్లాల్లో అయితే ఎండ మండిపోయింది. కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, తూర్పు, పశ్చిమగోదావరి, ఏలూరు, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోని అన్ని మండలాల్లో 42 నుంచి 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవడాన్ని బట్టి అక్కడ ఎండ తీవ్రతను అంచనా వేయవచ్చు. మన్యం ప్రాంతంలోనూ

మిగతా 5వ పేజీలో ▶

ఉదయం నుంచే ఎండ తీవ్రత..

ఉదయం 6 గంటలకే మొదలవుతున్న ఎండ వేడి సాయంత్రం 6 గంటలు దాటినా కొనసాగుతోంది. ఉదయం 7 గంటలకే ఉష్ణోగ్రతలు 28 నుంచి 30 డిగ్రీలకు చేరుకుంటున్నాయి. మధ్యాహ్నం 12 గంటల సమయానికి 40 డిగ్రీలు, 2, 3 గంటల సమయానికి 44 నుంచి 46 డిగ్రీలకు పెరుగుతోంది. రాత్రిపూట కనిష్ట ఉష్ణోగ్రతలు సైతం 30 నుంచి 36 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి.



కర్ణాటక సీఎం అభ్యర్థిపై..

ఢిల్లీలో 'పవర్ ప్లే'

- పదవిపై పట్టువీడని ఇద్దరు నేతలు
- అధిష్టానం పిలుపుతో ఢిల్లీకి సిద్ధు
- ఆరోగ్య కారణాలతో రాష్ట్రంలోనే డీకే
- ఖర్గే చేతికి ఏఐసీసీ ప్రతినిధుల నివేదిక
- సోనియా, రాహుల్‌తో అధ్యక్షుని చర్చలు
- నేడు సాయంత్రంలోగా తుది నిర్ణయం!

6లో

ఇదండీ సంగతి



అన్నిటికీ తానే మార్గదర్శినని.. అలా అనీ అనీ హ్యాండిలా ఫిక్సయిపోయింది సార్!

మలుపు తిప్పిన ముఠా!

▶ మొదటి పేజీ తరువాయి

సాగిన గూడుపుఠాణీ దశలవారీగా ఇదిగో ఇలా సాగింది..!

అలైన్‌మెంట్‌ను ఆనుకుని భూములు

ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను మెలికలు తిప్పడం ద్వారా హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని రమేశ్ కుటుంబానికి చెందిన భూముల విలువ భారీగా పెరిగింది. కంతేరు, కాజాలో లింగమనేని కుటుంబానికి 355 ఎకరాలున్నాయి. మొదట రూపొందించిన అలైన్‌మెంట్ ప్రకారం ఆ భూములకు 3 కి.మీ. దూరంగా ఇన్నర్‌రింగ్ రోడ్డు నిర్మించాలి. అలైన్‌మెంట్ మార్పుతో ఆ భూములను ఆనుకుని ఉండేలా ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఖరారు చేశారు. ఆ ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను ఆనుకునే హెరిటేజ్ ఫుడ్స్‌కు చెందిన 9 ఎకరాలు ఒకచోట, ఒప్పందం చేసుకున్న నాలుగు ఎకరాలు మరో చోట ఉండటం గమనార్హం.

అమాంతం పెరిగిన విలువ

ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఖరారుకు ముందు లింగమనేని కుటుంబం ఆ ప్రాంతంలో ఎకరా భూమి రూ.8 లక్షల రిజిస్టర్ విలువ చొప్పున విక్రయించింది. మార్కెట్ ధర ప్రకారం ఎకరా రూ.50 లక్షలు ఉంది. అంటే ఆ భూముల మార్కెట్ విలువ రూ.177.50 కోట్లు. ఇక ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఖరారు తరువాత ఎకరం రూ.36 లక్షల రిజిస్టర్ విలువ చొప్పున విక్రయించింది. అంటే రిజిస్టర్ విలువే నాలుగున్నర రెట్లకుపైగా పెరిగింది. మార్కెట్ ధర ప్రకారం ఎకరా రూ.2.50 కోట్లు పలికింది. అంటే 355 ఎకరాల విలువ మార్కెట్ ధర ప్రకారం అమాంతంగా రూ.887.50 కోట్లకు పెరిగింది. అమరావతి నిర్మాణం పూర్తయితే సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో ఎకరా విలువ రూ.4 కోట్లకు చేరుతుందని నాడు ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబే ప్రకటించారు. ఇన్నర్ రింగ్ రోడ్డును ఆనుకుని ఉన్న భూముల విలువ ఎకరా రూ.6 కోట్లకు చేరుతుందని అంచనా వేశారు. అంటే అమరావతి నిర్మాణం పూర్తయితే ఆ 355 ఎకరాల విలువ ఏకంగా రూ.2,130 కోట్లకు చేరుతుందని అంచనా. ఆ ప్రకారం మార్కెట్ ధరను బట్టి హెరిటేజ్ ఫుడ్స్ 9 ఎకరాల విలువ రూ.4.50 కోట్ల నుంచి రూ.22.50 కోట్లకు పెరిగింది. అమరావతి నిర్మాణం పూర్తయితే రూ.54 కోట్లకు చేరుతుందని తేలింది. హెరిటేజ్ ఫుడ్స్ ఒప్పందం చేసుకున్న మరో నాలుగు ఎకరాల విలువ కూడా రూ.24 కోట్లకు చేరుతుంది.

అక్కడే పవన్ కల్యాణ్‌కు 2.40 ఎకరాలు

జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు కూడా ఈ ఇన్నర్‌రింగ్ రోడ్డు అవినీతి పాపంలో చంద్రబాబు పిడికెడు వాటా ఇచ్చారు. కాజాకు సమీపంలో ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌కు సమీపంలోనే పవన్‌కల్యాణ్‌కు 2.4 ఎకరాలున్నాయి. లింగమనేని కుటుంబం నుంచి ఆ భూములను ప్రభుత్వ ధర ప్రకారం ఎకరా రూ.8 లక్షలు చొప్పున కొనుగోలు చేసినట్లు చూపించారు. ల్యాండ్ పూలింగ్ నుంచి మినహాయింపు కల్పించిన భూమినే పవన్ కల్యాణ్‌కు ఇవ్వడం గమనార్హం.

కృష్ణా ఇవతలా అవినీతి మెలికలే

అమరావతి పరిధిలో ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ద్వారా చంద్రబాబు, లింగమనేని కుటుంబాల భూముల విలువ అమాంతం పెంచుకోగా కృష్ణానదికి ఇవతల విజయవాడ శివారులో నారాయణ తమ ఆస్తుల విలువ భారీగా పెంచుకున్నారు. సీఆర్‌డీఏ అధికారులు మొదట రూపొందించిన అలైన్‌మెంట్ ప్రకారం ఇన్నర్‌రింగ్ రోడ్డును గుంటూరు జిల్లాలోని అమరావతి నుంచి కృష్ణా జిల్లాలోని నున్న మీదుగా నిర్మించాల్సి ఉంది. అందుకోసం కృష్ణా నదిపై వంతెన నిర్మిస్తారు. గుంటూరు జిల్లాలోని నూతక్కి – కృష్ణా జిల్లా పెద్దపులిపర్రు మధ్య కృష్ణా నదిపై వంతెన నిర్మించి అక్కడ నుంచి తాడిగడప నుంచి ఎనికేపాడు మీదుగా నున్న వరకు ఇన్నర్‌రింగ్ రోడ్డు కొనసాగుతుంది. అయితే అలా నిర్మిస్తే నారాయణ విద్యా సంస్థల భవనాలను భూసేకరణ కింద తొలగించాల్సి వస్తుంది. ఈ అలైన్‌మెంట్‌పై నారాయణ నాడు సీఆర్‌డీఏ అధికారులపై తీవ్రస్థాయిలో ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. సీఆర్‌డీఏ సమావేశంలో అధికారులను పరుష పదజాలంతో దూషిస్తూ అలైన్‌మెంట్‌ను మార్చాలని ఆదేశించారు. దాంతో ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను 3 కి.మీ. తూర్పు దిశగా మార్చారు. ఆ ప్రకారం గుంటూరు జిల్లాలో రామచంద్రాపురం – కృష్ణా జిల్లా చోడవరం మధ్య వంతెన నిర్మించాలని ప్రతిపాదించారు. అక్కడ నుంచి పెనమలూరు మీదుగా నిడమానూరు నుంచి నున్న వరకు ఇన్నర్‌రింగ్ రోడ్డును నిర్మిస్తారు. నారాయణ కుటుంబానికి చెందిన 9 విద్యా సంస్థల భవనాలను ఆనుకుని ఉండేలా ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను ఖరారు చేశారు. తన విద్యా సంస్థల భూముల విలువ అమాంతం పెరిగేలా నారాయణ చక్రం తిప్పారు.

అటూ ఇటూ భారీగా కొనుగోలు


ఇన్నర్‌రింగ్ రోడ్డును ఎలా నిర్మించనున్నారో ముందుగానే తెలిసిన చంద్రబాబు, నారాయణ తమ కుటుంబ సంస్థలు హెరిటేజ్, రామకృష్ణ హౌసింగ్ లిమిటెడ్‌లతోపాటు తమ బినామీ లింగమనేని రమేష్ తన సంస్థల పేరిట భారీగా భూములు కొన్నారు. అవన్నీ ప్రతిపాదిత ఇన్నర్‌రింగ్ రోడ్డుకు అటూ ఇటూ ఉండటం గమనార్హం. సీఐడీ అధికారులు మంగళగిరి, పెదకాకాని, తాడికొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో భూముల రిజిస్ట్రేషన్లను పరిశీలించగా ఈ విషయం స్పష్టమైంది.



అమరావతి ఇన్నర్‌రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్‌లో మార్పులు
వైలెట్ కలర్: సీఆర్‌డీఏ అధికారులు మొదట రూపొందించిన అలైన్‌మెంట్
బ్లాక్ కలర్ : చంద్రబాబు ఆదేశాలతో మారిన అలైన్‌మెంట్. హెరిటేజ్ ఫుడ్స్. లింగమనేని భూములను ఆనుకొని రూపొందించిన అలైన్‌మెంట్
రెడ్ కలర్ : ఎస్‌టీయూపీ కన్సల్టెన్సీ ఖరారు చేసిన అలైన్‌మెంట్. హెరిటేజ్ ఫుడ్స్. లింగమనేని భూములను ఆనుకొని ఖరారు చేసిన అలైన్‌మెంట్.(మార్కింగ్ చేసిన భూములే హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని కుటుంబాలకు చెందినవి

అలైన్‌మెంట్ 1
సీఆర్‌డీఏ తొలుత రూపొందించింది

అమరావతి ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ నిర్ణయించేందుకు టెండర్ల ద్వారా కన్సల్టెన్సీతో నిమిత్తం లేకుండా పని ముగించాలని చంద్రబాబు, నారాయణ నిర్ణయించారు. దీంతో సీఆర్‌డీఏ అధికారులు 94 కి.మీ. పొడవుతో అమరావతి ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను రూపొందించారు. దీన్ని చూసి చంద్రబాబు, నారాయణ మండిపడ్డారు. ఎందుకంటే దాని ప్రకారం ఇన్నర్‌రింగ్ రోడ్డు పెదపరిమి, నిడమర్రు, చినవడ్లపూడి, పెదవడ్లపూడి మీదుగా వెళ్తుంది. చంద్రబాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని కుటుంబానికి చెందిన భూములకు 3 కి.మీ. దూరం నుంచి ఇన్నర్‌రింగ్ రోడ్డు నిర్మించాల్సి వస్తుంది. దీంతో తమ భూముల విలువ అమాంతం పెంచుకునేందుకు ఆ అలైన్‌మెంట్‌ను మార్చాలని ఆదేశించారు.



రెడ్ కలర్ : గుంటూరు, కృష్ణాజిల్లాలను కలుపుతూ కృష్ణానది మీదుగా సీఆర్‌డీఏ అధికారులు ఖరారు చేసిన ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్
గ్రీన్ కలర్ : నారాయణ ఆదేశాలతో కృష్ణా, గుంటూరు జిల్లాలను అనుసంధానిస్తూ ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో చేసిన మార్పులు

అలైన్‌మెంట్ 2
చంద్రబాబు ఆదేశాలతో రూపొందించారు

గత సర్కారు పెద్దల ఆదేశాలతో సీఆర్‌డీఏ అధికారులు ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో కీలక మార్పులు చేశారు. చంద్రబాబు, లింగమనేని కుటుంబానికి చెందిన వందలాది ఎకరాలున్న తాడికొండ, కంతేరు, కాజా ప్రాంతాలను పరిగణలోకి తీసుకుంటూ ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను 3 కి.మీ. దక్షిణానికి జరిపారు. హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని కుటుంబానికి కంతేరు, కాజాలో ఉన్న భూములను ఆనుకుని మరీ ఇన్నర్‌రింగ్ రోడ్డు నిర్మించేలా 97.50 కి.మీ. మేర అలైన్‌మెంట్‌ను రూపొందించారు. ఆ విషయాన్ని గోప్యంగా ఉంచారు.

అలైన్‌మెంట్ 3
కన్సల్టెన్సీ ద్వారా ఆమోదించింది

సింగపూర్‌కు చెందిన సుర్బానా జ్యురాంగ్ కన్సల్టెన్సీ ద్వారా రూపొందించిన అమరావతి మాస్టర్‌ప్లాన్‌లోనే ప్రతిపాదిత ఇన్నర్‌రింగ్ రోడ్ డిజైన్‌ను చంద్రబాబు ప్రభుత్వం ముందుగానే చేర్చింది. అంటే అప్పటికే ఇన్నర్‌రింగ్ రోడ్ అలైన్‌మెంట్ ఎలా ఉండాలన్నది నిర్ధారణ అయిపోయింది. అనంతరం ఇన్నర్‌రింగ్ రోడ్ అలైన్‌మెంట్‌ను రూపొందించేందుకు ఎస్టీయూపీ అనే ఓ కన్సల్టెన్సీని నియమించారు. మాస్టర్‌ప్లాన్‌లో పొందుపరిచిన అలైన్‌మెంట్‌కు అనుగుణంగానే అది ఉండాలని నిర్దేశించారు. అప్పటికే సీఆర్‌డీఏ ద్వారా తాము ఖరారు చేసిన అలైన్‌మెంట్‌నే ఎస్టీయూపీ కన్సల్టెన్సీ ద్వారా తెరపైకి తెచ్చి ఆమోదించారు. తాడికొండ, కంతేరు, కాజాలో హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని భూములను ఆనుకునే అలైన్‌మెంట్‌ను ఎస్టీయూపీ కన్సల్టెన్సీ ఖరారు చేసింది.



అమరావతి ఇన్నర్‌రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్‌లో మార్పులు

వైలెట్ కలర్ : సీఆర్‌డీఏ అధికారులు మొదట రూపొందించిన అలైన్‌మెంట్
బ్లాక్ కలర్: చంద్రబాబు ఆదేశాలతో మారిన అలైన్‌మెంట్. హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని భూములను ఆనుకొని రూపొందించిన అలైన్‌మెంట్
రెడ్ కలర్: ఎస్‌టీయూపీ కన్సల్టెన్సీ ఖరారు చేసిన అలైన్‌మెంట్. హెరిటేజ్ ఫుడ్స్ , లింగమనేని భూములను ఆనుకొని ఖరారు చేసిన అలైన్‌మెంట్.(మార్కింగ్ చేసిన భూములే హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని కుటుంబాలకు చెందినవి

వైఎస్సార్ మత్స్యకార భరోసా.. వరుసగా ఐదో ఏడాది కూడా..

సాక్షి, అమరావతి: వైఎస్సార్ మత్స్యకార భరోసా కింద వేట నిషేధ భృతిని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వరుసగా ఐదో ఏడాది కూడా రంగం సిద్ధంచేసింది. బాపట్ల జిల్లా నిజాంపట్నంలో మంగళవారం జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో ఈ సాయాన్ని జమచేయనున్నారు. మొత్తం 1,23,519 మంది మత్స్యకార కుటుంబాలకు మత్స్యకార భరోసా కింద రూ.123.52 కోట్లతో పాటు ఓఎన్జీసీ పైప్‌లైన్ ఏర్పాటుతో జీవనోపాధి కోల్పోయిన 23,458 మంది మత్స్యకారులకు కూడా రూ.108 కోట్ల ఆర్థిక సాయాన్ని జమచేయనున్నారు.



గతంతో పోలిస్తే ఆరు రెట్లు అధికం..

సముద్రంపై వేటకు వెళ్లే మత్స్యకారులకు వేట నిషేధ కాలంలో ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున వేట నిషేధ భృతి అందిస్తున్నారు. టీడీపీ ప్రభుత్వం తొలి రెండేళ్లలో రూ.2 వేలు చొప్పున ఇవ్వగా, ఆ తర్వాత రూ.4వేల చొప్పున ఇచ్చారు. అదీ కూడా మర, యాంత్రిక పడవలకే పరిమితం చేశారు. ఇలా సగటున 50వేల మందికి రూ.21 కోట్లు మాత్రమే ఇచ్చారు. కానీ, ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఈ భృతి రూ.10వేలకు పెంచడమే కాక.. మర, యాంత్రిక పడవలతో పాటు సంప్రదాయ పడవలపై వేట జరిపే మత్స్యకార కుటుంబాలకు కూడా చెల్లిస్తోంది. ఏటా సగటున రూ.110 కోట్లు చొప్పున చెల్లించింది. గతంతో పోలిస్తే ఇది దాదాపు ఆరు రెట్లు అధికం. ఇక చెప్పిన మాట ప్రకారం సరైన సమయానికి, వేట నిషేధ కాలంలోనే భృతి చెల్లిస్తూ వారికి అండగా నిలుస్తోంది ప్రస్తుత ప్రభుత్వం. నేడు అందిస్తున్న సాయంతో కలిపి ఒక్కో కుటుంబానికి సగటున రూ.50వేల చొప్పున ఈ నాలుగేళ్లలో రూ.538 కోట్ల భృతిని అందించారు.

డీజిల్ సబ్సిడీ గతం కంటే మిన్నగా..

టీడీపీ హయాంలో 1,100 బోట్లకు లీటర్ డీజిల్‌కు రూ.6 చొప్పున ఏటా సగటున రూ.12 కోట్లు ఆయిల్ సబ్సిడీ ఇచ్చేవారు. ప్రస్తుత ప్రభుత్వం వచ్చాక ఆ సబ్సిడీని రూ.9కి పెంచడమే కాక మత్స్యకారులకు స్మార్ట్ కార్డులు ఇచ్చారు. వీటి ద్వారా సబ్సిడీ మొత్తాన్ని మినహాయించుకుని మిగిలిన మొత్తాన్ని డీజిల్‌కు చెల్లించే వెసులుబాటు కల్పించింది. ఇలా ఏటా సగటున 20 వేల బోట్లకు రూ.25 కోట్లు చెల్లిస్తోంది.

విదేశీ జైళ్లలో మగ్గిన 23 మంది విడుదల

వేట చేస్తూ మరణించిన మత్స్యకార కుటుంబాలకు గత ప్రభుత్వం రూ.5లక్షల పరిహారం ఇస్తే ఈ ప్రభుత్వం దాన్ని రూ.10లక్షలకు పెంచింది. అంతే కాదు.. 2018లో పాకిస్తాన్ భద్రతా దళాలకు పట్టుబడగా, 13 నెలల పాటు కరాచీ జైలులో మగ్గిన 23 మత్స్యకారుల విడుదల కోసం కనీస ప్రయత్నం చేయకుండా టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. కానీ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చీరాగానే విదేశాంగ మంత్రిత్వ శాఖతో చర్చలు జరిపింది. వారిని పాకిస్థాన్ చెర నుండి విడిపించిన ఘనత వైఎస్ జగన్ ప్రభుత్వానిదే. మరోవైపు.. మత్స్యకారుల వలసల నివారణ, వారికి మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.3,767.48 కోట్లతో కొత్తగా 10 ఫిషింగ్ హార్బర్లు, ఆరు ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు, రూ.16వేల కోట్లతో నాలుగు పోర్టులను రాష్ట్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన నిర్మిస్తోంది. తద్వారా పెద్దఎత్తున ఉపాధి అవకాశాలకు బాటలు వేస్తోంది.

నేడు సీఎం జగన్ నిజాంపట్నం రాక

సాక్షి ప్రతినిధి, బాపట్ల : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం బాపట్ల జిల్లా పర్యటనకు రానున్నారు. రేపల్లె నియోజకవర్గంలోని నిజాంపట్నంలో జరిగే కార్యక్రమానికి ఆయన హాజరై బహిరంగ సభలో ప్రసంగిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో ఇచ్చే మత్స్యకార భరోసా మొత్తాన్ని ఉ.11.35 గంటలకు బటన్‌నొక్కి వారి ఖాతాల్లో జమచేస్తారు. లబ్ధిదారులతోనూ మాట్లాడతారు. ముఖ్యమంత్రి పర్యటనకు జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా నేతృత్వంలో అధికారులు అన్ని ఏర్పాట్లుచేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉ.9.00 గంటలకు తాడేపల్లి నుంచి బయల్దేరి తిరిగి మ.1.00కు ఇంటికి చేరుకుంటారు.

జీవనోపాధి కోల్పోయిన వారికి అండగా..

ఇక ఓఎన్జీసీ సంస్థ పైప్‌లైన్ పనుల కారణంగా జీవనోపాధి కోల్పోయిన కోనసీమ, కాకినాడ జిల్లాల్లోని 23,458 మత్స్యకార కుటుంబాలకు రూ.108 కోట్లు కూడా సీఎం జగన్ జమ చేస్తున్నారు. ఇప్పటివరకు వీరికి రూ.393.76 కోట్ల పరిహారం ఇచ్చారు. ఇలా ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత 2,43,649 మత్స్యకారులకు రూ.3,835.89 కోట్లు జమచేశారు. మరోవైపు.. ఫిష్ ఆంధ్ర బ్రాండ్ ద్వారా దేశీయ వినియోగం పెంచడంతోపాటు ఆక్వా రైతులకు, మత్స్యకారులకు మెరుగైన రేట్లు అందించడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా 26 ఆక్వా హబ్‌లు.. వాటికి అనుసంధానంగా 4,000 రిటైల్ దుకాణాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఇందులో 2,184 రిటైల్ దుకాణాలు అందుబాటులోకి వచ్చాయి. అంతేకాక.. మత్స్య, ఆక్వా రైతులకు సేవలు అందించేందుకు వీలుగా అభివృద్ధి చేసిన వెబ్ అప్లికేషన్ ఈ–మత్స్యకార్‌తోపాటు టోల్ ఫ్రీ నెంబర్ 155251ను ఇప్పటికే అందుబాటులోకి తీసుకొచ్చారు.

క్విడ్ ప్రోకోకు పక్కా ఆధారాలు

- నాడు కరకట్ట అక్రమ కట్టడాలన్నీ కూల్చేస్తామని చంద్రబాబు హడావుడి: సజ్జల
- వాటిల్లో ఒకటైన లింగమనేని బంగ్లాలోనే బాబు దిగడం బరితెగింపు కాదా?
- రమేష్‌కు డబ్బులు ఎక్కువై చంద్రబాబుకు ఉచితంగా బంగ్లా ఇచ్చారా?
- పూలింగ్ నుంచి 240 ఎకరాలను తప్పించినందుకే ఆ బహుమానం
- ఆ భూముల చెంతనే ఇన్నర్ రింగ్ రోడ్డు వెళ్లేలా అలైన్‌మెంట్‌లో మార్పులు
- భారీ లబ్ధికి ప్రతిఫలంగా హెరిటేజ్‌కు కారుచౌకగా నాలుగు ఎకరాలు కూడా
- సీఐడీ దర్యాప్తుతో ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్న చంద్రబాబు అక్రమాలు

సాక్షి, అమరావతి: రాజధాని అమరావతి భూముల వ్యవహారంలో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, రియల్ ఎస్టేట్ వ్యాపారి లింగమనేని రమేష్ క్విడ్ ప్రోకోకు పాల్పడినట్లు సీఐడీ పక్కా ఆధారాలతో తేల్చిందని ప్రభుత్వ సలహాదారు, వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. సీఐడీ దర్యాప్తులో వెల్లడైన అంశాల ఆధారంగానే చంద్రబాబు నివాసం ఉంటున్న కరకట్ట బంగ్లాను ప్రభుత్వం జప్తు చేసిందన్నారు. వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయంలో సజ్జల సోమవారం మీడియాతో మాట్లాడారు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చాక కృష్ణా కరకట్టపై ఉన్నవన్నీ అక్రమ కట్టడాలుగా ప్రకటించిన చంద్రబాబు వాటిల్లో ఒకటైన లింగమనేని బంగ్లాలో దిగడం బరితెగింపు కాదా? అని ప్రశ్నించారు. 'ఆరేళ్ల నుంచి పైసా అద్దె కూడా చెల్లించకుండా అక్రమ కట్టడంలో చంద్రబాబు ఎలా నివాసం ఉంటున్నారు? ప్రభుత్వం నుంచి ఇంటి అద్దె అలవెన్స్(హెచ్‌ఆర్‌ఏ) తీసుకోవడం తప్పు కాదా?' అని నిలదీశారు.

క్విడ్ ప్రోకో కాక మరేమిటి?

ముఖ్యమంత్రి సొంత నివాసం లేదా అద్దె తీసుకున్నట్లు ఒప్పందం ఉన్న ఇంటికి ప్రభుత్వ ఖర్చుతో భద్రతా ఏర్పాట్లు కల్పించవచ్చని సజ్జల తెలిపారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు అక్రమ కట్టడానికి మెరుగులు దిద్దడానికి, భద్రతా ఏర్పాట్లకు ప్రభుత్వ నిధులను ఎలా ఖర్చు చేశారని నిలదీశారు. లింగమనేని రమేష్‌కు డబ్బులు ఎక్కువై చంద్రబాబుకు ఇంటిని ఉచితంగా ఇచ్చారా? అని ప్రశ్నించారు. ఇక్కడే క్విడ్ ప్రోకోకు లింకులు దొరికాయన్నారు. భూసమీకరణ నుంచి లింగమనేనికి చెందిన సుమారు 240 ఎకరాలను తప్పించినందుకు ప్రతిఫలంగా హెరిటేజ్‌కు అత్యంత చౌకగా నాలుగు ఎకరాలతోపాటు కరకట్టలోని అక్రమ కట్టడాన్ని చంద్రబాబుకు కానుకగా ఇచ్చారని వెల్లడించారు. ఇది క్విడ్ ప్రోకో కాక మరేమిటని నిలదీశారు. అక్రమ కట్టడంలో నివసిస్తున్న చంద్రబాబు పర్యావరణ చట్టాలను ఉల్లంఘించి మురుగునీటిని



యథేచ్ఛగా కృష్ణా నదిలోకి వదలడంతోపాటు నదీ గర్భాన్ని తవ్వి ఇసుకను తరలించారని గుర్తు చేశారు. క్విడ్ ప్రోకోకు పాల్పడ్డారని ఆధారాలతో సహా తేలింది కాబట్టే అక్రమ కట్టడాన్ని ప్రభుత్వం జప్తు చేసిందని స్పష్టం చేశారు.

అలాగైతే ప్రభుత్వానికి ఎందుకు అప్పగించలేదు?

అక్రమ కట్టడాన్ని దేశభక్తితో ప్రభుత్వానికి అప్పగించానని లింగమనేని రమేష్ చెబుతున్నారని, అదే నిజమైతే అధికారం కోల్పోగానే చంద్రబాబు ఆ ఇంటిని ఖాళీ చేసి ప్రభుత్వానికి ఎందుకు అప్పగించలేదని సజ్జల ప్రశ్నించారు. చంద్రబాబు దివాలాకోరుతనం, బరి తెగింపు వ్యవహారాలకు కరకట్ట నివాసం చిరునామాగా నిలుస్తుందన్నారు. అమరావతి భూసమీకరణ పేరుతో చంద్రబాబు పాల్పడిన కుంభకోణం దేశంలో అతి పెద్దదన్నారు. లంక భూములతో సహా 50 వేల ఎకరాలు సమీకరించి లింగమనేని రమేష్, నారాయణ, హెరిటేజ్ భూములకు సమీపంలోనే వెళ్లేలా ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చి చంద్రబాబు రూ.వేల కోట్లు కొల్లగొట్టారన్నారు.

ఓటుకు రూ.రెండు వేలు ఎర

రాజధాని భూకుంభకోణంలో కొల్లగొట్టిన డబ్బులతోనే 2024 ఎన్నికల్లో ఓటుకు రూ.రెండు వేలు చొప్పున ఎరగా వేసేందుకు చంద్రబాబు సిద్ధమయ్యారని సజ్జల మండిపడ్డారు. అక్రమాలకు పాల్పడ్డారని సీఐడీ దర్యాప్తులో తేలడం వల్లే చంద్రబాబు నివాసం ఉంటున్న అక్రమ కట్టడాన్ని ప్రభుత్వం జప్తు చేసిందని పునరుద్ఘాటించారు. స్వతంత్ర సంస్థ సీఐడీ నిష్పక్షపాతంగా విచారణ చేస్తుందని ఓ ప్రశ్నకు సమాధానంగా పేర్కొన్నారు. సుప్రీం కోర్టు ఉత్తర్వులతో సీఐడీ దర్యాప్తులో చంద్రబాబు అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయన్నారు. రాజకీయంగా కక్ష సాధించాలనుకుంటే సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబును జైల్లో వేసేవారని మరో ప్రశ్నకు సమాధానంగా వ్యాఖ్యానించారు.

పేదల ఇళ్ల స్థలాలపై అడ్డుపడలేం!

సాక్షి, న్యూఢిల్లీ: రాజధాని అమరావతి ప్రాంతంలో 50 వేల మందికిపైగా నిరుపేదలకు ఇళ్ల స్థలాలను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సమర్థిస్తూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై స్టే విధించేందుకు సుప్రీంకోర్టు ధర్మాసనం నిరాకరించింది. సామాజిక న్యాయాన్ని పరిరక్షిస్తూ, రాజధానిలో అన్ని వర్గాల ప్రజలు నివసించేలా సీఆర్‌డీఏ పరిధిలోని 1,402.58 ఎకరాల్లో 25 లే అవుట్లు పేదల ఇళ్ల స్థలాల కోసం శరవేగంగా సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. దీనికి సంబంధించి ఆర్–5 జోన్‌కి వ్యతిరేకంగా, హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఊట్ల శివయ్య తదితరులు దాఖలు చేసిన పిటిషన్లు సోమవారం జస్టిస్ అభయ్.ఎస్.ఓకా, జస్టిస్ రాజేశ్ బిందాల్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం ముందుకొచ్చాయి. ఈ సందర్భంగా స్టే ఇచ్చేందుకు నిరాకరించిన ధర్మాసనం మూడు రాజధానుల పిటిషన్లతో దీన్ని జత చేస్తున్నట్లు పేర్కొంది. పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాదులు హరీష్ సాల్వే, ముకుల్ రోహత్గి వాదనలు వినిపిస్తూ ఏపీ ప్రభుత్వ నిర్ణయం సరికాదని, హైకోర్టు ఉత్తర్వులపై స్టే ఇవ్వాలని కోరారు. అమరావతి భూములకు ఈడబ్ల్యూఎస్ స్కీమ్‌ను వర్తింపజేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రైతులకు కోలుకోలేని నష్టాన్ని మిగులుస్తుందన్నారు. దీన్ని ఏపీ ప్రభుత్వ తరపు సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి వ్యతిరేకించారు. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిన విషయాన్ని కోర్టు దృష్టికి తెచ్చారు.

సీజేఐ సూచనల మేరకు..

రాజధానికి సంబంధించి ఇతర వ్యాజ్యాలు మరో ధర్మాసనం వద్ద పెండింగ్‌లో ఉన్న విషయాన్ని ఈ సందర్భంగా సుప్రీం ప్రస్తావించింది. ఆయా పిటిషన్లతో వీటిని జత చేస్తామని పేర్కొంటూ శుక్రవారం లోపు విచారణ జరిగేలా చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రీని ఆదేశించింది. దీనిపై సీజేఐ సూచనలు తీసుకుని జస్టిస్ జోసెఫ్ ధర్మాసనం ముందున్న పిటిషన్లతో కలిపి విచారణ జరిగేలా చర్యలు తీసుకోవాలంది. ఈ కేసులో కేవియట్ దాఖలు చేసిన మస్తాన్ వలీ తరపు న్యాయవాది అభిజిత్‌సేన్ గుప్తా కోర్టుకు హాజరయ్యారు. ఈ పిటిషన్లు గురువారం విచారణకు వచ్చే అవకాశం ఉంది.

పేదల విజయం

అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాలివ్వకుండా కొంతమంది సుప్రీంకోర్టును ఆశ్రయించారని, కోర్టు స్టే ఇచ్చేందుకు నిరాకరించడం పేదల విజయమని అదనపు అడ్వొకేట్ జనరల్ సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం సుప్రీం కోర్టు వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. రాజధానిలో పేదలకు ఇళ్ల స్థలాలను కేటాయించాలని సీఆర్‌డీఏ చట్టంలోనే ఉందన్నారు. ఒకసారి భూములిచ్చాక వాటిపై ప్రభుత్వానికే హక్కులుంటాయన్నారు.

కరకట్ట నివాసం ఎవరిది బాబూ?

(సాక్షి, అమరావతి) : ఇంతకీ కరకట్ట నివాసం ఎవరిది? చంద్రబాబుదా... లేక ప్రభుత్వానిదా? ''ఆ ఇంటికి సంబంధించి అవినీతికి తావెక్కడుంది? ఎందుకంటే ఆ ఇల్లు ప్రభుత్వానిది. లింగమనేని రమేశ్ నుంచి ల్యాండ్ పూలింగ్‌లో భాగంగా తీసుకున్నాం. ఒకవేళ ఇవ్వకపోయి ఉంటే భూసేకరణ ద్వారా తీసుకుని ఉండేవాళ్లం'' అని నేరుగా చంద్రబాబే.. సాక్షాత్తూ అసెంబ్లీలో చెప్పారు. ఇక లింగమనేని కూడా... ఆ ఇల్లు పూలింగ్‌లో తాను ప్రభుత్వానికి ఇచ్చేశానని, అక్కడ భారీ భవంతులు కడితే తనకెంతో సంతోషమని కూడా చెప్పారు. వీళ్ల మాటలకు వీడియో సాక్ష్యాలూ ఉన్నాయి.

ఇక్కడ అసలు ప్రశ్నేమిటంటే... : ఆ ఇల్లు ప్రభుత్వానిది అయినపుడు ప్రభుత్వ రికార్డుల్లో ఆ సంగతి ఉండాలి కదా? ముఖ్యమంత్రి పదవి నుంచి దిగిపోయాక కూడా చంద్రబాబు అందులో ఉంటున్నారంటే... అందుకు ప్రభుత్వ అనుమతి తీసుకోవాలి కదా? అసలు ఆ ఇల్లు ప్రభుత్వానిదన్న సంగతి ప్రభుత్వ రికార్డుల్లోనే లేదంటే ఏమనుకోవాలి? వీళ్లంతా కలిసి ఎంతటి దొంగల రాజ్యాన్ని నడిపించారో తెలియటం లేదా? ప్రభుత్వాస్తుల్ని కూడా ప్రయివేటు ఆస్తుల్లా ఎలా మార్చేసుకున్నారో తెలియటం లేదా?


చంద్రబాబు చెబుతున్న దాని ప్రకారం అది ప్రభుత్వ ఆస్తే అయినపుడు... : ప్రభుత్వం ఇపుడు ఇన్నర్ రింగ్‌రోడ్ కుంభకోణంలో


చంద్రబాబు కరకట్ట నివాసం

భాగంగా ఆ ఇంటిని జప్తు చేస్తుంటే ఉలుకెందుకు? అదేదో చంద్రబాబు సొంత ఆస్తిలా ఫీలవుతూ... 'ఈనాడు' దుర్మార్గపు రాతలెందుకు? బాబును టార్గెట్ చేస్తున్నారంటూ రామోజీ శోకాలెందుకు? ఇదంతా రాజకీయ కక్ష సాధింపేనంటూ తెలుగుదేశం డ్రామాలెందుకు? ప్రభుత్వ ఆస్తిని ప్రభుత్వం జప్తు చేస్తుంటే వీళ్లంతా ఎందుకింత దుష్ప్రచారానికి తెగిస్తున్నారు? ఇంకెన్నాళ్లు బాబూ ఈ డ్రామాలు?

నాడు అసెంబ్లీలో చంద్రబాబు చెప్పిందిదీ.. : ప్రజా వేదిక నాది కాదు. ప్రభుత్వానిది. నేనుంటున్న భవనం నాది కాదు. రమేష్ అనే డెవలపర్‌ది. నేను తాత్కాలికంగా ఉంటున్నాను. నేనొక టెనెంట్ (అద్దెకుంటున్న వాడిని).

ప్రెస్‌మీట్‌లో చంద్రబాబు చెప్పిందిదీ..:



గ్యాస్ ఇచ్చామని ప్రతిఫలంగా ఇల్లు ఇచ్చారని ఆరోపించారు. ఇల్లు ఇవ్వడమేంటి? అది గవర్నమెంట్ ఇల్లు. నేనున్నానంటే..అది గవర్నమెంట్ ఇల్లు కాబట్టి ఉన్నాను. నేను మొదటి రోజే చెప్పాను. దిస్ ప్రాపర్టీ బిలాంగ్స్ టు గవర్నమెంట్. నువ్ ఇచ్చినా ఇవ్వకపోయినా తీసుకుంటాం. ఇస్తే ల్యాండ్ పూలింగ్‌లో తీసుకుంటాం. ఇవ్వకపోతే లాండ్ అక్విజిషన్‌లో తీసుకంటాం. టెంపరరీగా నేను ఉండాలి. కార్యక్రమాలు స్టార్ట్ చేయాలి కాబట్టి నేను అక్కడ ఉంటున్నా. కట్టకు అవతల ఉండే ల్యాండ్ అంతా, కట్టడాలన్నీ పోయి టూరిజం, మిగతావన్నీ వస్తాయి. మాస్టర్ ప్లాన్‌లో కూడా నోటిఫై చేశారు.

లింగమనేని రమేష్ విలేకరులతో చెప్పిందిదీ.. :



ప్రభుత్వం ఆ భవనాన్ని పూలింగ్‌లో తీసుకుంది. దేశంపై భక్తితో ఇచ్చేశాను. నాకు ఆ భవనంతో ఏ రకమైన సంబంధం లేదు.

క్లుప్తంగా...

ఏపీసీజెడ్ఎంఏ బిల్డింగ్ ప్రపోజల్ సమావేశాలు నిర్వహించండి

పర్యావరణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి విశాఖ ఎంపీ వినతిపత్రం

సాక్షి, అమరావతి: ఏపీసీజెడ్ఎంఏ (ఏపీ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ) బిల్డింగ్ ప్రపోజల్ సమావేశాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని పర్యావరణ, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్‌ను విశాఖపట్నం ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కోరారు. ఈ మేరకు సచివాలయంలో సోమవారం ఎంపీ ఆయనకు వినతిపత్రం అందించారు. రాష్ట్ర ప్రభుత్వం విశాఖను ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేసేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నదని, దీంతో రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాలు నగరంలో బాగా అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర స్థాయిలో ఏపీజీజెడ్ఎంఏ బిల్డింగ్ ప్రపోజల్ రాష్ట్ర స్థాయి సమావేశాలు నెలకు ఒకసారి జరగాల్సి ఉందని, కానీ గత 7 నెలలుగా ఈ సమావేశాలు జరగలేదని తెలిపారు. దీనివల్ల విశాఖపట్నంలో కొత్తగా నిర్మితమవుతున్న భవనాలకు ఎన్‌వోసీ, సీఆర్‌జెడ్ క్లియరెన్స్‌లు ఇవ్వడం లేదని, దీనివల్ల బిల్డర్లు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు.

విద్యుత్ కోతలు లేవు

- సాంకేతికలోపంతో కేవలం 7 నిమిషాలే సరఫరా ఆగింది
- ఏపీఈపీడీసీఎల్ శ్రీకాకుళం సర్కిల్ ఎస్ఈ దైవప్రసాద్

సాక్షి, అమరావతి: శ్రీకాకుళం జిల్లాలో అనధికార విద్యుత్ కోతలు అమలుచేయడం లేదని ఆంధ్రప్రదేశ్ తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) శ్రీకాకుళం సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ) ఎల్.దైవప్రసాద్ తెలిపారు. విద్యుత్ కోతలంటూ ఒక పత్రికలో ప్రచురించిన కథనం పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. టెక్కలిలోని 200 పడకల జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఆదివారం సాయంత్రం 5.15 గంటల నుంచి 6 గంటల వరకు కరెంటు పోవడంతో సెల్‌ఫోన్ల వెలుగులో చికిత్స చేశారని పేర్కొనడంలో వాస్తవం లేదని తెలిపారు. కె.వి.రావివలస టౌన్-1 ఫీడర్ ఎస్ఎస్ 146 ట్రాన్స్‌ఫార్మర్ ఏబీ స్విచ్ వద్ద ఏర్పడిన సాంకేతిక లోపాన్ని సరిదిద్దేందుకు లైన్ క్లియరెన్స్ తీసుకుని సాయంత్రం 5.55 నుంచి 6.02 గంటల వరకు మరమ్మతుచేసి, కేవలం ఏడు నిమిషాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు తెలిపారు. పచ్చ పత్రికలో రాసినట్లు సాయంత్రం 5.15 నుంచి 6 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడిందనడం పచ్చి అబద్ధమని పేర్కొన్నారు. రాష్ట్రంలో డిమాండ్‌కు తగినంత విద్యుత్తు అందుబాటులో ఉండటం వల్ల జిల్లాలో ఎటువంటి ఎమర్జెన్సీ లోడ్ రిలీఫ్ విధించడం లేదని స్పష్టం చేశారు.

సీఎం ఆలోచనతో ఆక్వా రైతుకు మేలు

మంత్రులు పెద్దిరెడ్డి, బొత్స, సీదిరి





సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆలోచనలతో రాష్ట్రవ్యాప్తంగా ఆక్వా రైతులకు మేలు జరుగుతోందని ఆక్వా సాధికారిత కమిటీ సభ్యులు, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బొత్స సత్యనారాయణ, సీదిరి అప్పలరాజు చెప్పారు. 'ఈ ఫిష్' సర్వేతో లక్షలాది అర్హులైన చిన్న ఆక్వా రైతులకు ప్రభుత్వ సబ్సిడీ చేరువైందని తెలిపారు. సోమవారం విజయవాడలో జరిగిన ఆరో ఆక్వా సాధికారిత కమిటీ సమావేశంలో మంత్రులు మాట్లాడుతూ.. ఆక్వా జోన్ పరిధిలో 10 ఎకరాల్లోపు సాగు చేస్తున్న ప్రతి రైతుకు ప్రభుత్వం విద్యుత్ సబ్సిడీ ఇస్తోందన్నారు. ఇందులో భాగంగా ఈ ఫిష్ సర్వే ద్వారా రాష్ట్రంలో 46,445 మంది రైతులను అర్హులుగా నిర్ధారించామని చెప్పారు. దాదాపు 3,27,575 ఎకరాలకు విద్యుత్ సబ్సిడీగా ఏటా రూ.672.61 కోట్లు అందిస్తున్నట్టు వివరించారు. ఈ ఫిష్ సర్వేకు ముందు ఆక్వా జోన్ పరిధిలో 1.90 లక్షల ఎకరాలకు సబ్సిడీ అందితే, సర్వే తర్వాత 3.27 లక్షల ఎకరాలకు సబ్సిడీ అందుతోందన్నారు. ఎక్కువ మంది చిన్న రైతులు ఆక్వా జోన్ పరిధిలోకి రావడంతో వారికి మేలు జరుగుతోందన్నారు.

మాటేసిన మృత్యువు

వైఎస్సార్ జిల్లా ఏటూరు సమీపంలో దుర్ఘటన



వాహనంలో ఇరుక్కుపోయిన మృతదేహాలను బయటకు తీస్తున్న స్థానికులు

జమ్మలమడుగు/తాడిపత్రి అర్బన్/అనంతపురం అర్బన్: వారంతా బంధువులు. వేసవి సెలవులు కావడంతో దైవదర్శనం కోసం తిరుమల వెళ్లారు. శ్రీవారి దర్శనానంతరం తిరుగు పయనమయ్యారు. వీరు ప్రయాణిస్తున్న తుఫాన్ వాహనాన్ని మృత్యువు రూపంలో వచ్చిన లారీ ఢీకొనడంతో ఏడుగురు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. మరో 8 మంది తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు. వైఎస్సార్ జిల్లా రైల్వే కొండాపురం మండలం ఏటూరు గ్రామంలోని చిత్రావతి బ్రిడ్జి సమీపంలో సోమవారం తెల్లవారుజామున ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. అనంతపురం జిల్లా తాడిపత్రి కృష్ణాపురం మూడో రోడ్డులో ఉంటున్న వెంకటలక్ష్మమ్మ(55), తన కుమారుడు సునీల్‌కుమార్‌రెడ్డి (27), అక్కాచెల్లెళ్ల కుటుంబాలతో కలిసి తుఫాన్ వాహనంలో ఈ నెల 13న తాడిపత్రి నుంచి తిరుమల వెళ్లారు. శ్రీవారి దర్శనం చేసుకుని ఆదివారం రాత్రి తాడిపత్రికి తిరుగు పయనమయ్యారు. వీరు ప్రయాణిస్తున్న వాహనం వైఎస్సార్ జిల్లా రైల్వే కొండాపురం మండలంలోని ఏటూరు గ్రామ సమీపంలోకి రాగా.. తాడిపత్రి నుంచి రైల్వే కొండాపురం వైపు ఐరన్ ఓర్ లోడుతో వెళ్తున్న లారీ ఢీకొంది.

ఏడుగురు దుర్మరణం.. 8 మందికి గాయాలు

ఈ ఘోర ప్రమాదంలో తాడిపత్రిలోని కృష్ణాపురం మూడో రోడ్డుకు చెందిన కంచం రెడ్డి వెంకట లక్ష్మమ్మ (55), ఆమె కుమారుడు సునీల్‌కుమార్‌రెడ్డి (27), వైఎస్సార్ జిల్లా మైలవరానికి చెందిన మార్తల సుమలత (38), బళ్లారికి చెందిన కాటసాని సుభద్ర (35), సుభద్ర కుమారుడు లిఖిత్‌కుమార్‌రెడ్డి (11), ఎన్.లక్ష్మీదేవి అలియాస్ బుజ్జి (38), తుఫాన్ వాహన డ్రైవర్ సుధాకర్‌రెడ్డి (31) అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడిన వారిలో బి.నరసింహారెడ్డి, అతడి భార్య జయలక్ష్మి, కుమార్తె జి.ఆదిలక్ష్మి, మనుమళ్ల జి.మల్లికార్జునరెడ్డి, జి.యశ్వంత్‌రెడ్డి, మేఘనారెడ్డి, శిల్పారెడ్డి, కె.భాస్కర్‌రెడ్డిలకు గాయాలు కాగా.. దర్శిత్‌రెడ్డి అనే చిన్నారి ప్రమాదం నుంచి క్షేమంగా బయటపడ్డాడు. సమాచారం అందుకున్న వైఎస్సార్ జిల్లా తాళ్లపొద్దుటూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి.. అనంతరం అనంతపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో భాస్కర్‌రెడ్డి, మేఘనరెడ్డి, శిల్ప పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగళూరుకు తరలించినట్టు తెలిసింది. తుఫాన్ వాహనం నుజ్జునుజ్జుకాగా.. మృతదేహాలు అందులో చిక్కుకుపోయాయి. స్థానికుల సాయంతో మృతదేహాలను బయటకు తీసిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఘటన అనంతరం లారీ డ్రైవర్ వాహనాన్ని అక్కడే వదిలి పరారైనట్లు తెలుస్తోంది.



ప్రమాదానికి కారణమైన లారీ

మట్టిని కుప్పగా పోయడంతో..

మృతులు, ప్రమాదం బారిన పడిన వారు వైఎస్సార్ జిల్లా కొండాపురం మండలం నేదరపేట గ్రామానికి చెందిన అక్కాచెల్లెళ్ల కుటుంబాలకు చెందినవారు. వీరంతా అనంతపురం జిల్లా తాడిపత్రి, కర్ణాటక రాష్ట్రం బళ్లారిలోని కంప్లి ప్రాంతానికి వెళ్లి స్థిరపడ్డారు. వేసవి సెలవులు కావడంతో వీరంతా కలిసి తాడిపత్రి నుంచి తిరుపతి వెళ్లి తిరుగు ప్రయాణంలో ప్రమాదం బారినపడ్డారు. చిత్రావతి నది బ్రిడ్జి వద్ద రోడ్డుకు గుంతలు తీసి మట్టిని కుప్పగా పోశారు. బళ్లారి నుంచి నెల్లూరుకు ఐరన్ ఓర్ తీసుకెళుతున్న లారీ తాడిపత్రి వైపు నుంచి వేగంగా వెళుతుండగా, ఎదురుగా వస్తున్న లారీని తప్పించేందుకు తుఫాన్ వాహన డ్రైవర్ సుధాకర్‌రెడ్డి (31) బ్రేక్ వేశాడు. అప్పటికే ఆలస్యం కావడంతో ఎదురుగా వచ్చిన లారీ తుఫాన్ వాహనాన్ని ఢీకొట్టింది.

టీ తాగినా.. బతికేవారు

ఆదివారం రాత్రంతా వాహనం నడిపిన డ్రైవర్ సుధాకర్‌రెడ్డితో పాటు అందులో ప్రయాణిస్తున్న వారు టీ తాగడం కోసం కొండాపురం గ్రామంలో తెల్లవారుజామున 5 గంటల సమయంలో వాహనాన్ని ఆపారు. అక్కడ టీ దుకాణాలను అప్పుడే తెరవగా.. టీ కాసేందుకు కొంత సమయం పడుతుందని దుకాణదారులు చెప్పారు. అక్కడి నుంచి మరో 25 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తే ఇళ్లకు వెళ్లిపోతామన్న ఉద్దేశంతో అందరూ వాహనంలో బయలుదేరారు. కొద్దిసేపటికే చిత్రావతి బ్రిడ్జికి సమీపంలో మలుపు వద్ద ఈ ఘోరం జరిగింది. ప్రమాదం విషయం తెలిసిన వెంటనే పోలీస్ డివిజన్ అధికారి ఎస్.నాగరాజు, రెవెన్యూ అధికారి జి.శ్రీనివాసులు, ఆర్టీఏ అధికారులు డీవీ ప్రసాద్, వేణు, నేషనల్ హైవే అధికారులు విజయభాస్కర్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్షతగాత్రులను వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి హర్షవర్దన్ రెడ్డి, రమేష్‌రెడ్డి పరామర్శించి.. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారికి, తీవ్రంగా గాయపడిన వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎక్స్‌గ్రేషియా ప్రకటించారని అనంతపురం కలెక్టర్ ఎం.గౌతమి వెల్లడించారు. ప్రమాదంలో ఏడుగురు మరణించగా.. ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున రూ.35 లక్షలను వారి కుటుంబ సభ్యులకు ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తామన్నారు. ప్రమాదంలో 8 మంది గాయపడగా.. వారిలో పరిస్థితి విషమంగా ఉన్న ఇద్దరికి రూ.2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందిస్తామన్నారు.

వేసవిలోను నిరంతర విద్యుత్

- అర్హత ఉన్న ప్రతి రైతుకు ఉచిత విద్యుత్ కనెక్షన్
- జగనన్న కాలనీల్లో విద్యుదీకరణ పనులు గడువులోగా పూర్తిచేయాలి
- 33 కేవీ సబ్‌స్టేషన్ల పరిధిలో ప్రజాభాగస్వామ్యంతో కమిటీలు
- ఇంధనశాఖపై సమీక్షలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సాక్షి, అమరావతి: వేసవిలో విద్యుత్ డిమాండ్ అధికమవుతున్నా ప్రణాళికాయుతంగా విద్యుత్ ఉత్పాదనను సాగిస్తూ, ప్రజలకు కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నామని రాష్ట్ర ఇంధనశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పారు. ఆయన సోమవారం సచివాలయంలో ఇంధనశాఖ, ఆంధ్రప్రదేశ్ మధ్యప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీసీపీడీసీఎల్) అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లోను ఇదే తరహాలో విద్యుత్ సరఫరా కొనసాగుతుందని తెలిపారు. 33 కేవీ సబ్‌స్టేషన్ల పరిధిలో జవాబుదారీతనాన్ని పెంచేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులతో సబ్‌స్టేషన్ స్థాయి కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కమిటీలు తమ పరిధిలో విద్యుత్ డిమాండ్, లో ఓల్టేజీ, విద్యుత్ సరఫరా తదితర అన్ని అంశాలను పరిశీలిస్తాయని, మెరుగైన విద్యుత్ సరఫరాకు సహకరిస్తాయని తెలిపారు. దరఖాస్తు చేసిన ప్రతి రైతుకు అర్హతే ప్రామాణికంగా ఉచిత వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని, తొమ్మిది గంటలపాటు పగటిపూట ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశించారు. ఉచిత విద్యుత్ దరఖాస్తులకు గడువు ఉండకూడదన్నారు. ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులను జూన్ 15వ తేదీలోగా పరిష్కరించి కనెక్షన్లు మంజూరు చేయాలని చెప్పారు. మార్చి నెలాఖరు నాటికి వ్యవసాయానికి దాదాపు 1.20 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఇచ్చినట్లు డిస్కం అధికారులు తెలిపారు. జగనన్న హౌసింగ్ కాలనీలకు విద్యుదీకరణను గడువులోగా పూర్తిచేయాలని మంత్రి కోరారు. పంపిణీ నష్టాలను పూర్తిస్థాయిలో నియంత్రణలోకి తీసుకురావాలని, పారిశ్రామికసంస్థల బకాయిలను వసూలు చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. ఇప్పటికే పనులు అప్పగించిన సబ్‌స్టేషన్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. లో ఓల్టేజీ ప్రాంతాలను గుర్తించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ఏపీ జెన్‌కో ఎండీ కె.వి.ఎన్.చక్రధర్‌బాబు, సీపీడీసీఎల్ సీఎండీ జె.పద్మజనార్దనరెడ్డి పాల్గొన్నారు.

చకచకా విద్యుత్ పొదుపు చర్యలు

- విజయవాడ జోన్‌లోనే ఏటా 2.58 ఎంయూల కరెంటు ఆదా
- దీని విలువ రూ.1.87 కోట్లు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ (ఏపీ ట్రాన్స్‌కో) విజయవాడ, విశాఖపట్నం, కడప జోన్లలో విద్యుత్ పొదుపు చర్యలు చేపట్టింది. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ (ఏపీఎస్ఈసీఎం), స్టేట్ ఎనర్జీ ఎఫిషియెన్సీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఈఈడీసీ) సహకారంతో విజయవాడ జోన్‌లో 70 అదనపు హైటెన్షన్ (ఈహెచ్‌టీ) సబ్‌స్టేషన్లలో పనులు పూర్తయ్యాయి. ఈ సబ్‌స్టేషన్లలో మొత్తం 9 వాట్లవి 1,100 ఎల్ఈడీ బల్బులు, 20 వాట్లవి 3,026 ఎల్ఈడీ ట్యూబ్‌లైట్లు, 35 వాట్లవి 884 బ్రష్‌లెస్ డైరెక్ట్ కరెంట్ (బీఎల్‌డీసీ) సీలింగ్ ఫ్యాన్లు, 70 వాట్లవి 263 ఎల్ఈడీ స్ట్రీట్ లైట్లు, 110 వాట్లవి 2,441 ఎల్ఈడీ యార్డ్ లైట్లు, 190 వాట్లవి 342 యార్డ్ ఫ్లడ్‌లైట్లను అమర్చారు. పాత, సంప్రదాయ లైట్ల స్థానంలో వీటి ఏర్పాటు ద్వారా ఏటా రూ.1.87 కోట్లు విలువైన 2.58 మిలియన్ యూనిట్ల కరెంటు ఆదా కానుంది. వీటికి అయిన ఖర్చు రూ.1.52 కోట్లు పదినెలల్లో తిరిగిరానుంది. విశాఖపట్నం జోన్‌లో 69, కడప జోన్‌లో 102 సబ్‌స్టేషన్లలో కూడా ఈ పనులు చేపట్టనున్నారు. దీంతోపాటు నష్టాలను తగ్గించడానికి కొత్త హైటెన్షన్ (హెచ్‌టీ) లైన్లను ఏర్పాటు చేయడం, పాతలైన్లను మార్చడం, ఈహెచ్‌టీ సబ్‌స్టేషన్లలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు పెంచడం, పాతవాటికి సామర్థ్యాన్ని జోడించడం, కెపాసిటర్ బ్యాంక్, రియాక్టర్లను ఇన్‌స్టాల్ చేయడం వంటి రియాక్టివ్ పవర్ మేనేజ్‌మెంట్ చర్యలను కూడా ట్రాన్స్‌కో చేపడుతోంది.

ఖర్చులు తగ్గుతాయి




నియంత్రణ లేకుండా సమానమైన లైటింగ్ పిక్చర్‌తో పోలిస్తే 80 శాతం కంటే ఎక్కువ విద్యుత్‌ను ఆదా చేసే లైటింగ్ అప్‌గ్రేడ్‌లు, స్మార్ట్ నియంత్రణలపై ట్రాన్స్‌కో దృష్టిసారించింది. అందులో భాగంగానే విద్యుత్ ఆదాచేసే ఎల్ఈడీ బల్బులు, ఫ్యాన్లు అమర్చుతున్నాం.

– కె.విజయానంద్, సీఎండీ, ఏపీ ట్రాన్స్‌కో

కరీంనగర్‌లో కొలువుదీరనున్న శ్రీవారు

- ఈనెల 31న టీటీడీ ఆలయ భూమిపూజ, శంకుస్థాపన
- రూ. 20కోట్లతో టీటీడీ ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణం
- ఆలయ నిర్మాణ అనుమతి పత్రాలు అందజేసిన టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి



కరీంనగర్: కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వరస్వామి కరీంనగర్ కేంద్రంగా కొలువుదీరనున్నారు. ఈ మేరకు ఇప్పటికే సీఎం కేసీఆర్ కరీంనగర్‌లో 10ఎకరాల స్థలాన్ని టీటీడీ ఆలయానికి కేటాయించారు. ఈ క్రమంలో టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సోమవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో కరీంనగర్ టీటీడీ ఆలయ నిర్మాణ అనుమతి పత్రాలను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, టీటీడీ తెలంగాణ లోకల్ అడ్వయిజరీ కమిటీ చైర్మన్ జి.భాస్కర్‌రావులకు అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ విజ్ఞప్తి మేరకు ఏపీ సీఎం జగన్ ఆదేశాలతో కరీంనగర్ పట్టణంలో రూ.20 కోట్ల వ్యయంతో టీటీడీ ఆధ్వర్యంలో శ్రీవారి ఆలయాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు.

అదే రోజు శ్రీవేంకటేశ్వరుని కళ్యాణోత్సవం

ఈనెల 31న ఉదయం 7.26 గంటలకు శంకుస్థాపన కార్యక్రమం వేదమంత్రోచ్చారణలతో నిర్వహిస్తామని వెల్లడించారు. అనంతరం అదే ప్రాంగణంలో సాయంత్రం నుంచి ప్రజలకు శ్రీవారి ఆశీస్సులు అందించేలా శ్రీవేంకటేశ్వరుని కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తామన్నారు. మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ, త్వరలోనే వినోద్‌రావు, భాస్కర్‌రావుతో కలిసి తిరుమలకు వెళ్తామని, ఆగమశాస్త్రం ప్రకారం కరీంనగర్ పద్మనగర్‌లో నిర్మించే శ్రీవేంకటేశ్వరసామి ఆలయం అంతరాలయం, గోపురాలు, బాహ్యాలయ నిర్మాణాల నమూనాలతో పాటు మూల విరాట్, పోటు, ప్రసాద వితరణ కేంద్రం తదితర అంశాలను పరిశీలిస్తామని చెప్పారు.

అట్లాంటాలో రామాలయ నిర్మాణం

స్వామివారి విగ్రహాలకు భద్రాద్రిలో పూజలు

భద్రాచలం: అమెరికాలోని అట్లాంటాలో నిర్మిస్తున్న రామాలయంలో ప్రతిష్ఠించే విగ్రహాలకు సోమవారం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో పూజలు చేశారు. అట్లాంటా ఎన్ఆర్ఐల ఆధ్వర్యంలో భద్రాచలం రామాలయ నమూనా తరహాలో ఉండేలా ఆలయం నిర్మిస్తున్నారు. ఇందులో ప్రతిష్ఠించేందుకు ఏపీలోని కర్నూలు జిల్లా నంద్యాలలో శ్రీ సీతారామ లక్ష్మణులు, ఆంజనేయుడు, గరుత్మంతుడి విగ్రహాలను తయారు చేశారు. వీటిని ఏపీ దేవాదాయ శాఖ రిటైర్డ్ స్థపతి రాజేశ్వరాచార్యులు ఆధ్వర్యంలో భద్రాచలం తీసుకొచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు ఆధ్వర్యంలో ఈ విగ్రహాలకు ప్రత్యేక పూజలు, ధాన్యాధివాసం చేశారు. 45 రోజుల పాటు ధాన్యాధివాస పూజల అనంతరం విగ్రహాలను అట్లాంటాకు తీసుకెళ్లనున్నారు. భద్రాద్రి రామాలయంలో జరిగే సంప్రదాయ పూజలనే అట్లాంటాలోనూ ఆచరించేలా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు రాజేశ్వరాచార్యులు తెలిపారు. ధాన్యాధివాస పూజల్లో ఆలయ ఈఓ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బోధనాస్పత్రుల్లో ఈవెనింగ్ క్లినిక్స్

ఆదేశాలు జారీ చేసిన డీఎంఈ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ బోధనాస్పత్రుల్లో ఈవెనింగ్ ఓపీ క్లినిక్స్ నిర్వహించాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డాక్టర్ నరసింహం అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్లు, బోధన ఆసుపత్రుల సూపరింటెండెంట్‌లకు సోమవారం ఆదేశాలు జారీ చేశారు. విస్తృత అవసరాలు ఉన్న స్పెషాలిటీల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య ఓపీడీ సేవలు అందేలా చూడాలన్నారు. ఈ క్లినిక్స్ కు ఆర్ఎంవో/సీఎస్ ఆర్ఎంవోను ఇన్చార్జిగా నియమించాలన్నారు. ప్రత్యేక రిజిస్టర్‌ను సైతం ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రిన్సిపాళ్లు, సూపరింటెండెంట్‌లు కళాశాలల, ఆస్పత్రుల్లో సేవలపై తరచూ సమీక్షలు నిర్వహించాలన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఓపీలో వైద్య పరీక్షలు సూచించిన వారికి ఫలితాలు వెలువడ్డాక మందులు రాయడం, అవసరం మేరకు అడ్మిషన్లు చేపట్టడం కోసం ఎయిమ్స్‌లో ఈవెనింగ్ క్లినిక్స్ నిర్వహిస్తున్నారు. ఈ విధానాన్ని బోధనాస్పత్రుల్లో కూడా అమలు చేయడం ద్వారా ప్రజలకు మరింత మేలు జరిగే అవకాశం ఉంది.

తెలంగాణ

విజయవాడకు 20 నిమిషాలకో ఎలక్ట్రిక్ బస్సు

- హైదరాబాద్ నుంచి 'ఈ–గరుడ' బస్సులు నడపనున్న ఆర్టీసీ
- తొలివిడతగా 10 బస్సులు.. నేడు మియాపూర్ నుంచి ప్రారంభించనున్న మంత్రి పువ్వాడ
- దశలవారీగా మరో 40 బస్సులు అందుబాటులోకి..
- గ్రేటర్ హైదరాబాద్‌లో త్వరలో 10 డబుల్ డెక్కర్ బస్సులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పర్యావరణహితమైన ఎలక్ట్రిక్ ఏసీ బస్సులు అందుబాటులోకి రానున్నాయి. హైదరాబాద్ నుంచి విజయవాడ మార్గంలో 50 ఎలక్ట్రిక్ ఏసీ బస్సులను 'ఈ–గరుడ' పేరుతో నడిపేందుకు ఆర్టీసీ చర్యలు చేపట్టింది. ప్రతి 20 నిమిషాలకు ఒకటి చొప్పున ఈ బస్సులను నడపనున్నారు. మొదటి విడతగా 10 బస్సులను ప్రారంభించనున్నారు. హైదరాబాద్‌లోని మియాపూర్ క్రాస్‌రోడ్ సమీపంలోని పుష్పక్ బస్ పాయింట్ వద్ద మంగళవారం సాయంత్రం 5 గంటలకు జరిగే కార్యక్రమంలో రవాణా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ జెండా ఊపి ఈ బస్సులను లాంఛనంగా ప్రారంభిస్తారు. టీఎస్ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, ఎండీ సజ్జనార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. మిగతా 40 బస్సులను ఈ ఏడాది చివరినాటికి దశలవారీగా ప్రవేశపెట్టనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. హైటెక్ హంగులతో, సకల సదుపాయాలతో కూడిన ఈ–గరుడ బస్సులు ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందజేయనున్నాయి.

ఈ–గరుడ బస్సుల ప్రత్యేకతలివీ..

- కొత్తగా ప్రవేశపెడుతున్న ఎలక్ట్రిక్ ఏసీ బస్సులు 12 మీటర్ల పొడవు ఉంటాయి. 41 సీట్లు ఉంటాయి. ఒక్కసారి చార్జింగ్ చేస్తే 325 కిలోమీటర్ల దూరం వరకు ప్రయాణించవచ్చు.
- ప్రతి సీటు వద్ద మొబైల్ చార్జింగ్ సౌకర్యంతోపాటు రీడింగ్ ల్యాంప్‌లను ఏర్పాటు చేశారు.
- ప్రయాణికుల భద్రత దృష్ట్యా వెహికిల్ ట్రాకింగ్ సిస్టంతోపాటు ప్రతి సీటు వద్ద పానిక్ బటన్ ఉంటుంది. వాటిని టీఎస్ఆర్టీసీ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేస్తారు.
- ప్రతి బస్సులో మూడు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటికి ఒక నెల రికార్డింగ్ బ్యాకప్ ఉంటుంది.
- బస్సులోని ప్రయాణికులను లెక్కించే ఆటోమేటిక్ ప్యాసింజర్ కౌంటర్ (ఏపీసీ) కెమెరా కూడా ఉంది.
- బస్సును రివర్స్ చేసేందుకు వీలుగా రివర్స్ పార్కింగ్ అసిస్టెన్స్ కెమెరా ఉంటుంది.
- బస్సుకు ముందు, వెనుక ఎల్ఈడీ బోర్డులు ఉంటాయి. వాటిలో గమ్యస్థానాల వివరాలను ప్రదర్శిస్తారు.
- అగ్నిప్రమాదాలను ముందుగానే గుర్తించి నివారించేందుకు ఈ బస్సుల్లో 'ఫైర్ డిటెక్షన్ సప్రెషన్ సిస్టం (ఎఫ్‌డీఎస్ఎస్)'ను ఏర్పాటు చేశారు.
- ప్రయాణికులకు సమాచారం చేరవేసేందుకు వీలుగా బస్సుల్లో పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ కూడా ఉంది.

త్వరలో డబుల్ డెక్కర్ బస్సులు

గ్రేటర్ హైదరాబాద్‌లో పరుగులు తీసేందుకు త్వరలోనే 10 ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్సులను ప్రవేశపెట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఫ్లైఓవర్లు, మెట్రో మార్గాలు లేని రూట్లలో వీటిని నడిపేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇక రానున్న రెండేళ్లలో ఆర్టీసీలో మొత్తంగా 1,860 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి రానున్నాయి. వీటిలో 1,300 బస్సులను హైదరాబాద్‌లో నడుపుతారు. మరో 550 బస్సులను హైదరాబాద్ నుంచి వివిధ జిల్లాలకు తిప్పనున్నారు.

రిజిస్ట్రార్ గదికి తాళం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్/సాక్షి, హైదరాబాద్: తెలంగాణ విశ్వవిద్యాలయంలో రిజిస్ట్రార్ పదవి విషయంలో వివాదం కొనసాగుతూనే ఉంది. సోమవారం రిజిస్ట్రార్ యాదగిరి గదికి తాళం వేసి ఉంచడంతో గందరగోళం నెలకొంది. దీనిపై రిజిస్ట్రార్ యాదగిరి ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాకాటి కరుణ కమిషనర్ నవీన్‌మిట్టల్‌కు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. వర్సిటీలో ఉదయం అన్ని విభాగాలు, చాంబర్లకు సెక్యూరిటీ సిబ్బంది తాళాలు తెరిచారు. రిజిస్ట్రార్ చాంబర్ మాత్రం తెరవద్దని వైస్ చాన్స్‌లర్ పీఏ సవిత చెప్పడంతో తెరవకుండానే ఉంచారు. అక్కడకు వచ్చిన రిజిస్ట్రార్ విషయాన్ని పాలకమండలి సభ్యులకు చెప్పడంతో వారు వీసీకి ఫోన్ చేశారు. దీంతో మధ్యాహ్నం 1.30 గంటలకు తాళం తీయడంతో సిబ్బంది వెళ్లి కూర్చున్నారు. రిజిస్ట్రార్ మాత్రం చాంబర్‌కు రాలేదు.

ప్రభుత్వం చెబితేనే రిజిస్ట్రార్‌గా వచ్చా..

ప్రభుత్వం, పాలకమండలి చెబితేనే రిజిస్ట్రార్‌గా వచ్చానని, సమస్య పరిష్కారం చేస్తేనే బాధ్యతలు స్వీకరిస్తానని యాదగిరి 'సాక్షి'కి తెలిపారు. తనను లొంగదీసుకునే ఉద్దేశంతోనే వీసీ ఇలా చేశారని ఆరోపించారు. కాగా తాళం వేసిన విషయమై వీసీ రవీందర్‌గుప్తాను 'సాక్షి'ప్రశ్నించగా, తాను తాళం వేయించలేదని, అలా చేస్తే తాళానికి సీల్ వేసి, లెటర్ విడుదల చేసేవాడినన్నారు. వీసీ గా ఉన్న తన అనుమతి లేకుండానే ఈసీ సభ్యులు యాదగిరిని రిజిస్ట్రార్‌గా నియమించ డం చెల్లదన్నారు. తాను రిజిస్ట్రార్‌గా పెట్టిన విద్యావర్ధినిని బయటకు పంపి యాదగిరిని ఎలా నియమిస్తారన్నారు. తెయూలోనూ ఇతర ప్రొఫెసర్లు ఉన్నప్పటికీ తనకు నచ్చని యాదగిరిని నియమించారని, తాను ఆర్డర్ ఇవ్వకుండా యాదగిరి ఎలా బాధ్యతలు తీసుకుంటారని వీసీ అన్నారు.

తెయూ వీసీని సస్పెండ్ చేయాలని గవర్నర్‌కు ఫిర్యాదు

తెయూ వీసీపై వచ్చిన ఆరోపణలపై విచారణ కమిషన్ లేదా రిటైర్డ్ హైకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని బీజేపీ నేత దినేశ్ కులాచారితో పాటు పలువురు వర్సిటీ విద్యార్థులు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత వీసీ 2021మేలో పదవి చేపట్టాక పరిపాలన, ఆర్థిక వ్యవహారాల్లో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ మేరకు సోమ వారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసైకి వినతిపత్రం సమర్పించారు.

8 మంది నూతన ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారం

ప్రమాణం చేయించిన శాసనమండలి చైర్మన్ మోషేన్ రాజు

సాక్షి, అమరావతి: శాసన మండలికి స్థానిక సంస్థల కోటాలో ఎన్నికైన 8 మంది కొత్త సభ్యులు ఎమ్మెల్సీలుగా ప్రమాణ స్వీకారం చేశారు. గుంటూరు జిల్లా వెలగపూడిలోని రాష్ట్ర అసెంబ్లీ భవనం ప్రాంగణంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు నూతన సభ్యులతో ప్రమాణం చేయించారు. పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి (వైఎస్సార్ జిల్లా), మేరిగ మురళీధర్ (నెల్లూరు జిల్లా), కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్ (పశ్చిమ గోదావరి జిల్లా), కుడిపూడి సూర్యనారాయణరావు (తూర్పు గోదావరి జిల్లా), నర్తు రామారావు (శ్రీకాకుళం జిల్లా), సిపాయి సుబ్రహ్మణ్యం (చిత్తూరు జిల్లా), డాక్టర్ ఎ.మధుసూదన్ (కర్నూలు జిల్లా) ఎమ్మెల్సీలుగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, మంత్రులు ధర్మాన ప్రసాదరావు, చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, కారుమూరి నాగేశ్వరరావు, మేరుగ నాగార్జున, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి, ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు, శాసనమండలి చీఫ్‌విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ప్రభుత్వ విప్ జంగా కృష్ణమూర్తి, మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్యే వరప్రసాద్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డితోపాటు పలువురు ఎమ్మెల్సీలు, శాసనసభ సెక్రటరీ జనరల్ రామాచార్యులు, శాసనమండలి ఓఎస్డీ సత్యనారాయణరావు, ఉప కార్యదర్శి విజయరాజు పాల్గొన్నారు.

తోడేళ్ల మందలా దాడి

సీఎం జగన్ రాజకీయ నిర్ణయాలు చంద్రబాబుకు రాజకీయంగా ఉరితాడు లాంటివని సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. అందుకే తోడేళ్ల మందలా ఏకమై కుట్రపూరితంగా ప్రజా ప్రభుత్వంపై దాడి మొదలు పెట్టారని మండిపడ్డారు. ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారం అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. సీఎం జగన్ మేనిఫెస్టోలో 98 శాతానికిపైగా హామీలు అమలు చేసి చూపించారన్నారు. నిజాయతీ, విశ్వసనీయతకు నిదర్శనమైన సీఎం జగన్‌కు, అబద్ధానికి, మోసానికి ప్రాతినిధ్యం వహిస్తున్న చంద్రబాబుకు, తోడేళ్ల మందకు మధ్య యుద్ధం జరుగుతోందన్నారు. చంద్రబాబు ఏజెంట్‌లా పవన్ కల్యాణ్ వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. పెత్తందార్ల పక్షాన నిలిచిన చంద్రబాబు, పవన్, ఎల్లో మీడియాతో ప్రజల పక్షాన నిలిచిన వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందన్నారు. టీడీపీ హయాంలో అమరావతి భూముల్లో కుంభకోణం జరిగిందన్నారు. చంద్రబాబు బరితెగింపు, అక్రమాలకు ఆయన కరకట్ట నివాసం నిదర్శనమని దుయ్యబట్టారు. రియల్ ఎస్టేట్ ఏజెంట్ల ద్వారా చంద్రబాబు గొడవ చేయిస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు, పవన్‌ల కుట్ర రాజకీయాలను సీఎం జగన్ సమాధి చేస్తున్నారు కాబట్టే ఈ కుట్రదారులు వైఎస్సార్‌సీపీ విముక్త రాష్ట్రం అని మాట్లాడుతున్నారని చెప్పారు.

థాయ్ క్యాసినోకి ఎవరు తీసుకెళ్లారు..

ఎంత వసూలు చేశారు?

చీకోటి ప్రవీణ్‌కుమార్‌ను ఏడు గంటలపాటు ప్రశ్నించిన ఈడీ అధికారులు

సాక్షి, హైదరాబాద్: థాయ్‌లాండ్ క్యాసినో కేసులో అక్కడి పోలీసులకు పట్టుబడిన చీకోటి ప్రవీణ్‌కుమార్‌ను సోమవారం ఈడీ అధికారులు సుదీర్ఘంగా ప్రశ్నించారు. థాయిలాండ్‌లో క్యాసినో ఆడుతుండగా దాడిచేసిన థాయ్ పోలీసులు పెద్ద మొత్తంలో నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ మొత్తం వ్యవహారంలో నగదు లావాదేవీలు, డబ్బు తరలింపు తదితర విషయాలపై ఈడీ అధికారులు సోమవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 7–40 గంటల వరకు దాదాపు ఏడు గంటలకుపైగా ప్రశ్నించారు. థాయిలాండ్ వెళ్లి పట్టుబడిన వారిని ఇక్కడి నుంచి ఎవరు తీసుకెళ్లారు..? అక్కడ విలాసాలకు, క్యాసినో ఆడేందుకు ఒక్కొక్కరి నుంచి ఎంత వసూలు చేశారు..? ఏ రూపంలో డబ్బు లావాదేవీలు చేశారు...? హవాలా రూపంలో ఏవైనా లావాదేవీలు జరిగాయా..? థాయిలాండ్ పోలీసులు పట్టుకున్న నగదుకు సరైన లెక్కలు చూపారా..? ఇలా పలు అంశాలపై ప్రవీణ్‌ను ప్రశ్నించినట్టు సమాచారం. ప్రధానంగా మనీలాండరింగ్‌పైనే ఈడీ అధికారులు ఫోకస్ పెట్టారు. ఆ దిశగానే ప్రవీణ్ నుంచి కీలక సమాచారాన్ని వారు సేకరించినట్టు తెలిసింది.

నేల నుంచి లేచిన దుమ్ము దానికే తిరిగి చేరినట్టు,
ప్రాణం ఎవరిచ్చారో అది ఆ దేవుడికే తిరిగి చేరుతుంది.
– జుడాయిజం

సాక్షి

మంగళవారం, 16 మే 2023

ఈ ఎన్నిక ఏం చెబుతోంది?

ఎన్నికలు ముగిశాయి. ఫలితాలు వెలువడ్డాయి. కర్ణాటకలో ఉత్కంఠకు మాత్రం తెరపడలేదు. బీజేపీ సర్కార్‌ను మట్టి కరిపించిన కాంగ్రెస్ విజయగాథ ఇంకా పూర్తిగా ప్రచారం కాక ముందే, విజయ సారథులైన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు డీకే శివకుమార్, శాసనసభా పక్షా నేత సిద్ధరామయ్యల మధ్య సీఎం సీటుకై సాగుతున్న పోటాపోటీ ప్రధాన వార్తై కూర్చుంది. సోమవారం కథ బెంగళూరు నుంచి ఢిల్లీకి మారింది. కాంగ్రెస్ అధిష్ఠానం కోర్టులోకి కొత్త సీఎం ఎంపిక బంతి వచ్చి పడింది. పోటీదారులిద్దరినీ ఎలా బుజ్జగించి, ఎవరి పేరును సీఎంగా ప్రకటిస్తుందన్న సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది. రాజీ ఫార్ములా ఏమైనా, వ్యవహారం అశోక్ గెహ్లోత్, సచిన్ పైలట్ల నిత్యకుంపటి రాజస్థాన్‌లా కాకూడదన్నదే ప్రస్తుతం కాంగ్రెస్ అజెండాగా కనిపిస్తోంది.

అధిక భాగం ఎమ్మెల్యేల మద్దతు తనకే ఉన్నట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో, సాక్షాత్తూ సిద్ధరామయ్య సైతం అదే అభిప్రాయం వ్యక్తం చేస్తూ సోమవారం దేశరాజధానికి విమానమెక్కారు. పుట్టినరోజు వేడుకలు, పూజా కార్యక్రమాల బిజీ మధ్య డీకే ఢిల్లీ పయనం ఒకడుగు ముందుకు, రెండడుగులు వెనక్కూ ఊగిసలాడింది. అధిష్ఠానం ఆదేశించినా ఆఖరి క్షణంలో అనారోగ్యమంటూ వెళ్ళక డీకే తన అసంతృప్తిని పైవాళ్ళకు చెప్పకనే చెప్పారు. త్వరలో లోక్‌సభ ఎన్నికలున్న వేళ సిద్ధ, డీకేలలో ఒకరిని కాదని మరొకరిని ఎంపిక చేయడం కాంగ్రెస్ పెద్దలకు సైతం క్లిష్టమైన పనే. ఇద్దరూ సమర్థులే. ఇద్దరూ పార్టీ విజయానికి కష్టపడ్డవారే. ప్రజానేతగా, గతంలో ప్రజానుకూల సీఎంగా తెచ్చుకున్న పేరు, పాలనానుభవం సిద్ధకు కలిసొచ్చే అంశాలు. మరోపక్క పార్టీని పలువురు వదిలేసినా, కేంద్ర దర్యాప్తు సంస్థలు వేటాడినా కాంగ్రెస్‌కే కట్టుబడి, అంగ, అర్థబలాలతో భారీ విజయం కట్టబెట్టిన కార్యదక్షత డీకే ప్రధాన ఆకర్షణ. ఎవరినీ దూరం చేసుకోలేకే కాంగ్రెస్ వంతులవారీ సీఎం సీటనే లోపాయకారీ ఫార్ములాతో శాంతపరచజూస్తోంది. కాకపోతే ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలో లాగా ఆ ఫార్ములా ఆచరణలో అమలుకాదేమో అన్నది రెండో వంతులో సీఎం కావాల్సినవారి భయం.

ఎన్నికల వేళ కలసి ప్రత్యర్థి పార్టీపై పోరాడిన కర్ణాటక కాంగ్రెస్ దిగ్గజ నేతలు తీరా ఫలితాలు వెలువడిన మరుక్షణమే సీఎం సీటుకై పాత ప్రత్యర్థులుగా మారిపోవడం విచిత్రమే. బీజేపీతో ఢీ అంటే ఢీ అనడానికి ఇప్పుడిప్పుడే సర్వశక్తులూ ఒడ్డుతున్న పార్టీకి ఇది పెద్ద తలనొప్పే కాక ప్రజాక్షేత్రంలోనూ తలవంపులే. దీని నుంచి బయటపడడం ఇప్పుడు ఆ పార్టీ, ఆ పార్టీ నేతల చేతుల్లోనే ఉంది. నిజానికి, 224 స్థానాలున్న కీలక దక్షిణాది రాష్ట్రంలో 42.9 శాతం ఓటు షేర్‌తో 135 సీట్లు గెలవడం మోదీ ప్రవేశానంతర రాజకీయ క్షేత్రంలో కాంగ్రెస్‌కు పెద్ద సాంత్వన. 2018 ఎన్నికలతో పోలిస్తే, 4.8 శాతం ఓటు షేర్, 55 సీట్లు అధికంగా ఆ పార్టీ దక్కించుకోవడం విశేషం. బీజేపీ మాత్రం అర శాతం లోపే ఓటు షేరు తగ్గినా, 38 సీట్లు చేజార్చుకొని 66 స్థానాల్లోనే గెలుపొందగలిగింది. బీజేపీ ప్రభుత్వ పాలనావైఫల్యానికి దర్పణంగా డజనుమంది మంత్రులు ఓటమిపాలై, ఇంటి దారి పట్టాల్సొచ్చింది.

పాలనలో లోపంతో పాటు పేరుకున్న అవినీతి, ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం, లింగాయత్ వర్గాన్ని దూరం చేసుకోవడం – ఇలా బీజేపీ ఓటమికి అనేక కారణాలు. రాష్ట్రంలో 16–17 శాతం జనాభాతో, ఒకప్పుడు కమలానికి బలమైన ఓటుబ్యాంక్‌గా నిలిచిన వీరశైవ లింగాయత్‌లు ఈసారి హస్తం గుర్తుకు జై కొట్టారు. ఉత్తర కర్ణాటకలో వచ్చిన ఫలితాలు, బీజేపీతో పోలిస్తే కాంగ్రెస్ పక్షాన గెలిచిన లింగాయత్ ఎమ్మెల్యే అభ్యర్థుల సంఖ్యే అందుకు సాక్ష్యం. బీజేపీలో తమకు అవమానం జరిగిందంటూ తమ వైపు మొగ్గిన ఈ బలమైన లింగాయత్ వర్గాన్ని అలాగే నిలుపుకోవాల్సిన బాధ్యత ఇప్పుడు కాంగ్రెస్‌దే. మరో బలమైన ఒక్కళిగ వర్గానికి చెందిన డీకేనూ దూరం చేసుకోలేదు. పైగా, లోక్‌సభ ఎన్నికల్లోనూ 28 సీట్ల కన్నడసీమలో ఇదే విజయ దరహాసం పునరావృతం కావాలంటే పార్టీని సమర్థంగా నడిపే కార్యశూరులే కావాలి. 75 లక్షల సంస్థాగత బలంతో, సిద్ధ, డీకే లాంటి స్థానిక నేతలతోనే తాజా విజయం సాధ్యమైందని అధిష్ఠానానికీ తెలుసు.

ఒక రకంగా కర్ణాటక ఫలితాలు గెలిచిన కాంగ్రెస్‌కూ, ఓడిన బీజేపీకీ రెంటికీ స్పష్టమైన సందేశం ఇస్తున్నాయి. జాతీయ అంశాల కన్నా స్థానిక అంశాలు, సారథులు, ప్రజా సంక్షేమ వాగ్దానాలు, బడుగు బలహీన వర్గాల, దళిత, మైనారిటీల ఏకీకరణ రాజకీయంతో మోదీ, షా లాంటి బలమైన ప్రత్యర్థుల్ని సైతం ఢీకొట్టవచ్చని గ్రాండ్ ఓల్డ్ పార్టీ నేర్వాల్సిన పాఠం. అతి జాతీయవాదం, మనుషుల్ని చీల్చే మతతత్వం, 'ఒకే దేశం ఒకే భాష'తో ఆసేతు హిమాచలాన్ని చాపచుట్టేయాలనుకుంటే అది కుదరని పని అనేది కాషాయపార్టీకి కర్ణాటక చావుదెబ్బ చెబుతున్న గుణపాఠం. మోదీపై బీజేపీ అతిగా ఆధారపడితే లాభం లేదు. స్థానికంగా పార్టీ, నాయకత్వం బలంగా ఉంటేనే ఆ మోళీ పని చేస్తుందనడానికి యూపీ, అస్సామ్, మధ్యప్రదేశ్‌లే తార్కాణం. 2014 మే తర్వాత జరిగిన 57 అసెంబ్లీ ఎన్నికల్లో సగానికి పైగా వాటిలో మోదీ ఉన్నా ఆ పార్టీ ఓడిపోయిందనేది కఠిన వాస్తవం. అది తెలిసి నడుచుకోకుంటే బీజేపీకి కష్టం. ఇక, కర్ణాటక ఫలితాలతో లోక్‌సభపై ఆశలు పెంచుకుంటున్న ప్రతిపక్షాలు అతిగా లెక్కలేసి, సంబరపడితే సరిపోదు. జాతీయ స్థాయిలో నేటికీ తిరుగులేని మోదీకి ప్రత్యామ్నాయంగా నిలవాలంటే, నిందలు, ఆరోపణల కన్నా ప్రజా సమస్యలపైనే దృష్టి పెట్టాలి. బలవంతుడైన ప్రత్యర్థిపై కలసికట్టుగా పోరాడాలి. సీఎం సీటు చేజారవచ్చనే నిస్పృహలో 'ధైర్య సాహసాలు నిండిన ఒక్క వ్యక్తి వల్లే మెజారిటీ సాధ్య'మని గర్జిస్తున్న డీకేకి సైతం ఆ సంగతి తెలీదనుకోలేం. మరిన్ని సవాళ్ళు ముందున్న వేళ పార్టీకైనా, వ్యక్తులకైనా ఐకమత్యమే మహాబలం.

ఎప్పటికీ 'మేధావులు' అవసరమే!

విశ్లేషణ



నీరా చంఢోక్

ఫ్రెంచ్ సమాజంలో జరిగిన పరిణామాల నేపథ్యంలో 'మేధావులు' ఆవిర్భవించారు. అయితే ఈ మేధావులు అనే మాటను వామపక్షీయులను ఉద్దేశించి వాడింది సంప్రదాయవాదులు (రైట్‌వింగ్), కాకపోతే నిందాపూర్వకంగా! వారి దృష్టిలో ఈ మేధావులు దేశ వ్యతిరేకులు. నేటి భారత్‌లో కూడా అదే పరిస్థితి ఉండటం గమనార్హం. అయితే మేధావులు ఈ దాడులను మొదటినుంచీ తమ లక్ష్య సాధనలో ప్రాసంగికత లేనివిగా కొట్టిపారేస్తారు. అన్యాయం, నిరంకుశాధికారం, మత ఘర్షణల మీద పోరాటమే తమ లక్ష్యమని చెబుతారు. సమాజంలో జరిగే వ్యవహారాలకు మేధావులు తమ సొంత ప్రపంచాల్లో కళ్లుమూసుకుని ఉండలేరు. కానీ మునుపటిలా శక్తిమంతంగా వారు పోరాడుతున్నారా అన్నది సందేహం.



1993లో 'బీబీసీ రీత్ ప్రసంగం' చేస్తూ పాలస్తీనియన్–అమెరికన్ ప్రొఫెసర్ ఎడ్వర్డ్ సెడ్ ఇలా ప్రశ్నించారు: ''సృజనాత్మకతకూ, దౌర్బల్యాల పట్ల నిబద్ధతకూ మధ్య సమతౌల్యత సాధించడం ఎలా?'' ఇంకా ఆయన ఇలా కొనసాగించారు: ''అదిభౌతికమైన ఉద్వేగాలు, ఆసక్తి ఉండని న్యాయం, సత్యం వంటి సూత్రాలు కదిలించినప్పుడల్లా అసలైన మేధావులు ఎన్నడూ లేనంత తాముగా ఉన్నారు. వారు అక్రమాలను నిరసించారు, బలహీనుల పక్షాన నిలిచారు, అధికారాన్ని ప్రశ్నించారు.''

ప్రజా మేధావి అన్న భావన మొట్టమొదట 1894 డిసెంబరులో ఫ్రాన్స్‌లో పుట్టుకొచ్చింది. ఆర్మీ కెప్టెన్ ఆల్ఫ్రెడ్ డ్రేఫస్‌పై దేశద్రోహం ఆరోపణలు వచ్చాయి. జర్మన్లకు మిలటరీ రహస్యాలు అమ్మేశాడన్నది ఆయనపై ఆరోపణ. ఇదే అదనుగా యూదు వ్యతిరేక సంస్థలు చెలరేగాయి. ఉదాహరణకు ఎడువార్డ్ డ్రూమాంట్ సంపాదకత్వంలో నడిచిన 'లా లిబ్రే' ఫ్రెంచ్ యూదులు విశ్వాస ఘాతకులన్నట్టుగా కథనాలు ప్రచురించింది. కొంతమంది డ్రేఫస్‌కు మద్దతుగా నిలిచారు. ఆయనకు వ్యతిరేకంగా ఉన్న సాక్ష్యం బలహీనంగా ఉంది. ఫెర్డినాండ్ వాల్సిన్ ఈస్టర్‌హేజీ అనే మరో అధికారిపై ఇలానే దేశద్రోహ ఆరోపణలు వస్తే మిలటరీ కోర్టు వాటిని కొట్టివేసింది.

జరిగిన అన్యాయం గురించి అందరికీ స్పష్టంగా అర్థమైంది. జాతి వివక్ష కూడా ప్రస్ఫుటంగా కనిపించింది. ఈ నేపథ్యంలో మేధావులు తమ సొంత ప్రపంచాల్లో కళ్లుమూసుకు ఉండలేని పరిస్థితి. విఖ్యాత నవలా రచయిత ఎమిలీ జోలా 'జా అక్యూస్' పేరుతో రాసిన బహిరంగ లేఖ 'లా అరోర్' పత్రికలో ప్రచురితమైంది. డ్రేఫస్‌ను అక్రమంగా దోషిగా నిర్ధారించి ఆ విషయాన్ని కప్పిపుచ్చేందుకు ప్రయత్నించారని ఎమిలీ ఆ లేఖలో సైన్యాన్ని తీవ్రంగా విమర్శించారు. ఇది మరో వివాదానికి దారితీసింది. జోలా మద్దతుదారులు సైన్యాన్ని కించపరచడం ద్వారా దేశాన్ని బలహీన పరిచారని సంప్రదాయవాదులు (రైట్ వింగ్) విరుచుకుపడ్డారు. మండించే స్వభావం గల అలంకార ప్రాయమైన దేశభక్తి కంటే వ్యక్తిగత స్వేచ్ఛకు ఉదారవాద వామపక్షీయులు మద్దతిచ్చారు. సంప్రదాయవాదులు వారిని 'మేధావులు' అని నిందాపూర్వకంగా పిలిచారు. వారి దృష్టిలో ఈ మేధావులు దేశ వ్యతిరేకులు. నేటి భారత్‌లో కూడా అదే జరుగుతోంది.

అయితే మేధావులు ఎప్పుడూ ఈ దాడులను తమ లక్ష్య సాధనలో ప్రాసంగికత లేనివిగా కొట్టిపారేస్తారు. అన్యాయం, నిరంకుశాధికారం, మత ఘర్షణల మీద పోరాటమే తమ లక్ష్యమని చెబుతారు. తత్వవేత్త, రచయిత జా పాల్ సార్త్ర్ 1980లో మరణించినప్పుడు సుమారు యాభై వేల మంది ఆయన అంతిమయాత్రలో పాల్గొన్నారు. వివాదానికి దూరంగా ఉండే హక్కు మేధావికి లేదనే వారు సార్త్ర్. అన్నింటికీ అతీతంగా ఉంటామనే సౌలభ్యం కూడా వారికి నాస్తి అంటారాయన. సమాజాన్ని మార్చేందుకు ప్రజా మేధావి అనేవాడు తన సొంత విషయాలను పక్కనబెట్టాలనీ, వ్యక్తిగత జీవితం వంటివి అతడు లేదా ఆమెకు ఉండవనీ అంటారు.

1935లో ఫ్రెంచ్ మేధావులు అంతర్జాతీయ రచయితల సంఘం ఒకదాన్ని ఏర్పాటు చేశారు. ప్యారిస్ సంస్కృతి పరిరక్షణ దీని ఉద్దేశం. ఈ సంఘం ఏర్పాటు చేసిన సదస్సులో ఫాసిజానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రజలు ఏకమయ్యారు. జూన్ నెలలో జరిగిన ఈ సదస్సుకు సజ్జాద్ జహీర్, ముల్క్‌రాజ్ ఆనంద్ వంటివారూ హాజరయ్యారు. తరువాతి కాలంలో వీరిద్దరూ భారతీయ సాహిత్యం, ఉర్దూ కవిత్వంలో మార్పునకు కృషి చేశారు. ఆల్డస్ హక్స్‌లీ, ఈఎం ఫార్‌స్టర్, బోరిస్ ప్యాస్టర్‌నాక్, బెర్తోల్ట్ బ్రెష్ట్, ఇంకా ఇతర దిగ్గజ రచయితలు ఈ సదస్సుకు హాజరయ్యారు. సదస్సులో తలెత్తిన వివాదాలు కాస్తా ప్యారిస్ వీధుల వరకూ విస్తరించాయి.

సోవియట్ యూనియన్ చరిత్రకారుడు ఇల్యా ఎహ్రెన్ బర్గ్ 'దోపిడిదారులను దునుమాడేందుకు ఆయుధంగా మారని ఏ కళ అయినా నిష్ప్రయోజనమైంది!' అన్నారు ఇల్యా మీద ఆంద్రే బ్రెటన్ లాంటివారు బహిరంగంగానే విమర్శించారు. చివరకు ఆ సదస్సు ఫాసిస్టులకు వ్యతిరేకంగా ఒక సమాఖ్యనైతే ఏర్పాటు చేయలేకపోయింది. సదస్సుకు హాజరైన వారందరూ ఫాసిజాన్ని ద్వేషించారు. కానీ సోవియట్ యూనియన్ తరహా పరిష్కారం ఉండాలన్న ఆకాంక్షపై మాత్రం ఏకాభిప్రాయానికి రాలేక పోయారు. అధివాస్తవికులు, కమ్యూనిస్టుల మధ్య సయోధ్య కోసం రెనె క్రేవెల్ (అధివాస్తవికుడు) విఫలయత్నం చేశారు. ఆ నిస్పృహలో రెనె తన ఇంటికొచ్చేసి గ్యాస్ కనెక్షన్ ఆన్ చేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. 'ఏవగింపు' అని రాసి ఉన్న నోట్ అతడి కోటు జేబుకు అతికించి ఉండింది!

ప్రగతిశీల రచయితల బాధ్యత

రచయితలు, కవుల సామాజిక బాధ్యతలపై అదే కాలంలో భారత్‌లో కూడా ఎన్నో చర్చోపచర్చలు జరుగుతున్నాయి. కవులు, రచయితలు సామాన్యులతో కలిసిపోవాలంటే వారు తమ వ్యక్తిగత ఆనందాలు, కోరికలు, ఉద్వేగాలు, నిస్పృహలకు అతీతంగా తమ రచనలు, కవితలను తీసుకెళ్లాలన్న నమ్మకంతో 1936లో ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్ (అఖిల భారతీయ ప్రగతిశీల రచయితల సంఘం) ఏర్పడింది. మతం, జాతీయత రాజకీయాల నుంచి పేదరికం, వివక్ష, వర్గం వైపు కవులను మళ్లించిన ఘనత దీనిదే. ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్ సభ్యులు ఇటలీ కాలమిస్ట్ ఆంటోనియో గ్రాంసీ రచనలను అప్పటికి చదివి ఉండేందుకు అవకాశం లేదు. ఆయన 'ప్రిజన్ నోట్‌బుక్' 1970లలో ఆంగ్లంలో ప్రచురితమైంది. కానీ ముస్సోలిని అపఖ్యాతి జైలు వ్యవస్థలో మగ్గిన గ్రాంసీ రాసినదానిలో ఈ ప్రగతిశీల రచయితలు నమ్మకం ఉన్నవారే. అదేమిటంటే... మేధావి అనేవాడు సామాజిక, ఆర్థిక, రాజకీయ పరివర్తనకు అవసరమైన వాతావరణాన్ని సృష్టించాలి. ఉదారవాదులు రాజకీయ జీవితంలోకి ప్రవేశించాలి!

ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్ సభ్యుడు, ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ సభ్యుడైన కె.ఎ. అబ్బాస్ తన ఆత్మకథలో 'నేనేమీ ఓ ద్వీపాన్ని కాదు' అన్న వాక్యం ఉంటుంది. 1946 నాటి బాంబే గురించి ఈ వ్యాఖ్య. అప్పట్లో హిందూ, ముస్లింల మధ్య బాంబే రెండుగా విడిపోయి ఉండేది. ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్, ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ ఓ శాంతి ప్రదర్శన ఏర్పాటు చేశాయి. పృథ్వీరాజ్ కపూర్‌కు చెందిన పృథ్వీ థియేటర్స్‌తో పాటు సుమారు 52 సాంస్కృతిక సంఘాలు ఈ ప్రదర్శనలో పాల్గొన్నాయి. కపూర్లు(పృథ్వీరాజ్, రాజ్, షమ్మీ), దేవానంద్, బల్‌రాజ్ సహానీ, అభ్యుదయ ఉర్దూ కవులు, రచయితలు సజ్జాద్ జహీర్, మజ్రూహ్ సుల్తాన్‌పూరి, అలీ సర్దార్ జాఫ్రీ, కైఫీ అజ్మీ, సాహిర్ లూధియాన్వీతో పాటు మరాఠీ, గుజరాతీ రచయితలు కూడా బోరిబందర్ నుంచి బాంద్రా వరకూ సాగిన ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. శాంతి, సామరస్యాలు, సౌభ్రాతృత్వాలను సూచించే పాటలు పాడుతూ సాగిందా ఊరేగింపు. తద్వారా మత ఘర్షణల గాయాలకు మందు పూసే ప్రయత్నం జరిగింది.

ప్రస్తుతానికి వస్తే... మన నటులను అధికార పక్షంపై ప్రశంసలు కురిపించేలా బలవంతం చేస్తున్నారు. జైలుకెళ్లాల్సి వస్తుందని రచయితలు భయపడుతున్నారు. విప్లవాత్మక ఆలోచనలున్న నాటక రంగం కనుమరుగైంది. కవులు రాస్తున్నారు కానీ వారి వారి ఏకాంతాల్లో! విద్యావేత్తలు తమ ఉపకులపతుల ఆగ్రహానికి గురి కాకుడదన్న రంధిలో ఉన్నారు. ఏతావాతా... సమాజపు చేతన కాస్తా నిశ్శబ్దంలో అంగలారుస్తోంది. ఇది ఉపమాలంకారమే కావొచ్చుగానీ, మేధావుల చుట్టూ సంకెళ్ల శృంఖలాలు చుట్టుకుపోయి ఉన్నాయి. దశాబ్దాలపాటు ఫాసిస్టు వ్యతిరేక కూటమి కట్టిన శక్తులు మమ్మల్ని మళ్లీ ఆవహిస్తే బాగుండు. సామాజిక మేధావులు లేని సమాజం నశించిపోతుందనీ, అది కూడా చాలా నెమ్మదిగా కానీ కచ్చితంగా జరుగుతుందనీ ఆ శక్తులు గుర్తుచేస్తున్నాయి.

వ్యాసకర్త రాజకీయ విశ్లేషకులు
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

శాంతిని నెలకొల్పాలి



మణిపూర్‌లో అశాంతి ఇంకా కొనసాగుతుండటం తీవ్ర ఆందోళనకరం. శాంతిని నెలకొల్పడం, అందరి క్షేమాన్ని చూసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాథమ్యం ఇవ్వాలి. హింసలో చిక్కుబడిపోయి, దీనివల్ల ప్రభావితమైన అందరి పట్లా నాకు వేదన కలుగుతోంది.

– ప్రియాంక గాంధీ వాద్రా, కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి

ఏంటో తెలుసు



ఖాలిస్తానీ ఉద్యమానికి మేము సిక్కులం వ్యతిరేకులం. మాకు ఈ సోకాల్డ్ ఉద్యమ వాస్తవికత ఏంటో తెలుసు. సిక్కుల్లో ఎవరూ ఖాలిస్తాన్ కోరుకోవడం లేదు. ఇది భారత్‌కు వ్యతిరేకంగా సమస్యలు సృష్టించడానికి మొదలైనది మాత్రమే.

– జస్లీన్ కౌర్, వ్యాఖ్యాత

ఏం రాశాడో!



ఏనాడూ పుస్తకం పట్టి చదవగా చూడని నా చిన్నారి కూడా భారీ మార్కులతో పాసవ్వడం చూశాక – విద్యావ్యవస్థలో నాకున్న కొద్దిపాటి విశ్వాసం కూడా సన్నగిల్లింది.

– మంజుల్, కార్టూనిస్ట్

ఎందరో పనిచేస్తే...



ఒంటిచేత్తో తాను ప్రధాని కాలేదనీ, కానీ అదే ఒంటిచేత్తో తన ప్రధాని పదవి పోతుందనీ మోదీ తెలుసుకోవాలి. (కర్ణాటక ఎన్నికల నేపథ్యంలో)

– సుబ్రమణ్యస్వామి, కేంద్ర మాజీ మంత్రి

ప్రశ్నే తలెత్తొద్దు



ఐదేళ్లలో సుమారు పది లక్షల కోట్ల రూపాయల మురిగిపోయిన కార్పొరేట్ అప్పుల్ని బ్యాంకులు రైటాఫ్ చేసే దేశంలో– ప్రజల అంచనాలు, అవసరాలను చూసుకోవడానికి మాత్రం నిధుల కొరత ఎందుకుండాలి?

– దేవీందర్ శర్మ, కాలమిస్ట్

ఇన్‌బాక్స్

దాడుల నుంచి రక్షించాలి

ఇటీవలి కాలంలో ఆసుపత్రులపై, వైద్యులపై భౌతిక దాడులు దేశవ్యాప్తంగా పెరిగిపోతున్నాయి. గతవారం కేరళలో యువ వైద్యురాలు వందనా దాస్ హత్యకు గురైన నేపథ్యంలో వైద్యులు తమ సేవలు నిర్భయంగా, స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో అందించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలు తక్షణం తీసుకురావలసిన అవసరం మరొక్కసారి చర్చకు వచ్చింది.

దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం 2008లో దేశంలోనే మొట్టమొదటిసారిగా వైద్యులపై, ఆసుపత్రులపై దాడుల నిరోధానికి చట్టం తీసుకువచ్చారు. తర్వాత 14 రాష్ట్రాల్లో ఇదే విధమైన చట్టాన్ని తీసుకురావడం జరిగింది. అయితే అప్పట్లో మన రాష్ట్ర చట్టంలో నేరారోపణ రుజువైన వారికి మూడు ఏళ్ల కారాగార శిక్ష పొందుపరచడం జరిగింది. ఈ చట్టం ప్రకారం దోషులకు బెయిల్ ఇవ్వడానికి వీలు లేని విధంగా అరెస్ట్ చేయడానికి అవకాశం ఉండేది. అయితే 'ఏపీ పోలీస్ మాన్యువల్'లో ప్రస్తుతం ఏడు సంవత్సరాల కనీస కారాగార శిక్ష పడే ఆరోపణ ఉన్న వారిపై మాత్రమే నాన్ బెయిలబుల్ అరెస్టు చేయడానికి అవకాశం ఉంది.



అందువల్ల ప్రస్తుతం ఉన్న ఆంధ్రప్రదేశ్ వైద్య రక్షణ చట్టంలో సవరణలు చేసి కనీస కారాగర శిక్ష ఏడేళ్లకు మార్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) కోరుతోంది.

డాక్టర్ వందనా దాస్ హత్య అనంతరం కేరళలో ప్రస్తుతమున్న రాష్ట్ర వైద్య రక్షణ చట్టాన్ని కఠినతరం చేస్తామని కేరళ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దేశవ్యాప్తంగా అమలు చేయడానికి అనుకూలంగా జాతీయస్థాయిలో వైద్యుల, ఆసుపత్రుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వానికి ఐఎంఏ జాతీయ సంఘం, రాష్ట్ర సంఘాలు కొన్ని సంవత్సరాలుగా పలు సందర్భాలలో విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఏ మాత్రం ఖాతరు చేయకపోవడం శోచనీయం.

ఆసుపత్రుల్లో రోగులు చనిపోయిన సందర్భాలలో, చికిత్సలలో లోపాలపై వైద్యులపై వైద్య నిర్లక్ష్యం కేసులు నమోదు చేసే సమయంలో సుప్రీంకోర్టు తీర్పులు పరిగణన లోకి తీసుకోవాలి. ముగ్గురు వైద్య నిపుణుల కమిటీ ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని నిర్ధారించిన తర్వాత మాత్రమే కేసులు నమోదు చేయాలి. వైద్యులను అరెస్టు చేయకూడదని దీనికి సంబంధించి నిర్దిష్టమైన ఒకే విధానం అన్నిచోట్ల అమలు చేసేలా 'ఎస్ఓపీ' ఆదేశాలు జారీ చేయాలి.

– డాక్టర్ జి. రవికృష్ణ, డాక్టర్ పి. ఫణిధర్
ఐఎంఏ ఏపీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు

మహానగరపు మార్మిక గాథ

కామెంట్



కరణ్ థాపర్

చాలా సంవత్సరాలుగా ఢిల్లీ గాథను తెలుసుకోవాలని నేను అనుకున్నాను. కానీ నిజంగా దాన్ని తెలుసుకోడానికి పెద్దగా ప్రయత్నించలేదు. మనం చరిత్ర మధ్యలో జీవిస్తున్నప్పుడు దానికి ఇవ్వాల్సినంత ప్రాధాన్యం ఇవ్వం. ఘోరమైన విషయం ఏమిటంటే, నేను ఢిల్లీని కాన్ బెర్రా, ఒట్టావా లేదా వాషింగ్టన్‌తో పోల్చడం ఉచితమేనని అనుకున్నందుకు చింతిస్తున్నాను. నిస్సందేహంగా నేను అలా పోల్చిన ప్రతిసారీ, తప్పు చేస్తున్నానని నాకు తెలుసు కానీ అలా పోల్చడాన్ని అది ఆప లేదు. నా అజ్ఞానంలో ఉంటూ, నేను విలువైన అంశాన్ని ప్రతిపాది స్తున్నట్లు యోచించాను. బహుశా నేను ఒక సందర్భంలో ఘోరంగా దొరికిపోయేంతవరకూ ఇది అలాగే కొనసాగిందని చెప్పాలి.

లండన్ నుంచి ఎయిర్ ఇండియా విమానంలో వస్తున్నప్పుడు నా పక్కనే కూర్చున్న ఒక అందమైన యువతి ''ఢిల్లీ గురించి చెప్పండి'' అని నన్ను అడిగింది. అది 1980ల చివరలో అనుకుంటాను. సెలవుపై ఇంటికి తిరిగొస్తున్నప్పుడు అది తటస్థించింది. ఆమె చాలా ఆకర్షణీయంగా ఉంది. నేను సంభాషణ ఏదైనా మొదలెట్టాలని అనుకున్నాను. ''ఢిల్లీ అద్భుతమైన చరిత్ర కలిగిన ఒక పురాతన నగరం అని నేను నమ్ముతున్నాను'' అని ఆమె అన్నది.

''అవును, అవును'' అంటూ నేను ఉత్సాహంగా సమాధాన మిచ్చాను. కానీ దాని గురించి ఏమీ తెలియకపోవడంతో నేను సంభాషణను కొనసాగించలేకపోయాను. అందుకే విషయాన్ని పక్క దోవ పట్టించడానికి ప్రయత్నించాను. ''ఢిల్లీ చాలావరకు కాన్‌బెర్రా, ఒట్టావా, వాషింగ్టన్ లాంటిదే'' అన్నాను.

''ఓ దేవుడా! కచ్చితంగా కాదు'' ఆమె దెబ్బ తిన్నట్టుగా అన్నది.

''ఓ ఎస్'' అని నేను రెట్టించాను. కానీ ఈ విషయంపై ఏం చెప్పాలో నాకు తోచలేదు.

''వెల్, మీ మాట తప్పు కావాలని కోరుకుంటున్నా.''

అక్కడే ఆ సంభాషణ ముగిసిపోయింది. తర్వాత ఎనిమిది గంటల పాటు ఆ విమాన ప్రయాణ కాలంలో మాట్లాడటానికి నేను వేసిన ప్రారంభ ఎత్తులన్నీ సున్నితమైన తిరస్కరణను ఎదుర్కొన్నాయి. నా ఉద్దేశపూర్వక ప్రయత్నాలకు ఢిల్లీ గురించి నాకు జ్ఞానం లేకపోవడం అనేది గట్టి అడ్డంకిగా నిలిచింది.

నేను ఎంత ఘోరమైన అభిప్రాయాలతో ఉన్నానో ఇటీవలే గుర్తించాను. 'ద మిలీనియం బుక్ ఆన్ న్యూఢిల్లీ' పుస్తకం రాసిన పవన్ వర్మ ఆ మధ్య ఆ ప్రతిని నాకు పంపారు. చూసీచూడగానే అది ఒక విలాసవంతమైన కాఫీ టేబుల్ అలంకృత పుస్తకంగా అనిపించింది. అలాగని అలాంటి వాటి పట్ల నాకు వ్యతిరేకత ఏమీ లేదు. పేజీలు అలా తిరగేస్తూ, ఫొటోగ్రాఫులను మెచ్చుకుంటూ, నెమ్మ దిగా వ్యాసాల్లోకి మునిగిపోతుండగా ఢిల్లీ గురించి అత్యంత పఠనీయ చరిత్రాంశాలను ఈ పుస్తకం కలిగి ఉన్నదని గుర్తించాను. నగరానికి ఆ పేరు ఎలా వచ్చిందో, దాని మూలాల వెనుక ఉన్న కథ ఏమిటో, ఈ మహానగరం ఎన్ని 'నగరాల'తో కూడుకుని ఉన్నదో, ఇంకా ఇలాంటి ఎన్నో సంగతులు ఇప్పుడు నాకు తెలుసు. దీనంతటికీ నేను ఖుశ్వంత్ సింగ్‌కు రుణపడి ఉంటాను. నా కళ్లు మొట్టమొదట పడింది ఆయన వ్యాసం మీదే. చెప్పాలంటే దాన్ని ఆబగా చదివాను – కృతజ్ఞతతో, ఆనందంతో. కొంత గర్వ ప్రదర్శన చేసుకోవడానికి అనుమతివ్వండి.

ఢిల్లీ మూలం విసుగు తెప్పించే సత్యం కంటే ఎంతో చక్కగాఉండే ఒక పౌరాణిక గాథపై ఆధారపడి ఉంది. ఒకానొకప్పుడు గంగానది పొంగి పరవళ్లు తొక్కుతున్నప్పుడు (ఈరోజు అది అలా ప్రవహించలేనంతగా కలుషితమైపోయింది) అది శాస్త్రాలను కక్కింది. (యాదృచ్ఛికంగా ఈ 'కక్కడం' అనే మాట ఖుశ్వంత్ సింగ్‌దే. కానీ ఆయన దాన్నొక శ్లేషగా మాత్రమే వాడి వుంటారా అని నా సందేహం.). ఆ ప్రాంతానికి గుర్తుగా అక్కడ నిగమ్‌బోధ్ అని పిలిచే ఆలయం నిర్మించారు. అవును ఒకరోజు మీరు, నేను ఇదే ఘాట్ దగ్గర బహుశా స్వర్గాభిముఖంగా బట్వాడా అవుతాం. ''ఇది ఢిల్లీని దైవ నిలయంగా ఎంచుకోవడానికి మన పూర్వీకులకు తగిన హేతువు అయి వుండవచ్చు'' అని ఖుశ్వంత్ సింగ్ కొనసాగిస్తారు. ''అలా ఢిల్లీ మొదటి నగరం, స్వర్గాధిపతి అయిన ఇంద్రుడి నివాసం ఇంద్రప్రస్థ ఆవిర్భవించింది.'' నేడు పురానా ఖిలా బహుశా అదే చోట ఉంది.

ఇంద్రప్రస్థ అనంతరం, అది మన ప్రియమైన న్యూఢిల్లీ అయ్యేంతవరకూ అనేక నగరాలు వెలిశాయి. ఎన్ని నగరాలు అనే సంఖ్య అనిశ్చితం. కొంతమంది ఏడు నగరాలు అని చెబుతూ ఢిల్లీని ఎనిమిద వదిగా పేర్కొంటుంటారు. ఇంకొందరయితే పదిహేను నగరాలు



అంటారు. ఖుశ్వంత్ వ్యాసంలో నేను ఇట్టే పద్నాలుగు నగరాలను లెక్కించాను. అవి ఇంద్రప్రస్థ, యోగినిక్‌పుర, లాల్ కోట్, సిరి, కిలో ఖేరీ, చిరాగ్, జహాపనా, తుగ్లకాబాద్, ఫిరోజాబాద్, ఖిలా ఫిరోజ్ షా, ముబారకాబాద్, దీన్ పనాహ్, షాజహానాబాద్, తర్వాత ఇంకేంటి న్యూఢిల్లీ. కానీ పదిహేనవ నగరం ఏది? నాకు ఇప్పటికీ తెలియనందుకు చిరాగ్గా ఉంది.

ఏదేమైనా, నాకు ఖుశ్వంత్ వ్యాసంలో మరీ ఎక్కువ నచ్చింది ఢిల్లీ ఉచ్చారణకు సంబంధించిన ఖండిక. ''చదువుకున్నవాళ్లు డెహ్లీ అనీ, సాధారణ జనం దిలీ అని పిలిచే... విచిత్రంగా ధ్వనించే పేరు''. దీనికి సంబంధించి అనేక వివరణలు ఉన్నాయి. పర్షియన్ పదమైన దెహ్లీజ్ నుంచి ఇది పుట్టుకొచ్చి ఉండవచ్చు. దెహ్లీజ్ అంటే ప్రవేశ ద్వారం అని అర్థం. ఎందుకంటే గంగా మైదాన ప్రాంతానికి ఇది ఒక ప్రవేశద్వారంగా ఉంటోంది. మరొక వివరణ ప్రకారం, డైడలస్ అనే పదం నుంచి ఢిల్లీ పేరు పుట్టి ఉండవచ్చు. ఈజిప్టులోని అలెగ్జాండ్రియాకు చెందిన భౌగోళిక శాస్త్రవేత్త టాలెమీ ఈ నామకరణం చేశారు. ఏదేమైనా, ఈ నగరాన్ని ఒకప్పుడు పరిపాలించిన రాజన్ ఢీలూ పేరుతో దీని జాడలు దొరుకుతున్నాయని 16వ శతాబ్ది పర్షియన్ చరిత్రకారుడు ఫెరిష్తా పేర్కొన్నాడు. కొంతమంది పండితులు ఈ పేరును కుతుబ్ మినార్ సమీపంలో ఉండే సుప్రసిద్ధ ఇనుప స్తంభంతో ముడిపెడు తున్నారు. అయితే ఈ సంబంధాన్ని నేను పూర్తిగా అర్థం చేసుకున్నానని చెప్పలేను. ఖుశ్వంత్ సింగ్ చెప్పినట్లుగా, ''ఈ స్తంభాన్ని మహా విష్ణువు ప్రతీకగా రూపొందించారు. దీన్ని తన తలపై భూమిని మోస్తున్న త్రాచుపాము (వాసుకి) పడగలోకి లోతుగా పాతడానికి ఉద్దేశించారు.'' ఈ స్తంభం జోలికి పోయేవారికి శాపం తగులుతుందని చెబుతుంటారు. అయితే ఒక మూర్ఖపు తోమర్ రాజ్‌పుత్ రాజు దీన్ని నిజంగానే త్రాచుపాము పడగ మీదే జొప్పించినట్టుగా ప్రతిష్ఠించారో లేదో రుజువు కావాలనుకుని, దాన్ని తవ్వించాడు. స్తంభం బయటకు తీయగానే, దాని కిందిభాగం రక్తంతో తడిసివుండటం కనిపించింది. తర్వాత తోమర్ రాజు తన సింహాసనాన్ని కోల్పోయాడు. అతడి వంశం కూడా అతడితోనే అంతరించి పోయింది. ఇది అద్భుతమైన గాథ. కానీ నా వరకూ దీనికీ, ఢిల్లీ పేరుకూ ఉన్న సంబంధాన్ని గ్రహించలేక పోయాను. ఢిల్లీ ఒక నెత్తుటి నగరం అని ఇది సూచిస్తోందా? విషాదకరంగా, కొన్నిసార్లు ఢిల్లీ అలాగే ఉండింది.

విషాదమేమిటంటే, ఖుశ్వంత్ సింగ్‌ను వీటిపై వివరించమని అడిగే అవకాశాన్ని నేను ఎన్నడూ పొందలేదు. ఢిల్లీకి ఆ తప్పిపోయిన 15వ పేరు గురించి కూడా అడిగే అవకాశం లేకుండా పోయింది. అయినప్పటికీ తర్వాత ఎప్పుడైనా ఎయిర్ ఇండియా విమానంలో ఒక అందమైన యువతి పక్కన కూర్చున్నప్పుడు, సంభాషణను నిలపడంలో నాకు తక్కువ సమస్యలు ఉంటాయి. నాకు ఆ అదృష్టం పట్టాలని కోరుకోండి మరి!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** బ.ద్వాదశి రా.11.45 వకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** ఉత్తరాభాద్ర ఉ.8.46 వరకు, తదుపరి రేవతి, **వర్జ్యం:** రా.8.20 నుండి 9.53 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.04 నుండి 8.55 వరకు, తదుపరి రా.10.47 నుండి 11.32 వరకు ; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 5.47, **సూర్యాస్తమయం:** 6.37.

క్లుప్తంగా...

పెట్టుబడులకు శ్రీసిటీ అనుకూలం

పుదుచ్చేరి రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి పి.జవహర్



శ్రీసిటీలోని కెమ్ ఫ్యాబ్ పరిశ్రమను పరిశీలిస్తున్న పుదుచ్చేరి అధికారుల బృందం

వరదయ్యపాళెం(తిరుపతి జిల్లా): పెట్టుబడులకు శ్రీసిటీ పారిశ్రామికవాడ ఎంతో అనుకూలమని పుదుచ్చేరి రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి పి.జవహర్ ప్రశంసించారు. పుదుచ్చేరి రాష్ట్రానికి చెందిన సీనియర్ అధికారుల బృందంతో కలిసి ఆయన సోమవారం శ్రీసిటీని సందర్శించారు. వీరికి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికి శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతల గురించి వివరించారు. జవహర్ మాట్లాడుతూ.. శ్రీసిటీ రూపకల్పన, అమలు తీరును నేరుగా వీక్షించడం ఎంతో అనుభవాన్నిచ్చిందన్నారు. తమ రాష్ట్రంలో ఈ నమూనాను అనుసరించే ఆలోచనతో సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసేందుకే తమ అధికారుల బృందం పర్యటిస్తున్నదని చెప్పారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ.. వాణిజ్యం, పరిశ్రమలు, విద్య, ఓడరేవులు, హౌసింగ్ తదితర విభిన్న రంగాల్లో అపారమైన అనుభవం ఉన్న పుదుచ్చేరి ఉన్నతాధికారుల బృందం శ్రీసిటీలో పర్యటించడం గౌరవప్రదంగా భావిస్తున్నామన్నారు. పుదుచ్చేరి రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యశాఖ డైరెక్టర్ ఎండీ రుద్రగౌడ్, జనరల్ మేనేజర్ సురేశ్‌రాజ్, పరిశ్రమలు, వాణిజ్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ధనగోవింద్, డిప్యూటీ ఫంక్షనల్ మేనేజర్ జయరామన్, డిప్యూటీ మేనేజర్ (వర్క్స్) శంకరన్ తదితరులు పాల్గొన్నారు.

ఈ దశలో బెయిల్ ఇవ్వడం సరికాదు

ఉదయ్‌కుమార్ పిటిషన్‌ను కొట్టేసిన సీబీఐ కోర్టు

సాక్షి, హైదరాబాద్: మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో నిందితుడు (ఏ-6) గజ్జల ఉదయ్‌కుమార్‌కి ఈ దశలో బెయిల్ ఇవ్వడం సరికాదని సీబీఐ స్పెషల్ కోర్టు అభిప్రాయపడింది. బెయిల్ పిటిషన్‌ను కొట్టివేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. వివేకా హత్యకేసులో గత నెల 14న ఉదయ్‌ని అరెస్టుచేసిన సీబీఐ.. అనంతరం కోర్టు అనుమతితో ఆరురోజులు కస్టడీలోకి తీసుకుని విచారించింది. అరెస్టయిన రెండురోజులకే ఉదయ్‌కుమార్ సీబీఐ కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన సీబీఐ కోర్టు గత వారం తీర్పు రిజర్వు చేసింది. సోమవారం తీర్పు వెలువరించింది.

జల్‌జీవన్ నిధులు పక్కదారి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు

గురజాల: కేంద్రం అందించే జల్‌జీవన్ మిషన్ నిధులు పక్కదారి పడుతున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు ఆరోపించారు. పల్నాడు జిల్లా గురజాలలో సోమవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో ప్రజాసమస్యలపై ప్రజాచార్జిషీట్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని ప్రజల నుంచి సమస్యలు తెలుసుకుని అర్జీలు తీసుకున్నారు. అనంతరం ఆ సమస్యల్ని రెవెన్యూ డివిజన్ అధికారికి విన్నవించారు. ఆర్డీవో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వీర్రాజు మాట్లాడారు. రాష్ట్రంలో నిరంకుశ పాలన నడుస్తోందని విమర్శించారు. కేంద్రం నుంచి ప్రతి జిల్లాకు రూ.1,200 కోట్లు ఇచ్చి జల్‌జీవన్ మిషన్‌లో వాటర్ గ్రిడ్ ద్వారా ప్రతి ఇంటికి కుళాయి వేయాలని ప్రధాని నరేంద్రమోదీ ఆదేశించారని చెప్పారు. దీనికి టెండర్లు పిలిచిన ప్రభుత్వం రాష్ట్రం తరఫున నిధులు ఇవ్వకుండా నీటిని అందించలేకపోవడం దురదృష్టమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మద్యం, ఇసుక, గ్రావెల్ విషయాల్లో పెద్ద తప్పులు చేసిందన్నారు. గ్రామాల అభివృద్ధి కుంటుపడే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలపై చార్జిషీట్ దాఖలు చేశామన్నారు. రానున్న ఎన్నికల్లో పొత్తుల విషయంలో నిర్ణయం తమ పార్టీ అధిష్టానానిదేనన్నారు. బీజేపీతో ఉన్నామంటున్న పవన్‌కళ్యాణ్ టీడీపీతో కలిసి పనిచేయాలంటున్నారని, ఈ విషయాన్ని పార్టీ పెద్దల దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. కేంద్ర పార్టీ నిర్ణయాన్నిశిరోధార్యంగా భావిస్తామని ఆయన పేర్కొన్నారు.

గెలిపించిన తర్వాత గల్లా పట్టుకోండి: లోకేశ్

మహానంది: 'నా గల్లా పట్టుకోండి.. ఓహో ఈయన గల్లా పట్టుకుంటారా.. పట్టుకోండి.. పర్మిషన్ ఇస్తున్నా. అయితే గెలిపించిన తర్వాత పట్టుకోండి.. ముందు వద్దు..' అని టీడీపీ నాయకుడు లోకేశ్ పేర్కొన్నారు. ఆయన నిర్వహిస్తున్న పాదయాత్రలో భాగంగా మంగళవారం నంద్యాల జిల్లా సంతజూటూరులో గిరిజనులతో ముఖాముఖి నిర్వహించారు. లోకేశ్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే గిరిజనుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఆయన మాట్లాడుతుండగా గిరిజనులు వేదికపై ఉన్న మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి వైపు చూసి ఏదో చెప్పబోతుండగా.. ఆయన గల్లా పట్టుకుంటారా.. గెలిపించిన తరువాత పట్టుకోండి అని పేర్కొన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత మొదటి ఏడాదిలోగా ఇళ్లు కట్టించకపోతే గల్లా పట్టుకోండి అని చెప్పారు. బ్యాక్‌లాగ్ పోస్టులను ఐదేళ్లలో భర్తీచేస్తామని హామీ ఇచ్చారు.

సీఎం జగన్‌ను కలిసిన ఏపీ క్షత్రియ ఫెడరేషన్ ప్రతినిధులు

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సోమవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో ఏపీ క్షత్రియ ఫెడరేషన్ ప్రతినిధులు కలిశారు. క్షత్రియ సామాజికవర్గ అభివృద్ధి కోసం ఏపీ క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసినందుకు, నూతన జిల్లాకు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టినందుకు సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటివరకు సేవా సమితి పేరుతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. ప్రస్తుతం ఏపీ క్షత్రియ ఫెడరేషన్‌ను ఏర్పాటు చేసి మరింత విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు సీఎంకు వివరించారు. సీఎం జగన్ స్పందిస్తూ.. ప్రభుత్వం తరఫున అవసరమైన సహకారం అందజేస్తామని చెప్పారు. సీఎం జగన్‌ను కలిసిన వారిలో ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, ఏపీ క్షత్రియ ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటపతిరాజు, దాట్ల సత్యనారాయణరాజు, ఏపీ క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు, క్షత్రియ ఫెడరేషన్ వైస్ చైర్మన్ టీవీఎస్ ఆంజనేయరాజు, గాదిరాజు సుబ్బరాజు ఉన్నారు.



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న క్షత్రియ ఫెడరేషన్ పత్రినిధులు

నిప్పుల కొలిమి

▶ మొదటి పేజీ తరువాయి

ఉష్ణోగ్రతలు 40 నుంచి 45 డిగ్రీల వరకు నమోదయ్యాయి.

అత్యధిక ఉష్ణోగ్రతలు ఇక్కడే

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కొండాపురంలో అత్యధికంగా 46.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆ తర్వాత ప్రకాశం జిల్లా పచ్చవలో 46.2, కృష్ణా జిల్లా కొండూరులో 46, గుంటూరు జిల్లా పొన్నూరులో 45.9, పల్నాడు జిల్లా రావిపాడులో 45.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. 2021, 22 సంవత్సరాల్లో వేసవి ఉష్ణోగ్రతలు రాష్ట్రంలో 46 డిగ్రీలు దాటలేదు. 45 డిగ్రీలకు చేరుకున్నా అది కొన్ని ప్రాంతాలకే పరిమితమైంది. కానీ ఈ సంవత్సరం 46 డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవగా, మెజారిటీ ప్రాంతాల్లో 42 డిగ్రీల కంటే ఎక్కువగా నమోదైంది.

వచ్చే రెండు రోజులు మరింత తీవ్రం

వచ్చే రెండు రోజులు ఎండలు మరింత తీవ్రం కానున్నాయి. కోస్తా జిల్లాల్లో తీవ్రమైన హీట్ వేవ్ ఉంటుందని ఇప్పటికే భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. మంగళవారం 9 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 194 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉన్నట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. గుంటూరు జిల్లా దుగ్గిరాల, కొల్లిపర, మంగళగిరి, పెదకాకాని, తాడేపల్లి, తాడికొండ, తుళ్లూరు మండలాలు, కృష్ణా జిల్లా పెనమలూరు మండలం, ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలో తీవ్రవడగాడ్పులు ఉండే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రయాణాల్లో ఉన్నవారు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

సోమవారం రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు

నగరం	ఉష్ణోగ్రత	నగరం	ఉష్ణోగ్రత
విజయవాడ	44.6	కర్నూలు	41.6
తిరుపతి	44.6	నెల్లూరు	37.2
కాకినాడ	43.4	ఒంగోలు	41.5
గుంటూరు	40.6	శ్రీకాకుళం	36.3
కడప	44.2	విశాఖపట్నం	43.0
అనంతపురం	41.0	విజయనగరం	43.4

వడదెబ్బకు ప్రకాశంలో నలుగురు మృతి

ఒంగోలు: ఎండ తీవ్రత కారణంగా వడదెబ్బకు గురై సోమవారం ప్రకాశం జిల్లాలో నలుగురు మృతిచెందారు. జరుగుమల్లి మండలం కె.బిట్రగుంటకు చెందిన సాబినేని సుబ్బమ్మ (56), పాపిశెట్టి సూరిబాబు(57), పొందూరి సుబ్బరామిరెడ్డి (68), సింగరాయకొండ మండలం పాతసింగరాయకొండకు చెందిన కొట్టే పేరమ్మ(65) వడదెబ్బకు గురై మరణించిందని కుటుంబ సభ్యులు తెలిపారు.



నిర్మానుష్యంగా ఒంగోలులోని కొత్తపట్నం బస్టాండ్ సెంటర్

ఎక్కువగా నీరు తాగాలి



ఈ ఉష్ణోగ్రతల ప్రభావంతో శరీరంలో నీటిశాతం తగ్గిపోయి హెపటైటిస్-బి వచ్చే ప్రమాదం ఉంది. ఎండలో పనిచేసే వారు ఎక్కువగా నీటితో పాటు పళ్లరసాలు, బార్లీ, మజ్జిగ వంటివి తీసుకోవాలి. ఎండలో పనిచేసేవారిలో విపరీతమైన నీరసం, తలనొప్పి, పిక్కలు పట్టేయడం, తల విసిరేయడం వంటి లక్షణాల్లో ఏ ఒక్కటి ఉన్నా డీహైడ్రేషన్‌కు గురైనట్లు గుర్తించాలి. వారు నీడలోకి చేరి నీరు ఎక్కువగా తీసుకుని సేదతీరాలి. కళ్లకు ఇబ్బందులు రాకుండా నల్ల కళ్లద్దాలు వాడాలి. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4 గంటలు వరకు ప్రయాణాలు చేయకూడదు.

– డాక్టర్ వడ్డాది సురేష్, ఎండీ, రాజమహేంద్రవరం.

ఎన్జీటీ ఆదేశాలపై 17న విచారణ

సాక్షి, న్యూఢిల్లీ : ఆవులపల్లి, ముదివేడు, నేతిగుంటపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లకు సంబంధించి రాష్ట్ర స్థాయి పర్యావరణ అనుమతులు పక్కనపెడుతూ జాతీయ హరిత ట్రిబ్యునల్(ఎన్జీటీ) ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు ఈ నెల 17న విచారించనుంది. ఎన్జీటీ పర్యావరణ అనుమతులు పక్కనపెట్టడం, రూ.100 కోట్లు జరిమానా విధించడంపై ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌ను త్వరగా విచారించాలంటూ ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి, ఏవోఆర్ మెహ్‌ఫూజ్ నజ్కీలు సోమవారం సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ ధర్మాసనం ముందు ప్రస్తావించారు. రిజర్వాయర్ల నిర్మాణాన్ని ప్రజా ప్రాజెక్టుగా అభివర్ణించిన ధర్మాసనం ఈ నెల 17న విచారణ జాబితాలో చేర్చాలంటూ రిజిస్ట్రీని ఆదేశించింది.

అనుమతుల్లేని పాఠశాలలపై చర్యలు తీసుకోండి

సాక్షి, అమరావతి: ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ సోమవారం ఆర్జేడీ, డీఈవోలను ఆదేశించారు. పాఠశాలలకు ప్రభుత్వ అనుమతులు, గుర్తింపునకు సింగిల్‌విండో ఆన్‌లైన్ విధానం అందుబాటులోకి తెచ్చామని, యాజమాన్యాలు https://cse.ap.gov.in/PSIS వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ విధానంలో ఫైళ్లు వేగంగా పరిష్కారమవుతాయని పేర్కొన్నారు.

యాంటిబయోటిక్స్ మందుల వినియోగంపై గ్రామస్థాయిలో అవగాహన

వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు



సాక్షి, అమరావతి: యాంటి బయోటిక్స్ మందుల వినియోగంపై గ్రామ స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఆదేశించారు. మంగళగిరిలోని వైద్యశాఖ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఏపీ యాక్షన్ ప్లాన్ ఫర్ కంటైన్మెంట్ ఆఫ్ యాంటి మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) రిపోర్టును కృష్ణబాబు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన ఏఎంఆర్ కట్టడిలో భాగంగా భాగస్వామ్య సంస్థల ప్రతినిధులతో జూమ్ మీటింగ్ మాట్లాడుతూ... వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్‌లో పనిచేసే కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్(సీహెచ్‌వో)లు ఏఎంఆర్ కట్టడికి పని చేయాలన్నారు. ఏఎంఆర్ కట్టడికి అవగాహన కల్పించేందుకు విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఇప్పటికే సీహెచ్‌వోలకు ఈ అంశంపై అవగాహన కల్పించామన్నారు. ఏఎంఆర్ కట్టడిలో ఇతర రాష్ట్రాలకు ఏపీ ఆదర్శంగా నిలుస్తోందన్నారు.

మాజీ ఎమ్మెల్యే డైరెక్షన్.. తెలుగు తమ్ముళ్ల ఓవరాక్షన్!

- అల్లరి మూకలతో కలిసి అన్నమయ్య జిల్లాలో శంకర్‌యాదవ్ హల్‌చల్
- సంఘీభావ ర్యాలీ పేరుతో దౌర్జన్యకాండ
- జాతీయ రహదారిపై బైఠాయింపు
- వైఎస్సార్‌సీపీ నేతలపై రాళ్లు, చెప్పులతో దాడి

ములకలచెరువు : నారా లోకేశ్ 'యువగళం' పాదయాత్ర వంద రోజులు పూర్తయిన సందర్భంగా అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లి నియోజకవర్గానికి చెందిన తెలుగు తమ్ముళ్లు ములకలచెరువులో సోమవారం చేపట్టిన సంఘీభావ ర్యాలీ ఉద్రిక్తతలకు దారితీసింది. తంబళ్లపల్లి మాజీ ఎమ్మెల్యే జి.శంకర్ యాదవ్ నేతృత్వంలో చేపట్టిన ఈ ర్యాలీకి పోలీసుల నుంచి ముందస్తు అనుమతి లేదు. దీంతో పోలీసులు ర్యాలీని అడ్డుకున్నా... శంకర్‌యాదవ్ డైరెక్షన్‌లో తెలుగు తమ్ముళ్లు రెచ్చిపోయి అలజడి సృష్టించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ దౌర్జన్యకాండకు ఒడిగట్టారు. దీంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అదనపు పోలీసు బలగాలు రంగంలోకి దిగాయి. ఫలితంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు ములకలచెరువు మండల కేంద్రంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సంయమనంతో అక్కడే ఉన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులను రెచ్చగొట్టేలా టీడీపీ శ్రేణులు ఈలలు వేస్తూ వారి మీదికొచ్చారు. అల్లరి మూకలు వైఎస్సార్‌సీపీ నాయకులపై రాళ్లు, చెప్పులతో దాడులు చేశాయి. ఈ దాడుల్లో పోలీసులతోపాటు వైఎస్సార్‌సీపీ నేతలకూ గాయాలయ్యాయి. సంఘీభావ ర్యాలీ చేపట్టిన శంకర్ అనుచరులు, పోలీసుల మధ్య వాగ్వాదం జరిగింది. ర్యాలీకి ముందస్తు అనుమతి లేదని నిలిపివేయాలని మదనపల్లి డీఎస్పీ కేశప్ప మాజీ ఎమ్మెల్యే శంకర్‌కు సూచించారు. 'మీకు చేతనైతే ర్యాలీని ఆపుకోండి.. దేనికైనా సిద్ధం' అంటూ శంకర్ పోలీసులను రెచ్చగొట్టారు. అంతటితో ఆగని శంకర్.. తన వాహనంతో మండల కేంద్రానికి వచ్చి అనుచరగణంతో కలిసి జాతీయ రహదారిపై బైఠాయించారు. దీంతో గంటల కొద్దీ ట్రాఫిక్ స్తంభించింది. వాహనదారులు అసహనం వ్యక్తం చేశారు.



డీఎస్పీతో వాగ్వాదానికి దిగిన శంకర్‌యాదవ్

చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే చర్యలు తప్పవు : డీఎస్పీ

బహిరంగ సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించాలంటే ముందస్తుగా పోలీసుల అనుమతి తప్పనిసరిగా పొందాలని డీఎస్పీ కేశప్ప స్పష్టం చేశారు. ఇష్టారాజ్యంగా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని జన జీవనానికి విఘాతం కలిగిస్తూ.. సభలు, సమావేశాలు నిర్వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు

తెలుగు తమ్ముళ్ల దాడిలో మహిళలకు గాయాలు

యాదమరి(చిత్తూరు జిల్లా): లోకేశ్ పాదయాత్ర వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా యాదమరి మండలంలో చేపట్టిన సంఘీభావ యాత్రలో వైఎస్సార్‌సీపీ నాయకుల ఇళ్లపై టీడీపీ నాయకులు టపాకాయలు కాల్చి దాడికి దిగారు. సోమవారం నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు యాదమరి నుంచి దళవాయిపల్లెకు సంఘీభావ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కావాలనే 14 కండిగ ముస్లింవాడ గ్రామం మీదుగా దళవాయిపల్లె వరకు పాదయాత్ర చేశారు. 14 కండిగ ముస్లింవాడలో వైఎస్సార్‌సీపీ మైనారిటీ నాయకులు, స్థానిక సర్పంచ్ కుటుంబం కబీర్ ఇంటి ముందు బాణసంచా పేల్చి, వారిని ఇబ్బందులకు గురిచేయాలని భావించారు. ప్రణాళిక ప్రకారం వీధిలో దాదాపు 500 మీటర్ల దూరం బాణసంచా పేర్చి నిప్పు పెట్టారు. చెవులకు చిల్లులు పడేలా శబ్దాలు రావడంతో ఇంట్లో ఏడాది బాబుతో పాటు మహిళలు భయాందోళనలకు గురయ్యారు. దీనిపై స్థానిక మహిళలు తెలుగు తమ్ముళ్లను ప్రశ్నించగా, వారు రెచ్చిపోయి విచక్షణ రహితంగా దాడులకు తెగబడ్డారు. పలువురు మహిళలకు గాయాలయ్యాయి. దీనిపై మైనారిటీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సుమన్ తెలిపారు.

ఓర్వలేకనే ఇళ్లపై విష కథనాలు

మున్సిపల్ శాఖ మంత్రి సురేష్



మార్కాపురం: రాజధాని ప్రాంతంలో పేదలకు అన్ని వసతులతో ఇళ్లు కట్టించి ఇవ్వటాన్ని సహించలేక టీడీపీ నేతలు ఆటంకాలు సృష్టిస్తున్నారని పురపాలక శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ విమర్శించారు. మార్కాపురంలో సోమవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. టీడీపీ హయాంలో టిడ్కో ఇళ్ల పేరుతో ఇష్టానుసారంగా వసూలు చేసి పేదలను అవస్థలకు గురి చేశారని ధ్వజమెత్తారు. పేదలపై బ్యాంకు రుణాల భారం లేకుండా ముఖ్యమంత్రి జగన్ ఒక్క రూపాయికే ఇళ్లు కట్టించి ఇస్తుంటే ఓర్వలేక టీడీపీ అనుకూల మీడియాలో బురద రాతలు రాస్తున్నారని మండిపడ్డారు. జర్నలిజం, రాజకీయాలు వేర్వేరు విషయాలని రామోజీరావు ఇప్పటికైనా గుర్తించాలని సూచించారు. టిడ్కో ఇళ్లపై ఇప్పటివరకు 101 అసత్య కథనాలను ప్రచురించారని చెప్పారు. రాజధాని ప్రాంతంలోని పెనుమాక, ఎర్రబాలెం, దొండపాడు, అనంతవరం, తుళ్లూరు తదితర చోట్ల రూ.350 కోట్లతో గృహ నిర్మాణాలు జరుగుతుండగా మరో రూ.వంద కోట్లతో నీరు, డ్రైనేజ్, రోడ్ల పనులు పూర్తి కావచ్చాయని, విద్యుత్ సౌకర్యం కూడా త్వరలో పూర్తవుతుందని తెలిపారు. ఎన్ని ఆటంకాలు సృష్టించినా పేదలకు టిడ్కో ఇళ్లను ఇచ్చి తీరుతామన్నారు.

డిసెంబర్‌కు 2.63 లక్షల ఇళ్లు

డిసెంబర్ నాటికి రాష్ట్రంలో 2.63 లక్షల ఇళ్లను రూ.14 వేల కోట్ల వ్యయంతో సిద్ధం చేసి ప్రజలకు అప్పగిస్తామని మంత్రి సురేష్ తెలిపారు. ఇప్పటికే 60 వేల గృహాలను అందచేశామన్నారు. ప్రభుత్వం కట్టిన గృహాలు రాష్ట్ర ప్రజలందరికీ కళ్లెదుటే కనిపిస్తున్నా, 'ఈనాడు' మాత్రం నిజాలు రాయడం లేదని విమర్శించారు. పంక్చరైన సైకిల్ టైర్‌కు ఎంత గాలి కొట్టినా ఉపయోగం లేదన్నారు.

టిడ్కో ఇళ్లపైనా క్షుద్ర రాతలు

- 'సెంటు పట్టాల పంపిణీపై ఉన్న తొందర టిడ్కోపై లేదేం?' అంటూ మొసలి కన్నీరు
- ఎలాంటి వసతులు కల్పించకుండా వదిలేసినా బాబును అడగని క్షుద్ర పత్రిక 'ఈనాడు'
- అన్ని వసతులు కల్పించి అమరావతిలో 5,024 టిడ్కో ఇళ్ల నిర్మాణం
- వీటిని మే చివరి వారంలో ఇచ్చేందుకు ఏర్పాట్లు
- పేదలు చెల్లించాల్సిన రూ.71.42 కోట్ల భారాన్ని భరిస్తున్న ప్రభుత్వం



ఫ్యాక్ట్ చెక్

సాక్షి, అమరావతి : సీఆర్డీఏ పరిధిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 50,004 నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు యుద్ధ ప్రాతిపదికన సన్నాహాలు చేస్తుంటే దానిని చూసి ఓర్వలేక నానా యాగీ చేసిన చంద్రబాబు, ఆయన భజన బృందంలోని ఎల్లో మీడియా.. తమ పాచికలు పారకపోవడంతో ఇప్పుడు టిడ్కో ఇళ్లపై మొసలికన్నీరు కారుస్తోంది. నిజానికి.. అమరావతి పరిధిలోని నిడమర్రు, మందడం, అనంతవరం, దొండపాడు, ఐనవోలు, పెనుమాక, తుళ్లూరు, నవులూరులో 5,024 టిడ్కో ఇళ్లను చంద్రబాబు ప్రభుత్వ హయాంలో చేపట్టినా, ఆనాడు వాటికి ఎలాంటి మౌలిక సదుపాయాలు కల్పించకుండానే వదిలేశారు. అనంతరం జగనన్న ప్రభుత్వం వచ్చాక ఆయా నివాసాలకు తాగునీరు, ఎస్టీపీ, విద్యుత్ వంటి సౌకర్యాలకు రూ.75 కోట్లు వెచ్చించింది. ఇక్కడ నిర్మించిన సముదాయాల్లో 300 చ.అడుగుల్లో 992 ఇళ్లు, 365 చ.అ. విస్తీర్ణంలో 1,536.. 430 చ.అ. విస్తీర్ణంలో 2,496 యూనిట్లు మొత్తం 5,024 టిడ్కో ఇళ్లు మంజూరు చేశారు. ప్రభుత్వ సబ్సిడీ పోగా 300 చ.అ. ఇంటికి 2.65 లక్షలు బ్యాంకు రుణంగా పొంది 20 ఏళ్ల పాటు చెల్లించాలని బాబు సర్కారు షరతు విధించింది. అంటే ఒక్కో లబ్ధిదారుడు ఇంటికి రూ.7.20 లక్షలు చెల్లించాలి. ఇక్కడి నివాసాల్లో 992 యూనిట్లు నిరుపేదలకు కేటాయించినవే. వారందరిపైనా బాబు మోపిన ఆర్థిక భారం అక్షరాలా రూ.71.42 కోట్లు. కానీ, ఈ మొత్తాన్ని జగనన్న ప్రభుత్వమే భరించి లబ్ధిదారులకు రూ.1కే ఇంటిని కేటాయించింది.

రూ.112.86 కోట్ల మేర బాబు అదనపు భారం..

▲ 'బి' కేటగిరిలో ఉన్న 365, 430 చ.అ. ఇంటికి రూ.50 వేలు, రూ.లక్ష చొప్పున లబ్ధిదారు వాటాగా చెల్లించాలని బాబు సర్కారు షరతు పెడితే, జగనన్న ప్రభుత్వం ఆ మొత్తాన్ని రూ.25 వేలు, రూ.50 వేలకు తగ్గించింది. ఫలితంగా అమరావతిలోని ఈ రెండు కేటగిరీల లబ్ధిదారులపై ప్రస్తుత ప్రభుత్వం రూ.16.32 కోట్ల భారాన్ని తగ్గించడంతో పాటు మూడు కేటగిరీల ఇళ్లకు లబ్ధిదారుల భారం రూ.87.74 కోట్లను రద్దుచేసింది. పైగా రిజిస్ట్రేషన్ చార్జీలను కూడా పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుండడంతో మరో రూ.25.12 కోట్ల భారం లబ్ధిదారులకు తగ్గిపోయింది. అంటే గత ప్రభుత్వం మోపిన రూ.112.86 కోట్ల భారాన్ని ఇప్పటి ప్రభుత్వమే భరిస్తోంది.


▲ అంతేగాక.. పేదలకు ఇచ్చిన 300 చ.అ ఇళ్లను రూ.2.65 లక్షల చొప్పున 323 మంది బ్యాంకుల నుంచి రూ.6.46 కోట్లు రుణాలు తీసుకుంటే జగన్ సర్కారు ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించి సదరు లబ్ధిదారులకు రూ.1కే ఇంటిని కేటాయించింది.

▲ ఇక ప్రస్తుతం టిడ్కో ఇళ్లు ఉన్న ఎనిమిది ప్రాంతాల్లో గత సర్కారు ఎలాంటి మౌలిక వసతులు కల్పించలేదు. దాంతో ప్రస్తుత ప్రభుత్వం రూ.75 కోట్లతో తాగునీరు, ఎలక్ట్రిక్ పనులు, ఎస్టీపీ నిర్మాణం వంటి వసతులు కల్పించింది. అలాగే, ఎలక్ట్రికల్ పవర్ కనెక్షన్ పనులను మరో రూ.17.06 కోట్లతో చేపట్టింది.

▲ ఇక తుళ్లూరు, దొండపాడు, అనంతవరం, నవులూరు ప్రాంతాల్లో భూగర్భ జలాలు ఉప్పునీరు కావడంతో వాటికి తాగునీటిని అందించేందుకు ప్రత్యేక ప్రాజెక్టును ప్రస్తుత వైఎస్సార్‌సీపీ రూపొందించింది. గత ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యాన్ని సరిదిద్దేందుకు జగన్ సర్కారు మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు ఇటు పేదలపై ఆర్థిక భారం పడకుండా చేస్తోంది. ఇలా అన్ని రకాలుగా ఇక్కడి లబ్ధిదారులకు రూ.200 కోట్ల మేర లబ్ధిని చేకూర్చింది. మరోవైపు.. అన్ని వసతులతో సిద్ధమైన 5,024 టిడ్కో ఇళ్లను మే చివరి వారం లేదా జూన్ మొదటి వారంలో అందించేందుకు ప్రణాళికను సిద్ధంచేసింది. కానీ, అమరావతిలోని టిడ్కో లబ్ధిదారులను ఆర్థికంగా దెబ్బతీసేలా పథకాలు రూపొందించిన నాటి చంద్రబాబు నిర్లక్ష్యాన్ని ప్రశ్నించలేని క్షుద్ర పత్రిక ఈనాడుకు ప్రస్తుత సర్కారు ఇంత మేలు చేస్తున్నా కనిపించకపోవడం విచారకరం.

హజ్ యాత్ర అదనపు భారం ప్రభుత్వమే భరిస్తుంది

- 1,813 మందికి మేలు చేసేలా సీఎం వైఎస్ జగన్ నిర్ణయం
- రూ.14.51 కోట్లు విడుదల చేయడం గొప్ప విషయం
- విజయవాడ విమానాశ్రయం నుంచే హజ్ యాత్రకు ఏర్పాట్లు
- ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా
- జూన్ 7 నుంచి 22 వరకు గన్నవరం నుంచి హజ్ యాత్రకు ఏర్పాట్లు




సాక్షి, అమరావతి/కడప కార్పొరేషన్: పవిత్ర హజ్ యాత్రకు వెళ్లే వారికి మేలు చేసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారని ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా చెప్పారు. ఆంధ్రప్రదేశ్ నుంచి హజ్ యాత్రకు వెళ్లే వారిపై పడుతున్న అదనపు భారాన్ని ప్రభుత్వమే భరిస్తుందని, దీనివల్ల 1,813 మంది హజ్ యాత్రికులకు మేలు జరుగుతుందని వెల్లడించారు. హజ్ యాత్రికుల అదనపు ఖర్చుల భారం రూ.14.51 కోట్లను ప్రభుత్వమే భరించేలా ఉత్తర్వులు జారీ చేయడం గొప్ప విషయమని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది రాష్ట్రానికి చెందిన హజ్ యాత్రికులకు విజయవాడ (గన్నవరం విమానాశ్రయం) ఎంబార్కేషన్ పాయింట్ నుంచి వెళ్లేందుకు ఏర్పాటు చేశామన్నారు. హజ్ యాత్ర ప్యాకేజీలను కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని హజ్ కమిటీ నిర్ణయించిందన్నారు. దీంతో హైదరాబాద్ విమానాశ్రయం నుంచి వెళ్లే వారికంటే గన్నవరం నుంచి వెళ్లే యాత్రికులు ఒక్కొక్కరిపై రూ.80 వేల అదనపు భారం పడుతుందన్నారు. ఈ విషయంపై సీఎం వైఎస్ జగన్ కేంద్ర విమానయాన మంత్రిత్వ, మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రులకు లేఖలు రాశారన్నారు. సీఎం ఆదేశాలతో ఆయా శాఖల కేంద్ర మంత్రులను కలిసి తాము సంప్రదింపులు జరిపినట్లు తెలిపారు. హైదరాబాద్, బెంగళూరు టికెట్ ధరలతో సమానంగా విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్‌కు టికెట్ ధర నిర్ణయించాలని కోరినట్టు వివరించారు. సాంకేతిక కారణాల వల్ల ఆ మంత్రిత్వ శాఖలు నిస్సహాయత వ్యక్తంచేశాయని తెలిపారు. దీనిపై సీఎం వైఎస్ జగన్ వెంటనే స్పందించి విజయవాడ నుంచి వెళ్లే యాత్రికులపై పడే అదనపు భారాన్ని ప్రభుత్వమే భరిస్తుందని భరోసా ఇచ్చి, ఉత్తర్వులు జారీ చేశారని, నిధులు కూడా విడుదల చేశారని వివరించారు. దీనిద్వారా సీఎం వైఎస్ జగన్ ముస్లిం పక్షపాతిగా మరోసారి రుజువు చేసుకున్నారని ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆ మొత్తాన్ని ఆన్‌లైన్ ద్వారా సెంట్రల్ హజ్ కమిటీకి చెల్లిస్తామన్నారు.

సీఎం వైఎస్ జగన్ పెద్ద మనసు చాటుకున్నారు : ఏపీ హజ్ కమిటీ చైర్మన్ గౌస్ లాజమ్



హజ్ యాత్రికుల విషయంలో సానుకూలంగా స్పందించిన సీఎం వైఎస్ జగన్ మరోసారి పెద్ద మనసు చాటుకున్నారని ఏపీ హజ్ కమిటీ చైర్మన్ గౌస్ లాజమ్ చెప్పారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. హజ్ యాత్రికుల టూర్ ప్యాకేజీ కేంద్ర హజ్ కమిటీ నిర్ణయిస్తుందని, రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర హజ్ కమిటీకి సంబంధం ఉండదని తెలిపారు. వాస్తవాలు తెలుసుకోకుండా కొందరు రాజకీయం చేయడం సరికాదన్నారు. ఏపీ హజ్ యాత్రికులపై అదనపు భారాన్ని ప్రభుత్వమే భరించేలా సీఎం జగన్ నిర్ణయం తీసుకోవడం గొప్ప విషయమన్నారు. జూన్ 7 నుంచి 22వ తేదీ వరకు గన్నవరం విమానాశ్రయం నుంచి హజ్ యాత్రకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు: ముస్లిం జేఏసీ రాష్ట్ర కన్వీనర్ షేక్ మునీర్ అహ్మద్



హజ్ యాత్రికులపై పడుతున్న అదనపు భారాన్ని ప్రభుత్వమే భరించేలా నిర్ణయం తీసుకున్న సీఎం వైఎస్ జగన్‌కు ముస్లిం సమాజం తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని ముస్లిం జేఏసీ రాష్ట్ర కన్వీనర్ షేక్ మునీర్ అహ్మద్ చెప్పారు. ముస్లిం మైనార్టీల విషయంలో ప్రతి సందర్భంలోనూ సీఎం వైఎస్ జగన్ పెద్ద మనసుచాటుకుంటున్నారన్నారు. ఇప్పటికే కడపలో హజ్ హౌస్ ఆధునీకరణ చేపట్టిన ప్రభుత్వం తాజాగా విజయవాడ సమీపంలో రాష్ట్ర హజ్ హౌస్ నిర్మాణానికి చర్యలు తీసుకోవడం ముస్లింలకు సంతోషం కలిగించే విషయమని తెలిపారు.

జగన్ పాలనలో వర్షాలు.. బాబు పాలనలో కరువుకాటకాలు

- జలవనరుల శాఖ మంత్రి అంబటి
- చిత్తూరులో డేటా సెంటర్ ప్రారంభం

చిత్తూరు కార్పొరేషన్(చిత్తూరు జిల్లా)/తిరుపతి కల్చరల్ : వైఎస్సార్‌తో పాటు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కరువు ఉండదని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. జగన్ పాలనలో గత నాలుగేళ్లుగా ఏ ఒక్క మండలాన్నీ కరువు ప్రాంతంగా ప్రకటించలేదని ఆనందం వ్యక్తం చేశారు. వర్షాలు సుభిక్షంగా పడుతున్నాయన్నారు. వైఎస్సార్ పాలనలోనూ సమృద్ధిగా వర్షాలు పడ్డాయని, కానీ చంద్రబాబు పాలనలో మాత్రం కరువు తాండవిస్తుందని చెప్పారు. ప్రపంచ బ్యాంకు నిధులు రూ.1.9 కోట్లతో చిత్తూరులో జిల్లా డేటా సెంటర్‌ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులతో కలిసి అంబటి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రూ.16 కోట్లతో డేటా సెంటర్లను ఏలూరు, విజయనగరం, చిత్తూరు, విశాఖ జిల్లాల్లో ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. కలెక్టర్ షన్మోహన్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.



డేటా సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి అంబటి రాంబాబు, పక్కన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

శ్రీవారి బ్రహ్మోత్సవాల తరహాలో గంగమ్మ జాతర

ఈ ఏడాది తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల తరహాలో వెంకన్న చెల్లి గంగమ్మతల్లి జాతర ఉత్సవాలు జరుగుతుండటం సంతోషకరమని మంత్రి అంబటి రాంబాబు అన్నారు. తిరుపతి గంగజాతరలో భాగంగా సోమవారం మంత్రి అంబటి తన కుటుంబ సభ్యులతో కలిసి శ్రీతాతయ్యగుంట గంగమ్మకు సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మంత్రికి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

క్లుప్తంగా

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసు.. న్యూస్ చానెల్ అధికారి అరెస్ట్

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసుకు సంబంధించి సీబీఐ తాజాగా మరొకరిని అరెస్ట్ చేసింది. 'ఇండియా ఏహెడ్' న్యూస్ చానెల్ కమర్షియల్ హెడ్, ప్రొడక్షన్ కంట్రోలర్ అర్వింద్ కుమార్ జోషిని అదుపులోకి తీసుకుంది. 2022 గోవా అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆప్ ప్రచార బాధ్యతలను చేపట్టిన చారియెట్ మీడియా సంస్థకు ఈయన హవాలా మార్గంలో రూ.17 కోట్లను బదిలీ చేసినట్లు సీబీఐ ఆరోపిస్తోంది. వాట్సాప్ చాటింగ్, హవాలా ఆపరేటర్ల రికార్డులు పరిశీలించిన తర్వాత జోషిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపింది. చారియెట్ మీడియా యజమాని రాజేశ్ జోషిని ఫిబ్రవరిలోనే ఈడీ అదుపులోకి తీసుకుంది. అయితే, సరైన ఆధారాలను సమర్పించలేదంటూ మే 6న ప్రత్యేక కోర్టు ఆయనకు బెయిలిచ్చింది.

మరో 'అనుచిత' విమాన ప్రయాణికుడి అరెస్ట్

అమృత్‌సర్: అంతర్జాతీయ విమానంలో మరో అనుచిత ప్రవర్తన ఘటన చోటుచేసుకుంది. ఈ వివరాలను సోమవారం పోలీసులు వెల్లడించారు. శనివారం షార్జా నుంచి అమృత్‌సర్‌కు బయల్దేరిన ఇండిగో సంస్థ అంతర్జాతీయ విమానంలో పంజాబ్‌లోని కోట్లీ గ్రామానికి చెందిన రాజేందర్ సింగ్ ప్రయాణిస్తున్నారు. విమానంలో తప్పతాగాక అతను విమాన మహిళా సిబ్బంది ఒకరితో గొడవకు దిగాడు. ఈ సందర్భంగా ఆమెను లైంగికంగా వేధించాడు. గొడవను గమనించిన తోటి విమాన సిబ్బంది వెంటనే అమృత్‌సర్‌లోని కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదుచేశారు. దీంతో విమానం అమృత్‌సర్‌లోని శ్రీ గురు రాందాస్ జీ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగగానే రాజేందర్‌ను పోలీసులు అరెస్ట్‌చేశారు. భారత శిక్షాస్మృతిలోని 354, 509 సెక్షన్ల కింద కేసు నమోదుచేశారు.

కరెంటు బిల్లులు కాంగ్రెస్ నుంచి వసూలు చేసుకోండి!

చిత్రదుర్గ: "మే కరెంటు బిల్లులు కట్టం. కాంగ్రెస్ పార్టీ నుంచి వసూలు చేసుకోండి" అని కర్ణాటకలో ఓ గ్రామస్తులు తెగేసి చెప్పారు. చిత్రదుర్గ జిల్లాలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. బకాయిలతో సహా కరెంటు బిల్లులన్నీ కట్టాలన్న బిల్లు కలెక్టర్‌కు గ్రామస్తులు ఎదురు తిరిగారు. ప్రతి ఇంటికీ 200 యూనిట్ల ఉచిత కరెంటిస్తామని కాంగ్రెస్ ఎన్నికల హామీ ఇచ్చింది గనక ఎన్నికల బిల్లులను ఆ పార్టీ నుంచే వసూలు చేసుకోవాలని స్పష్టం చేశారు. దాంతో చేసేది లేక ఆయన వెనుదిరిగాడు.

హాజీ సలీం.. డ్రగ్ లార్డ్



అతనిది అత్యంత విలాసవంతమైన జీవన శైలి. అడుగు కదిలితే చుట్టూ అత్యాధునిక ఏకే ఆయుధాలతో అంగరక్షకుల భారీ భద్రత. ఎటు వెళ్లాలన్నా ముందే పలు అంచెల తనిఖీలు, దారి పొడవునా మూడో కంటికి అగుపడని రీతిలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు. ఇది ఏ దేశాధ్యక్షుని పరిచయమో కాదు. భారత్‌తో సహా పలు ఆసియా దేశాలకు కొన్నేళ్లుగా కంటిపై కునుకు లేకుండా చేస్తున్న డ్రగ్ కింగ్ హాజీ సలీం జల్సా లైఫ్ స్టైల్! శనివారం కోచి సమీపంలో అరేబియా సముద్రంలో అంతర్జాతీయ జలాల్లో భారీగా డ్రగ్స్ మోసుకెళ్తున్న ఓ నౌకను పక్కా సమాచారం మేరకు నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అడ్డగించి ముంచేయడం తెలిసిందే. అందులో ఏకంగా 2.5 టన్నుల మెథంఫెటామిన్ దొరకడం అధికారులనే విస్మయపరిచింది. ఇది ఎన్సీబీకి మోస్ట్ వాంటెడ్ డ్రగ్స్ స్మగ్లర్ అయిన హాజీదేనని దాడిలో పట్టుబడ్డ 29 ఏళ్ల పాక్ జాతీయుడు వెల్లడించాడు. భారత్, శ్రీలంక, సీషెల్స్ తదితర దేశాల్లో సరఫరా నిమిత్తం దీన్ని పాక్ దన్నుతో దొంగచాటుగా తరలిస్తున్నట్టు విచారణలో అంగీకరించాడు. మన దేశంలో ఇంత భారీ మొత్తంలో డ్రగ్స్ పట్టుబడటం ఇదే తొలిసారి! అంతేగాక పలు దేశాల్లో సరఫరా నిమిత్తం అత్యంత భారీ మొత్తంలో డ్రగ్స్‌ను మోసుకెళ్తున్న మదర్ షిప్ ఎన్సీబీకి చిక్కడమూ ఇదే మొదటిసారి! దాని విలువను రూ.12 వేల కోట్లుగా అధికారులు తొలుత పేర్కొన్నారు. కానీ ఇప్పటిదాకా దొరికిన డ్రగ్స్‌లోకెల్లా ఇదే అత్యంత హెచ్చు నాణ్యతతో కూడినదని తాజాగా పరీక్షల్లో తేలింది. దాంతో దీని విలువను సవరించి ఏకంగా రూ.25,000 కోట్లుగా తేల్చారు! పాక్ నుంచి ఉగ్రవాదుల చొరబాటుకు హాజీ ముఠా అన్నిరకాలుగా సాయపడుతున్నట్టు కూడా తేలింది.



భారత్‌కు మోస్ట్‌వాంటెడ్ క్రిమినల్

ఐఎస్ఐ, లష్కరే దన్ను, దావూద్‌తో లింకులు	పలు దేశాల్లో విచ్చలవిడిగా డ్రగ్స్ పంపింగ్
తాజాగా ఎన్సీబీకి చిక్కిన డ్రగ్స్ **2.5** టన్నులు	దాని విలువ ఏకంగా రూ. **25,000** కోట్లు!

పాక్ అడ్డాగా...

పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ, ఉగ్ర సంస్థ లష్కరే తొయిబా అండదండలతో అరేబియా సముద్రంలో హాజీ విచ్చలవిడిగా డ్రగ్స్ దందా నడుపుతున్నాడు. పాక్, ఇరాన్, అఫ్గానిస్తాన్ అతని అడ్డాలు! ఎక్కడా స్థిరంగా ఉండకుండా తరచూ స్థావరాలు మార్చడం హాజీ స్టైల్. అతని ప్రస్తుత అడ్డా పాకిస్తాన్. బలూచిస్తాన్‌లో మకాం వేసి కథ నడుపుతున్నాడు. మాఫియా డాన్ దావూద్ ఇబ్రహీంతోనూ హాజీకి దగ్గరి లింకులున్నట్టు ఎన్సీబీ అనుమానం.

గమ్మత్తైన సంకేతాలు..

తేలు, ఎగిరే గుర్రం, డ్రాగన్, కొమ్ముగుర్రం, 555, 777, 999. ఇవన్నీ డ్రగ్స్ సరఫరాలో హాజీ ముఠా వాడే సంకేతాల్లో కొన్ని. డ్రగ్స్ ప్యాకెట్లపై ఉండే ఈ ప్రత్యేకమైన గుర్తులు వాటిలోని డ్రగ్స్, దాని నాణ్యతకు సంకేతాలు. కొనుగోలుదారులు మాత్రమే వీటిని గుర్తిస్తారు. హాజీ మనుషులు డ్రగ్స్‌ను ఏడు పొరలతో పటిష్టంగా ప్యాక్ చేస్తారు. నీళ్లలో పడ్డా దెబ్బతినకుండా ఈ జాగ్రత్త. ఇలా డ్రగ్స్ సరఫరా, విక్రయంలో హాజీది విలక్షణ శైలి. హాజీ అప్పుగానే డ్రగ్స్ సరఫరా చేస్తాడు. తనకు హవాలా మార్గంలోనే సొమ్ము పంపాలని చెబుతాడు. వ్యాపారానికి శ్రీలంక పడవలు వాడుతుంటాడు. అవి పాక్, ఇరాన్ సముద్ర తీరాల్లో మదర్ షిప్ నుంచి డ్రగ్స్ నింపుకొని రహస్యంగా భారత్‌కు చేరుకుంటాయి. క్వింటాళ్ల కొద్దీ ఉన్న నిల్వను చిన్న చిన్న ప్యాకెట్లుగా మార్చి గమ్యానికి తరలిస్తారు.

ఢిల్లీలో పవర్ ప్లే

పదవిపై పట్టువీడని ఇద్దరు నేతలు

- అధిష్టానం పిలుపుతో ఢిల్లీకి సిద్ధూ
- ఆరోగ్య కారణాలతో రాష్ట్రంలోనే డీకే
- ఖర్గే చేతికి ఏఐసీసీ ప్రతినిధుల నివేదిక
- సోనియా, రాహుల్‌తో అధ్యక్షుని చర్చలు
- నేటి సాయంత్రంలోగా తుది నిర్ణయం!

న్యూఢిల్లీ/బెంగళూరు: కర్ణాటక సీఎం అభ్యర్థిని తేల్చేందుకు కాంగ్రెస్ పెద్దలు హస్తినలో మల్లగుల్లాలు పడుతున్నారు. పదవి కోసం మాజీ సీఎం సిద్దరామయ్య, పీసీసీ చీఫ్ డీకే శివకుమార్ తీవ్రంగా తలపడుతుండటంతో రెండు రోజులుగా రాష్ట్రంలో రాజకీయం వేడెక్కడం తెలిసిందే. సీఎల్పీ భేటీలోనూ పీటముడి వీడకపోవడంతో సంప్రదింపుల కోసం వారిద్దరినీ అధిష్టానం హస్తినకు పిలిచింది. దాంతో సిద్దరామయ్య సోమవారం సాయంత్రమే ఢిల్లీ చేరగా డీకే మాత్రం 'ఆరోగ్య కారణాల'తో బెంగళూరుకే పరిమితమై మరింత సస్పెన్స్‌కు తెర తీశారు. ఢిల్లీ వెళ్తున్నట్టు మధ్యాహ్నం దాకా చెబుతూ వచ్చిన ఆయన చివరికి పర్యటనను రద్దు చేసుకున్నారు. మెజారిటీ ఎమ్మెల్యేలు సిద్దరామయ్య వెంటే ఉన్నారన్న వార్తలను మీడియా ప్రస్తావించగా, తాను మొత్తం 135 మంది ఎమ్మెల్యేలకూ నాయకుడినంటూ డీకే నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. అంతకుముందు సోమవారం ఉదయం బెంగళూరులో డీకే 61వ పుట్టినరోజు వేడుకల్లో సిద్దరామయ్య కూడా పాల్గొన్నారు. ఆ వెంటనే ఒకరు హస్తినలో, మరొకరు బెంగళూరులో తమ ప్రయత్నాలకు పదును పెడుతూ రాజకీయ వేడిని మరింత పెంచుతున్నారు. అసెంబ్లీ పోరులో పార్టీని కలసికట్టుగా విజయ తీరాలకు చేర్చిన వీరిద్దరిలో ఎవరూ పట్టు వీడకపోవడం, వారి మద్దతుదారులైన ఎమ్మెల్యేలు, నేతలు రెండు శిబిరాలుగా చీలిన నేపథ్యంలో ఈ చిక్కుముడిని అధిష్టానం ఎలా పరిష్కరిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. అగ్ర నేతలు సోనియా, రాహుల్‌గాంధీలతో చర్చించి మంగళవారం సాయంత్రానికల్లా సీఎం అభ్యర్థిని అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఖరారు చేస్తారని చెబుతున్నారు. సీఎం అభ్యర్థి ఎంపికకు ఆదివారం రాత్రి పొద్దుపోయేదాకా ముగ్గురు అధిష్టానం ప్రతినిధుల పర్యవేక్షణలో జరిగిన సీఎల్పీ భేటీ ఎటూ తేల్చలేకపోవడం, నేతలతో, ఎమ్మెల్యేలతో దూతల విడివిడి చర్చలు, రహస్య బ్యాలెట్ వంటివి ఏ ఫలితమూ ఇవ్వకపోవడంతో అభ్యర్థి ఎంపిక అధికారాన్ని పార్టీ అధ్యక్షునికే కట్టబెడుతూ సీఎల్పీ తీర్మానం చేయడం తెలిసిందే. సీక్రెట్ బ్యాలెట్ బాక్సులతో ఢిల్లీ ప్రతినిధులు సోమవారం ఢిల్లీ చేరారు. ఖర్గేకు పరిస్థితి వివరించడంతో పాటు నివేదిక కూడా అందజేశారు.



సోమవారం తన పుట్టిన రోజు సందర్భంగా సిద్ధరామయ్యకు కేక్ తినిపిస్తున్న డీకే శివకుమార్

సిద్ధూ వర్సెస్ డీకే

కర్ణాటక సీఎం పదవి కోసం తీవ్ర పోటీ

కర్ణాటక నూతన ముఖ్యమంత్రి ఎవరన్న దానిపై తీవ్ర ఉత్కంఠ కొనసాగుతోంది. సీఎం రేసులో ప్రధానంగా సిద్ధరామయ్య, డీకే శివకుమార్ ముందంజలో ఉన్నారు. ముఖ్యమంత్రి పదవి కావాలన్న ఆకాంక్షను వారిద్దరూ ఏమాత్రం దాచుకోవడం లేదు. పరస్పరం గట్టిగా పోటీ పడుతున్నారు. అయితే, కాంగ్రెస్ అధిష్టానం మనసులో ఏమున్నదో అంతుబట్టడం లేదు. ఈ నేపథ్యంలో ఇద్దరు నాయకుల బలాలు, బలహీనతలు, వారికి ఉన్న అవకాశాలు ఏమిటో చూద్దాం.. – బెంగళూరు

సిద్ధరామయ్య బలాలు

- మాస్ లీడర్‌గా రాష్ట్రవ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు.
- మెజార్టీ కాంగ్రెస్ ఎమ్మెల్యేల మద్దతు.
- 2013 నుంచి 2018 పూర్తిస్థాయిలో ఐదేళ్లపాటు ముఖ్యమంత్రిగా పని చేసిన అనుభవం.
- ఏకంగా 13 సార్లు రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టారు. పరిపాలనలో విశేష అనుభవం ఉంది.
- మైనార్టీలు, వెనుకబడిన తరగతులు, దళితుల్లో ఆదరణ.
- బీజేపీ, జేడీ(ఎస్)లను గట్టిగా ఎదుర్కొనే సామర్థ్యం.
- రాహుల్ గాంధీకి అత్యంత సన్నిహితుడు కావడం. రాహుల్ గాంధీ నుంచి లభిస్తున్న అండదండలు.

బలహీనతలు

- కాంగ్రెస్ పార్టీతో సంస్థాగతంగా పెద్దగా అనుబంధం లేకపోవడం.
- 2018లో ముఖ్యమంత్రిగా పనిచేస్తూ కూడా రాష్ట్రంలో కాంగ్రెస్‌ను మళ్లీ గెలిపించలేకపోవడం.
- జేడీ(ఎస్) నుంచి వచ్చిన ఆయన్ను బయటి వ్యక్తిగానే ఓ వర్గం చూస్తుండటం.
- వయసు 75 ఏళ్లు. వృద్ధాప్యం సమీపిస్తుండడం.

అవకాశాలు

- ప్రభుత్వాన్ని సమర్థంగా నడిపే, అందిరినీ కలుపుకొనేపోయే తత్వం. 2024 లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో అత్యధిక ఎంపీ సీట్లు గెలవాలంటే సిద్ధూ వంటి అనుభవజ్ఞుడు కావాలని అధిష్టానం భావిస్తుండడం.
- డీకే శివకుమార్‌పై ఐటీ, ఈడీ, సీబీఐ కేసులు.
- తనకు ఇదే చివరి ఎన్నిక అని సిద్ధూ ప్రకటించినందున మరోసారి ముఖ్యమంత్రి అయ్యేందుకు ఇదే చివరి అవకాశం కావడం.

డీకే శివకుమార్ బలాలు

- సుదీర్ఘమైన రాజకీయ అనుభవం. బలమైన సంస్థాగత సామర్థ్యాలు.
- అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి ఘన విజయం సాధించి పెట్టడం.
- పార్టీ నాయకత్వానికి విధేయుడిగా పేరు.
- కష్ట కాలంలో ట్రబుల్ షూటర్‌గా అందించిన సేవలు.
- పుష్కలమైన ఆర్థిక వనరులు కలిగిన నాయకుడు.
- బలమైన తన సొంత సామాజిక వర్గం ఒక్కలిగల మద్దతు.
- సోనియా కుటుంబంతో సాన్నిహిత్యం.
- వయసు కేవలం 61 ఏళ్లు. ఆరోగ్యం మెరుగ్గా ఉండడం.
- మంత్రిగా శాఖలను నిర్వర్తించిన అనుభవం.

బలహీనతలు

- వెంటాడుతున్న ఐటీ, ఈడీ, సీబీఐ కేసులు. న్యాయ పోరాటం చేయాల్సి రావడం.
- తిహార్ జైలులో కొన్నిరోజులపాటు శిక్ష అనుభవించడం.
- రాష్ట్రమంతటా కాకుండా పాత మైసూర్‌కే తన ప్రాబల్యం పరిమితం కావడం.
- ఒక్కలిగలు మినహా ఇతర సామాజిక వర్గాల మద్దతు ఆశించిన స్థాయిలో లేకపోవడం.

అవకాశాలు

- పాత మైసూర్‌లో కాంగ్రెస్‌కు ప్రజాదరణ దక్కడం వెనుక కృషి శివకుమార్‌దే.
- కర్ణాటక పీసీసీ అధ్యక్షుడిగా కొనసాగుతుండడం. ఎస్ఎం కృష్ణ, వీరేంద్ర పాటిల్ పీసీసీ అధ్యక్షులుగా ఉంటూ ముఖ్యమంత్రులయ్యారు.
- కాంగ్రెస్‌లోని పాత తరం నాయకుల ఆశీస్సులు లభిస్తుండడం.



అహ్మదాబాద్‌లోని సబర్మతీ ఆశ్రమంలో చరఖా తిప్పుతున్న భారత్‌లో అమెరికా రాయబారి ఎరిక్ గార్సెటీ. ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన ఆయన సోమవారం ఆశ్రమాన్ని సందర్శించారు.

అరుదైన అంతరిక్ష శిల అరుదెంచె..

న్యూజెర్సీలో ఇంట్లోకి దూసుకొచ్చిన కాన్‌డ్రైట్ గ్రహ శకలం



న్యూజెర్సీ: సువిశాలమైన అంతరిక్షంలో వింతలు విడ్డూరాలకు అంతు లేదు. మనకు తెలియని ఎన్నెన్నో విశేషాలు అప్పుడప్పుడు జరుగుతుంటాయి. ఇతర గ్రహాల నుంచి విడిపోయిన శిలలు సుదీర్ఘంగా ప్రయాణం సాగించి మన భూగోళంపై పడుతుంటాయి. ఇలాంటి శిలల వల్ల భూమిపై భారీ గోతుల్లాంటివి ఏర్పడుతుంటాయి. అత్యంత అరుదైన కాన్‌డ్రైట్ అంతరిక్ష శిల(గ్రహ శకలం) అమెరికాలోని న్యూజెర్సీ రాష్ట్రంలో ఓ ఇంటి పై అంతస్తులోని పైకప్పును చీల్చుకొని పడక గదిలోకి దూసుకొచ్చింది. న్యూజెర్సీ రాజధాని ట్రెంటాన్‌కు ఉత్తరాన ఉన్న హోప్‌వెల్ టౌన్‌షిప్‌లో ఇటీవలే మధ్యాహ్నం 12.30 గంటలకు ఈ సంఘటన జరిగింది. ఈ శిల వేగానికి పడక గదిలోని కలప గచ్చు కొంత ధ్వంసమయ్యింది. ఎవరో ఆకతాయిలు రాయి విసిరారని భావించిన ఆ ఇంటి యజమాని సుజీ కాప్ దాన్ని చేతిలోకి తీసుకొని పరిశీలించగా వేడిగా తగిలి చురుక్కుంది. అదొకలోహాన్ని పోలి ఉండడంతో ప్రభుత్వ అధికారులకు సమాచారం చేరవేశారు. అధికారుల సూచన మేరకు 'ద కాలేజ్ ఆఫ్ న్యూజెర్సీ' సైంటిస్టులు రంగంలోకి దిగి, ఆ శిలను ఎలక్ట్రానిక్ మైక్రోస్కోప్‌తో క్షుణ్నంగా పరిశీలించారు. అది కాన్‌డ్రైట్ అంతరిక్ష శిలగా నిర్ధారించారు. బంగాళదుంప పరిమాణంలో 6/4 అంగుళాలు, 2.2 పౌండ్ల (దాదాపు ఒక కిలో) బరువు ఉన్నట్లు సైంటిస్టులు చెప్పారు. ఇలాంటి గ్రహశకలం గతంలో భూమిపై పడిన దాఖలాలు పెద్దగా లేవని తెలిపారు. అరుదైన గ్రహ శకలాన్ని పరీక్షించడం అద్భుతమైన అవకాశమని ద కాలేజ్ ఆఫ్ న్యూజెర్సీ ఫిజిక్స్ డిపార్టుమెంట్ చైర్మన్ నాథన్ మ్యాగీ చెప్పారు. ఈ శిలపై అధ్యయనం ద్వారా ఫిజిక్స్ ప్రొఫెసర్లు, విద్యార్థులు ఎన్నో కొత్త విషయాలు నేర్చుకోవచ్చని వెల్లడించారు.

కాంగ్రెస్ బలంగా ఉన్న చోట్ల మద్దతిస్తాం

తొలిసారిగా ప్రకటించిన తృణమూల్ చీఫ్ మమతా బెనర్జీ

కోల్‌కతా: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో విపక్షాల ఐక్యత భావనకు తృణమూల్ కాంగ్రెస్ జై కొడుతుందా లేదా అనే ప్రశ్నకు ఎట్టకేలకు సమాధానం లభించింది. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉన్న నియోజకవర్గాల్లో తాము మద్దతు ఇస్తామని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు మమతా బెనర్జీ సోమవారం ప్రకటించారు. దీంతో 2024 సార్వత్రిక ఎన్నికల్లో విపక్షాలు ఐక్యంగా ఉమ్మడి వ్యూహంతో ముందుకెళ్తాయనే సానుకూలత మరింత పెరిగింది. సోమవారం రాష్ట్ర సచివాలయంలో మమత మాట్లాడారు. "కాంగ్రెస్ బలంగా ఉన్న నియోజకవర్గాల్లో వాళ్లనే పోటీ చేయనిద్దాం. మేం వారికి మద్దతు ప్రకటిస్తాం. ఇందులో తప్పేముంది. ఇదే తరహాలో వేరే నియోజకవర్గాల్లో తోటి రాజకీయ పార్టీలు బలంగా ఉంటే అక్కడ వారికి కాంగ్రెస్ మద్దతు ఇవ్వాల్సిందే. సీట్ల షేరింగ్ సూత్రం పాటిస్తే బాగుంటుంది. బలమైన ప్రాంతీయ పార్టీలకు సరైన ప్రాతినిధ్యం దక్కాలి. కాంగ్రెస్ బలంగా ఉన్న చోట కాంగ్రెస్‌కు మద్దతు అందాలంటే ఇతర పార్టీలు బలంగా ఉన్న స్థానాల్లో కాంగ్రెస్ కూడా మద్దతు ఇవ్వాలి. ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్న స్థానాల్లో వాటికే ప్రాధాన్యమివ్వాలి" అన్నారు.

గురుద్వారాలో మద్యం తాగిందని... మహిళను కాల్చి చంపేశాడు

పటియాలా: పంజాబ్‌లోని పటియాలాలో గురుద్వారాలో మద్యం సేవిస్తోందనే ఆగ్రహంతో ఓ మహిళను ఒక వ్యక్తి కాల్చిచంపాడు. పర్వీందర్ కౌర్ అనే మహిళకు మద్యం అలవాటుంది. డీ–అడిక్షన్ చికిత్స తీసుకుంటోంది. ఆదివారం సాయంత్రం దుఖ్‌నివారణ్ గురుద్వారాకు వచ్చి సరోవరం వద్ద మద్యం తాగడం మొదలుపెట్టింది. అడ్డుచెప్పిన భక్తులపై మద్యం బాటిల్‌తో దాడి చేసింది. ఆమెను వాళ్లు గురుద్వారా మేనేజర్ గదికి తీసుకెళ్లి ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆమెను గది బయటకు తీసుకు రాగానే నిర్మల్‌జీత్ సింగ్ సైనా అనే భక్తుడు ఆగ్రహంతో ఊగిపోతూ లైసెన్స్‌డ్ రివాల్వర్‌తో ఆమెపై గుళ్లవర్షం కురిపించడంతో అక్కడికక్కడే మరణించింది. తర్వాత నిందితుడు రివాల్వర్ పోలీసులకు అప్పజెప్పి లొంగిపోయాడు. కోర్టులో అతడిపై సిక్కు సంఘాల సభ్యులు పూలవర్షం కురిపించారు.

ఖర్గేపై రూ.100 కోట్లకు దావా

సంగ్రూర్: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేపై హిందూ సురక్ష పరిషత్ జాతీయ అధ్యక్షుడు హితేశ్ భరద్వాజ్ పంజాబ్‌లోని సంగ్రూర్ కోర్టులో రూ.100 కోట్ల పరువు దావా దాఖలు చేశారు. దీనిపై జూలై 10లోగా వివరణ ఇవ్వాలంటూ ఖర్గేకు న్యాయస్థానం నోటీసు జారీ చేసింది. కర్ణాటకలో అధికారంలోకి వస్తే పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా(పీఎఫ్ఐ)తో పాటు బజరంగ్ దళ్‌పై నిషేధం విధిస్తామని కాంగ్రెస్ ఎన్నికల హామీ ఇవ్వడం తెలిసిందే. బజరంగ్ దళ్‌ను అతివాద సంస్థ అయిన పీఎఫ్ఐతో పోల్చి అప్రతిష్టపాలు చేసేలా హామీ ఇచ్చారని హితేశ్ ఆరోపించారు.

వ్యాన్‌ను ఢీకొట్టిన ట్రక్కు..26 మంది మృతి

మెక్సికో సిటీ: మెక్సికోలో ఆదివారం ఘోర ప్రమాదం జరిగింది. ప్రయాణికుల వ్యాన్‌ను ట్రక్కు ఢీకొనడంతో 26 మంది చనిపోయారు. తమౌలిపాస్ రాజధాని సియుడాడ్ విక్టోరియా రహదారిపై ఈ ఘోరం జరిగింది. ప్రమాద తీవ్రతకు ట్రక్కు ట్రయిలర్, వ్యానుకు మంటలు అంటుకున్నాయి. మృతులంతా విహార యాత్ర నుంచి తిరిగొస్తున్నారు.

కేజ్రీవాల్ బంగ్లా దర్యాప్తు అధికారికి ఉద్వాసన

న్యూఢిల్లీ: ఢిల్లీలో పాలనాధికారం రాష్ట్ర సర్కార్‌కే ఉంటుందని సుప్రీంకోర్టు తేల్చిన నేపథ్యంలో ఆప్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సీఎం కేజ్రీవాల్ అధికార బంగ్లా ఆధునీకరణకు రూ.45 కోట్లు వెచ్చించారన్న ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్న విజిలెన్స్ అధికారి, సీనియర్ ఐఏఎస్ రాజశేఖర్‌ను ఆ బాధ్యతల నుంచి తప్పిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. దర్యాప్తును విజిలెన్స్ విభాగంలోని ఇతర అసిస్టెంట్ డైరెక్టర్లు పంచుకోవాలని, నివేదికలను నేరుగా విజిలెన్స్ సెక్రటరీకి సమర్పించాలని ఆదేశించింది. దర్యాప్తు మాటున రాజశేఖర్ వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఫిర్యాదుల వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్టు విజిలెన్స్ మంత్రి సౌరభ్ భరద్వాజ్ చెప్పారు.

రిటైర్ అవ్వాల్సిన వ్యక్తిని కాను... కొత్త ఇన్నింగ్స్ మొదలుపెడతా

పదవీ విరమణ సందర్భంగా సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ ఎంఆర్ షా ఉద్వేగ ప్రసంగం

వీడ్కోలు కార్యక్రమంలో సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్‌తో జస్టిస్ ఎంఆర్ షా



న్యూఢిల్లీ: ఇప్పుడే పదవీవిరమణ చేయాల్సిన వ్యక్తిని కాదని, మరో కొత్త ఇన్నింగ్స్ మొదలెడతా అని సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ ముఖేశ్‌కుమార్ రసిక్‌భాయ్(ఎంఆర్) షా సోమవారం వ్యాఖ్యానించారు. భారత సర్వోన్నత న్యాయస్థానంలో నాలుగో అత్యంత సీనియర్ న్యాయమూర్తి అయిన ఎంఆర్ షా సోమవారం పదవీవిరమణ సందర్భంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ అధ్యక్షతన సుప్రీంకోర్టు బార్ ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఆర్ షా ప్రసంగించారు. 'రిటైర్ అవ్వాల్సిన వ్యక్తినికాదు. జీవితంలో కొత్త ఇన్నింగ్స్ మొదలుపెడతా. కొత్త ఇన్నింగ్స్ ఆడేందుకు సరిపడ ధైర్య, స్థైర్య, ఆయుఃఆరోగ్యాలు ప్రసాదించాలని ఆ భగవంతుని వేడుకుంటున్నాను. రాజ్‌కపూర్ సినిమాలో పాటలోని పదాలు నాకు గుర్తొస్తున్నాయి. రేపు నేను ఆటలో ఉండొచ్చు ఉండకపోవచ్చు. కానీ వినీలాకాశంలో సదా తారనై ఉంటా. పుట్టుక ఇక్కడే. మరణమూ ఇక్కడే' అంటూ ఉద్వేగంతో మాట్లాడారు. 'లాయర్లకు నాదో విన్నపం. అస్తమానం కేసులపై వాయిదాలు కోరకండి. వాదనలకు సిద్ధమై రండి. యువ లాయర్లకు నాదో సలహా బార్ రూమ్‌లోనో, క్యాంటీన్‌లో కాలక్షేపాలొద్దు. కోర్టు హాల్‌లో వాదనలు విని అనుభవం గడించండి' అని అన్నారు. ఈ సందర్భంగా సీజేఐ మాట్లాడారు. 'ధైర్యం, పోరాట స్ఫూర్తి చూస్తే ఆయనను టైగర్ షా అనాల్సిందే. తర్కంతో ఆలోచించే జ్ఞాని. టెక్నాలజీని త్వరగా ఆకళింపుచేసుకుంటారు. కొలీజియం నిర్ణయాలు తీసకునేటపుడు అద్భుతమైన సలహాలిచ్చారు. నేను అదనపు సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియాగా ఉన్నప్పుడు మొదలైన స్నేహం ఆనాటి నుంచీ కొనసాగింది. ఎవరి ఇళ్లల్లో వాళ్లం ఉన్నాసరే ఫోన్‌చేస్తే చాలు ఆయన ఎప్పుడూ కీలకమైన అంశాలపై చర్చిస్తుండేవారు. కోవిడ్ సంక్షోభకాలంలోనూ విధులు నిర్వర్తించాం' అని అన్నారు. 2018 నవంబర్ రెండో తేదీన సుప్రీంకోర్టు జడ్జిగా షా నియమితులయ్యారు. సోమవారం ఆయన రిటైర్‌అవడంతో సుప్రీంకోర్టులో సీజేతో కలిపి మొత్తం జడ్జీల సంఖ్య 32కు పడిపోయింది. ఆదివారం మరో జడ్జి జస్టిస్ దినేశ్ మహేశ్వరి రిటైర్‌కావడం తెల్సిందే. రాజ్యాంగం ప్రకారం సుప్రీంకోర్టులో జడ్జీల గరిష్ట సంఖ్య 34.

జస్టిస్ ఎంఆర్ షా న్యాయ ప్రస్థానం 1982లో గుజరాత్ హైకోర్టులో న్యాయవాదిగా మొదలైంది. 2004 మార్చిలో గుజరాత్ హైకోర్టులో అదనపు న్యాయవాదిగా నియమితులయ్యారు. ఆ తర్వాతి ఏడాది శాశ్వత న్యాయమూర్తి అయ్యారు. 2018 ఆగస్ట్‌లో పట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అయ్యారు. అదే ఏడాది నవంబర్‌లో పదోన్నతితో సుప్రీంకోర్టుకు న్యాయమూర్తిగా వచ్చారు.

వైవిధ్యమే భారత్ బలం: మోదీ

న్యూఢిల్లీ: భారతీయులను వైవిధ్యం పట్ల సహజంగా ఉండే ప్రేమే శతాబ్దాలుగా ఐకమత్యంగా ఉంచుతోందని ప్రధాని మోదీ అన్నారు. భారత్‌కున్న ఈ విశిష్టతే ప్రపంచం దృష్టిని కూడా ఆకర్షించిందని చెప్పారు. 'భారతదేశం వివిధ వర్గాలు, మతాలు, భాషలు, సంప్రదాయాలకు నెలవు. ఎన్నో సంస్కృతులు, ఆచారాలు, జీవన విధానాలను ఆచరిస్తూనే ప్రజలు కలిసిమెలిసి జీవిస్తున్నారు. ఒకరి పండుగలను మరొకరు జరుపుకుంటూ సహజీవనం సాగిస్తున్నారు'అంటూ ప్రధాని మోదీ జమ్మూకశ్మీర్‌లోని పూంఛ్‌కు చెందిన నజాకత్ చౌధరికి రాసిన లేఖలో పేర్కొన్నారు. ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమంలో భాగంగా చౌధరి ఇటీవల అస్సాంలో పర్యటించారు. ఈ పర్యటన తనలో స్ఫూర్తి నింపిందనీ, మరిచిపోని అనుభూతులను మిగిల్చిందంటూ ప్రధానికి రాసిన లేఖలో పేర్కొన్నారు. ఆ లేఖకు ప్రధాని పైవిధంగా బదులిచ్చారు.



నేడు 71 వేల మందికి నియామక పత్రాలు

దేశవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగాలు పొందిన 71 వేల మందికి మోదీ మంగళవారం వర్చువల్ విధానంలో నియామక పత్రాలివ్వనున్నారు. రోజ్‌గార్ మేళాలో భాగంగా ఆయన ఇప్పటిదాకా 2.9 లక్షల మందికి నియామక పత్రాలిచ్చారని కేంద్రం తెలిపింది. దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల్లో రోజ్‌గార్ మేళాలను ఏర్పాటు చేయనున్నారు. 10 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా గత ఏడాది అక్టోబర్‌లో రోజ్‌గార్ మేళాను ప్రధాని ప్రారంభించారు.

గహ్లోత్‌కు సచిన్ పైలట్ అల్టిమేటం

నెలాఖరులోగా డిమాండ్లు తీర్చకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామంటూ హెచ్చరిక



జైపూర్: రాజస్తాన్ మాజీ డిప్యూటీ సీఎం సచిన్ పైలట్ దూకుడు పెంచారు. గత బీజేపీ ప్రభుత్వ హయాంలో అవినీతిపై విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలన్న తన డిమాండ్‌ను ఈ నెలాఖరులోగా నెరవేర్చకుంటే ఆందోళనను తీవ్రతరం చేస్తామంటూ సొంత పార్టీకే చెందిన సీఎం అశోక్ గహ్లోత్‌కు అల్టిమేటం జారీ చేశారు. ఈ డిమాండ్ సాధనలో భాగంగా ఆయన చేపట్టిన ఐదు రోజుల పాదయాత్ర సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా తన మద్దతు దారులైన 15 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో జైపూర్‌లో భారీ ర్యాలీ చేపట్టారు. రాజస్తాన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఆర్‌పీఎస్‌సీ)ని రద్దు చేసి, పునర్వ్యవస్థీకరించాలని, పేపర్ లీక్‌తో పరీక్షలను రద్దు వల్ల నష్టపోయిన వారికి పరిహారం చెల్లించాలన్న రెండు కొత్త డిమాండ్లను వినిపించారు. నెలాఖరులోగా చర్యలు తీసుకోకుంటే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

ఎండ మం..డే

సాక్షి, చెన్నై: మెకా తుపాను కారణంగా గాలిలో తేమ తగ్గడంతో రాష్ట్రంలో ఎండ వేడిమి అమాంతం పెరిగింది. రాష్ట్రవ్యాప్తంగా సోమవారం భానుడు ప్రతాపం చూపాడు. ముఖ్యంగా 15 జిల్లాల్లో ఎండలు తీవ్రమయ్యాయి. ఈనెల మొదటివారంలో అకాల వర్షాలతో రాష్ట్రం పులకించిన విషయం తెలిసిందే. అయితే ఇటీవల బంగాళాఖాతంలో మెకా తుపాన్ ఏర్పడడంతో రాష్ట్రంలో గత రెండు మూడు రోజులుగా వాతావరణం ఆహ్లాదకరంగానే ఉంది. అయితే మెకా తుపాన్ బంగ్లా తీరం వైపుగా ఆదివారం వెళ్లింది. తమిళనాడు సముద్ర తీరం, ఉపరితలంలో ఉన్న తేమను అంతా మెకా వెళ్తూ..వెళ్తూ లాక్కెళ్లింది. ఈ క్రమంలో సోమవారం మరింతగా భానుడు మండే విధంగా పరిస్థితి నెలకొంది. ఇంటి నుంచి జనం మధ్యాహ్నం అడుగు బయట పెట్టడానికే భయపడే పరిస్థితి ఏర్పడింది. ఇదే పరిస్థితి మరో ఐదు రోజులు ఉంటుందని వాతావరణ కేంద్రం పేర్కొంది.

న్యూస్‌రీల్

కొడైకెనాల్‌లో గవర్నర్ రవి పర్యటన



విద్యార్థులు, శాస్త్రవేత్తలతో గవర్నర్ ఆర్‌ఎన్ రవి

సాక్షి,చెన్నై: గవర్నర్ ఆర్‌ఎన్ రవి కొడైకెనాల్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రో ఫిజిక్స్ పరిశోధన కేంద్రాన్ని సోమవారం సందర్శించారు. అక్కడి విద్యార్థులతో ముచ్చటించారు. గవర్నర్ ఆర్‌ఎన్ రవి మూడు రోజుల పర్యటనగా దిండుగల్‌జిల్లా కొడైక్కెనాల్‌కు వెళ్లారు. తొలి రోజు పర్యటనలో అక్కడి రోజా పుష్పాల పార్క్‌ను సందర్శించారు. పర్యాటక అందాలను తిలకించారు. అలాగే ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రో ఫిజిక్స్ పరిశోధన కేంద్రాన్ని సందర్శించారు. ఇక్కడి విద్యార్థులతో ముచ్చటించారు. అక్కడి శాస్త్రవేత్తలతో మాట్లాడారు. పరిశోధనల గురించి తెలుసుకున్నారు. అనంతరం థెరీసా పాఠశాలల జరిగిన కార్యక్రమంలో పలువురు విద్యార్థుల ప్రశ్నలకు గవర్నర్ సమాధానం ఇచ్చారు.

సీఎం రాజీనామా చేయాలి



మీడియాతో మాట్లాడుతున్న పళణి స్వామి

సాక్షి, చెన్నై: విల్లుపురం, చెంగల్పట్టు ఘటనలకు బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేయాలని సీఎం స్టాలిన్‌ను అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామి డిమాండ్ చేశారు.సోమవారం తిరుచ్చిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో మత్తు పదార్థాల విక్రయాలే కాదు, కల్తీ, నాటు సారాల విక్రయాలు జోరందుకున్నాయని ధ్వజమెత్తారు. ఆ పార్టీకి చెందిన వారి అండదండాలతోనే ఆయా ప్రాంతాలలో యథేచ్ఛగా విక్రయాలు సాగుతున్నట్లు తెలుస్తోందన్నారు. 16 మందిని పొట్టన పెట్టుకున్న ఈ ఘటనకు డీఎంకే ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ సీఎం స్టాలిన్, ఎక్సైజ్ శాఖ మంత్రి సెంథిల్ బాలాజీ తమ పదవులకు రాజీనామా చేయాలన్నారు. ఇదిలా ఉండగా, పళణి స్వామికి వ్యతిరేకంగా సేలం పోలీసులు గత వారం కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఎన్నికల ప్రమాణ పత్రంలో ఆయన తప్పుడు సమాచారం ఇచ్చినట్లు అందిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేశారు. ఇందులో భాగంగా పళణి స్వామిని విచారించేందుకు సేలం పోలీసులు కసరత్తు చేస్తుండడం గమనార్హం.

యూ ట్యూబర్‌పై మంత్రి కన్నెర్ర

• పరువునష్టం దావా దాఖలు



సెంథిల్ బాలాజీ

సాక్షి,చెన్నై : యూ ట్యూబర్ ఎస్ శంకర్‌పై విద్యుత్, ఎక్సైజ్ శాఖ మంత్రి సెంథిల్ బాలాజీ కన్నెర్ర చేశారు. ఆయనపై ఏకంగా నాలుగు పరువునష్టం దావాలను సోమవారం సైదాపేట కోర్టులో దాఖలు చేశారు. శంకర్ తనకు వ్యతిరేకంగా పదే పదే వీడియోలను విడుదల చేస్తూ వస్తున్నారని ఆ పిటిషన్లలో మంత్రి వివరించారు. మహారాష్ట్ర తరహాలో తమిళనాడులో ప్రభుత్వాన్ని కూల్చేందుకు తానేదో కుట్ర చేస్తున్నట్లుగా శంకర్ ఆధార రహిత ఆరోపణలు చేస్తున్నట్లు పేర్కొన్నా రు. అలాగే, తాను టాస్మాక్‌బార్‌లను నిర్వహిస్తున్నట్లు ఆరోపించారని తెలిపారు. ఆధార రహిత ఆరోపణలు చేయడమే కాకుండా డీఎంకే అధిష్టానం తనపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు తప్పుడు సమాచారం ప్రజలకు అందజేస్తూ వస్తున్నాడని వివరించారు. తన పేరుకు, పరువుకు కలంకం తెచ్చే విధంగా వ్యవహరిస్తున్న శంకర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ మేరకు కోర్టును కోరారు.

కోర్టులో మాజీ ఎమ్మెల్యే లొంగుబాటు

కొరుక్కుపేట: శ్రీ విల్లిపుత్తూరు కోర్టులో అన్నాడీఎంకే మాజీ ఎమ్మెల్యే రాజావర్మన్ లొంగిపోయారు. వివరాలు.. అన్నాడీఎంకే మాజీ ఎమ్మెల్యే రాజావర్మన్ తన స్నేహితుడు రవి చంద్రన్‌తో కలసి 2018లో టపాకాయల ఫ్యాక్టరీని ప్రారంభించాడు. అయితే రాజా వర్మన్ వ్యాపారంపై దృష్టి పెట్టకపోగా, లాభాల్లో వాటాను అందజేయాలని రవిచంద్రన్‌ను కోరారు. దీంతో అతడు మాజీ ఎమ్మెల్యే వాటాను పూర్తిగా ఇచ్చేశాడు. అయితే రవిచంద్రన్‌ను రాజావర్మన్ ఇబ్బందులకు గురిచేయడమే కాకుండా చివరికి కిడ్నాప్ చేసి శ్రీవిల్లి పుత్తూరులోని ఓ ప్రైవేటు స్థలంలో బంధించి కొట్టారు. అప్పట్లో శ్రీవిల్లి పుత్తూరు ప్రాంతంలో పనిచేస్తున్న ఇద్దరు పోలీసు అధికారులు వీరికి సహకరించారు. దీంతో వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రవిచంద్రన్ శ్రీవిల్లిపుత్తూరు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అన్నాడీఎంకే మాజీ ఎమ్మెల్యే రాజవర్మన్‌తోపాటు తంగమునిస్వామి (30), మరో రవిచంద్రన్ (53), అంగీశ్వరి (50), ముత్తుమారియప్పన్ (54)తో పాటు ఇద్దరు పోలీసులపై కేసు నమోదైంది. కాగా ఈ కేసులో చెన్నై కోర్టులో రాజావర్మన్‌కు ముందుస్తు బెయిల్ మంజూరైంది. ఈక్రమంలో సోమవారం ఉదయం శ్రీవిల్లిపుత్తూరులోని అదనపు మేజిస్ట్రేట్ కోర్టులో జడ్జి తిరునావుక్కరసు ఎదుట మాజీ ఎమ్మెల్యే రాజావర్మన్ లొంగిపోయారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

గ్రామీణ ప్రాంతాల్లోని చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమ ఫలాలను అందించడమే లక్ష్యంగా డీఎంకే ప్రభుత్వం పాలన సాగిస్తోందని సీఎం ఎంకే స్టాలిన్ స్పష్టం చేశారు. రెవెన్యూ శాఖలో కొత్తగా నియమించిన వారికి ఉద్యోగ నియామక ఉత్వర్వులను సోమవారం ఆయన అందజేశారు. మత్స్యశాఖ ప్రగతికి రూ. 314 కోట్లతో నిర్మాణాలు, డిజిటల్ సేవలను విస్తృతం చేయడంతో పాటు పాఠశాలలకు మెరుగులు దిద్దే పనులను వేగవంతం చేస్తామని తెలిపారు.

• సీఎం స్టాలిన్ వ్యాఖ్య
• రెవెన్యూలో 224 మంది సర్వేయర్లు, మరో 698 మంది సిబ్బంది నియామకం
• డిజిటల్ సేవలు మరింత విస్తృతం చేస్తామని వెల్లడి



ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందజేస్తున్న సీఎం స్టాలిన్



కొత్తవాహనాలకు జెండా ఊపుతూ..



మ్యాప్‌ల ప్రదర్శనను తిలకిస్తున్న సీఎం స్టాలిన్

సాక్షి, చెన్నై: సీఎం స్టాలిన్ సోమవారం సచివాలయం నుంచి రెవెన్యూ, మత్స్య, తమిళ, విద్యాశాఖల నేతృత్వంలో నిర్మించిన భవనాలకు ప్రారంభోత్సవాలు, కొత్తవాటికి శంకుస్థాపనలు చేశారు. అలాగే రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖలో 224 మంది సర్వేయర్లకు ఉద్యో నియామక ఉత్తర్వులను అందజేశారు. అలాగే మరో 698 మంది సిబ్బందిని నియమించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో రెవెన్యూ శాఖ పాత్ర కీలకమని అభిప్రాయపడ్డారు. విపత్తులు సంభవించిన సమయాల్లో మరింత గొప్ప పనితీరును ప్రదర్శించాలని సూచించారు. సాంకేతిక అర్హతల ఆధారంగా టీఎన్‌పీఎస్సీ నిర్వహించిన పరీక్షల్లో ఎంపికైన వారికే ప్రస్తుతం ఉద్యోగ నియామక ఉత్తర్వులను అందజేశామన్నారు. ఈసందర్భంగా తమిళనాడు ల్యాండ్ సర్వే అండ్ రికార్డ్స్ విభాగం నేతృత్వంలో ఏర్పాటు చేసిన మ్యాప్ ఎగ్జిబిషన్‌ను సీఎం ప్రారంభించారు. ఇందులో నాటి మద్రాసు నగర మ్యాప్, భాషా పరంగా రాష్ట్రాల విభజన తర్వాత చెన్నై మ్యాప్, ప్రస్తుతం తమిళనాడు రూపురేఖలు, జిల్లాల వివరాలతో రూపొందించిన మ్యాప్‌లు ఈ ప్రదర్శనలో ఉన్నాయి.

మత్స్యకారుల సంక్షేమానికి..

మత్స్య శాఖ, మత్స్య కారుల సంక్షేమం కోసం రూ. 314. 89 కోట్లతో నిర్మించిన భవనాలను సీఎం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఇందులో చేపల హార్బర్ల అభివృద్ధి, చేపల పెంపకం, ఆక్వా కల్చర్ పరిరక్షణ పద్ధతులను ప్రోత్సహించడం వంటి పథకాలతో పాటు శిక్షణ కేంద్రాలు ఇంటిగ్రేటెడ్ కార్యాలయాల భవనాలు ఉన్నాయి. కడలూరు జిల్లా ముత్తా నగర్‌లో రూ. 100 కోట్లతో పునర్ నిర్మించిన ఫిషింగ్ హార్బర్, పుదుపేటలో రూ. 5 కోట్లతో సిద్ధం చేసిన చేపల దిగుమతి కేంద్రం, లాజ్‌పేటలో చేపల పెంపకం కోసం సిద్ధం చేసిన చెరువులు ఉన్నాయి. అలాగే రూ. 20 కోట్లతో రామనాపురం జిల్లా మండపంలో ఏర్పాటు చేసిన ఫిషింగ్ హార్బర్ ప్లాట్ ఫాంలు కూడా ఉన్నాయి. మైలాడుతురై జిల్లా తరంగం బాడిలో రూ. 120 కోట్లతో కొత్తగా నిర్మించిన ఫిషింగ్ హార్బర్, కన్యాకకుమారి జిల్లా మేల్‌మనకుడిలో రూ. 29 కోట్లతో పూర్తి చేసిన చేపల దిగుమతి కేంద్రం, తూత్తుకుడి జిల్లా తిరుచెందూరు సమీపంలోని జీవా నగర్‌లో రూ. 3 కోట్లతో మత్స్య కారుల కోసం నిర్మించిన గృహాలు వంటి నిర్మాణాలు ఉన్నాయి.

డిజిటల్ సేవలు మరింతగా..

రూ.54.61 కోట్లతో ఇటీవల అన్నా యూనివర్సిటీ క్యాంపస్‌లో తమిళనాడు సెంటర్ ఫర్ టెక్నాలజీని స్థాపించారు. దీనిని సీఎంస్టాలిన్ సోమవారం ఆవిష్కరించారు. డిజిటల్ సేవల విస్తృతం దిశగా,ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, ఇంటర్నెట్ ఆఫ్ ట్రస్ట్ వంటి సాంకేతికతలకు ప్రాముఖ్యత ఇచ్చే విధంగా ఇక్కడ సేవలందిస్తామని వివరించారు. ప్రధాన సాంకేతిక సవాళ్లను పరిష్కరించడం, సాంకేతికతల అమల్లో సమన్వయమే లక్ష్యంగా ఈకేంద్రం పనిచేస్తుందని సీఎం ప్రకటించారు. అలాగే హైటెక్ ప్రొటోటైపింగ్, డిజైన్ సౌకర్యాలను ఇక్కడ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సాంకేతిక కేంద్రం, విద్యా సంస్థలు, స్టార్టప్‌లు, ప్రముఖ సంస్థలు, పరిశ్రమల సమన్వయంతో ప్రభుత్వంతో కలిసి పనిచేస్తుందని వివరించారు. తమిళనాడు ప్రభుత్వ సమాచార సాంకేతికత, డిజిటల్‌సేవల రంగం కింద లాభాపేక్ష లేని సంస్థగా ఇది పనిచేస్తుందన్నారు.

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు భరోసా

రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు బాసటగా నిలిచే విధంగా రూ. 82.02 కోట్లతో నిర్మించిన భవనాలను, హాస్టళ్లు, బోర్డింగ్ స్కూల్ భవనాలను సీఎం సోమవారం ప్రారంభించారు. అలాగే, రూ.2.04 కోట్లతో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల కోసం సిద్ధంచేసిన వాహనాలు, 500 మంది పారిశుధ్య కార్మికులకు రూ. 55 కోట్ల నిధి కేటాయింపు, గృహాల మంజూరు వంటి కార్యక్రమాలను సీఎం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ఇందులో రూ.42 కోట్లతో ఎస్టీ విద్యార్థుల కోసం నిర్మించిన 21 హాస్టళ్లు ఉన్నాయి. అలాగే రూ. 16.59 కోట్లతో నిర్మించిన 9 పాఠశాలల భవనాలు, రూ. 22.97 కోట్లతో నిర్మించిన 4 మోడల్ బోర్డింగ్ స్కూళ్ల భవనాలు కూడా ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీ ప్రజల్లో అక్షరాస్యత పెంపు, సామాజిక, ఆర్థిక స్థితుల మెరుగు, జీవన ప్రమాణాల పెంపే లక్ష్యంగా ప్రభుత్వం బృహత్తర కార్యక్రమాలను అమలు చేస్తోందని సీఎం స్టాలిన్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో మంత్రులు కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, పీకే శేఖర్‌బాబు, ఎం. సుబ్రమణియన్, కయల్విలి సెల్వరాజ్, పొన్ముడి, అనిత ఆర్ రాధాకృష్ణన్, పళణి వేల్ త్యాగరాజన్, మేయర్ ఆర్. ప్రియ, సీఎస్ ఇరై అన్బుతో పాటు ఆయా శాఖల కార్యదర్శులు, బోర్డుల చైర్మన్లు, ఎంపీ, ఎమ్మెల్యేలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

బీజేపీ కూటమితోనే..

సామాజిక న్యాయం



వానతీ శ్రీనివాసన్

సాక్షి, చెన్నై: సామాజిక న్యాయమే ధ్యేయంగా శ్రమిస్తున్న తమ కూటమిలోకి రావాలని వీసీకే నేత తిరుమావళవన్‌కు బీజేపీ మహిళా మోర్చా జాతీయ అధ్యక్షురాలు, ఎమ్మెల్యే వానతీ శ్రీనివాసన్ పిలుపు నిచ్చారు. కర్ణాటక ఎన్నికల్లో ఓటమి నేపథ్యంలో, ఇక బీజేపీ శకం దేశ వ్యాప్తంగా ముగియ బోతోందని , తమిళనాడులోని అన్నాడీఎంకే తదితర పార్టీలు మేల్కొంటే మంచిదని హితవు పలుకుతూ తిరుమావళవన్ ఆదివారం వ్యాఖ్యలు చేశారు. ఇందుకు సమాధానం ఇచ్చే విధంగా వానతీ శ్రీనివాసన్ సోమవారం మీడియాతో మాట్లాడుతూ స్పందించారు. ఇతర పార్టీలకు సలహాలు ఇచ్చే ముందు తాను ఉన్న కూటమిలో ఏం జరుగుతున్నదో అనే విషయాన్ని తిరుమావళవన్ గుర్తెరగాలని హితవు పలికారు. వీసీకే భావాలు, మనో భావాలు, ఆశయాలు డీఎంకే కూటమిలో తిరుమాకు నేరవేరాయా? అనేది లెక్కలు వేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రెండేళ్లుగా డీఎంకే కూటమిలో సామాజిక న్యాయం జరిగిందా ? అని ప్రశ్నించారు. వేంగై వయల్ ఘటన మొదలు పరువు హత్యలు, తాజా కల్తీ సారా ఘటనలను గుర్తు చేస్తూ విమర్శలు గుప్పించారు. ఎస్సీ, ఎస్టీల సంక్షేమమే ధ్యేయంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఆ సామాజిక వర్గానికి చెందిన రాష్ట్రనేత ఒకరికి కేంద్రంలో పదవి, మరొకరికి పార్టీ పదవీ అప్పగించారని వివరించారు. సామాజిక న్యాయం చేసే విధంగా అన్ని వర్గాలకు అనుకూలంగా బీజేపీ ముందుకెళ్తోన్న విషయాన్ని తిరుమా గుర్తెరగాలని సూచించారు. సామాజిక న్యాయాన్ని పరిరక్షించుకోవాలంటే, తిరుమా బీజేపీ కూటమిలోకి రావాలని పిలుపునిచ్చారు.

ఆమ్నీకి ప్రత్యేక టెర్మినల్

• చెన్నై శివార్లలో స్థల పరిశీలన



ఆమ్నీ బస్టాండ్

సాక్షి, చెన్నై: ఆమ్నీ ప్రైవేటు బస్సుల కోసం చెన్నై శివారులో టెర్మినల్‌కు కసరత్తు జరుగుతోంది. ఇందుకు తగ్గ స్థల పరిశీలనలో సీఎండీఏ అధికారులు ఉన్నారు. చెన్నై కోయంబేడు బస్టాండ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇదే బస్టాండ్‌కు కూతవేటు దూరంలో ప్రైవేటు ఆమ్నీ బస్సుల కోసం బస్టాండ్ ఉంది. కోయంబేడు పరిసరాల్లో పెరిగిన ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని, ఇక్కడకు వచ్చే బస్సులను చెన్నై నగర శివారులకు పరిమితం చేసే విధంగా సీఎండీఏ విస్తృత ప్రాజెక్టులు చేపట్టింది. ఇందులో ఒకటి మాధవరం సబర్బన్ బస్ టెర్మినల్. ఇది ఉపయోగంలోకి వచ్చింది. అలాగే పూందమల్లి సమీపంలో మరో సబర్బన్ టెర్మినల్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇక దక్షిణ తమిళనాడు వైపుగా వెళ్లే బస్సుల్లోని మరో నెల రోజుల్లో కిలంబాక్కం బస్టాండ్‌కు పరిమితం కానున్నాయి. ఇక్కడ ఆ మేరకు బ్రహ్మాండ బస్టాండ్ రూపుదిద్దుకుంది. ఈ పనులు ముగింపు దశకు చేరడంతో సోమవారం సీఎండీఏ చైర్మన్, దేవదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు అధికారులతో కలిసి పరిశీలించారు. దక్షిణ తమిళనాడు వైపుగా వెళ్లే బస్సులన్నీకిలాబాక్కంకు వచ్చేసిన పక్షంలో కోయంబేడు బస్టాండ్‌లో సగానికి పైగా రద్దీ తగ్గినట్టే. అదే సమయంలో పొరుగున ఉన్న ప్రైవేటు ఆమ్నీ బస్టాండ్ కారణంగా ఎదురయ్యే రద్దీని సైతం తగ్గించేందుకు సీఎండీఏ సిద్ధమైంది.

వరద రాజపురంలో బస్టాండ్

కోయంబేడు నుంచి దక్షిణ తమిళనాడు వైపుగా వందలాది వాహనాలు రాత్రి 7 గంటల తర్వాత రోడ్డెక్కుతుంటాయి. రాత్రి తొమ్మిది గంటలైతే చాలు కోయంబేడు పరిసరాలతో పాటు అనేక మార్గాలు ప్రైవేటు బస్సులతో కిక్కిరిసి ఉంటాయి. దీనిని పరిగణనలోకి తీసుకుని ప్రైవేటు ఆమ్నీ బస్టాండ్‌ను కిలాంబాక్కంకు కూతవేటు దూరంలో స్థలాన్ని ఎంపిక చేసి తరలించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా కిలాంబాక్కం నుంచి 7 కి.మీ దూరంలో ఉన్న వరదరాజపురంలో ప్రైవేటు బస్సుల కోసం టెర్మినల్ తీర్చిదిద్దబోతున్నారు. ఇక్కడ బస్టాండ్ ఏర్పాటు చేయడం ద్వారా బస్సులు ఔటర్ ఎక్స్‌ప్రెస్ వే గుండా జాతీయ రహదారిలోకి వెళ్లేందుకు మార్గం సులభంగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఈ కారణంగా చెన్నై నగరంలోనే కాదు, శివార్లలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందు వీలౌతుందని పేర్కొంటున్నారు.

ముమ్మరంగా 'సారా' వేట

కల్తీ సారా మరణాలతో పోలీసు యంత్రాంగం అలర్ట్ అయ్యింది. రాష్ట్రవ్యాప్తంగా సారా విక్రయదారుల భరతం పట్టే విధంగా సోమవారం పరుగులు తీసింది. ఏకంగా 247 మందిని అరెస్టు చేసింది. ఇక, మరక్కానంలో కల్తీ సారా మృతుల సంఖ్య 11కు చేరింది. ఆస్పత్రుల్లో 34 మంది చికిత్స పొందుతున్నారు. హుటాహుటిన విల్లుపురం చేరుకుని బాధిత కుటుంబాలను సీఎం స్టాలిన్ ఓదార్చారు.

• ఏడీఎస్పీల నేతృత్వంలో ప్రతిజిల్లాకూ ప్రత్యేక టీం
• 247 మంది వ్యాపారుల అరెస్టు
• మరక్కానంలో 11కు చేరిన కల్తీ సారా మృతుల సంఖ్య
• ఆస్పత్రుల్లో 34 మందికి చికిత్స
• బాధిత కుటుంబాలకు సీఎం ఓదార్పు
• కేసు నమోదు చేసిన సీబీసీఐడీ



విల్లుపురంలో అధికారులతో సమీక్షిస్తున్న సీఎం స్టాలిన్

సాక్షి, చెన్నై: విల్లుపురం జిల్లా మరక్కానం సమీపంలోని ఎక్కియార్‌కుప్పం కంబంమేడు గ్రామంలో కల్తీ సారా తాగి జాలర్లు మరణించడం ఆదివారం తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసిందే. తొలిరోజు ఆరుగురు మృతి చెందగా, రాత్రికి రాత్రే చికిత్స ఫలించక మరో ఐదుగురు ప్రాణాలు పోగొట్టుకున్నారు. దీంతో కల్తీ సారా మరణాల సంఖ్య 11కు చేరింది. మరో 34 మంది ఆస్పత్రి పాలు కావడంతో వీరికి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. అదే సమయంలో చెంగల్పట్టు జిల్లా అచ్చరపాక్కం పరిధిలో కల్తీ సారా తాగి మరణించిన వారి సంఖ్య ఐదుకు చేరడం ప్రభుత్వాన్ని ఇరాకటంలో పడేసింది. ప్రతి పక్షాలు దుమ్మెత్తి పోసే పనిలో పడటంతో సీఎం స్టాలిన్ తక్షణం స్పందించారు. స్వయంగా తానే విల్లుపురం వెళ్లి బాధిత కుటుంబాలను సోమవారం ఉదయం పరామర్శించారు.

38 జిల్లాల్లో..

సీఎం విల్లుపురం పర్యటనకు సిద్ధం కావడంతో పోలీసు యంత్రాంగం అలర్ట్ అయ్యింది. డీజీపీ శైలేంద్రబాబు ఆదేశాలతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 38 జిల్లాల్లో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. డీఎస్పీల నేతృత్వంలో సారా వేట మీద దృష్టి పెట్టాయి. ప్రధానంగా కుగ్రామాలు, అటవీ గ్రామాల్లో సోదాలు ముమ్మరం చేశారు. మాదక ద్రవ్యాల నియంత్రణ విభాగం ఏడీజీపీ మహేశ్‌కుమార్ పర్యవేక్షణలో మరెన్నో బృందాలు చర్యలను వేగవంతం చేశాయి. సారా కారణంగా ఎదురయ్యే అనార్థాలను ప్రజలకు వివరించే విధంగా అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేశారు. అలాగే, మిథనాల్, స్పిరిట్‌లను బయటి వ్యక్తులకు ఇష్టానుసారంగా విక్రయిస్తే చర్యలు తప్పదని ప్రైవేటు డీలర్లకు, దుకాణదారులకు పోలీసులు తీవ్ర హెచ్చరికలు చేశారు. 247 మంది సారా వ్యాపారులను అరెస్టు చేశారు. ఇందులో విల్లుపురానికి పొరుగున ఉన్న కడలూరు జిల్లాలో మాత్రం 22 మంది వ్యాపారులు పట్టుబడ్డారు. వీరి నుంచి 226 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. అలాగే మర్కానంలో సారా విక్రయించిన ఐదుగురిపై కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న ఇద్దరి కోసం గాలిస్తున్నారు. చెంగల్పట్టు అచ్చరపాక్కం వద్ద సారా విక్రయించిన కేసులో ఇద్దరిని అరెస్టు చేశారు. ఈ ఇద్దరు తాము కూడా అదే సారాను తాగినట్లు పేర్కొనడంతో వారికి చికిత్స అందిస్తున్నారు. కాగా, ఎక్కడైనా సారాతో పాటు మాదక ద్రవ్యాల విక్రయాలు జరిగిన పక్షంలో తమకు సమాచారం అందించాలని ప్రజలకు పోలీసుల యంత్రాంగం పిలుపు నిచ్చింది. అలాగే 74188 46100 నంబర్లకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

బాధితులకు సీఎం ఓదార్పు..



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శిస్తూ..

చెన్నై నుంచి రోడ్డు మార్గంలో విల్లుపురానికి మధ్యాహ్నం సీఎం స్టాలిన్ చేరుకున్నారు. మంత్రులు పొన్ముడి, ఏవీ వేలు, సెంజి మస్తాన్, హోం శాఖ కార్యదర్శి అముదా, డీజీపీ శైలేంద్రబాబుతో కలిసి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. వారి కుటుంబాలను ఓదార్చారు. వైద్యులతో మాట్లాడారు. మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు. అలాగే మృతుల కుటుంబాలను పరామర్శించి భరోసా ఇచ్చారు. అనంతరం మంత్రులు, అధికారులు, డీజీపీ, విల్లుపురం, కళ్లకురిచ్చి , కడలూరు జిల్లాల ఎస్పీలు, ఐజీలు, డీఐజీతో సీఎం స్టాలిన్ సమావేశమయ్యారు. మీడియాతో స్టాలిన్ మాట్లాడుతూ, సారావిక్రయదారులను కఠినంగా శిక్షిస్తామన్నారు. మరక్కానం, అచ్చరాపాక్కం ఘటనల్లో మరణించిన వారి కుటుంబాలకు తలా రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించామని, ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి తలారూ. 50 వేలు అందజేస్తామన్నారు. కాగా ఈ సమావేశంలో అధికారులపై సీఎం స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అలాగే ఎక్సైజ్ శాఖ పని తీరుపై మంగళవారం చెన్నైలో పోలీసు ఉన్నతాధికారులతో సమావేశం కావాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా విల్లుపురం ఎస్పీ శ్రీనాథ్, చెంగల్పట్టు ఎస్పీ ప్రదీప్‌పై సీఎం కన్నెర్ర చేశారు. దీంతో ఎస్పీ శ్రీనాథ్‌పై సస్పెన్షన్ వేటు పడగా ప్రదీప్ పాటు చెంగల్పట్టు ఎక్సైజ్ డీఎస్పీని బదిలీ చేశారు.

తాటి ఉత్పత్తులపై అధ్యయనం

• తయారీ కేంద్రాన్ని పరిశీలించిన తెలంగాణ బృందం



ఉత్పత్తులను పరిశీలిస్తున్న పల్లె రవికుమార్

సాక్షి, చెన్నై: తమిళనాడులో చేపడుతున్న తాటి ఉత్పత్తులపై అధ్యయనం చేయడానికి తెలంగాణ కల్లుగీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవి కుమార్ గౌడ్ నేతృత్వంలోని బృందం చెన్నైకు వచ్చింది. మాధవరంలోని తాటి ఉత్పత్తుల తయారీ కేంద్రాన్ని ఈ బృందం సోమవారం సందర్శించింది. వివరాలు.. చెన్నై నగర్ శివారులోని మాధవవరంలో సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పామ్ ప్రోడక్ట్స్(తాటి ఉత్పత్తులు) కేంద్ర ఉన్న విషయం తెలిసిందే. ఇక్కడ వివిధ రకాల తాటి ఆధారిత ఉత్పత్తులను చేస్తున్నారు. వీటిని పరిశీలించేందుకు తెలంగాణ రాష్ట్ర కల్లు గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవి కుమార్ గౌడ్, బీసీ కమిషన్ సభ్యుడు కిశోర్ గౌడ్, కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఉదయ్ ప్రకాశ్ చెన్నైకు వచ్చారు. తాటి చెట్టు ఆకులు, మట్టలు, కల్లు నుండి తాటి బెల్లం, తాటి షుగర్, నీరాలతో పాటు అలంకరణ తదితర వస్తువుల తయారీ యూనిట్లను పరిశీలించారు. ఆయా వస్తువుల తయారీతో పాటుగా శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పామ్ ప్రోడక్ట్స్ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రభాకరన్, సీనియర్ ఎగ్జిక్యూటివ్ వీఎస్‌రావు తెలంగాణ బృందానికి ఇక్కడి ఉత్పత్తులు, యూనిట్ల పనితీరును వివరించారు.

క్లుప్తంగా

జల్లికట్టు క్రీడాకారుడు ఆత్మహత్య

అన్నానగర్: చోళవందన్ సమీపంలో సోమవారం జల్లికట్టు క్రీడాకారుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మదురై జిల్లా చోళవందన్ సమీపంలోని కురువితురై గ్రామానికి చెందిన పవిత్రన్ (26) కుటుంబ సమస్యల కారణంగా సోమవారం తన తోటలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కాడుపట్టి పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ కుబేంద్రన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రూ.29 లక్షల విలువైన బంగారం సీజ్

అన్నానగర్: తిరుచ్చి విమానాశ్రయంలో సోమవారం రూ.29 లక్షల విలువైన స్మగ్లింగ్ బంగారాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. విదేశాల నుంచి తిరుచ్చి విమానాశ్రయంలోకి కొందరు ప్రయాణికులు బంగారాన్ని అక్రమంగా తరలిస్తున్నారు. ముఖ్యంగా మలేషియా, సింగపూర్, దుబాయ్ వంటి దేశాల నుంచి విమానాల్లో పెద్దఎత్తున బంగారం స్మగ్లింగ్ జరుగుతోంది. వీటిని అరికట్టేందుకు కస్టమ్స్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో మలేషియా రాజధాని కౌలాలంపూర్ నుంచి మలిండో విమానం సోమవారం వేకువజామున తిరుచ్చికి చేరుకుంది. ఈ విమానంలో వచ్చిన ప్రయాణికులను కస్టమ్స్ అధికారులు తనిఖీ చేశారు. అనుమానాస్పదంగా ఉన్న ఓ ప్రయాణికుడిని పరిశీలించగా.. అతని నుంచి గొలుసులు, జిగురు రూపంలో మొత్తం 490 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.29 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈమేరకు నిందితుడిని అరెస్టు చేసి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

18న డీఎంకే విద్యార్థి సంఘం కార్యవర్గ సమావేశం

కొరుక్కుపేట: డీఎంకే విద్యార్థి సంఘం రాష్ట్ర నిర్వాహకుల సమావేశం ఈనెల 18న చెన్నైలోని అన్నా అరివాలయంలో నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే సీవీఎంపీ ఎళిలరసన్ ప్రకటించారు. ఈ మేరకు డీఎంకే విద్యార్థి సంఘం కార్యదర్శి ఎమ్మెల్యే ఎళిలరసన్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి తనతోపాటు విద్యార్థి బృందం నాయకుడు ఇరా నాయకత్వం వహిస్తారని పేర్కొన్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర విద్యార్థి బృందం నిర్వాహకులందరూ తప్పక హాజరుకావాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి జయంతి ఉత్సావాలు, దేశ స్థాయిలో విద్యార్థి సంస్థల ఏర్పాట్లపై చర్చ జరగనుందని వెల్లడించారు.

వేడుకగా అగ్నిగుండ ప్రవేశం

తిరుత్తణి: ద్రౌపదీదేవి ఆలయ ఉత్సవాల్లో భాగంగా 1,700 మంది భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేసి మొక్కులు చెల్లించారు. తిరుత్తణి పట్టణంలోని ఎగువ తిరుత్తణి ద్రౌపదీదేవి ఆలయంలో ఏప్రిల్ 25న అగ్నిగుండ ఉత్సవాలకు ధ్వజారోహణం నిర్వహించారు. 18 రోజుల పాటు నిర్వహించిన ఈ వేడుకల్లో రోజూ పగటి సమయాల్లో మహాభారత ఉపన్యాసాలు, రాత్రి వేళల్లో వీధి నాటకాలు ప్రదర్శించారు. ఆదివారం అగ్నిగుండం ప్రవేశం సందర్భంగా భక్తులు కంకణాలు ధరించారు. సాయంత్రం వేలాదిగా భక్తులు ఆలయం వద్దకు చేరుకున్నారు. విద్యుద్దీపలంకరణ కనువిందు చేయగా సాయంత్రం ఎనిమిది గంటల సమయంలో అగ్నిగుండం ముందు ద్రౌపదీదేవి పుష్పాలంకరణలో కొలువుదీరారు. భక్తులు పసుపు దుస్తులతో వేపాకులు చేతబట్టి ఆలయం వద్దకు చేరుకున్నారు. అగ్నిగుండానికి పూజలు చేపట్టి బాణసంచా వేడుకల నడుమ భక్తులు గోవింద నామస్మరణతో అగ్నిగుండ ప్రవేశం చేశారు.


విశేష అలంకరణలో ద్రౌపదీదేవి


అగ్నిగుండం ప్రవేశం చేస్తున్న భక్తులు

ఉత్సవాల్లో ఘర్షణ.. యువకుడికి గాయాలు

అగ్నిగుండ ఉత్సవాల తరువాత రాత్రి జరిగిన వీధి నాటకం చుస్తుండగా మద్యం మత్తులో తిరుత్తణి జారు వీధికి చెందిన శ్రీనివాసన్ అనే వ్యక్తితో అమృతాపురానికి చెందిన రవి, మురుగేశన్ గొడవ పడ్డారు. ఆ సమయంలో వారి చేతిలో ఉన్న మద్యం బాటిల్ కొట్టి కడుపులో పొడిచారు. తీవ్ర గాయాలైన శ్రీనివాసన్ తిరువళ్లూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రవి, మురుగేశన్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ రాజీకుమారి తెలిపారు. అలాగే శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా కఠిన చర్యలు చేపట్టినట్లు ఆమె వివరించారు.

చెట్టుకొమ్మ విరిగి పడి విద్యార్థిని మృతి

అన్నానగర్: కంబం సమీపంలో ఆదివారం పిక్నిక్ స్పాట్‌లో చెట్టు కొమ్మ విరిగి పడి చెన్నైకు చెందిన ఓ విద్యార్థిని మృతి చెందింది. వివరాలు.. చెన్నై నీలాంగరై ఈశ్వరీ నగర్‌కు చెందిన నిక్సన్ (47) కారు డ్రైవర్. ఇతని భార్య కృష్ణమాల. ఈ దంపతులకు కుమార్తె బెమీనా (15), కుమారుడు డైలాన్ ఆండర్సన్ ఉన్నారు. బెమీనా చెన్నైలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. ఈ స్థితిలో, పాఠశాలలకు వేసవి సెలవులు కావడంతో నిక్సన్ తన బంధువులతో కలిసి ఆదివారం తేని జిల్లా కంబం సమీపంలోని సురులి జలపాతం వద్దకు కారులో వెళ్లారు. అక్కడ జలపాతం పరిసర ప్రాంతాలను చూస్తూ సందడి చేశారు. తర్వాత బెమీనా సహా అందరూ జలపాతం నుంచి కారు పార్క్ చేసిన ప్రదేశం వైపు నడిచారు. వెన్నీరు వంతెన దగ్గరకు రాగానే హఠాత్తుగా ఓ చెట్టు కొమ్మ విరిగి బెమీనా తలపై పడింది. తలకు తీవ్ర గాయం కావడంతో బెమీనా అక్కడికక్కడే మృతి చెందింది. రాయప్పన్‌పట్టి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రూ. 2.5 లక్షల పొగాకు ఉత్పత్తులు స్వాధీనం

అన్నానగర్: తేని సమీపంలో సోమవారం ఓ గోడౌన్‌లో దాచిన రూ.2.5 లక్షల విలువైన పొగాకు ఉత్పత్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. తేనిజిల్లా పళనిశెట్టిపట్టి పోలీసులు సోమవారం తేని సమీపంలోని పాలత్ పుదూర్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో బైక్‌పై వచ్చిన ఓ వ్యక్తిని ఆపి బ్యాగ్‌ను సోదా చేశారు. ఇందులో పొగాకు ఉత్పత్తులను గుర్తించారు. విచారణలో నిందితుడు అల్లినగరం మందుగరుప్పనస్వామి దేవాలయం వీధికి చెందిన గౌతమ్ (20) అని తేలింది. తేనికి చెందిన నవరత్నవేల్ (41) నుంచి పొగాకు ఉత్పత్తులను కొనుగోలు చేసి పాలత్‌పుదూర్‌కు చెందిన కణ్ణన్ (28) ద్వారా కొన్ని కట్టలను గోడౌన్‌లో ఉంచినట్లు తెలిపారు. దీంతో పోలీసులు పాలత్‌పుదూర్‌లోని గోడౌన్‌ను తనిఖీ చేసి అందులోని పొగాకు ఉత్పత్తులను సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు గౌతమ్, నవరత్నవేల్, కన్ననన్‌ను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.2.59 లక్షల విలువైన పొగాకు ప్యాకెట్లను, రూ.98,880 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

3 కిలోల బంగారం స్వాధీనం



అన్నానగర్: కోయంబత్తూరు విమానాశ్రయంలో సోమవారం లోదుస్తుల్లో దాచి అక్రమంగా తరలిస్తున్న 3 కిలోల బంగారాన్ని ఇంటెలిజెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేశారు. వివరాలు.. కోయంబత్తూరు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రోజూ పెద్దసంఖ్యలో విమానాలు వచ్చి చేరుతాయి. ఈక్రమంలో షార్జా నుంచి కోయంబత్తూరు వస్తున్న ఎయిర్ అరేబియా విమానంలో బంగారం అక్రమంగా తరలిస్తున్నట్లు కేంద్ర రెవెన్యూ ఇంటెలిజెన్స్ విభాగం అధికారులకు రహస్య సమాచారం అందింది. దీని ప్రకారం సోమవారం షార్జా నుంచి కోయంబత్తూరుకు విమానం అరేబియా ఫ్లైట్ వచ్చింది. నలుగురు ప్రయాణికుల కార్యకలాపాల్లో అనుమానం వచ్చింది. అనంతరం అధికారులు వారిని తనిఖీ చేశారు. అప్పుడు ఇద్దరు ప్యాంటు జేబులు, లోదుస్తుల్లో దాచి 3 కిలోల బంగారాన్ని అక్రమంగా తరలించినట్లు గుర్తించి సీజ్ చేశారు. దీని విలువ రూ.1.9 కోట్లు ఉంటుందని భావిస్తున్నారు. ఈ కేసులో పుదుకోట్టై జిల్లాకు చెందిన జియావుద్దీన్ (27), చెన్నైకి చెందిన షేక్ మహ్మద్(31)లను అధికారులు ముమ్మరంగా విచారణ చేస్తున్నారు.

చేపల కుంటలో మునిగి తల్లి, కుమారుడి మృతి

అన్నానగర్: చేపల కుంటలో మునిగి ఉత్తర రాష్ట్రానికి చెందిన తల్లి, కుమారుడు ఆదివారం మృతి చెందారు. వివరాలు.. కర్ణాటక రాష్ట్రం బెంగళూరులోని రామమూర్తి నగర్‌కు చెందిన సాగర్ (54)కు చెందిన ఎస్టేట్ కృష్ణగిరి జిల్లా తలి సమీపంలోని ఉచనపల్లి గ్రామంలో ఉంది. ఈ ఎస్టేట్‌లో అస్సాంకు చెందిన మున్నా కుర్మీ (35), ఇతని భార్య సుమ (28) కూలీలుగా పనిచేస్తున్నారు. ఈ దంపతులకు లోకేష్ (06) అనే కుమారుడు ఉన్నాడు. మున్నా కుర్మీ ఆదివారం బయటకు వెళ్లాడు. ఆ సమయంలో లోకేష్ ఎస్టేట్‌లోని చేపల కుంటలో పెంచుతున్న చేపలను ఎరతో పట్టుకునేందుకు వెళ్లాడు. అనూహ్యంగా చేపల కుంటలోకి జారి పడిపోయాడు. ఇది చూసి షాక్‌కు గురైన తల్లి సుమ నీటి కుంటలోకి దిగి కుమారుడిని రక్షించేందుకు యత్నించింది. అయితే ఇద్దరికీ ఈతరాకపోవడంతో నీటిలో మునిగిపోయి చనిపోయారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్టేట్ కార్మికులు తలి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని నీటిలో మునిగిన తల్లీకొడుకుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తేన్‌కనికోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన ఆ ప్రాంతంలో తీవ్ర విషాదాన్ని నింపింది.

కొడుకుపై అక్రమ కేసులు నమోదు

- ఆత్మహుతికి యత్నించిన కుటుంబం

తిరువళ్లూరు: తమ కుమారుడిపై అక్రమంగా 18 కేసులు బనాయించి మనవాలనగర్ పోలీసులు వేధింపులకు గురి చేస్తున్నారని వాపోయిన కుటుంబం కిరోసిన్ పోసుకుని ఆత్మహుతికి యత్నించిన ఘటన కలెక్టర్ కార్యాలయంలో ఉద్రిక్తతకు దారితీసింది. వివరాలు.. తిరువళ్లూరు జిల్లా వెంగత్తూరు గ్రామంలో సుడర్‌మణి, సెల్వీ దంపతులు నివాసం ఉంటున్నారు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కొడుకులు, కుమార్తె ఉన్నారు. వీరిలో చిన్నకొడుకు నవీన్ కుమార్ అంబత్తూరులోని ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు. రెండేళ్ల క్రితం వలసైవెట్టికాడులో జరిగిన ఘర్షణలో నవీన్‌కుమార్‌పై కేసు నమోదయ్యింది. దీంతో గ్రామాన్ని వదిలి వెంగత్తూరుకు సుడర్‌మణి కుటుంబం స్థిరపడింది. అయితే గ్రామంలో చిన్న ఘర్షణ జరిగినా తమ కొడుకుకు అంటగట్టి కేసులు నమోదు చేస్తున్నారని బాధిత కుటుంబ సభ్యులు వాపోయారు. రెండేళ్లుగా పోలీసులు వేధిస్తున్నారని, రాత్రి సమయంలో విచారణ వుందని తీసుకెళ్లి అక్రమ కేసులు బనాయిస్తున్నారని వాపోయిన సుడర్‌మణి కుటుంబం సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయానికి కిరోసిన్‌తో వచ్చి ఆత్మహుతికి యత్నించారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు వారించి విచారణ నిమిత్తం స్టేషన్‌కు తరలించారు. ఈ విషయం స్థానికంగా కలకలం రేపింది.


కిరోసిన్ పోసుకుని ఆత్మహుతికి యత్నించిన కుటుంబాన్ని వారిస్తున్న ఎస్‌ఐ

అ'పూర్వ'కలయిక


పాతికేళ్ల తర్వాత సమావేశమైన పూర్వ విద్యార్థులు

తిరువళ్లూరు: స్థానిక శ్రీ వేంకటేశ్వర మెట్రిక్ పాఠశాలలో 25 ఏళ్ల క్రితం చదువుకున్న విద్యార్థులు సోమవారం మళ్లీ కలుసుకుని పాత జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. తిరువళ్లూరు పట్టణంలో శ్రీ వేంకటేశ్వర మెట్రిక్ పాఠశాల ఉంది. ఇందులో 1998వ సంవత్సరంలో ప్లస్–2 పూర్తి చేసి వేర్వేరు రంగాల్లో స్థిరపడ్డారు. అయితే వాట్సాప్ ద్వారా పాత మిత్రుల వివరాలను సేకరించిన పూర్వ విద్యార్థులు ప్రత్యేకంగా సమావేశం కావాలని నిర్ణయించారు. సోమవారం భేటీ అయ్యి పాత జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. తమకు విద్యను బోధించిన ఉపాధ్యాయులను సత్కరించారు.

అప్పుడే రాశా.. ప్రేమలేఖ

తమిళ సినిమా: నటి సాయి పల్లవి గురించి ఇప్పుడు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉండదు. ఒక నిర్దిష్టమైన నిర్ణయంతో కథలను ఎంపిక చేసుకుని నటిస్తున్నారామె. ముఖ్యంగా గ్లామర్‌కు దూరంగా, నటనకు అవకాశం ఉన్న కథా పాత్రలనే ఎంచుకుంటూ తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. ఈమె డాక్టర్ కాబోయి యాక్టర్ అయిన విషయం తెలిసిందే. ఈమెలో మంచి డ్యాన్సర్ ఉన్నారు కూడా. ప్రేమలో పడని వారు కళాకారులు కాలేరు అని ఇటీవల సీనియర్ దర్శకుడు భారతి రాజా కూడా పేర్కొన్నారు. అలాంటి అనుభవం నటి సాయి పల్లవి జీవితంలో కూడా జరిగిందట ఈ విషయాన్ని ఆమె స్వయంగా ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఇందులో తాను ఏడవ తరగతి చదువుతున్నప్పుడే తన సహా విద్యార్థిపై ఇష్టం ఏర్పడిందన్నారు. అదంటే ఏదో తెలియని ఆసక్తి కలిగిందన్నారు. ఆ విషయాన్ని అతనికి తెలియజేయడం కోసం ప్రేమలేఖను రాశానన్నారు. అయితే దాన్ని అతనికి ఎలా అందజేయాలో తెలియక పుస్తకంలో పెట్టానన్నారు. అయితే ఆ ప్రేమ లేఖ తన తల్లి కంట పడడంతో బాగా కొట్టినట్లు వాపోయారు. అలా అమ్మ తనను కొట్టడం అదే మొదటిసారి, చివరి కూడా అని పేర్కొన్నారు. అప్పటి నుంచి అమ్మకు కోపం వచ్చేది ఏ పనీ చేయలేదని చెప్పారు. పిల్లల్ని మంచి మార్గంలో నడిపించే ప్రతి తల్లీ తన పిల్లలకు హీరోయిన్‌నే అని సాయి పల్లవి పేర్కొన్నారు.


నటి సాయి పల్లవి

కోలీవుడ్ టాక్స్

రెడ్ జెయింట్ ఖాతాలో కళువేత్తి మూర్కన్

తమిళ సినిమా: నటుడు అరుళ్ నిధి కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం కళువేత్తి మూర్కన్. నటి తుషార విజయన్ నాయకిగా నటిస్తున్న ఇందులో నటుడు సంతోష్ ప్రతాప్, ఛాయాదేవి, మునీష్కాంత్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. కాగా దీనికి ఎస్ గౌతమ్ రాజ్ కథా దర్శకత్వం బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఈయన ఇంతకుముందు నటి జ్యోతిక ప్రధాన పాత్రలో నటించిన రాక్షసి వంటి విజయవంతమైన చిత్రాన్ని తెరకెక్కించారు. ఒలంపియా మూవీస్ పతాకంపై అంబేద్ కుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలను జరుపుకుంటోంది. కాగా యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రానికి డి.ఇమాన్ సంగీతాన్ని అందిస్తున్నారు. కాగా ఈ చిత్ర ఫస్ట్ పోస్టర్, టీజర్‌ను ఇటీవల విడుదల చేయగా ప్రేక్షకుల నుంచి విశేష స్పందన వచ్చిందని యూనిట్ వర్గాలు పేర్కొన్నారు. కాగా తాజాగా కళువేత్తి మూర్కన్ చిత్రానికి సంబంధించిన అప్‌డేట్‌ను నిర్మాత వెల్లడించారు. చిత్రం తమిళనాడు విడుదల హక్కులను రెడ్ జెయింట్ మూవీస్ సంస్థ పొందినట్లు పేర్కొంటూ పోస్టర్‌ను సోమవారం విడుదల చేశారు. త్వరలో చిత్రం తెరపైకి రానున్నట్లు అందులో పేర్కొన్నారు.

ఉదయనిధి స్టాలిన్ తో అరుళ్ నిధి



25 ఏళ్ల తర్వాత బాలీవుడ్‌లో..

తమిళ సినిమా: బహుభాషా నటి జ్యోతిక. ఈమె 2000 దశకంలో కోలీవుడ్లో టాప్ హీరోయిన్‌గా రాణించారు. తర్వాత తెలుగు, హిందీ తదితర భాషల్లోనూ సత్తాచాటారు. కథానాయకిగా బిజీగా ఉన్న సమయంలోనే నటుడు సూర్యను ప్రేమించి, పెద్దల సమ్మతితో 2006లో పెళ్లి చేసుకున్నారు. ఆ తర్వాత నటనకు గ్యాప్ ఇచ్చిన జ్యోతిక 2015లో మళ్లీ నటిగా రీఎంట్రీ ఇచ్చారు. అలా ఆమె నటించిన హీరోయిన్ ఓరియెంటెడ్ కథా చిత్రం 36 వయదినిలే మంచి విజయాన్ని సాధించింది. ఆ తర్వాత వరుసగా తనకు తగిన కథ చిత్రాలను ఎంచుకుంటూ నటిస్తున్న జ్యోతిక 2డీ ఎంటర్‌టైన్మెంట్ సంస్థకు తన భర్త సూర్యతో కలిసి నిర్మాణ బాధ్యతలను నిర్వహిస్తున్నారు. కాగా జ్యోతిక 1998లో ప్రియదర్శన్ దర్శకత్వంలో డోలీ సజాకు రఖ్నా అనే హిందీ చిత్రంలో నాయికగా నటించారు. తాజాగా 25 ఏళ్ల తర్వాత మళ్లీ ఈమె బాలీవుడ్ చిత్రాల్లో నటించటం విశేషం. క్వీన్ చిత్ర దర్శకుడు వికాస్ బాయ్ దర్శకత్వంలో ఆమె నటించనున్నారు. ఇందులో బాలీవుడ్ స్టార్ నటుడు అజయ్ దేవగన్, మాధవన్ హీరోలుగా నటించనున్నారు. దీన్ని అజయ్ దేవగన్ సొంత నిర్మాణ పనోరమా స్టూడియోస్ నిర్మించనుంది. దీని గురించి అధికార ప్రకటనను సోమవారం చిత్ర వర్గాలు మీడియా విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నాయి.


నటి జ్యోతిక

మరణం అనేది సహజమే.. అయితే!

తమిళ సినిమా: ప్రముఖ హాస్య నటులు టీపీ గజేంద్రన్, మయిల్ సామి, మనోబాల ఇటీవల మరణించారు. తమిళ సినిమాకు వీరు లేని లోటు తీర్చలేనిదే. కాగా, వీరి స్మృత్యాంజలి కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం దక్షిణ భారత సంఘం నిర్వాహకులు నిర్వహించారు. స్థానిక టి.నగర్‌లోని త్యాగరాయర్ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం కోశాధికారి నటుడు కార్తీ, ఉపాధ్యక్షుడు పూచి మురుగన్, నిర్మాతర సంఘం కార్యదర్శి రాధాకృష్ణన్, దర్శకుల సంఘం కార్యదర్శి ఉదయ్ కుమార్, యాక్టివ్ నిర్మాతల సంఘం కార్యదర్శి టి.శివ, నటుడు ఢిల్లీ గణేష్, పశుపతి, రాజేష్, బోస్ వెంకట్, అజరత్నం, ఉదయ, లియాకత్ అలీ ఖాన్, విఘ్నేష్, వైయాపురి, నటి సిమ్రాన్, దేవయాని, రోహిణి, సచ్చు, పలువురు పాల్గొని టీపీ గజేంద్రన్, మయిల్ సామి, మనోబాల చిత్రపటాలకు శ్రద్ధాంజలి ఘటించి నివాళులు అర్పించారు. అనంతరం నటుడు కార్తీక్ మాట్లాడుతూ.. మరణించిన ముగ్గురూ తమిళ సినిమా గర్వించదగ్గ నటులని కీర్తించారు. ఇతరులకు సాయం చేయడంలోనూ ముందుండే వారన్నారు. ముఖ్యంగా నటుడు మయిల్ సామి దానకర్తగా జీవించారని పేర్కొన్నారు. నటుడు టీపీ రాజేంద్రన్ మంచి పాజిటివ్ భావాలు కలిగిన వ్యక్తి అని పేర్కొన్నారు. ఏ కార్యక్రమానికైనా బాధ్యతలను తనపై వేసుకుని నడిపించే మనిషి మనోబాల అని అన్నారు. మరణం సహజమేనని అయితే అది త్వరగా రాకుండా జాగ్రత్త వహించాలని, ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని కార్తీ పేర్కొన్నారు.


దివంగత నటుల సంస్మరణ సభలో ప్రముఖులు

యాక్షన్ క్రైమ్ థ్రిల్లర్‌గా మారుతినగర్ పోలీస్ స్టేషన్


మారుతి నగర్ పోలీస్ స్టేషన్ చిత్ర యూనిట్

తమిళ సినిమా: మారుతి నగర్ పోలీస్ స్టేషన్.. డి.పిక్చర్స్ పతాకంపై దయాళ్ పద్మనాభన్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం ఇది. నటి వరలక్ష్మి శరత్ కుమార్ ప్రధాన పాత్ర పోషించిన ఇందులో నటుడు ఆరవ్, సంతోష్ ప్రతాప్, మహత్, దర్శకుడు సుబ్రమణి శివ, వివేక్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. మణికాంత్ కాంద్రి సంగీతాన్ని అందించారు. పోలీస్ స్టేషన్ నేపథ్యంలో సాగే యాక్షన్ క్రైమ్ థ్రిల్లర్ కథా చిత్రం మారుతి నగర్ పోలీస్ స్టేషన్.. కథా, కథనం డిఫరెంట్‌గా ఉంటుందని సోమవారం సాయంత్రం చెన్నైలోని ప్రసాద్ ల్యాబ్ జరిగిన మీడియా సమావేశంలో దర్శకుడు దయాళ్ పద్మనాభన్ చెప్పారు. 21 రోజుల్లో చిత్రీకరించినట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. ఇందులో రెండు పాటలు ఉంటాయని తెలిపారు. ఇది ఈ నెల 19వ తేదీన నుంచి ఆహా తమిళ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. కంటెంట్ ఉన్న చిత్రాల దర్శకుడని దయాళ్ పద్మనాభన్ కొంద్రాల్ పావం చిత్రతోనే నిరూపించుకున్నానని, అదే విధంగా ఇది కూడా వేరే విధమైన కంటెంట్ ఉన్న చిత్రమని నటి వరలక్ష్మి శరత్ కుమార్ పేర్కొన్నారు. ఎలాంటి కాంట్రవర్సీ లేని మంచి కథా చిత్రంగా ఉంటుందని పేర్కొన్నారు. నటి వరలక్ష్మి శరత్ కుమార్‌తో కలిసి నటించడం మంచి అనుభవంగా నటుడు ఆరవ్ పేర్కొన్నారు. దర్శకుడు దయాళ్ పద్మనాభన్ కథ చెప్పిన దానికంటే బాగా తెరపై ఆవిష్కరించారని తెలిపారు.

క్లుప్తంగా

మహిళ దారుణ హత్య

అన్నానగర్: తెన్‌కాశి జిల్లా శంకరన్‌కోయిల్ సమీపంలోని ఉత్తర అగనాచియార్‌పురంలో మహిళ హత్యకు గురైంది. గ్రామ సమీపంలోని చందన పాండియన్‌కు చెందిన తోటలో సుమారు 35 ఏళ్ల గల మహిళ సోమవారం తీవ్ర గాయాలతో మృతి చెందింది. పోలీసులు అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతురాలు నైటీ ధరించి ఉంది. ఆమె మెడ, చేతులపై నరికిన గాయాలు ఉన్నాయి. ఘటనా స్థలంలో కారంపొడి చల్లారు. పోలీసులు ఆమె మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని శంకరన్ కోయిల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

కండక్టర్‌పై దాడి


చికిత్స పొందుతున్న కండక్టర్ మోసస్

తిరువళ్లూరు: బస్సులో టికెట్ తీసుకుని ప్రయాణం చేయాలని కోరిన కండక్టర్‌పై దాడి చేసిన సంఘటన కలకలం రేపింది. తిరువళ్లూరు నుంచి రామంజేరికి పూండీ మీదుగా ప్రభుత్వ బస్సు నడుస్తోంది. ఆదివారం రాత్రి రామంజేరి నుంచి తిరువళ్లూరు వైపు బస్సు బయలుదేరింది. గుర్తు తెలియని ఐదుగురు యువకులు బస్సులో ఎక్కారు. వారిని టికెట్ తీసుకోవాలని కండక్టర్ మోసస్ కోరడంతో అందుకు నిరాకరించిన యువకులు కండక్టర్‌తో వాగ్వాదానికి దిగారు. కండక్టర్ టికెట్ తీసుకోకపోతే బస్సు నుంచి దిగిపోవాలని కోరాడు. బస్సు దిగిన ఐదుగురు యువకులు కండక్టర్‌పై విచక్షణారహితంగా దాడి చేసి పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన కండక్టర్‌ను స్థానికులు తిరువళ్లూరు వైద్యశాలకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పుల్లరంబాక్కం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నూరులో రౌడీ హత్య

కొరుక్కుపేట: ఎన్నూరు ప్రాంతంలో ఆదివారం రాత్రి పేరు మోసిన రౌడీని 11 మందితో కూడిన ముఠా నరికిచంపింది. చెన్నై తిరువొత్తియూర్ ఎర్నావూరు సునామీ నివాసానికి చెందిన పోయి విజీ (25) రౌడీ. ఇతనిపై పలు స్టేషన్లలో కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. అతనికి అదే ప్రాంతానికి చెందిన కొందరితో తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ క్రమంలో పోయి విజీ ఆదివారం రాత్రి ఎన్నూరు కసివిసువనాథన్ కోయిల్ కుప్పం వద్ద వెళుతుండగా 11 మందితోకూడిన ముఠా దాడికి దిగింది. వారి నుంచి తప్పించుకునేందుకు అతను పరుగులు తీశాడు. వారు అతన్ని వెంబడించి కత్తులతో నరికి చంపేశారు. చనిపోయాడని నిర్ధారించుకున్న తర్వాత అక్కడి నుంచి పారిపోయారు. సమాచారం అందుకున్న ఎన్నూరు పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని చెన్నైలోని స్టాన్లీ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాలుగు వాహనాల ఢీ

కొరుక్కుపేట: చెంగల్పట్టు బైపాస్‌లో సోమవారం ప్రభుత్వ బస్సు సహా నాలుగు వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చెన్నై వైపు వస్తున్న ఒక కారు సడన్ బ్రేక్ వేసింది. ఈ క్రమంలో వ్యాన్, ప్రభుత్వ బస్సు, లారీ ఒకదాని తర్వాత ఒకటి కారును ఢీకొన్నాయి. వ్యాన్‌లో ప్రయాణిస్తున్న ఏడుగురికి తీవ్ర గాయాలు కాగా వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో చెన్నై హైవే పై ట్రాఫిక్ జామ్ అయింది. దాదాపు మూడు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ పోలీసులు తీవ్రంగా శ్రమించి వాహనాలను ప్రత్యామ్నాయ మార్గంలో మళ్లించారు. రెండు గంటలకు పైగా ట్రాఫిక్ జామ్ అయింది.

ముగ్గురు క్రీడాకారిణులకు స్పాన్సర్‌షిప్


క్రీడాకారిణులకు స్పాన్సర్‌షిప్ అందజేస్తున్న రామకుమార్, మేఘనాథ రెడ్డి

కొరుక్కుపేట: చెన్నైలోని నెహ్రూ స్టేడియంలోని తమిళనాడు అథ్లెటిక్ అసోసియేషన్ వేదికగా రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాసు ఈస్ట్ డిస్ట్రిక్ట్ -3232 ముగ్గురు నిరుపేద క్రీడాకారిణులు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున స్పాన్సర్‌షిప్‌ను అందజేసింది. దీనికి టీఎన్ఏఏ అధ్యక్షుడు డబ్ల్యూ ఐ ధవరామ్ అధ్యక్షత వహించారు. యుఎస్‌లోని ది ఎంపవర్ ఫౌండేషన్ సౌజన్యంతో రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాసు ఈస్ట్ తరపున ముగ్గురు నిరుపేద క్రీడాకారిణులైన ఆర్.స్వాతి, వి.గుణష్య, హర్షితకు స్పాన్సర్‌షిప్‌లను ఇచ్చారు. ఎస్‌డీఏటీ సెక్రటరీ మేఘనాథ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. ఈ క్రమంలో ప్రతిభ కనపరుస్తున్న నిరుపేద క్రీడాకారులను గుర్తించి సాయం అందిస్తున్న రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాసు ఈస్ట్ నిర్వాహకులను అభినందనలు తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాసు ఈస్ట్ అధ్యక్షులు టీవీ రామకుమార్, టీఎన్ఏఏ వైస్ ప్రెసిడెంట్ రాజేంద్రన్, సెక్రటరీ సి.లత తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా
గుడియాత్తం అమ్మన్ శిరస్సు జాతర


వివిధ వేషధారణల్లో భక్తులు


పులి వేషంలో నృత్యం చేస్తున్న భక్తులు


అమ్మన్ శిరస్సు ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

వేలూరు: వేలూరు జిల్లా గుడియాత్తం గంగయమ్మన్ ఆలయ జాతరను పురస్కరించుకుని శిరస్సు జాతర సోమవారం ఉదయం అంగరంగ వైభవంగా జరిగింది. జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన గుడియాత్తం గంగయమ్మన్ జాతర ప్రతి సంవత్సరం అతి వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా సోమవారం ఉదయం ముత్తాలమ్మన్ ఆలయంలో ఉన్న అమ్మన్ శిరస్సుకు ప్రత్యేక పూజలు చేసి భక్తిశ్రద్ధలతో భక్తుల కోలాహలం మధ్య శిరస్సును ఊరేగింపుగా తీసుకొచ్చి పాలారు నది ఒడ్డున ఉన్న ఆలయంలోని విగ్రహానికి అమర్చారు. ఈ ఊరేగింపులో ఓం శక్తి భక్తులతో పాటు, భక్తులు వివిధ వేషధారణలో ఆకట్టుకున్నారు. అదే విధంగా భక్తులు మూటలు మూటలుగా కొబ్బరి కాయలను కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ జాతరకు వేలూరు, తిరువణ్ణామలై, తిరుపత్తూరు, వానియంబాడి, ఆంబూరు, పరదరామి, చిత్తూరు నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. ఇదిలా ఉండగా విపరీతమైన ఎండ తీవ్రతతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జాతరకు వచ్చే భక్తుల దాహార్తిని తీర్చేందుకు నీరు, మజ్జిగ, అంబలితో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ జాతరలో దేవదాయ శాఖ ఆలయ అధికారి లక్ష్మణన్, ఆలయ ఈవో తిరునావకరసు, అసిస్టెంట్ కమిషనర్ నిత్య, ఆలయ ధర్మకర్త ఆర్‌జే సంపత్, నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఎస్పీ రాజేష్ కన్నన్ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతర ముగింపులో రాత్రి బాన వేడుకలను ఏర్పాటు చేశారు.

నాగర్‌కోయిల్ వ్యాపారవేత్త ఇంట్లో 100 సవర్ల బంగారు చోరీ

కొరుక్కుపేట: నాగర్‌కోయిల్ సమీపంలోని ఓ ఆర్థిక సంస్థ డైరెక్టర్ ఇంట్లో 100 సవర్ల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. గణపతిపురం బహంతి ప్రాంతానికి చెందిన మురుగన్ (43) వ్యాపారవేత్త. అతను తన ఇంటి ఆవరణలో బంగారు ఆభరణాలకు రుణాలను అందించే సంస్థను నడుపుతున్నారు. రియల్ ఎస్టేట్‌తోపాటు పలు వ్యాపారాలు చేస్తున్నాడు. ఆదివారం రాత్రి మురుగన్ తన భార్య, కుటుంబ సభ్యులతో కలిసి కుమారుడు చదువు విషయమై చెన్నై వెళ్లారు. సోమవారం ఉదయం ఇంట్లో ఉండే చేపల తొట్టెలను శుభ్రం చేసి చేపలకు ఆహారం వేయాలని మురుగన్ తండ్రి పూతలింగం వచ్చాడు. ఇంటి తలుపులు తెరిచి ఉన్నట్టు గుర్తించి లోపల పరిశీలించాడు. బీరువా తెరిచి ఉండగా కుమారుడు మురుగన్‌కు సమాచారం అందించాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బీరువాలోని ఆభరణాలు, నగదు చోరీకి గురైనట్టు గుర్తించారు. దాదాపు 100 సవర్ల బంగారునగలు, రూ.6 లక్షల వరకు నగదు చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో డ్రైవర్ల ధర్నా


ఆటో కార్మికుల ధర్నా

తిరుత్తణి: తిరుత్తణి ఆలయ డిప్యూటీ కమిషనర్ తీరుకు నిరసనగా ఆటో డ్రైవర్లు సోమవారం ఉదయం కొండ ఆలయం ఘాట్ రోడ్డులో ధర్నా చేపట్టారు. తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి కొండ ఆలయానికి భక్తులు వాహనాల ద్వారా ఘాట్ రోడ్డులో చేరుకుంటుంటారు. భక్తుల సౌకర్యార్థం ఆలయం ద్వారా బస్సు సేవలు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో ఆటో డ్రైవర్లు సైతం అధిక సంఖ్యలో కొండకు భక్తులను తరలిస్తుంటారు. వారు రోజుకు రూ.30 టికెట్ తీసుకుని రోజంతా భక్తులను కొండకు తీసుకెళ్లేవారు. ప్రతి సింగిల్‌కు టికెట్ తీసుకుంటే తప్ప అనుమతించరాదని ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయ సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు. దీంతో టికెట్ లేని ఆటోలను అనుమతికి సిబ్బంది నిరాకరించారు. ఆటో డ్రైవర్లు దాదాపు 150 మంది ఘాట్ రోడ్డు ముందు ధర్నా చేపట్టారు. వారితో డీఎస్పీ చర్చలు జరిపారు. సామాన్య భక్తులకు మేలు చేసే విధంగా సేవలందిస్తున్న తాము రోజుకు ఒక్క టికెట్ తీసుకుని రాకపోకలకు అనుమతించాలని, అంతవరకు తమ పోరాటం ఆగదని తేల్చి చెప్పారు. దీంతో ఆలయ డిప్యూటీ కమిషనర్‌తో చర్చలు జరిపిన డీఎస్పీ సమస్య పరిష్కారానికి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని పేర్కొన్నారు. ఆటో డ్రైవర్ల ధర్నాతో ఘాట్ రోడ్డులో వాహనాలు నిలిచిపోయాయి.

ఏనుగుల దాడిలో యువకుడికి తీవ్ర గాయాలు


గ్రామాల్లో సంచరిస్తున్న అటవీ ఏనుగులు

వేలూరు: క్రిష్ణగిరి అటవీ ప్రాంతంలో చుట్టి వస్తున్న అటవీ ఏనుగులు గత వారంలో ఒకరిపై దాడి చేసి చంపిన విషయం తెలిసిందే. ఈ ఏనుగులు ఆంధ్ర రాష్ట్రంలో మరో ఐదుగురిపై దాడి చేసి చంపిన విషయం తెలిసిందే. అటవీ ఏనుగుల్లో జంట ఏనుగులు తిరుపత్తూరు జిల్లా నాట్రంబల్లి సమీపంలోని ఏలగిరి కొండ సమీపంలో తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. అవి ఆదివారం సాయంత్రం తన్నీర్ పందల్ గ్రామం సమీపంలోని చెన్నై– బెంగళూరు జాతీయ రహదారిని దాటాయి. ఆ సమయంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బైకులో వచ్చిన యువకుడు బైకును నిలపకుండా వెళ్లడంతో ఏనుగులు దాడి చేశాయి. తీవ్రంగా గాయపడిన అతన్ని ఆసుపత్రికి తరలించారు. అనంతరం ఏనుగులు ఆతూర్ గ్రామానికి చేరుకుని చెరుకు తోట, మామిడి తోట, అరటి వంటి పంటలను నాశనం చేశాయి. గ్రామస్తులు డప్పులు, టపాకాయలు పేల్చి వాటిని తరిమేందుకు ప్రయత్నం చేశారు. అయినప్పటికీ ఏనుగులు అక్కడి నుంచి వెళ్లకపోవడంతో గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందజేశారు. వారు క్రిష్ణగిరి, ధర్మపురం జిల్లాల నుంచి సిబ్బందిని రప్పించి ఏనుగులను టపాకాయలు పేల్చి అడవిలోకి తరిమివేశారు. పూజారి గ్రామం వైపు వెళుతున్న సమయంలో మాసిలామణి పశువు మేత మేస్తుండగా ఏనుగులు దాడి చేసి చంపేశాయి.

ఇద్దరు పారిశుద్ధ్య కార్మికుల మృతి

తిరువళ్లూరు: సెప్టిక్ ట్యాంక్‌ను శుభ్రం చేసే క్రమంలో విషవాయువు పీల్చి ఇద్దరు పారిశుద్ధ్య కార్మికులు మృతి చెందిన సంఘటన సోమవారం పుళల్ సమీపంలో జరిగింది. తిరువళ్లూరు జిల్లా పుళల్ కావాంగరై గురుశాంతి నగర్‌లో రాజేంద్రన్ కుటుంబ సభ్యులతో కలిసి నివాసం వుంటున్నారు. ఇతని ఇంటి ముందు వున్న సెప్టిక్ ట్యాంక్‌లో లీకేజీ రావడంతో వాటిని తొలగించాలని నిర్ణయించి సెంగుడ్రం ఎంఏ నగర్‌కు చెందిన భాస్కరన్, గణేషన్ తదితర ఇద్దరు కార్మికులను ఆశ్రయించారు. వారు సోమవారం ఉదయం పది గంటలకు రాజేంద్రన్ ఇంటికి వచ్చి పనుల్లో నిమగ్నమయ్యారు. మొదట భాస్కరన్ ఎలాంటి భద్రత ఉపకరణాలు లేకుండా తాడు సాయంతో ట్యాంక్‌లోకి దిగాడు. పైన గణేషన్ తాడును పట్టుకున్నాడు. ట్యాంక్‌లో దిగిన నిమిషాల వ్యవధిలోనే భాస్కరన్ విషవాయువు పీల్చి స్పృహ తప్పి పడిపోయాడు. గమనించిన గణేషన్ అతడ్ని కాపాడానికి ట్యాంక్‌లో దిగాడు. అతనూ విషవాయువు పీల్చి స్పృహతప్పి పడిపోయాడు. విషయాన్ని గ్రహించిన స్థానికులు పుళల్ అగ్నిమాపక సిబ్బందితో పాటు మాధవరం డిప్యూటీ కమిషనర్ శక్తివేల్, అసిస్టెంట్ కమిషనర్ ఆదిమూలం, ఇన్‌స్పెక్టర్ షన్ముగంకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది ట్యాంక్‌లో పడిన ఇద్దరు కార్మికులను బయటకుతీశారు. అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించి వైద్యశాలకు తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కారు బోల్తా పడి ఇద్దరు చిన్నారుల మృతి

- నలుగురికి తీవ్ర గాయాలు


క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

వేలూరు: కారు బోల్తా పడి ఇద్దరు చిన్నారులు మృతిచెందగా మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. చెన్నై విల్లివాక్కం ప్రాంతానికి చెందిన మహ్మద్ సలీమ్, అతని కుమార్తె తబస్సు పాతిమా(15), బంధువులు కోటూరుకు చెందిన అబ్దుల్ రజాక్, అతని కుమార్తె సుమయ పాతిమా(17) అందరూ కుటుంబ సభ్యులతో కలిసి ఆంధ్ర రాష్ట్రం చిత్తూరు జిల్లాలోని బంధువులు మృతి చెందడంతో సోమవారం కారులు బయలుదేరారు. చెన్నై విల్లివాక్కంకు చెందిన విజయ్ కారును నడుపుతున్నాడు. ఉదయం రాణిపేట సమీపంలోని బెల్ పరిశ్రమ వద్ద వెళుతుండగా కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణం చేస్తున్న తబస్సు పాతిమా, సుమయ పాతిమా అక్కడికక్కడే మృతి చెందారు. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని వెంటనే వాలాజ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

అన్నానగర్: గోపిశెట్టిపాళైయంలో సోమవారం బాలిక(3)పై జరిగిన లైంగిక వేధింపుల వార్తను టీవీలో చూసి ఓ యువకుడు గొంతు కోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. ఈరోడ్ జిల్లా గోపిశెట్టిపాళైయం సమీపంలోని నాంజ్ సకౌండన్‌పాళయం నందవన్ రోడ్డుకు చెందిన దురైసామి కుమారుడు అరుల్ కుమార్ (32) కూలీ. సోమవారం ఉదయం ఇంట్లో ఉండగా గొంతు కోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. అతని కేకలు విని తల్లి సరసమ్మాల్ గదిలోకి వెళ్లింది. అతను గొంతు కోసుకుని ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నాడు. అతన్ని స్థానికుల సహాయంతో గోపిశెట్టి పాలయం ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. అక్కడి నుంచి ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న గోపిశెట్టి పాలైయం పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేశారు. అరుల్ కుమార్ టెలివిజన్‌లో 3 ఏళ్ల బాలికపై లైంగిక వేధింపుల వార్తను చూశాడు. దీంతో మనస్తాపానికి గురైన గొంతు కోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించాడని తెలిసింది. ఈ ఘటన ఆ ప్రాంతంలో సంచలనం సృష్టించింది.

రెగ్జిన్ గోడౌన్‌లో అగ్ని ప్రమాదం

రూ.5 లక్షల ఆస్తి నష్టం

అన్నానగర్: చెన్నై సౌకార్‌పేట వెంకట మేస్త్రీ వీధిలో రెగ్జిన్ గోడౌన్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.5 లక్షల ఆస్తి నష్టం సంభవించింది. వసంత (70) కుమారుడు సతీష్ (38) ఇంటి కింది అంతస్తులో గోడౌన్ ఏర్పాటు చేసుకుని గత 20 ఏళ్లుగా రెగ్జిన్ ఉత్పత్తులను కొనుగోలు చేస్తూ సోఫాలతో పాటు వివిధ గృహోపకరణాలను తయారు చేసి విక్రయిస్తున్నాడు. ఆదివారం సెలవు కావడంతో గోడౌన్ తాళం వేసి ఉంది. సాయంత్రం ఒక్కసారిగా పొగ కమ్ముకుంది. కొద్దిసేపటికే పత్తికి మంటలు పెద్ద ఎత్తున వ్యాపించాయి. గోడౌన్‌లోని రెగ్జిన్ సహా పలు రకాల రసాయనాలు మంటలు చెలరేగి పేలిపోయాయి. సమాచారం అందుకున్న వన్నార్‌పేట ప్రాంతం నుండి 10 మందికి పైగా అగ్నిమాపక సిబ్బంది 2 ఫైర్ ఇంజన్లతో అక్కడికి చేరుకుని 2 గంటలకు పైగా శ్రమించి మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో రూ.5 లక్షల విలువైన వస్తువులు దగ్ధమయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు



బాలసౌరి, అన్నామలై

తిరుమల: శ్రీవారిని సోమవారం పార్లమెంట్ కమిటీ చైర్మన్ బాలసౌరి, తమిళనాడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

పట్టాలు తప్పిన చెన్నై–బెంగళూరు డబుల్ డెక్కర్ రైలు


జోలార్‌పేట సమీపంలో నిలిచి పోయిన రైలు

వేలూరు: చెన్నై సెంట్రల్ రైల్వే స్టేషన్ నుంచి సోమవారం ఉదయం 7.25 గంటలకు బెంగళూరుకు డబుల్ డెక్కర్ రైలు బయలుదేరింది. ఉదయం 11.21 గంటల సమయంలో తిరుపత్తూరు జిల్లా జోలార్‌పేట సమీపంలోని సీసీ సత్తం గ్రామం వద్ద వెళుతుండగా ఆఖరి బోగి సీవన్ పట్టాలు తప్పింది. బోగిలోని రెండు చక్రాలు కింద దిగడంతో శబ్దం వచ్చింది. ప్రయాణికులు కేకలు వేశారు. విషయం తెలుసుకున్న డ్రైవర్ రైలును నిలిపి వేశాడు. కుప్పం, జోలార్‌పేట రైల్వే స్టేషన్‌కు సమాచారం అందజేశారు. రైల్వే కార్మికులు ప్రమాద స్థలానికి చేరుకొని మరమ్మతులు చేపట్టారు. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. సుమారు రెండు గంటల పాటు రైళ్ల రాకపోకలు పూర్తిగా నిలిపి వేశారు. దీంతో కాట్పాడి మీదుగా చెన్నై వెళ్లే రైళ్ల రాకపోకలు పూర్తిగా ఎక్కడికక్కడే నిలిచి పోయాయి.

అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి

అన్నానగర్: చెన్నై–తిరుచ్చి జీఎస్టీ రోడ్డులోని గుడువాంజేరి సమీపంలోని పొత్తేరిలో ఓ ప్రైవేట్ యూనివర్సిటీకి చెందిన ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థి సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఈ కళాశాలలో తమిళనాడుతోపాటు పలు ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వేలాది మంది విద్యార్థులు హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. కొంతమంది విద్యార్థులు సమీపంలోని కాటంగళత్తూరు, పొతేరి, తైలవరం, వల్లంజేరి, గుడువాంజేరి ప్రాంతాల్లోని ప్రైవేట్ ప్లాట్లలో అద్దెకు ఉంటున్నారు. గూడువాంచేరి సమీపంలోని వల్లాంజేరిలో 15 అంతస్తుల ప్రైవేట్ ప్లాట్ 7వ అంతస్తులో అద్దెకు ఉంటున్న విద్యార్థి(20) సోమవారం ఉదయం కిందకు దూకి మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని చెంగల్‌పట్టు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతను ఏ ఊరికి చెందిన వాడో, ఎవరైనా కిందకు తోసి హత్య చేశారా లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడా అని పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత మహిళ ఆత్మహత్య



మృతి చెందిన భవానీ, అరెస్టయిన ప్రసాద్

తిరువళ్లూరు: భర్త వివాహేతర సంబంధంతో విసిగిపోయిన వివాహిత ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తిరువళ్లూరు జిల్లా ఒండికుప్పం గ్రామానికి చెందిన ప్రసాద్(28)కు పడపై ప్రాంతానికి చెందిన సమీప బంధువైన భవాని(24)తో 2019లో పెళ్లి అయింది. వీరికి ఏడాదిన్నర బాలుడు వున్నాడు. ప్రసాద్ శ్రీపెరంబదూరులోని ప్రయివేటు కంపెనీలో పని చేస్తున్నాడు. అతనికి అదే కంపెనీలో పనిచేసే యువతితో వివాహేతర సంబంధం వుంది. ఈ విషయమై భార్యాభర్తలు గొడవపడి సంవత్సరం నుంచి వేరుగా వుంటున్నారు. రెండు వారాల క్రితం భవానీకి ఫోన్ చేసిన కవిత, తనకు ప్రసాద్‌కు మూడు నెలల క్రితం వివాహమైందని, తాను ప్రస్తుతం మూడు నెలల గర్భవతినని చెప్పింది. భవానీ ఈ విషయంపై భర్తతో గొడవ పడగా భర్త నిర్లక్ష్యంగా సమాధానమిచ్చాడు. దీంతో మనస్తాపం చెందిన భవాని సోమవారం ఉదయం ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటనపై భవాని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడు ప్రసాద్‌ను అరెస్టు చేశారు. భవాని మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఇంటి స్థలాలు కేటాయించాలని ఆందోళన


ఆందోళన చేస్తున్న బాధితులు

తిరువళ్లూరు: రోడ్డు విస్తరణలో భాగంగా ఇళ్లు కోల్పోయిన బాధితులకు ప్రత్యామ్నాయ స్థలాలను కేటాయించాలని కోరుతూ దాదాపు రెండు వందల మంది సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. తిరువళ్లూరు జిల్లా మనవాలనగర్ నుంచి శ్రీపెరంబదూరు వరకు రోడ్డు విస్తరణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే రోడ్డుకు రెండు వైపులా వున్న చెట్లను తొలగించి వర్షపు నీరు వెళ్లడానికి కాలువ నిర్మాణ పనులు చేస్తున్నారు. దీంతో పాటు రోడ్డు విస్తరణకు అడ్డంకిగా వున్న ఇళ్లను గుర్తించి నెల రోజుల క్రితం నోటీసులు జారీ చేసి ప్రస్తుతం నివాసాలను తొలగించే ప్రక్రియను చేపట్టారు. ఈ నేపథ్యంలో కడంబత్తూరు యూనియన్ పోలీవాక్కం, పోలీవాక్కం సత్రం, అత్తికుళం గ్రామానికి చెందిన సుమారు రెండు వందల ఇళ్లు తొలగించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. దీంతో బాధితులు సోమవారం ఆందోళన చేపట్టారు. ప్రత్యామ్నాయ ఇంటి స్థలాలను కేటాయించాలని, ఇందు కోసం ప్రభుత్వానికి చెందిన 4 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుని ప్లాట్‌గా వేసి తమకు ఇవ్వాలని నినాదాలు చేశారు. అనంతరం కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్‌కు వినతి పత్రం సమర్పించారు. న్యాయం చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


వికలాంగులకు పింఛను మంజూరు ఉత్తర్వులు అందజేస్తున్న కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్

తిరువళ్లూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులకు వర్తింపజేయాలని కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్ సూచించారు. తిరువళ్లూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్‌డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి అన్ని శాఖలకు చెందిన అధికారులు హాజరు కాగా అన్ని ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై వినతి పత్రాలు సమర్పించారు. ఇంటి పట్టా, ఉద్యోగం, పక్కాగృహాలు, స్వయం ఉపాధి కోసం రుణాలు, పట్టా మార్పిడితో పాటు ఇతర సంక్షేమ పథకాల కోసం వినతులు వచ్చాయి. అనంతరం పది మంది వికలాంగులకు పింఛను మంజూరు పత్రాలు, మరో ముగ్గురు వికలాంగుల కుటుంబానికి చెందిన మహిళకు కుట్టు మిషన్‌లను అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలను అర్హులకు మాత్రమే వర్తింపజేయాలని సూచించారు. వేర్వేరు పథకాల కోసం వచ్చే ప్రజలను తరచూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా న్యాయం చేయాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు.

వివేకా హత్య కేసులో సర్పంచ్‌ని విచారించిన సీబీఐ

చక్రాయపేట: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసుకు సంబంధించి వైఎస్సార్ జిల్లా చక్రాయపేట మండలంలోని కె.ఎర్రగుడి గ్రామ సర్పంచ్ కాటినేని హరిప్రసాద్‌నాయుడును సోమవారం సీబీఐ అధికారులు విచారించారు. హైదరాబాదులోని సీబీఐ కార్యాలయానికి విచారణ నిమిత్తం రావాలని హరిప్రసాద్‌నాయుడుకు సీబీఐ అధికారులు ఆదివారం నోటీసు ఇచ్చారు. దీంతో ఆయన సోమవారం హైదరాబాద్‌లో సీబీఐ కార్యాలయానికి వెళ్లారు. సీబీఐ అధికారులు సుమారు ఐదుగంటల పాటు హరిప్రసాద్‌నాయుడును విచారించినట్లు సమాచారం. గతంలో సిట్ అధికారులు కూడా హరిప్రసాద్‌నాయుడును విచారించారు.

సుప్రీం స్టే నిరాకరించడం హర్షణీయం

960వ రోజు రిలే దీక్షల్లో బహుజన నాయకులు

తాడికొండ: పేదలకు రాజధానిలో ఇళ్ల పట్టాలిచ్చేందుకు జరుగుతున్న పనులను అడ్డుకునేందుకు కులవాదులు వేసిన తప్పుడు కేసులో స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించడం హర్షణీయమని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు సోమవారం నాటికి 960వ రోజుకు చేరాయి. పలువురు మాట్లాడుతూ.. సీఆర్డీఏకు భూములిచ్చిన తర్వాత ఆ భూములపై వారికి ఏం హక్కులు ఉంటాయని, రైతుల ముసుగులో ఉన్న టీడీపీ నాయకులు ఎందుకు కోర్టుల్లో కేసులు వేస్తున్నారో సమాధానం చెప్పాలన్నారు. సీఆర్డీఏ చట్టం ప్రకారం పేదలకు భూములిస్తే అమరావతి దొంగలకు వచ్చిన నష్టమేమిటో చెప్పాలని మండిపడ్డారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా పేదలంటే అమితమైన ప్రేమ ఉన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు పెద్దపీట వేస్తూ కులమతాలకతీతంగా అర్హత ఉన్న ప్రతి పేదవాడికి ఈ ప్రాంతంలో 50 వేలకు పైగా ఇళ్ల స్థలాలు కేటాయించడం హర్షణీయమన్నారు. క్విడ్ ప్రో కో కేసుల్లో చంద్రబాబు నివాసం ఉంటున్న లింగమనేని ఆస్తులను, మాజీ మంత్రి నారాయణ అండ్ కో ఆస్తులను అటాచ్ చేస్తూ సీఐడీ ముందుకెళ్లడం హర్షణీయమన్నారు. రాజధాని పేరుతో జరిగిన అవినీతి కేసుల్లో చంద్రబాబు, నారాయణ అండ్ కో, స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో లోకేశ్ అరెస్టు కాక తప్పదని హెచ్చరించారు.నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పెరికే వరప్రసాద్, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం, పులి దాసు, బొలిమేర శ్యామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

తెనాలి నుంచే పోటీ

స్పష్టం చేసిన నాదెండ్ల మనోహర్

కొల్లిపర: రానున్న శాసనసభ ఎన్నికల్లో మళ్లీ తెనాలి నుంచే పోటీ చేస్తానని జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. పంటలు నష్టపోయిన రైతులను పరామర్శించేందుకు సోమవారం కొల్లిపర మండలంలో పర్యటించిన మనోహర్‌ను, స్థానిక విలేకరులు ఎన్నికల్లో పోటీ విషయమై ప్రశ్నించగా పైవిధంగా సమాధానమిచ్చారు. జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ తనకు స్పష్టమైన హామీనిచ్చినట్లు చెప్పారు. మండల పరిధిలోని తూములూరు, కొల్లిపర, అత్తోట గ్రామాల్లో ఆయన పర్యటించి రైతుల సమస్యలను తెలుసుకున్నారు.

ఏపీలో స్టార్టప్‌లకు భారీ ప్రోత్సాహం

గుజరాత్ స్టార్టప్ ఫండింగ్ తరహాలో ఏర్పాటు

- కనీసం రూ.200 కోట్లతో నిధి.. స్టార్టప్‌లకు ఆర్థిక సాయం
- సక్సీడ్ ఇండోవేషన్ ఫండ్ భాగస్వామ్యం
- దేశంలో ఆరో అతి పెద్ద ఫండింగ్ కంపెనీ సక్సీడ్

విశాఖలో ఏడు స్టార్టప్‌లకు సాయానికి సంప్రదింపులు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో స్టార్టప్‌లకు భారీ ప్రోత్సాహానికి కీలక అడుగులు పడుతున్నాయి. రాష్ట్రంలోని స్టార్టప్‌లన్నింటికీ ఒకే చోట అన్ని పరిష్కారాలు లభించేలా ఏపీ స్టార్టప్ డాట్ ఇన్ పేరుతో ప్రత్యేకంగా ఒక పోర్టల్ ఏర్పాటు చేయడమే కాకుండా వాటికి అవసరమైన నిధులను సమకూర్చేవిధంగా ఇన్నోవేషన్ ఫండ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. దేశంలోనే టాప్ ఫండింగ్ కంపెనీల్లో ఒకటైన సక్సీడ్ ఇండోవేషన్ ఫండ్ రాష్ట్రంలోని స్టార్టప్‌లకు ఆర్థిక సాయం చేయడానికి ముందుకొచ్చింది. ఇందులో భాగంగా తొలి దశలో ఏడు స్టార్టప్‌లతో ప్రాథమిక చర్చలు పూర్తయ్యాయని, మరో రెండు దశల తర్వాత ఎంపికైన సంస్థలకు ఫండింగ్ మొదలవుతుందని ఐటీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఐటాప్) చైర్మన్ శ్రీధర్ కోసరాజు 'సాక్షి'కి తెలిపారు. ఏపీ స్టార్టప్స్, డీప్‌టెక్ ఇండియాలు సక్సీడ్ ఇండోవేషన్ ఫండ్ భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. గుజరాత్ రాష్ట్రంలో సుమారు రూ.1,000 కోట్లతో ఇన్నోవేషన్ ఫండ్ ఏర్పాటు చేసిన విధంగానే రాష్ట్రంలో కూడా ఏర్పాటు చేయనున్నామని, దీనికి కేంద్ర ఐటీ శాఖ మంత్రి రాజీవ్ చంద్రశేఖరన్ స్ఫూర్తినిచ్చినట్లు తెలిపారు. గుజరాత్ తరహాలోనే ప్రారంభంలో రూ.100 కోట్లతో స్టార్టప్ ఫండ్ స్టార్ట్ చేస్తే దానికి కేంద్రం నుంచి కూడా అంతేమొత్తం అందించేలా తోడ్పాటును అందిస్తానని చెప్పారన్నారు. దీంతో ఏపీ స్టార్టప్ పేరుతో ఏర్పాటు చేస్తున్న ఈ ఫండింగ్ కార్యక్రమంలో భాగస్వామ్యం కావడానికి సక్సీడ్ ఇండోవేషన్ ఫండ్ ముందుకు వచ్చిందన్నారు. ఆ సంస్థ భాగస్వాములు రమేష్ లోగనాథం, విక్రాంత్ వర్షిణి విశాఖలోని 40 మందికిపైగా హైనెట్‌వర్త్ ఇన్వెస్టర్లు, స్టార్టప్‌లతో చర్చలు జరిపినట్లు తెలిపారు. ఎంపికైన స్టార్టప్‌కు రూ.50 లక్షల నుంచి రూ. 8 కోట్ల వరకు సక్సీడ్ సమకూరుస్తుందన్నారు. ప్రారంభంలో రూ.200 కోట్లతో నిధి ఏర్పాటు చేసి, అనంతరం రూ.1,000 కోట్లకు చేర్చి స్టార్టప్ హబ్‌గా ఏపీని తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

కంచి పీఠాధిపతికి పెద్ద మర్యాద


ధ్వజస్తంభానికి మొక్కుతున్న విజయేంద్ర సరస్వతి స్వామీజీ

తిరుమల: కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామీజీకి టీటీడీ శ్రీవారి ఆలయం తరఫున సోమవారం పెద్ద మర్యాద చేశారు. ముందుగా పాత అన్నదాన భవనం వద్ద ఉన్న రావిచెట్టు వద్దకు స్వామీజీ చేరుకున్నారు. టీటీడీ అర్చక స్వాములు, అధికారులు ఇస్తికఫాల్ స్వాగతం పలికి శ్రీ బేడి ఆంజనేయస్వామివారి దర్శనం చేయించారు. అక్కడ నుంచి శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్నారు. శ్రీవారిని దర్శించుకున్నారు. స్వామీజీకి టీటీడీ ఈవో ధర్మారెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

టీడీపీ నేత హత్యకేసులో తుపాకీ విక్రేత అరెస్టు

- అలవాల గ్రామంలో 3 నెలల కిందట హత్య
- ఈ కేసులో తుపాకీ అమ్మిన రాజస్థాన్ వ్యక్తి గౌరవ్‌సింగ్ అరెస్టు
- ఇప్పటికే జైలులో ఉన్న నలుగురు నిందితులు
- వివరాలు వెల్లడించిన పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి


అక్రమ ఆయుధాలను సరఫరా చేసిన రాజస్థాన్‌కి చెందిన గౌరవ్‌సింగ్‌ను మీడియాకు చూపుతున్న సీఐ భక్తవత్సలరెడ్డి, ఇతర పోలీస్ సిబ్బంది

సాక్షి, నరసరావుపేట: పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం అలవాల గ్రామంలో జరిగిన టీడీపీ నేత వెన్నా బాలకోటిరెడ్డి హత్యకేసులో ఉపయోగించిన తుపాకీని విక్రయించిన గౌరవ్‌సింగ్‌ను నరసరావుపేట రూరల్ పోలీసులు సోమవారం ఫిరంగిపురం రైల్వేస్టేషన్‌లో అరెస్ట్ చేశారు. నరసరావుపేటలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో నిందితుడి వివరాలను ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి వెల్లడించారు. టీడీపీకి చెందిన వెన్నా బాలకోటిరెడ్డి హత్యకు పాల్పడిన అదే పార్టీ నేత పమ్మి పెద్ద వెంకటేశ్వరరెడ్డికి రాజస్థాన్‌కు చెందిన గౌరవ్‌సింగ్ అలియాస్ ప్రదీప్‌సింగ్ తుపాకీ, ఆరు బుల్లెట్లు విక్రయించినట్లు చెప్పారు. నేరచరిత్ర ఉన్న గౌరవసింగ్‌పై రాజస్థాన్‌లో పలు కేసులున్నాయని తెలిపారు. డ్యాన్సర్‌గా చలామణి అవుతున్న అతడు నరసరావుపేట వచ్చి ఇక్కడి యువతులను ప్రభావితం చేసి రాజస్థాన్‌లోని జైపూర్‌కి పంపేవాడని, అక్కడి నుంచి ఆయుధాలు తెచ్చి ఇక్కడ విక్రయించేవాడని చెప్పారు. టీడీపీ నేత వెన్నా బాలకోటిరెడ్డి అదే పార్టీకి చెందిన పమ్మి పెద్ద వెంకటేశ్వరరెడ్డి ద్వారా పెద్ద మొత్తంలో డబ్బులు ఖర్చు చేయించారని తెలిపారు. తనకు పార్టీలో తగిన గుర్తింపు ఇవ్వడం లేదన్న కోపంతో పెద్ద వెంకటేశ్వరరెడ్డి.. వెన్నా బాలకోటిరెడ్డిపై గతేడాది జూలై 19న గొడ్డలితో దాడిచేశాడని, రొంపిచర్ల పోలీసులు కేసు నమోదుచేసి జైలుకు పంపారని చెప్పారు. జైలు నుంచి బయటకు వచ్చిన తరువాత కుడా పగచల్లారక బాలకోటిరెడ్డిని చంపాలని నిర్ణయించుకున్నాడన్నారు. జైలులో పరిచయమైన ఒంటిపులి వెంకటేశ్వర్లు, పులి అంజిరెడ్డి ద్వారా గౌరవసింగ్ వద్ద తుపాకీ, బుల్లెట్లు కొనుగోలు చేశాడని తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి ఒకటో తేదీ రాత్రి 11 గంటల సమయంలో బాలకోటిరెడ్డి ఇంట్లోకి నిందితులు పమ్మి పెద్ద వెంకటేశ్వరరెడ్డి, ఒంటిపులి వెంకటేశ్వర్లు, పులి అంజిరెడ్డి, పూజల రామయ్య అక్రమంగా ప్రవేశించారని చెప్పారు. పెద్ద వెంకటేశ్వరరెడ్డి తన వద్ద ఉన్న తుపాకీతో బాలకోటిరెడ్డిని కాల్చగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 21 రోజుల తర్వాత మృతిచెందారని తెలిపారు. ఆ కేసులో ఈ నలుగురిని అరెస్టు చేసి జైలుకు పంపినట్లు చెప్పారు. ఇప్పుడు తుపాకీ విక్రయించిన గౌరవ్‌సింగ్‌ను అరెస్టు చేశామన్నారు. అతడిని అరెస్టు చేసిన నరసరావుపేట రూరల్ సీఐ భక్తవత్సలరెడ్డి, ఎస్ఐ సురేష్, హెడ్‌కానిస్టేబుల్ నారాయణ, శ్రీను, కానిస్టేబుల్ సిరాజ్‌బాషా, హోంగార్డ్ లాలూ, కృష్ణారెడ్డిలను ఎస్పీ అభినందించారు.

పెళ్లి చేసుకున్న వెంటనే ప్రేమజంట ఆత్మహత్య!

- తిరుమలలో పెళ్లి చేసుకున్న యువతీ యువకుడు
- అనంతరం మదనపల్లె సమీపాన అటవీ ప్రాంతంలో బలవన్మరణం
- మృతులు అనంతపురం జిల్లా ఉదిరిపికొండ గ్రామస్తులు



వెంకటనాయుడు, వినీషా (ఫైల్)

మదనపల్లె: ప్రేమించి పెళ్లి చేసుకున్న ఓ యువజంట... ఆ తర్వాత కొన్ని గంటల్లోనే ఆత్మహత్య చేసుకుంది. నాలుగు రోజుల తర్వాత వారి మృతదేహాలను గుర్తించారు. ఈ ఘటన వివరాలు... అనంతపురం జిల్లా కూడేరు మండలం ఉదిరిపికొండ గ్రామానికి చెందిన ముత్తులూరి వెంకటనాయుడు(28), వినీషా(17) ప్రేమించుకుంటున్నారు. వినీషా పదో తరగతిలో ఉండగానే పారిపోయి పెళ్లి చేసుకునేందుకు ప్రయత్నించారు. ఇద్దరి కులాలు వేరుకావడంతో అమ్మాయి కుటుంబ సభ్యులు కూడేరు పోలీస్‌స్టేషన్‌లో వెంకటనాయుడుపై పోక్సో, కిడ్నాప్ కేసు పెట్టారు. తర్వాత గ్రామంలో పెద్దమనుషుల సమక్షంలో జరిగిన పంచాయితీలో అమ్మాయి మేజర్ అయిన తర్వాత పెళ్లి చేసేందుకు తల్లిదండ్రులు అంగీకరించారు. అప్పటివరకు ఇద్దరు వేర్వేరుగా ఉండాలని నిర్ణయించారు. అనంతరం వెంకటనాయుడు విశాఖపట్నం వెళ్లి ఓ ఫార్మా కంపెనీలో ఉద్యోగం చేసుకుంటున్నాడు. వినీషా విజయవాడ వెళ్లి ఇంటర్ పూర్తి చేసి ఎంసెట్‌కు శిక్షణ తీసుకుంటోంది. అయితే, జాతర కోసం ఇద్దరు ఈ నెల మొదటి వారంలో తమ గ్రామానికి చేరుకున్నారు. పెద్దమనుషుల సమక్షంలో నిర్ణయించిన ఒప్పందానికి తమ తల్లిదండ్రులు అంగీకరించేలా లేరని, ఇంటి నుంచి పారిపోయి పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. తిరుమలలో పెళ్లి చేసుకునేందుకు ఈ నెల 9న వెంకటనాయుడు బైక్‌పై ఇద్దరు బయలుదేరి వెళ్లారు. తిరుమలలో పెళ్లి చేసుకుని, శ్రీవారి దర్శనం తర్వాత తిరిగి గ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యంలో ఏమైందో తెలియదు గానీ... మదనపల్లె మండలం కొత్తవారిపల్లె పంచాయతీ అబ్బిగొంది అటవీప్రాంతం వైపుగా వెళ్లి బైక్‌ను కొండ కింద నిలిపారు. కొంత దూరం అడవి లోపలికి నడిచి వెళ్లి బండకు ఆనుకుని ఉన్న చెట్టుకు వినీషా చున్నీతో ఇద్దరూ జంటగా ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. అడవికి సమీపాన నాలుగు రోజులుగా బైక్ నిలిపి ఉండటం, గాలి వీచినప్పుడల్లా కొండవైపు నుంచి దుర్వాసన వస్తుండటంతో ఆదివారం సాయంత్రం పశువులకాపరులు వెళ్లి చూశారు. ఇద్దరు ఉరివేసుకుని ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. అప్పటికే చీకటిపడటంతో సోమవారం ఉదయం మదనపల్లె తాలూకా సీఐ సత్యనారాయణ సిబ్బందితో కలిసి వెళ్లి మృతదేహాలను పరిశీలించారు. బైక్ ఆధారంగా మృతుల వివరాలను సేకరించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. జిల్లా ఆస్పత్రి వైద్యులను ఘటనాస్థలానికి తీసుకువెళ్లి శవపంచనామా, పోస్టుమార్టం నిర్వహించారు. మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పట్టాలు తప్పిన డబుల్ డెక్కర్ రైలు



గుడుపల్లె(చిత్తూరు జిల్లా): చెన్నై నుంచి బెంగళూరుకు వెళ్లే డబుల్ డెక్కర్ రైలు సోమవారం పట్టాలు తప్పింది. ఉదయం 11 గంటల సమయంలో చెన్నై నుంచి బెంగళూరుకు బయలు దేరిన ఈ రైలు ఆంధ్ర సరిహద్దు ప్రాంతమైన కర్ణాటక రాష్ట్రంలోని బిసానత్తం రైల్వే స్టేషన్ పక్కన రైలు బోగీలు కిందకు దిగిపోయాయి. దీంతో పైలెట్ గమనించి రైలును ఆపేశారు. ఈ క్రమంలో బెంగళూరుకు వెళ్లే పలు రైళ్లు ఐదు గంటలు ఆలస్యంగా నడిచాయి. సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో రైలు బోగీలను సరిచేయడంతో రైలు యథావిధిగా బెంగళూరుకు చేరుకుంది.

ముగ్గురు అధికారులపై చార్జిషీట్ ఫైల్ చేసిన డీసీఐ

డీసీఐ మాజీ ఎండీ విక్టర్ నియామకంలో అక్రమాలపై విచారణ

సాక్షి, విశాఖపట్నం: డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(డీసీఐ) మాజీ ఎండీ విక్టర్ నియామకంలో అక్రమాలకు పాల్పడిన ముగ్గురు అధికారులపై డీసీఐ మానవ వనరుల విభాగం చార్జిషీట్ దాఖలు చేసింది. డీసీఐలో జరుగుతున్న అక్రమాలపై 'సాక్షి'లో ప్రచురితమైన వరుస కథనాలపై ఆ సంస్థ స్పందించి విచారణ నిర్వహించింది. ఎండీగా విక్టర్‌ను నియమించేటప్పుడు డీసీఐ నిబంధనలేవీ పాటించలేదనే ఆరోపణలపై సుదీర్ఘంగా దర్యాప్తు చేపట్టింది. ఆయన సంస్థలో చేరినప్పటి నుంచి ఎండీగా నియమితులయ్యేంత వరకు ఎలాంటి విచారణ చేపట్టి విధులు అప్పగించారనే అంశంపై డీసీఐ హెచ్ఆర్ విభాగం దర్యాప్తు నిర్వహించింది. సాధారణంగా ఎండీని నియమించేటప్పుడు చేయాల్సిన పోలీస్ విచారణ, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, సైకో మెట్రిక్ టెస్టులు నిర్వహించలేదని దర్యాప్తులో తేలింది. అదేవిధంగా నియామక సమయంలో నిర్వహించిన కొన్ని టెస్టుల రిపోర్టులు కూడా తారుమారు చేసినట్లు గుర్తించారు. ఈ విధంగా విక్టర్ నియామకంలో అక్రమాలకు సంబంధించి మొత్తం 34 పేజీల చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ అక్రమాల్లో కీలకంగా వ్యవహరించిన మాజీ సెక్రటరీ కడియాల అశ్విని శ్రీకాంత్, హెచ్ఆర్ విభాగాధికారులు కెప్టెన్ శరవణన్, దాస్‌గుప్తాల పేర్లను చార్జిషీట్‌లో పొందుపరిచినట్లు డీసీఐ వర్గాలు వెల్లడించాయి. తదుపరి లోతైన విచారణ కొనసాగిస్తున్నట్లు సమాచారం.

రూ.65 కోట్లతో చర్మపరిశ్రమ అభివృద్ధి

- లిడ్‌క్యాప్ ప్రగతికి కార్యాచరణ
- మంత్రి మేరుగు నాగార్జున


సమీక్షిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రూ.65 కోట్లతో చర్మ పరిశ్రమ అభివృద్ధి చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగార్జున చెప్పారు. ఆయన సోమవారం రాష్ట్ర సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ చర్మ పరిశ్రమాభివృద్ధి సంస్థ (లిడ్‌క్యాప్) కార్యకలాపాలను సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో లిడ్‌క్యాప్‌కు అత్యంత విలువైన 133.74 ఎకరాల భూములున్నాయని తెలిపారు. ప్రస్తుతం ఈ భూములు, భవనాలన్నింటినీ వినియోగంలోకి తెచ్చేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. పీఎం అజయ్ పథకం కింద మంజూరైన రూ.11.50 కోట్లతో కృష్ణాజిల్లాలోని జి.కొండూరు, ప్రకాశం జిల్లాలోని యడవల్లిల్లో రెండు పాదరక్షల తయారీ (ఫుట్‌వేర్ మాన్యుఫాక్చర్) కేంద్రాలు నిర్మించనున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించిన టెండర్ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. విజయవాడ ఆటోనగర్ గేట్ వద్ద ఉన్న భూమిలో చర్మ ఉత్పత్తుల శిక్షణ, విక్రయాలకు అవసరమైన భవనాన్ని నిర్మించే ప్రతిపాదన ఉందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 9 మినీ లెదర్‌పార్కులను నిర్మించడానికి కూడా చర్యలు చేపడుతున్నామన్నారు. ఇవికాకుండా రూ.65 కోట్లతో లిడ్‌క్యాప్‌లో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో లిడ్‌క్యాప్ ఎండీ శంకర్, జీఎం నల్లమోతు అధికారి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సై మందలించాడని..

- తండ్రీ, కూతురు, ఆమె ప్రేమికుడు ఆత్మహత్యాయత్నం
- ప్రేమ విషయంలో డీఎస్పీ వద్ద నడిచిన పంచాయితీ

దర్శి: ప్రేమ వ్యవహారం ముగ్గురు ప్రాణాల మీదకు తీసుకొచ్చింది. ప్రకాశం జిల్లా దర్శిలో సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ప్రకాశం జిల్లా దర్శికి చెందిన షేక్ బాజీ (23), పోలే ఏసురాణి (19) కొంతకాలంగా ప్రేమించుకున్నారు. వీరిద్దరూ పెళ్లి చేసుకోవాలని నిశ్చయించుకుని తమ తమ ఇళ్లల్లో చెప్పగా.. కులాలు వేరు కావడం, ఇతర కారణాలతో ఇంట్లో పెద్దలు ఒప్పుకోలేదు. దీంతో బాజీ, ఏసురాణి కుటుంబీకులు పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ తరువాత స్థానిక ఎస్సై పట్టించుకోలేదని ఒంగోలు స్పందనలో ఫిర్యాదు చేయగా.. ఆ పంచాయితీ డీఎస్పీ కార్యాలయానికి చేరుకుంది. దీంతో యువతి ఫిర్యాదు మేరకు అత్యాచారం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేశారు. అనంతరం డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి బదిలీపై వెళ్లగా.. డీఎస్పీగా అశోక్ వర్ధన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. కాగా, సోమవారం సాయంత్రం ఎస్సై రామకృష్ణ ఏసురాణి ఇంటికి వెళ్లి ఆమె తండ్రిని బెదిరించాడని బంధువులు ఆరోపిస్తున్నారు. కూతురు విషయంలో పరువుపోయి బాధలో ఉన్న తనను ఎస్సై మందలించారన్న బాధతో ఏసురాణి తండ్రి కాటి అంకమ్మ పెట్రోల్ తాగి.. నెత్తిన పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. అతడిని ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఏసురాణి శానిటైజర్ తాగి ఆత్మహత్యకు యత్నించగా.. ఆమెకు దర్శి ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న ప్రేమికుడు షేక్ బాజీ పురుగు మందు తాగి ఆత్మహత్యా యత్నం చేశారు. బాజీకి దర్శి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స అందిస్తున్నారు.

బెదిరించలేదు

ఈ విషయమై ఎస్సై రామకృష్ణను వివరణ కోరగా.. ఏప్రిల్ 22వ తేదీన ఏసురాణి, ఆమె కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు షేక్ బాజీపై రేప్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని చెప్పారు. అయితే, అమ్మాయి కుటుంబ సభ్యులు తనపై దాడి చేస్తున్నారని షేక్ బాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏసురాణి ఇంటికి వెళ్లి మాట్లాడానని తెలిపారు. తాను వారినేమీ బెదిరించలేదన్నారు. డీఎస్పీ అశోక్‌వర్ధన్‌రెడ్డిని వివరణ కోరగా.. ఇరువర్గాల ఫిర్యాదులపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

విలేకరులమంటూ దోపిడీ

- చాకుతో బెదిరించి రూ.5 వేలు లాక్కెళ్లిన వైనం
- తెలుగుయువత నేత నితీష్‌కుమార్, నాగరాజు అరెస్టు


గండేపూడి నితీష్‌కుమార్, నక్కా నాగరాజు (చేతులు కట్టుకున్న వ్యక్తి)

హనుమాన్‌జంక్షన్ రూరల్ (గన్నవరం): తాము విలేకరులమని, తమకు డబ్బులివ్వాలంటూ చాకుతో బెదిరించి రూ.5 వేలు దోపిడీ చేసిన తెలుగుయువత కృష్ణాజిల్లా అధికార ప్రతినిధి గండేపూడి నితీష్‌కుమార్‌ను, అతడి స్నేహితుడు నక్కా నాగరాజును బాపులపాడు మండలం హనుమాన్‌జంక్షన్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఇప్పటికే పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న నితీష్‌కుమార్ తాజాగా విలేకరి అవతారంలో దోపిడీకి పాల్పడ్డారు. పోలీసుల కథనం మేరకు.. హనుమాన్‌జంక్షన్ – నూజివీడురోడ్డులోగల రైల్వేస్టేషన్ సమీపంలో నిర్మిస్తున్న కల్యాణ మండపం, జిమ్‌లకు ఆదివారం రాత్రి కంటైనర్ వాహనంలో సామగ్రి వచ్చింది. దిగుమతి చేసిన తర్వాత తిరిగి వెళుతున్న వాహనాన్ని అర్ధ రాత్రి రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద విలేకరులమంటూ గండేపూడి నితీష్‌కుమార్, నక్కా నాగరాజు అడ్డగించారు. వాహనం డ్రైవర్, కల్యాణ మండపం యజమాని బోడిగడ్డ మాధవరావు, ఆయన కుమారుడు రాజేష్‌ను వారిద్దరూ బెదిరించారు. తమకు డబ్బులివ్వాలంటూ దౌర్జన్యానికి దిగారు. వారు డబ్బులు ఇచ్చేందుకు నిరాకరించడంతో చాకుతో బెదిరించి, మాధవరావు జేబులోని రూ.5 వేలను బలవంతంగా లాక్కుని పరారయ్యారు. దీంతో మాధవరావు హనుమాన్‌జంక్షన్ ఎస్ఐ ఎ.డి.ఎల్.జనార్దన్‌కు ఫోన్‌చేసి సమాచారం ఇచ్చారు. ఎస్ఐ జనార్దన్ హుటాహుటిన తన సిబ్బందితో అక్కడికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సోమవారం నిందితులిద్దరిని అరెస్ట్ చేసి నూజివీడు కోర్టులో హాజరుపరిచారు. న్యాయాధికారి నిందితులకు 14 రోజుల రిమాండ్ విధించారు.

శంకరగిరి మాన్యాలు పట్టిస్తా

పోలీసులపై విరుచుకుపడ్డ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం: టీడీపీ నాయకుడు నారా లోకేశ్ పాదయాత్ర 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా నర్సీపట్నంలో నిర్వహించిన టీడీపీ ర్యాలీలో మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు పోలీసులపై విరుచుకుపడ్డారు. పోలీసులు ఒళ్లు దగ్గర పెట్టుకుని పని చేయాలని.. అతిగా వ్యవహరిస్తే తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే శంకరగిరి మాన్యాలు పట్టిస్తానని పోలీసులను హెచ్చరించారు. 'మరో ఆరు నెలల్లో చంద్రబాబు సీఎం అవటం ఖాయం. ఓవర్ యాక్షన్ చేస్తున్న పోలీసు అధికారుల జాబితా సిద్ధం చేశాం. రూ.15 కోట్ల విలువైన రంగురాళ్లు అక్రమంగా తవ్వితే పోలీసులు ఏం పీకుతున్నారు. నర్సీపట్నాన్ని గంజాయి కేంద్రంగా మార్చారు' అంటూ పోలీసుల్ని దుర్భాషలాడారు. ప్రతిపక్షాలను అణగదొక్కాలని బ్రిటిష్ కాలం నాటి జీవో నంబర్-1 తీసుకొచ్చారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పరిపాలన చేతకాదన్నారు. ఎన్ని జీవోలు తెచ్చినా తమను ఎవరూ ఆపలేరని సవాల్ చేశారు.

తెలంగాణ

ఢిల్లీలో ఈటల రాజేందర్

చేరికల అంశంపై బీజేపీ పెద్దలతో చర్చించే అవకాశం

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్ర రాజకీయ పరిణామాలు, పార్టీలో చేరికల అంశంపై చర్చించేందుకు బీజేపీ చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ సోమవారం ఢిల్లీ వచ్చారు. మంగళవారం ఆయన పలువురు బీజేపీ ముఖ్య నేతలతో భేటీ అయ్యే అవకాశాలున్నాయని తెలుస్తోంది. ముఖ్యంగా మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు సహా ఇతర నేతల చేరిక అంశంపై ఇప్పటికే ఒకమారు చర్చలు జరిపిన ఈటల, వారు పార్టీ ముందుంచిన డిమాండ్ల అంశాన్ని బీజేపీ పెద్దలతో చర్చించే అవకాశం ఉన్నట్లు సమాచారం. కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించిన నేపథ్యంలో వారిద్దరు నేతలు మరేదైనా కీలక నిర్ణయం తీసుకునేలోపై పార్టీలో చేరేలా చర్యలు తీసుకునే అంశంపై ఈటల సమాలోచనలు నిర్వహించే అవకాశాలున్నాయని చెపుతున్నారు. దీంతో పాటే ఇతర పార్టీల నేతలు కొందరు పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నా, స్థానిక రాజకీయ సమీకరణలు, జిల్లా నేతల నుంచి వస్తున్న అభ్యంతరాల నేపథ్యంలో ఏర్పడుతున్న సమస్యలపైనా ఆయన పెద్దలతో మాట్లాడే అవకాశం ఉందని తెలుస్తోంది.

తెలంగాణ

22న బీజేపీ కార్యవర్గ భేటీ

- 'పొరుగు'ఫలితాలతో కుంగవద్దు
- కేసీఆర్‌పై ప్రజావ్యతిరేకతను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్తే చాలు
- జాతీయ నేతల సలహాలు

సాక్షి, హైదరాబాద్: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతికూల ఫలితాల నేపథ్యంలో రాష్ట్రంలో తదుపరి చేపట్టాల్సిన ఎన్నికల కార్యాచరణపై చర్చించేందుకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గం సమావేశం కానుంది. ఈ నెల 22న నగర శివార్లలో జరగనున్న ఈ సమావేశానికి పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శులు తరుణ్‌చుగ్, సునీల్ బన్సల్ (రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జిలు) రానున్నారు. మరో నాలుగైదు నెలల్లోనే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న దృష్ట్యా పార్టీ పరంగా అనుసరించాల్సిన వ్యూహాలు, స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయనున్నట్లు సమాచారం. కర్ణాటకలో పార్టీకి ఎదురైన ఓటమి ప్రభావం ఎలాంటి పరిస్థితుల్లోనూ తెలంగాణపై రాజకీయంగా పడదనే భరోసాను రాష్ట్ర పార్టీకి జాతీయ నేతలు ఇవ్వనున్నట్టు తెలుస్తోంది. పొరుగు రాష్ట్రంలో వెలువడిన ఫలితాలతో కుంగిపోకుండా, రాష్ట్రంలో కేసీఆర్ సర్కార్‌పై ఉన్న వ్యతిరేకతను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంపై ప్రధానంగా నాయకత్వం దృష్టి సారించనున్నట్టు తెలిసింది.

ఢిల్లీకి పార్టీ నేతలు: ఎంపీ డా.కె.లక్ష్మణ్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్, నేతలు జి.వివేక్ వెంకటస్వామి, కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి వేర్వేరుగా ఎవరికి వారుగా సోమవారం ఢిల్లీకి చేరారు. చేరికలు, తదితర అంశాలపై చర్చకు ఈటలను జాతీయనాయకత్వం పిలిపించినట్టుగా ప్రచారం జరుగుతోంది.

న్యాయవాదికి జైలు, జరిమానా

విశాఖలో చిట్టీల పేరుతో మోసం

అల్లిపురం(విశాఖ దక్షిణ): తన తోటి న్యాయవాదుల నుంచి చిట్టీల పేరుతో లక్షలాది రూపాయలు సేకరించి, మోసగించిన న్యాయవాదికి ఏడాది పాటు కఠిన కారాగార శిక్షతో పాటు రూ.8వేల జరిమానా విధిస్తూ రెండో మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ జే పద్మావతి సోమవారం తీర్పు వెల్లడించారు. జరిమానా చెల్లించని యెడల మరో మూడు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో వెల్లడించారు. నిందితుడికి సహకరించిన అతని భార్యకు రూ.8వేల జరిమానా విధించారు. చెల్లించని యెడల ఆమెకు మూడు నెలల సాధారణ జైలు శిక్షను విధిస్తూ న్యాయమూర్తి తన తీర్పులో వెల్లడించారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మైలపల్లి ఆదినారాయణ తెలియజేసిన వివరాల ప్రకారం.. విశాఖపట్నం, మధురవాడ, బక్కన్నపాలెం, ఎఫ్‌సీఐ లేఅవుట్‌లో, దుర్గమ్మ గుడి దగ్గర గల ఫ్లాట్ నంబర్ 406, రాయల్ స్క్వేర్ అపార్ట్‌మెంట్స్‌లో నివసిస్తున్న న్యాయవాది, విశాఖ న్యాయవాదుల సంఘం మాజీ సంయుక్త కార్యదర్శి అయిన అంగర వెంకట లక్ష్మీపతిరావు, అతని భార్య అంగర లక్ష్మి 2019 సంవత్సరం నుంచి తోటి న్యాయవాదుల నుంచి చిట్టీల పేరుతో నెలకు రూ.5వేల చొప్పున డబ్బులు వసూలు చేశారు. చిట్టీ కాలం పూర్తయినా డబ్బులు ఇవ్వకుండా తాత్సారం చేయడంతో న్యాయవాది బోసుబాబు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు వెల్లడించారు.

తెలంగాణ

మా ప్రభుత్వం రాగానే ధరణిని రద్దు చేస్తాం

సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

వికారాబాద్ జిల్లా పరిగికి చేరుకున్న పీపుల్స్‌మార్చ్ యాత్ర

పరిగి: తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ధరణిని రద్దు చేస్తామని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ప్రకటించారు. రాష్ట్ర బడ్జెట్‌లో చూపించిన లక్ష కోట్ల రూపాయలు ఏమయ్యాయని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గుడిలో లింగాన్ని మింగినట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ ఆ రూ.లక్ష కోట్లు మింగారని ఆరోపించారు. భట్టి చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర సోమవారం వికారాబాద్ జిల్లా పరిగికి చేరుకుంది. ఈ సందర్భంగా తొండుపల్లి వద్ద ధర లేక రోడ్డుపై పడేసిన టమాటాను ఆయన పరిశీలించారు. రైతుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అవినీతిమయమైన రాష్ట్ర ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకే తాను పాదయాత్ర చేపట్టానని తెలిపారు. మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని రూ.5 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి దించారని దుయ్యబట్టారు. నిధులు, నీళ్లు, నియామకాల పేరిట అధికారంలోకి వచ్చిన కేసీఆర్.. తర్వాత వాటి గురించి పట్టించుకోవడం లేదని విమర్శించారు. మాట తప్పిన కేసీఆర్‌కు పాలమూరు, రంగారెడ్డి జిల్లా ప్రజల ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. కాంగ్రెస్ హయాంలో పేద ప్రజలకు లక్షల ఎకరాల భూ పంపిణీ చేశామని, కానీ ధరణి పేరిట వాటిని లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. అసైన్డ్ భూములకు శాశ్వత పట్టాలు, రెండు పడకల ఇల్లు నిర్మాణానికి రూ.5 లక్షలు, రూ.2లక్షల వరకు రుణమాఫీ, రైతుకు అన్ని రకాల సబ్సిడీలను పునరుద్ధరిస్తామని ప్రకటించారు. భూమి లేని ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ.12 వేలు అందిస్తామని, రూ.500లకే గ్యాస్ సిలిండర్, ప్రతి ఇంట్లో ఇద్దరికి పింఛన్, నిరుద్యోగులకు నాలుగు వేలు నిరుద్యోగ భృతి అందజేస్తామని హామీలు ఇచ్చారు.

అమరుల ఉసురు తగులుతుంది: గద్దర్

ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తెలంగాణ అమరవీరుల ఉసురు తగులుతుందని ప్రజాగాయకుడు గద్దర్ అన్నారు. 25 లక్షల ఎకరాల భూమిని లాక్కొని పేద ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఈసారి బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

కొత్త ఆలోచన



ఈ పార్కులు స్త్రీలకు మాత్రమే!

ఢిల్లీలో స్త్రీలకు ఉపశమనం. ఢిల్లీలోని 250 వార్డుల్లో కేవలం స్త్రీలకు మాత్రమే ప్రవేశం కల్పించే 'పింక్ పార్కు'లను ఏర్పాటు చేయనున్నారు. ఆకతాయిల వల్ల, దొంగల వల్ల పార్కులకు వెళ్లాలంటే భయపడే స్త్రీలు ఇళ్లల్లోనే మగ్గాల్సిన అవసరం లేకుండా చేసిన ఆ ఆలోచన మెచ్చుకోలు పొందుతోంది. బహుశా ప్రతి నగరంలో, పట్టణంలో ఇలాంటి పార్కులు ఉండాలేమో.

ఆడవాళ్లు ఉదయాన్నే పార్క్‌కు వెళ్లి నడవాలనుకుంటారు. వారికి సౌకర్యంగా ఉండే బట్టలు వేసుకుని నడుస్తుంటారు. కాని అలా నడిచేవారిని చూడటానికి కొందరు ఆకతాయిలు వస్తుంటారు. ఇంకేం నడక? పార్కుకు వచ్చి యోగా మ్యాట్ పరిచి ఆసనాలు వేద్దామనుకుంటారు. అటుగా వెళుతున్న మగవారు ఒక నిమిషం ఆగి చూసినా వారికి అసౌకర్యమే. ఆడవాళ్లు పార్క్‌లో పిల్లలతో ఆడుకోవాలనుకుంటారు. పక్కనే ఒక తండ్రి వచ్చి తన పిల్లలతో ఆడుకుంటూ ఉంటే వారు ఉండగలరా? పార్కుకు వచ్చి ఆడవాళ్లు అక్కడున్న జిమ్ పరికరాలతో ఏవో ప్రయత్నాలు చేయాలనుకుంటారు. మగవారు కూడా లోపల ఉంటే ఎంత ఇబ్బంది. పార్క్‌కు వచ్చిన ఆడవాళ్లు ఊరికే అలా బెంచీ మీద కూచుని పాటలు వినడమో, పుస్తకం చదువుకోవడమో చేయాలనుకున్నా కావలసిన ప్రైవసీ దొరుకుతుందా? ఇంట్లో ఇరవై నాలుగ్గంటలూ ఉండే గృహిణులు, అమ్మమ్మలు, నానమ్మలు, ఉద్యోగం చేసి అలసొచ్చిన స్త్రీలు కాస్త తెరిపిన పడాలంటే ఆహ్లాదమైన, సురక్షితమైన పబ్లిక్ ప్లేస్ ఉంటే ఎలా ఉంటుంది?

వీటన్నింటికి జవాబు 'పింక్ పార్క్'.

ఢిల్లీలో ఉన్న 250 వార్డుల్లో ప్రతి వార్డులోనూ తప్పనిసరిగా ఒక 'పింక్ పార్క్'ను ఏర్పాటు చేయాలని ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ నిర్ణయం తీసుకుంది. 'ఢిల్లీలో కార్పొరేషన్ పరిధిలో 15000 పార్కులు ఉన్నాయి. ఇవి స్త్రీలు, పురుషులు ఉపయోగించడానికి వీలుగా మెయిన్‌టెయిన్ అవుతున్నాయి. కాని వీటిలోని జిమ్‌లను కాని, వాకింగ్ ట్రాక్‌లను కాని, పిల్లల ప్లే ఏరియాలను కాని ఉపయోగించుకోవడానికి స్త్రీలు ఇబ్బంది పడటం గమనించాం. అందుకే స్త్రీలకు మాత్రమే ప్రవేశం కల్పించే పింక్ పార్క్‌లను ఏర్పాటు చేస్తున్నాం' అని కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ తెలియచేశారు.

నేరాలను దృష్టిలో పెట్టుకుని

ఢిల్లీలో నేరాలు ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం పెరుగుతూనే ఉన్నాయి. పార్కుల్లో ఆకతాయిల బెడద ఉంటుంది. పిల్లలను ఎత్తుకుని పోయేవారు కూడా ఉండొచ్చు. అందుకని చాలామంది తల్లులు భర్త తోడు లేకుండా రావడానికి సంశయిస్తుంటారు. వీరి కోసమే 'పింక్ పార్కులు' రానున్నాయి.

స్త్రీల నిర్వహణ

పింక్ పార్కులకు ప్రవేశ ద్వారాల దగ్గర మాత్రమే మగ గార్డులు ఉంటారు. లోపల పార్కు నిర్వహణకు, జిమ్‌కు, క్యాంటిన్ దగ్గర ఆడవాళ్లే పని చేస్తారు. 'పదేళ్ల లోపు మగ పిల్లలను మాత్రమే ఈ పార్కుల్లో తల్లులతో పాటు అనుమతిస్తాం' అని కార్పొరేషన్ బాధ్యులు తెలియచేశారు. సీసీ టీవీలు అడుగడుగునా ఉంటాయి. పిల్లలు ఆడుకునే చోట నిఘా ఉంటుంది. దీని వల్ల పిల్లలను ఆడుకోవడానికి వదిలి స్త్రీలు తమ వ్యాయామాలను, నడకను, జిమ్‌ను నిశ్చింతగా కొనసాగించవచ్చు. 'అన్నింటికంటే ముఖ్యం పిల్లలతో హాయిగా ఆడుకోవాలనుకునే తల్లులు బిడియం అక్కర్లేకుండా ఆడుకోవచ్చు' అంటున్నారు ఈ ఆలోచనకు బాధ్యులు.

ప్రతి ఊరిలో అవసరం

బిజీ లైఫ్‌లో స్త్రీలు కాసింత విరామాన్ని, ఆహ్లాదాన్ని కోరుకుంటే అలాంటి వారికి పింక్ పార్కులు గొప్ప ఓదార్పు అవుతాయి. పిల్లల ఆరోగ్యం కోసం, కాలక్షేపం వారిని ఆడించాలనుకునే తల్లులు కూడా వీటి వల్ల మేలు పొందుతారు. తగిన చోటు లేక కనీసం వాకింగ్ కూడా చేయలేని స్త్రీలు వీటి వల్ల చురుకుదనాన్ని, ఆరోగ్యాన్ని పొందే వీలుంటుంది. ఇన్నీ ప్రయోజనాలున్న ఆలోచనను ప్రతి రాష్ట్రంలో ప్రతిపాదించవచ్చు. స్త్రీలు విన్నవిస్తే ప్రభుత్వాలు వింటాయి కూడా. త్వరలో అన్ని ఊళ్లలో ఇలాంటి పార్క్‌లు రావాలని ఆశిద్దాం.

బ్యూటిప్

పాలు... కొబ్బరి... తేనె

ఒక గిన్నెలో రెండు టీ స్పూన్ల పాలు, టేబుల్ స్పూన్ పచ్చికొబ్బరి తురుము, టీ స్పూన్ తేనె కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసి, సున్నితంగా మసాజ్ చేయాలి. పది నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రపరుచుకోవాలి. ఇలా రోజుకు ఒక సారి చేస్తూ ఉంటే పొడిబారిన చర్మం మృదువుగా మారుతుంది.



సేవాపథం

జలకళ తీసుకువచ్చింది

బ్యాంకింగ్ రంగంలో క్షణం తీరిక లేని పనుల్లో ఉండేది వేదిక భండార్కర్. ఆ ఊపిరి సలపని పనుల్లో ఆమెకు కాస్త ఉపశమనం సామాజికసేవ. బ్యాంకింగ్ రంగాన్ని వదిలి సామాజికసేవా రంగం దారిని ఎంచుకున్న వేదిక... 'సామాజిక సేవ మనకు వినయాన్ని నేర్పుతుంది. మనసులో నుంచి మానవత్వ భావన పోకుండా కాపాడుతుంది. మరిన్ని మంచి పనులు చేయాలనే ఉత్సాహాన్ని ఎప్పుడూ ఇస్తుంది' అంటోంది...



● వేదిక భండార్కర్

'సామాజిక సేవారంగంలో పనిచేస్తానని కలలో కూడా అనుకోలేదు' అంటుంది ముంబైకి చెందిన వేదిక భండార్కర్.

'స్టార్ బ్యాంకర్'గా పేరు తెచ్చుకున్న వేదిక జేపీ మోర్గాన్‌లో ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ హెడ్‌గా పనిచేసింది. ఆ తరువాత మరో కంపెనీలో వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ హోదాలో పనిచేసింది.

తన వృత్తిపనుల్లో తలమునకలయ్యే వేదిక తొలిసారిగా ముంబైలోని 'జై వకీల్ ఫౌండేషన్'తో కలిసి పనిచేసింది. ఆ తరువాత 'దస్రా' అనే స్వచ్ఛందసంస్థతో కలిసి జార్ఖండ్, బిహార్ గ్రామీణ ప్రాంతాలలో మహిళలు, బాలికల విద్య, ఆరోగ్యానికి సంబంధించిన కార్యక్రమాల్లో పాల్గొంది.

'అపుడప్పుడు' అన్నట్లుగా ఉండే ఆమె సామాజికసేవలు ఆతరువాత నిత్యకృత్యం అయ్యాయి.

అలాంటి సమయంలోనే తమ సంస్థకు ఇండియాలో సారథ్యం వహించమని 'వాటర్.ఆర్గ్' నుంచి పిలుపు వచ్చింది.

మిస్సోరీ (యూఎస్) కేంద్రంగా పనిచేసే స్వచ్ఛందసంస్థ 'వాటర్.ఆర్గ్' సురక్షిత నీరు, జలసంరక్షణ, పారిశుద్ధ్యంకు సంబంధించి ఎన్నో దేశాల్లో పనిచేస్తోంది.

ఆ సంస్థ నుంచి ఆహ్వానం అందినప్పుడు నిరాకరించడానికి వేదికకు ఏ కారణం కనిపించలేదు. ఒప్పుకోవడానికి మాత్రం చాలా కారణాలు కనిపించాయి. అందులో ప్రధానమైనది... 'పేదప్రజలకు సేవ చేసే అవకాశం దొరుకుతుంది'

'వాటర్.ఆర్గ్' సారథ్య బాధ్యతలు చేపట్టే ముందు నీటి సంక్షోభం గురించి లోతుగా అధ్యయనం చేసింది వేదిక.

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూ హెచ్ వో) గణాంకాల ప్రకారం సురక్షితమైన నీటి సౌకర్యానికి నోచుకోని ప్రజలు కోట్లలో ఉన్నారు. నీటి కోసం అష్టకష్టాలు పడుతున్నారు మహిళలు. నీటి కోసం గంటల కొద్దీ సమయాన్ని వెచ్చించక తప్పని పరిస్థితుల వల్ల ఆ సమయాన్ని ఇతర ప్రయోజనకర పనులకోసం కేటాయించలేకపోతున్నారు.

'మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రధానంగా దృష్టి పెడతాను' అంటున్న వేదిక ఆ సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తోంది.

మరుగుదొడ్లు నిర్మించుకోవడం నుంచి వాటర్ కనెక్షన్‌లు ఏర్పాటు చేసుకోవడం వరకు 'వాటర్.ఆర్గ్' ద్వారా సహాయపడుతోంది.

ఒకసారి క్షేత్రపర్యటనలో భాగంగా కర్ణాటకలోని ఒక గ్రామానికి వెళ్లింది వేదిక.

ఒక మహిళ తన పదకొండు సంవత్సరాల కూతురు గురించి చెప్పింది. ఆ అమ్మాయి చదువుకోడానికి వేరే ఊళ్లో బంధువుల ఇంట్లో ఉంటుంది. అయితే బడికి సెలవులు వచ్చినా ఆ అమ్మాయి ఇంటికి రావడానికి మాత్రం ఇష్టపడడం లేదు. దీనికి కారణం వారి ఇంట్లో టాయిలెట్ సౌకర్యం లేకపోవడం. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఆ మహిళ టాయిలెట్ నిర్మించుకోవడానికి సహకరించింది వేదిక.

ఆ గృహిణి కళ్లలో కనిపించిన మెరుపును దగ్గర నుంచి చూసింది.

'బ్యాంకర్‌గా క్లయింట్స్ ఆదాయం ఒక స్థాయి నుంచి మరో స్థాయి పెరగడానికి కృషి చేశాను. ఇప్పుడు...తమకున్న వనరులతోనే సౌకర్యవంతమైన జీవితం ఎలా గడపవచ్చు అనే విషయంలో సామాన్య ప్రజలతో కలిసి పనిచేస్తున్నాను' అంటుంది వేదిక.

ఒకప్పుడు 'స్టార్ బ్యాంకర్'గా బ్యాంకింగ్ రంగంలో ఎన్నో విజయాలు సాధించిన వేదిక భండార్కర్ ఇప్పుడు 'నీటిని మించిన అత్యున్నత పెట్టుబడి ఏదీ లేదు' అంటూ జలసంరక్షణపై ఊరూరా ప్రచారం చేస్తోంది.

సాగుబడి

కృత్తిక కార్తె : మే 24 వరకు
రోహిణీ కార్తె : మే 25 నుంచి

కూరగాయలతో పాటే పుట్టగొడుగులు, కోళ్లు

● సమీకృత వర్టికల్ సిస్టమ్‌కు శాస్త్రవేత్తల రూపకల్పన

భువనేశ్వర్‌లోని కేంద్రీయ మహిళా రైతుల పరిశోధనా సంస్థ (సిఐడబ్ల్యుఎ- ఐసిఏఆర్ అనుబంధం) శాస్త్రవేత్తల బృందం భూమి లేని నిరుపేద మహిళల ఇంటిపంటల సాగుకు ఊతమిచ్చే 'ఇంటిగ్రేటెడ్ వర్టికల్ న్యూట్రి–ఫార్మింగ్ సిస్టమ్'ను రూపొందించింది. బహుళ అంతస్తుల ఐరన్ స్ట్రక్చర్ ఇది. పెరట్లో తక్కువ స్థలంలోనే పైన కూరగాయలు, మధ్యలో పుట్టగొడుగులు, కింద నాటు కోళ్ల పెంపకానికి ఉపయోగపడే విధంగా దీన్ని రూపొందించారు.

డా. తానియా సేథ్, డా. అరుణ్ కుమార్ పండా, చైత్రాలి శంషాక్ మాత్రే సిఐడబ్ల్యుఎ శాస్త్రవేత్తల బృందం బహుళ ప్రయోజనాలను అందించే ఈ వినూత్న స్ట్రక్చర్‌ను ఆవిష్కరించారు. భూమి లేని నిరుపేద కుటుంబాలకు దీన్ని అందిస్తే ఆ కుటుంబం తీసుకునే ఆహారంలో వైవిధ్యత పెరుగుతుంది. పెరట్లో తక్కువ స్థలం ఉన్నా దీన్ని ఏర్పాటు చేసుకోవచ్చు. ఏడాది పొడవునా సేంద్రియ కూరగాయలు, పుట్టగొడుగులు, గుడ్లు, కోడిమాంసం అందుబాటులో ఉంటాయి. ఈ పేద కుటుంబాలు వీటిని ఉపయోగించడంతో పాటు ఎంతో కొంత అదనపు ఆదాయం కూడా సమకూరుతుందని ఆశిస్తున్నారు. మహిళలు, పిల్లల పౌష్టికాహార లోపాన్ని తగ్గించడానికి ఈ న్యూట్రి–ఫార్మింగ్ సిస్టం పనికొస్తుందని వారు అంటున్నారు. ఇనుముతో దీన్ని తయారు చేయడానికి రూ. 30 వేల వరకు ఖర్చవుతుందని డా. తానియా 'సాక్షి సాగుబడి'తో చెప్పారు. ఈ టెక్నాలజీని సిఐడబ్ల్యుఎ నుంచి ఎవరైనా కొనుగోలు చేసి, ఈ స్ట్రక్చర్లను తయారు చేసి విక్రయించవచ్చు. ఇప్పటికే గుజరాత్ వల్సాద్‌లోని సెంట్రిఫ్యూగల్ ప్రొడక్ట్స్, లక్నోలోని తనగర్ సంస్థలకు టెక్నాలజీని ఇప్పటికే విక్రయించామని ఆమె అన్నారు. టెక్నాలజీని పొందడానికి లైసెన్స్ ఫీజుగా రైతులకు రూ. 11వేలు+ జిఎస్టీ. వ్యాపారులకు రూ. 20 వేలు+జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుందని డా. తానియా వివరించారు. **వివరాలకు.. 06742387940. director.ciwa@icar.gov.in**

దేశీ వరి పరిరక్షకులకు శిక్షణ

దేశీ వరి విత్తనాలు మన వ్యవసాయక సమాజపు అమూల్యమూన వారసత్వ సంపద. 25 ఏళ్లుగా 1,440 దేశీ వరి వంగడాలను జన్యుస్వచ్ఛత ఏ విధంగానూ కోల్పోకుండా ప్రతి ఏటా సాగు చేస్తూ, వీటిలో చాలా రకాలను రైతులకు ఉచితంగా పంచిపెడుతూ కంటికి కాపాడుతున్న సుప్రసిద్ధ విత్తన సంరక్షణ ఉద్యమకారుడు, ప్రపంచ ప్రసిద్ధ శాస్త్రవేత్త డా. దేబల్ దేవ్ వృద్ధాప్యం కారణంగా ఈ గురుతర బాధ్యతలను నిబద్ధత కలిగిన దేశీ విత్తన సంరక్షకులు ఎవరైనా ఉంటే వారికి బదలాయించాలని నిర్ణయించుకున్నారు. 1997లో 'బసుధ' పేరిట పరిశోధన ప్రయోగశాలను, 'వ్రిహి' పేరిట విత్తన బ్యాంకు బాధ్యతలను ఆయన చేపట్టారు. ప్రభుత్వేతర నిధుల ద్వారానే నిర్వహిస్తున్నారు. పశ్చిమబెంగాల్‌లో ప్రారంభించిన దేశీ వరి వంగడాల పరిరక్షణ ఉద్యమ కేంద్రాన్ని 2011లో ఒడిషాలోని రాయగడ జిల్లాలో కుగ్రామానికి డా. దేబల్ దేవ్ మార్చారు. ప్రతి వరి వంగడానికి 56 వ్యవసాయ సంబంధమైన విశిష్ట గుణాలుంటాయి. 4 రసాయనిక గుణాలు ఉంటాయని ఆయన చెబుతారు. పూత కాలంలో పరపరాగ సంపర్కం ద్వారా 82% మేరకు వరి వంగడాలు స్వచ్ఛతను కోల్పోయే అవకాశం ఉంటుంది. అందుకని, ఒకేసారి పూతకు వచ్చే రకాలను దగ్గర్లో సాగు చేయకూడదు. విత్తనాలు కూడా భౌతికంగా కలిసిపోకుండా చూడాలి. ఈ పరిరక్షణ కృషి ఎంతో కష్టంతో కూడుకున్నది. కేవలం ముగ్గురు సిబ్బందితో ఇన్నాళ్లూ ఏటేటా వీటిని కల్తీ జరగకుండా సాగు చేస్తూ, గుణగణాలను స్వీయ ప్రయోగశాలలో పరీక్షించి చూస్తూ స్వచ్ఛతను ఆయన కాపాడుతూ వస్తున్నారు. ఆసియాలో ఇలాంటి బృహత్తర పని చేస్తున్న మరో స్వచ్ఛంద సంస్థ లేదని డా. దేబల్ దేవ్ తెలిపారు. 11 రాష్ట్రాల్లో సుమారు 7 వేల మంది రైతులకు 860 రకాల దేశీ వరి రకాలను వ్రిహి సీడ్ బ్యాంక్ ద్వారా పంపిణీ చేశారు. ఈ ఏడాది తీసుకున్న విత్తనానికి రెట్టింపు విత్తనం రైతులు తిరిగి ఇవ్వాలి. అంతే. విత్తనం ఎవరికీ అమ్మకూడదు. విత్తన వ్యాపారం సంస్థలకు ఇవ్వకూడదు. ఇదీ డా. దేబల్ దేవ్ సిద్ధాంతం.



● డా. దేబల్ దేవ్

విత్తన పరిరక్షణపై ఆసక్తి ఉన్న 182 మందికి గత 20 ఏళ్లలో డా. దేబల్ దేవ్ శిక్షణ ఇచ్చి, విశిష్టమైన వంగడాలను వారికి ఇచ్చారు. అయితే, ఆరుగురు మాత్రమే కొన్ని రకాలను త్రికరణ శుద్ధితో పరిరక్షిస్తున్నారని ఆయన తెలిపారు. వయోభారం వల్ల ఈ పరిరక్షణ బాధ్యతను కొనసాగించలేనని, ఆసక్తి గల కొత్త వారు ఎవరైనా ఉంటే 12 మందిని లేదా స్వచ్ఛంద సంస్థలను ఎంపిక చేసి వచ్చే జూలై నుంచి శిక్షణ ఇస్తానన్నారు. వారు తలా ఒక 100 రకాలను పరిక్షించాల్సి ఉంటుందన్నారు. స్వచ్ఛతను కాపాడుతూ ప్రతి ఏటా సాగు చేస్తూ రైతులకు ఉచితంగా పంచాల్సి ఉంటుంది. ఆసక్తి గల వారెవరైనా ఉంటే డా. దేబల్ దేవ్‌ను మెయిల్ ద్వారా సంప్రదించవచ్చు. జూన్ 30లోగా ఎవరూ యోగ్యులు దొరక్క పోతే వ్రిహి విత్తన బ్యాంకు మూతపడుతుందని, దేశీ వరి వంగడాలు మాత్రం కలకాలం నిలుస్తాయని ఆయన తెలిపారు.
basudha.lab@gmail.com

■ ఎంబీఏ చదివి పాడి రైతుగా రాణిస్తున్న యువ రైతు **అప్పలనాయుడు**

■ 40 ఎకరాల కౌలు భూమిలో ఆధునిక పశుగ్రాసాల సాగు

■ పాడికి తోడుగా సైలేజీ గడ్డి విక్రయం ద్వారా ఏడాది పొడవునా ఆదాయం

కౌలు సేద్యంలో గెలిచాడు!



● అప్పలనాయుడు మినీ డెయిరీ

పాడి పరిశ్రమ నిర్వహణలో మేటిగా పురస్కారాలు అందుకుంటున్న ఆళ్ల అప్పలనాయుడు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఎంబీఏ చదివినా ఉద్యోగం కోసం ఎదురు చూడకుండా పాడి పరిశ్రమనే నమ్ముకొని అభివృద్ధి సాధిస్తూ విజయాన్ని తన సొంతం చేసుకున్నారు. శ్రద్ధగా చేస్తే పాడి పరిశ్రమ కౌలు రైతులకు కూడా లాభదాయకంగా ఉంటుందనడానికి చక్కని ఉదాహరణ అప్పలనాయుడు సోదరుల వ్యవసాయం నిలుస్తుంది. అనకాపల్లి జిల్లా కశింకోట మండల కేంద్రానికి చెందిన వ్యవసాయ కుటుంబంలో పుట్టిన అప్పలనాయుడు ఎంబీఎ చదివారు. ఉద్యోగం పట్ల ఆసక్తి చూపలేదు. మరొకరి కింద పని చేయడం సుతరాం ఇష్టపడలేదంటారాయన. 2008లో పశు సంవర్థక శాఖ ద్వారా పశు క్రాంతి పథకం కింద (సగం రాయితీపై) రూ.75 వేల రుణం పొంది, 2 పాడి ఆవులు కొనుగోలు చేసి పాడి రైతుగా స్వయంకృషితో జీవనాన్ని ప్రారంభించారు. ఏ పని చేసినా దీక్షగా చేసే అలవాటున్న అప్పలనాయుడు సత్ఫలితాలు సాధిస్తూ పురోగమించారు. 2012లో పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో 30 శాతం రాయితీపై మినీ డెయిరీ పథకానికి రూ.5 లక్షల రుణం మంజూరైంది. పది పాడి ఆవులను కొనుగోలు చేసి తన సొంత స్థలం అరెకరంలో మినీ డెయిరీ ఏర్పాటు చేశారు. సోదరులు శివ కృష్ణ, సత్తిబాబుల సహకారంతో పాలను విక్రయిస్తున్నారు. క్రమేపీ అనుభవం గడిస్తూ పాడి రైతుగా సమృద్ధి సాధించారు. ఇప్పుడు ఆయన డెయిరీ ఫాంలో 52 ఆవులు ఉన్నాయి. రోజుకు 220 లీటర్ల పాలు ఉత్పత్తి చేసి విక్రయిస్తున్నారు.

కౌలు రైతుల పశుగ్రాసం సాగుకు 'ఉపాధి' పథకం వర్తింపజెయ్యాలి



● విజయవాడలో సీకె రావు ఎండోమెంటు ట్రస్టు బంగారు పతకాన్ని మంత్రి అప్పలరాజు నుంచి అందుకుంటున్న అప్పలనాయుడు

ఎంబీఎ చదివినా వ్యవసాయ రంగంలో స్వయం ఉపాధి పొందాలని నిర్ణయించుకొని లాభదాయకమైన పాడి అభివృద్ధిపై దృష్టి పెట్టి విజయం వైపు పయనిస్తున్నాను. పది మందికి ఉపాధి కల్పిస్తున్నానన్న సంతృప్తి ఉంది. పాడి ఆవులతో డెయిరీ నిర్వహణ, పాతర గడ్డి తయారీ, మేలు జాతి గడ్డి రకాల పెంపకం చాలా లాభదాయకంగా ఉంది. నెలకు వీటి ద్వారా సుమారు రూ.60 వేల వరకు ఆదాయం సమకూరుతుంది. పురస్కారాలు అందుకోవడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోంది. పాడి పరిశ్రమ అభివృద్ధికి మున్ముందు మరింత కృషి చేస్తాను. కౌలు రైతుల పశుగ్రాసం సాగుకు ఉపాధి పథకం వర్తింపజేయటం ద్వారాప్రభుత్వం సహాయం అందిస్తే మరింత ప్రోత్సాహకంగా ఉంటుంది. పాడి పరిశ్రమపై మక్కువ ఉన్న యువతకు, రైతులకు శిక్షణతో పాటు ఆర్థిక సహాయం అందించి పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం దోహదపడాలి.



- ఆళ్ల అప్పలనాయుడు,
అభ్యుదయ పాడి రైతు, కశింకోట, అనకాపల్లి జిల్లా


పాతర గడ్డి ఉత్పత్తి ఇలా...

పశు పోషణకు, పాల ఉత్పత్తిని పెంపొందించడానికి ఉపయోగపడే నాణ్యమైన పాతర గడ్డి తయారీపై అప్పలనాయుడు సోదరులు దృష్టి సారించారు. 2018లో రూ. కోటి పెట్టుబడితో శిలపరశెట్టి చిట్టెమ్మ భాగస్వామ్యంతో సైలేజ్ యంత్రం (పాతర గడ్డి తయారీ యంత్రం) కొనుగోలు చేశారు. పశు సంవర్థక శాఖ 50% రాయితీ కల్పించింది. మొక్కజొన్న పంట విత్తిన 75 రోజులు దాటాక పాలకంకి స్థాయి (మొక్కజొన్న పొత్తులు గోరు గిల్లితే పాలు వచ్చే దశ)లో ఉన్నప్పుడు మొక్కజొన్న కర్రలను ముక్కలుగా కట్ చేస్తారు. ఆధునిక పాతర గడ్డి యంత్రం ద్వారా నిల్వ కోసం అనుమతించిన మందులు కలిపి గుండ్రటి బేళ్లుగా తయారు చేస్తారు. ఇవి 21 రోజుల తర్వాత అమ్మకానికి సిద్ధమవుతాయి. తక్కువ ధరపై కిలో 6.50కు పాడి రైతులకు అందుబాటులో ఉంచుతారు. ఈ పాతర గడ్డి ఏడాది వరకూ నిల్వ ఉంటుంది.



● సైలేజ్ యంత్రంతో తయారు చేసిన పాతర గడ్డి

వేసవి కాలంలో పచ్చిగడ్డి అందుబాటులో లేనప్పుడు, ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు గ్రాసం కొరత రాకుండా పాతర గడ్డి ఉపయోగపడుతుంది. ఒక్కొక్క పాడి పశువుకు రోజుకి 30 కిలోల వరకు పాతర గడ్డి అవసరం అవుతుంది. ఒక పాడి గేదెకు పాతర గడ్డి మేపితే రూ.210 ఖర్చుతో సరిపోతుంది. ఇది ఉంటే దాణా కూడా వేయాల్సిన పని ఉండదు. రోజుకు ఐదు కిలోల దాణాకు అయ్యే రూ.150 ఖర్చు కూడా తగ్గుతుంది. ఈ గడ్డి వల్ల అధిక పాల దిగుబడి వస్తుంది. పాతర గడ్డిని అప్పలనాయుడు స్థానికంగానే కాకుండా ఇతర ప్రాంతాలకు సరఫరా చేసి ఆదాయాన్ని సంపాదిస్తూ ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. ఆయన డెయిరీ ఫాంలో పశుపోషణ, గడ్డి పెంపకం, పాతర గడ్డి తయారీ పనుల్లో రోజూ పది మంది వరకు ఉపాధి పొందుతున్నారు.



● సాగులో ఆధునిక నేపియర్ గడ్డి

40 ఎకరాల్లో పశు గ్రాసం సాగు

40 ఎకరాల భూమిని లీజుకు తీసుకొని అప్పలనాయుడు మేలు రకాల పచ్చగడ్డి పెంపకాన్ని చేపట్టారు. పాతర గడ్డి తయారీ కోసం మొక్కజొన్నతో పాటు బహుళజాతి, ఆధునిక మేలు జాతి పశుగ్రాసాలు పెంచుతున్నారు. సూపర్ నేపియర్, కొంబో నేపియర్, రెడ్ నేపియర్, 4జి బుల్లెట్ నేపియర్, స్మార్టు నేపియర్ వంటి రకాల గ్రాసం పెంచి సొంతానికి వాడుకోగా మిగిలిన గ్రాసాన్ని రైతులకు టన్ను రూ. 2500కు విక్రయిస్తున్నారు. గడ్డి రకాల పెంపకానికి రైతులకు విత్తన కర్రలు (ముచ్చులు) తక్కువ ధరకు అందుబాటులో ఉంచుతున్నారు.

ఆధునిక పాడి పరిశ్రమ అభివృద్ధికి విశేష సేవలందిస్తున్నందుకు గుర్తింపుగా అప్పలనాయుడుకు రెండుసార్లు ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో ప్రభుత్వ పురస్కారాలు దక్కాయి. డా.సీకె రావు ఎండోమెంటు ట్రస్టు తరఫున గత నెలలో విజయవాడలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర పశు సంవర్థక శాఖ మంత్రి చిదిరి అప్పలరాజు చేతుల మీదుగా ఉత్తమ పాడి రైతు బంగారు పతకం, జ్ఞాపికతోపాటు ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. 2019లో పద్మశ్రీ డాక్టర్ ఐవి సుబ్బారావు 'రైతు నేస్తం' పురస్కారాన్ని హైదరాబాద్‌లో అప్పటి ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యానాయుడు, గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చేతుల మీదుగా అందుకున్నారు. ప్రస్తుతం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సభ్యునిగా కొనసాగుతున్నారు.

- వేగి రామచంద్రరావు,
సాక్షి, కశింకోట, అనకాపల్లి జిల్లా

నిర్వహణ:
పంతంగి రాంబాబు,
సాగుబడి డెస్క్



ప్రిక్వార్టర్ ఫైనల్లో బోపన్న జోడీ ఓటమి

ఇటాలియన్ మాస్టర్స్ సిరీస్ టెన్నిస్ టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ పోరాటం ముగిసింది. రోమ్‌లో సోమవారం జరిగిన పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో బోపన్న-ఎబ్డెన్ ద్వయం 6-2, 6-7 (8/10), 10-12తో డిమినార్-కుబ్లర్ (ఆస్ట్రేలియా) జోడీ చేతిలో ఓడిపోయింది. గంటా 50 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సూపర్ టైబ్రేక్‌లో బోపన ద్వయం ఒక మ్యాచ్ పాయింట్ చేజార్చుకుంది. బోపన్న జోడీకి 29,300 యూరోల (రూ. 26 లక్షల 22 వేలు) ప్రైజ్‌మనీ లభించింది.

నితీశ్ రాణాపై రూ. 24 లక్షల జరిమానా



చెన్నై సూపర్‌కింగ్స్‌తో ఆదివారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు కెప్టెన్ నితీశ్ రాణాపై రూ. 24 లక్షలు జరిమానా విధించారు. ఈ సీజన్‌లో కోల్‌కతా జట్టు స్లో ఓవర్‌రేట్ నమోదు చేయడం ఇది రెండో సారి. స్లో ఓవర్ రేట్‌తో ఈ సీజన్‌లో హార్దిక్ పాండ్యా (గుజరాత్), విరాట్ కోహ్లి, డు ప్లెసిస్ (బెంగళూరు), సంజూ సామ్సన్ (రాజస్తాన్), సూర్యకుమార్ యాదవ్ (ముంబై), కేఎల్ రాహుల్ (లక్నో), వార్నర్ (ఢిల్లీ)లపై కూడా జరిమానా పడింది.

'సాఫ్ట్ సిగ్నల్'కు కాలం చెల్లింది

క్రికెట్‌లో ఇం'కొన్ని' మార్పులు



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తరుచూ వివాదాస్పదమవుతున్న నిర్ణయాలను సవరించింది. సాఫ్ట్ సిగ్నల్, ఫ్రీ హిట్‌కు బౌల్డయితే పరుగులపై స్పష్టతనిచ్చింది. పేస్ బౌలింగ్‌ను ఎదుర్కొనే బ్యాటర్ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిందే! ఇకపై తన ఇష్టానికి వదిలేయరు. ఇది ఐసీసీ కొత్త రూల్!

సాఫ్ట్ సిగ్నల్: సాధారణంగా క్యాచ్‌లు పట్టినపుడు తీసుకునే నిర్ణయాలు. బౌండరీకి దగ్గరో, లేదంటే బంతి నేలను తాకినట్లు పట్టిన క్యాచ్‌లు వివాదాస్పదమవుతాయి. ఫీల్డ్ అంపైర్ తొలుత అవుటిచ్చినా... దాన్ని మళ్లీ టీవీ (థర్డ్) అంపైర్‌కు నివేదిస్తారు. కానీ మళ్లీ సాఫ్ట్ సిగ్నల్ ప్రకారం అవుటనే ప్రకటిస్తారు. ఇప్పుడు 'సాఫ్ట్'కు కాలం చెల్లింది. టీవీ అంపైర్‌దే తుది నిర్ణయమవుతుంది. దీంతో ఫీల్డ్ అంపైర్‌కు ఇది మరో కోతలాంటిది!

ఫ్రీ హిట్‌కు బౌల్డయితే: ఫ్రీ హిట్‌కు బౌల్డయితే బ్యాటర్ తీసిన పరుగులు చట్టబద్ధమే! ఇందులో ఎలాంటి వివాదానికి తావులేదని ఐసీసీ కమిటీ ప్రకటించింది. అయితే ఇలా తీసిన పరుగులు ఎక్స్‌ట్రాల కోటలో జమకావు. బ్యాటర్స్ ఖాతాలోకి వెళ్తాయి. గత టి20 ప్రపంచకప్‌లో భారత్, పాక్‌ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కోహ్లి ఫ్రీ హిట్‌కు బౌల్డయి మూడు పరుగులు రాబట్టాడు. పాక్ క్రికెటర్లు గగ్గోలు పెడితే అంపైర్లు నియమావళిని వివరించినా... చాన్నాళ్లు దీనిపై చర్చ నడిచింది!

హెల్మెట్ ఐచ్ఛికం కాదు... కచ్చితం: పేసర్లు బౌలింగ్‌కు దిగితే బ్యాటర్లు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిందే. అలాగే బ్యాటర్లకు చేరువగా మోహరించిన ఫీల్డర్లు సైతం హెల్మెట్ పెట్టుకోవాలి.

'మా నిరసన ఎల్లలు దాటిస్తాం'



న్యూఢిల్లీ: లైంగిక వేధింపులకు పాల్పడిన భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ సింగ్‌ను అరెస్టు చేయకపోతే తాము చేపట్టిన నిరసన దీక్షను అంతర్జాతీయ సమాజం దృష్టికి తీసుకెళ్తామని స్టార్ రెజ్లర్లు బజరంగ్, వినేశ్ ఫొగాట్, సాక్షి మలిక్ హెచ్చరించారు. 'మా నిరసనను ఎల్లలు దాటిస్తాం. అంతర్జాతీయ క్రీడాకారులు, ఒలింపియన్ల మద్దతు కోరతాం. విదేశీ ఆటగాళ్లు కూడా ఇందులో గళం విప్పేలా ప్రణాళికతో ముందుకెళ్తాం' అని వినేశ్ తెలిపారు.

టైటాన్స్ క్వాలిఫై... సన్‌రైజర్స్ అవుట్

ఐపీఎల్–2023లో హైదరాబాద్ టీమ్ సన్‌రైజర్స్ ఆట ముగిసింది. 2021, 2022లలో 'ప్లే ఆఫ్స్'కు అర్హత సాధించలేకపోయిన జట్టు వరుసగా మూడో ఏడాదీ విఫల ప్రదర్శనతో ముందంజ వేసే అవకాశాలు కోల్పోయింది. గుజరాత్ టైటాన్స్ చేతిలో తాజా ఓటమితో జట్టు అధికారికంగా రేసు నుంచి నిష్క్రమించింది. ఈ గెలుపుతో డిఫెండింగ్ చాంపియన్ టైటాన్స్ అందరికంటే ముందుగా ప్లే ఆఫ్స్ చేరడంతో పాటు టాప్–2లో చోటును ఖాయం చేసుకుంది.

- 'ప్లే ఆఫ్స్'కు గుజరాత్
- నిష్క్రమించిన హైదరాబాద్
- 34 పరుగులతో టైటాన్స్ విజయం



గిల్

అహ్మదాబాద్: ఐపీఎల్‌లో మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే హైదరాబాద్ ప్లే ఆఫ్స్‌కు దూరమైంది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ 34 పరుగుల తేడాతో సన్‌రైజర్స్‌పై విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 188 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' శుబ్‌మన్ గిల్ (58 బంతుల్లో 101; 13 ఫోర్లు, 1 సిక్స్) ఐపీఎల్‌లో తన తొలి సెంచరీ సాధించగా, సాయి సుదర్శన్ (36 బంతుల్లో 47; 6 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. వీరిద్దరు 84 బంతుల్లో 147 పరుగులు జోడించగా, భువనేశ్వర్ (5/30) ఐదు వికెట్లతో రాణించాడు. గజరాత్ జట్టు 40 పరుగుల వ్యవధిలో ఆ జట్టు 8 వికెట్లు చేజార్చుకుంది. భువీ వేసిన ఆఖరి ఓవర్లోనే 4 వికెట్లు కోల్పోయింది. ఇందులో ఒక రనౌట్ కూడా ఉంది. అనంతరం సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 154 పరుగులు చేసింది. హెన్రిచ్ క్లాసెన్ (44 బంతుల్లో 64; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించగా... షమీ, మోహిత్ శర్మ చెరో 4 వికెట్లు తీశారు. క్యాన్సర్ నివారణపై అవగాహన కల్పించే ప్రచార కార్యక్రమంలో భాగంగా గుజరాత్ ఆటగాళ్లు ఈ మ్యాచ్‌లో 'లావెండర్' రంగు జెర్సీలు ధరించారు. ఛేదనలో రైజర్స్ ఏమాత్రం పోరాటం కనబర్చలేకపోయింది. క్లాసెన్ మినహా ఇతర ఆటగాళ్లు కనీస స్థాయి ప్రదర్శన కూడా చూపలేదు. తొలి 6 ఓవర్ల లోనే 4 వికెట్లు కోల్పోయిన సన్‌రైజర్స్ జట్టు తర్వాతి మూడు ఓవర్లలో మరో మూడు వికెట్లు చేజార్చుకొని విజయంపై ఆశలు కోల్పోయింది.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	పా	నె.ర.
గుజరాత్	13	9	4	0	18	0.835
చెన్నై	13	7	5	1	15	0.381
ముంబై	12	7	5	0	14	-0.117
లక్నో	12	6	5	1	13	0.309
బెంగళూరు	12	6	6	0	12	0.166
రాజస్తాన్	13	6	7	0	12	0.140
కోల్‌కతా	13	6	7	0	12	-0.256
పంజాబ్	12	6	6	0	12	-0.268
హైదరాబాద్	12	4	8	0	8	-0.575
ఢిల్లీ	12	4	8	0	8	-0.686

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

లక్నో × ముంబై (రాత్రి గం. 7:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

స్కోరు వివరాలు

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాహా (సి) అభిషేక్ (బి) భువనేశ్వర్ 0; శుబ్‌మన్ గిల్ (సి) సమద్ (బి) భువనేశ్వర్ 101; సుదర్శన్ (సి) నటరాజన్ (బి) జాన్సెన్ 47; హార్దిక్ పాండ్యా (సి) త్రిపాఠి (బి) భువనేశ్వర్ 8; మిల్లర్ (సి) మార్క్‌రమ్ (బి) నటరాజన్ 7; తెవాటియా (సి) జాన్సెన్ (బి) ఫారుఖీ 3; షనక (నాటౌట్) 9; రషీద్ (సి) క్లాసెన్ (బి) భువనేశ్వర్ 0; నూర్ (రనౌట్) 0; షమీ (సి) జాన్సెన్ (బి) భువనేశ్వర్ 0; మోహిత్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 188.** **వికెట్ల పతనం:** 1-0, 2-147, 3-156, 4-169, 5-175, 6-186, 7-186, 8-186, 9-187. **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-30-5, జాన్సెన్ 4-0-39-1, ఫారుఖీ 3-0-31-1, నటరాజన్ 4-0-34-1, మార్క్‌రమ్ 1-0-13-0, మయాంక్ మార్కండే 3-0-27-0, అభిషేక్ శర్మ 1-0-13-0.

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: అన్‌మోల్ (సి) రషీద్ (బి) షమీ 5; అభిషేక్ (సి) సాహా (బి) యశ్ 5; మార్క్‌రమ్ (సి) షనక (బి) షమీ 10; త్రిపాఠి (సి) తెవాటియా (బి) షమీ 1; క్లాసెన్ (సి) మిల్లర్ (బి) షమీ 64; సన్వీర్ (సి) సుదర్శన్ (బి) మోహిత్ 7; సమద్ (సి) (సబ్) మావి (బి) మోహిత్ 4; జాన్సెన్ (సి) పాండ్యా (బి) మోహిత్ 3; భువనేశ్వర్ (సి) రషీద్ (బి) మోహిత్ 27; మార్కండే (నాటౌట్) 18; ఫారుఖీ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 154. వికెట్ల పతనం:** 1-6, 2-11, 3-12, 4-29, 5-45, 6-49, 7-59, 8-127, 9-147. **బౌలింగ్:** షమీ 4-0-21-4, యశ్ దయాళ్ 4-0-31-1, రషీద్ 4-0-28-0, మోహిత్ శర్మ 4-0-28-4, నూర్ 2.5-0-35-0, తెవాటియా 1.1-0-7-0.

'గ్రాండ్‌మాస్టర్' ప్రణీత్‌కు కేసీఆర్ అభినందన

రూ. 2 కోట్ల 50 లక్షలు నజరానా ప్రకటన



సాక్షి, హైదరాబాద్: భారత్ నుంచి 82వ చెస్ గ్రాండ్‌మాస్టర్‌గా నిలిచిన తెలంగాణ కుర్రాడు ఉప్పల ప్రణీత్‌ను ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావు అభినందించారు. ప్రణీత్ తన తల్లిదండ్రులు శ్రీనివాసాచారి, ధనలక్ష్మిలతో కలిసి సోమవారం సచివాలయంలో సీఎంను కలిశాడు. ప్రణీత్ ప్రదర్శన పట్ల సంతోషం వ్యక్తం చేసిన కేసీఆర్...అతను మున్ముందు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో ప్రణీత్ ఇతర టోర్నీల కోసం సన్నద్ధమయ్యేందుకు, మరింత మెరుగైన శిక్షణ తీసుకునేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రోత్సాహకంగా రూ. 2 కోట్ల 50 లక్షలను తెలంగాణ సీఎం ప్రకటించారు. రాష్ట్రం తరఫున గ్రాండ్‌మాస్టర్‌గా నిలిచిన ఐదో ఆటగాడిగా ప్రణీత్ గుర్తింపు పొందాడు. మరోవైపు మహిళా క్యాండిడేట్ మాస్టర్ (డబ్ల్యూసీఎం) హోదా పొందిన చెస్ ప్లేయర్ వీర్లపల్లి నందినికి రూ. 50 లక్షల ప్రోత్సాహకాన్ని సీఎం ప్రకటించారు. ఈ దిశగా తక్షణ చర్యలు చేపట్టాల్సిందిగా తన కార్యదర్శి భూపాల్ రెడ్డిని సీఎం ఆదేశించారు.

రన్నరప్ హంపి



బెర్లిన్: వరల్డ్ చెస్ అర్మగెడాన్ బ్లిట్జ్ చాంపియన్‌షిప్ మహిళల టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్, ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి కోనేరు హంపి రన్నరప్‌గా నిలిచింది. బిబిసారా అసాబయేవా (కజకిస్తాన్)తో జరిగిన ఐదు గేమ్‌ల ఫైనల్లో హంపి 1.5-3.5తో ఓడిపోయింది. తొలి గేమ్‌లో హంపి 33 ఎత్తుల్లో ఓడిపోగా.. రెండో గేమ్‌లో హంపి 41 ఎత్తుల్లో గెలిచింది. మూడో గేమ్‌లో 61 ఎత్తుల్లో, నాలుగో గేమ్‌లో 27 ఎత్తుల్లో బిబిసారా విజయం సాధించింది. ఐదో గేమ్ 57 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిసింది. ఎనిమిది మంది అగ్రశ్రేణి క్రీడాకారిణుల మధ్య ఈ టోర్నీ జరిగింది. మహిళల టోర్నీ విన్నర్, రన్నరప్ హోదాలో బిబిసారా, హంపి ఈ ఏడాది సెప్టెంబర్‌లో జరిగే అర్మగెడాన్ గ్రాండ్ ఫైనల్ టోర్నీకి అర్హత సాధించారు. గ్రాండ్ ఫైనల్ టోర్నీకి ఇప్పటికే సో వెస్లీ, సామ్ షాంక్‌లాండ్ (అమెరికా), దొమ్మరాజు గుకేశ్ (భారత్), నొదిర్‌బెక్ అబ్దుసత్తరోవ్ (ఉజ్బెకిస్తాన్) కూడా అర్హత పొందారు. త్వరలో యూరోప్, ఆఫ్రికా రీజియన్ మధ్య జరిగే టోర్నీ ద్వారా మరో ఇద్దరికి గ్రాండ్ ఫైనల్ టోర్నీకి బెర్త్‌లు లభిస్తాయి.

భారత జట్టుకు నిరాశ

మలేసియా చేతిలోనూ పరాజయం




సింధు

సుజౌ (చైనా): సుదిర్మన్ కప్ వరల్డ్ టీమ్ మిక్స్‌డ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో వరుసగా రెండో పరాజయంతో భారత జట్టు కథ ముగిసింది. మలేసియాతో సోమవారం జరిగిన గ్రూప్ 'సి' రెండో లీగ్ మ్యాచ్‌లో 0-5తో ఓడిపోయింది. బుధవారం జరిగే నామమాత్రమైన చివరి లీగ్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియాతో భారత్ ఆడుతుంది. మలేసియాతో జరిగిన పోటీలో తొలి మ్యాచ్‌లో ధ్రువ్-అశ్విని పొన్నప్ప 16-21, 17-21తో గో సూన్ హువాట్-లాయ్ షెవన్ జెమీ చేతిలో ఓడిపోయారు. రెండో మ్యాచ్‌లో శ్రీకాంత్ 16-21, 11-21తో లీ జియా జీ చేతిలో... మూడో మ్యాచ్‌లో పీవీ సింధు 21-14, 10-21, 20-22తో గో జిన్ వె చేతిలో ఓడటంతో భారత ఓటమి ఖరారైంది. నామమాత్రమైన నాలుగో మ్యాచ్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి 18-21, 19-21తో ఆరోన్ చియా-సో వుయ్ యిక్ చేతిలో... ఐదో మ్యాచ్‌లో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ 15-21, 13-21తో పియర్లీ-థినా చేతిలో ఓడిపోయారు.

సినిమా

కొట్టర కొట్టు.. బొక్కలు చూర అయ్యేటట్టు..



● రామ్

'నీ స్టేటు దాటలేనన్నావ్... దాటా!', 'నీ గేటు దాటలేనన్నావ్... దాటా!', నీ పవర్ దాటలేనన్నావ్...దాటా!', 'ఇంకేంటి దాటేది...!' అనే డైలాగ్స్‌తో విడుదలైంది రామ్ కొత్త సినిమా టీజర్. బోయపాటి శ్రీను దర్శకత్వంలో పవన్ కుమార్, జీ స్టూడియోస్ సౌత్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నారు. సోమవారం (మే 15) హీరో రామ్ బర్త్ డే సందర్భంగా 'ఫస్ట్ థండర్' పేరుతో ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. సదర్ ఉత్సవాల నేపథ్యంలో వచ్చే యాక్షన్ సీన్ విజువల్స్‌లో 'కొట్టర కొట్టు... నరాలు కట్టు! బొక్కలు చూర అయ్యేటట్టు..' అనే బ్యాక్‌గ్రౌండ్ సాంగ్ టీజర్‌లో వినిపించింది. ''మా హీరో రామ్ మేకోవర్, యాక్టింగ్, బోయపాటి శ్రీనుగారి డైరెక్షన్, తమన్ రీ రికార్డింగ్ ప్రేక్షకుల్ని అమితంగా ఆకట్టుకుంటాయి. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. త్వరలో టైటిల్, ఇతర వివరాలు వెల్లడిస్తాం. దసరా సందర్భంగా అక్టోబర్ 20న తెలుగు, హిందీ, కన్నడ, తమిళ, మలయాళ భాషల్లో ఈ సినిమాను విడుదల చేస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

నేతాజీ జీవిత రహస్యాలతో...



● నిఖిల్

''నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కి సంబంధించి మీరు ఎప్పుడూ వినని అంశాలు ఈ చిత్రంలో ఉంటాయి. అందుకే మొదటి టీజర్‌ని నేతాజీ విగ్రహం వద్ద విడుదల చేయాలనుకున్నాం. ఇక్కడ టీజర్‌ను విడుదల చేసే అవకాశం దక్కడం గౌరవంగా భావిస్తున్నాం. నేతాజీ జీవితంపై సాగే అవుట్ అండ్ అవుట్ యాక్షన్ చిత్రం ఇది'' అన్నారు నిఖిల్. స్వాతంత్ర్య సమర యోధుడు సుభాష్ చంద్రబోస్ జీవితంలోని రహస్యాల ఆధారంగా రూపొందిన చిత్రం 'స్పై'. నిఖిల్ హీరోగా గ్యారీ బీహెచ్ దర్శకత్వంలో కె. రాజశేఖర్ రెడ్డి నిర్మించారు. ఈ చిత్రం టీజర్‌ను సోమవారం న్యూఢిల్లీలోని కర్తవ్య పథ్‌లో సుభాష్ చంద్రబోస్ విగ్రహం దగ్గర రిలీజ్ చేశారు. నేతాజీ మరణం తాలూకు మిస్టరీని ఛేదించే స్పై పాత్రలో నిఖిల్ కనిపిస్తారు. ఐశ్వర్యా మీనన్, సన్యా ఠాకూర్ కథానాయికలుగా, ప్రత్యేక పాత్రలో ఆర్యన్ రాజేష్ కనిపించనున్న ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళ, మలయాళం, కన్నడ భాషల్లో జూన్ 29న విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: శ్రీచరణ్ పాకాల, విశాల్ చంద్రశేఖర్, కెమెరా: వంశీ పచ్చిపులుసు, మార్క్ డేవిడ్.

స్పెషల్ ఫోకస్



● జ్యోతిక

బాలీవుడ్‌పై జ్యోతిక స్పెషల్ ఫోకస్ పెట్టినట్లున్నారు. వరుసగా ఆమె హిందీ ప్రాజెక్ట్స్‌కు గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారు. ఇరవయ్యేళ్ల తర్వాత ఇటీవల హిందీ చిత్రం 'శ్రీ'లో నటించారు జ్యోతిక. వ్యాపారవేత్త శ్రీకాంత్ బొల్లా బయోపిక్‌గా రూపొందిన ఈ సినిమాలో రాజ్ కుమార్ రావు టైటిల్ రోల్ చేశారు. అలాగే ఓ హిందీ వెబ్ సిరీస్‌కు జ్యోతిక సైన్ చేశారనే టాక్ కొన్ని నెలల క్రితం బీటౌన్‌లో బలంగా వినిపించింది. తాజాగా మరో హిందీ ప్రాజెక్ట్‌కు జ్యోతిక సై అన్నారు. వికాస్ బాల్ దర్శకత్వంలో అజయ్ దేవగన్, మాధవన్ ప్రధాన పాత్రధారులుగా హిందీలో ఓ చిత్రం తెరకెక్కనుంది. ఇందులో అజయ్ దేవగన్ భార్య పాత్రలో జ్యోతిక కనిపిస్తారట. గుజరాతీ ఫిల్మ్ 'వష్'కు ఈ చిత్రం రీమేక్ అని భోగట్టా.

పవర్‌ఫుల్ రుద్ర



● వైష్ణవ్ తేజ్

అదొక చిన్న గ్రామం. ఆ గ్రామంలోని శివాలయాన్ని కొందరు గూండాలు ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తుంటారు. వారిని అడ్డుకోవడానికి రుద్ర రంగంలోకి దిగుతాడు. ఈ గొడవ ఎక్కడికి దారి తీసింది? తర్వాత ఏం జరిగింది? అనే కథాంశంతో హీరో వైష్ణవ్ తేజ్ తాజా చిత్రం రూపొందుతోంది. ఈ చిత్రానికి 'ఆది కేశవ' అనే టైటిల్‌ని ఖరారు చేసి, పాత్రలను పరిచయం చేస్తూ సోమవారం ఫస్ట్ గ్లింప్స్‌ని విడుదల చేశారు మేకర్స్. ఈ గ్లింప్స్‌లో పవర్‌ఫుల్ రుద్రగా ఉగ్రరూపం చూపించారు వైష్ణవ్ తేజ్. చిత్ర పాత్రలో హీరోయిన్ శ్రీలీల, వజ్ర కాళేశ్వరి దేవిగా కీలక పాత్రలో అపర్ణా దాస్, విలన్‌గా జోజు జార్జ్ నటిస్తున్నారు. జూలైలో ఈ చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నారు. శ్రీకాంత్ ఎన్. రెడ్డిని దర్శకుడిగా పరిచయం చేస్తూ ఎస్. నాగ వంశీ, ఎస్. సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్ కుమార్, కెమెరా: డడ్లీ.

గాఢమైన ప్రేమకథ



● శివ

శివ కందుకూరి హీరోగా నటించిన తాజా ఇంటెన్స్ లవ్ స్టోరీ (గాఢమైన ప్రేమకథ) 'మను చరిత్ర'. ఇందులో మేఘా ఆకాష్, ప్రగతి శ్రీవాస్తవ్ హీరోయిన్లుగా నటించారు. భరత్ పెదగానిని దర్శకుడిగా పరిచయం చేస్తూ, ప్రొద్దుటూరు టాకీస్ పతాకంపై ఎన్. శ్రీనివాస రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమాను జూన్ 23న విడుదల చేస్తున్నట్లు ప్రకటించి, కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. శ్రీ విజయ ఫిల్మ్స్ ఈ సినిమా వరల్డ్ వైడ్ థియేట్రికల్ హక్కులను సొంతం చేసుకుంది. ''వరంగల్ నేపథ్యంలో సాగే ఇంటెన్స్ లవ్ స్టోరీ ఇది. ఇందులో ఇంటెన్స్ ఉన్న క్యారెక్టర్‌ను శివ చేశారు'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: గోపీ సుందర్, కెమెరా: రాహుల్ శ్రీవాత్సవ్.

జూన్‌లో దర్శకులు మధుసూదనరావు శత జయంతి ఉత్సవాలు



● శివాజీ రాజా, వాణీ దేవి, కోదండ రామిరెడ్డి

ప్రముఖ దివంగత దర్శకులు వీరమాచనేని మధుసూదనరావు (జూన్ 14, 1923లో జన్మించారు) శతజయంతి ఉత్సవాలు జూన్ 11న హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ హోటల్‌లో జరగనున్నాయి. ఈ కార్యక్రమానికి భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఈ సందర్భంగా సోమవారం జరిగిన సమావేశంలో దర్శకుడు కోదండ రామిరెడ్డి మాట్లాడుతూ– ''మధుసూదనరావుగారు మన మధ్య లేకపోయినా దర్శకుడిగా ఆయన ప్రతిభ మరికొన్ని వందల ఏళ్లు బతికే ఉంటుంది. ఆయన దగ్గర శిష్యరికం చేయడం నా అదృష్టం'' అన్నారు. ''నాన్నగారి శత జయంతి ఉత్సవాలకు సినీ పరిశ్రమ నుంచి అందర్నీ ఆహ్వానిస్తున్నాం'' అన్నారు మధుసూదనరావు కుమార్తె వాణీదేవి. ''ఈ సంవత్సరం నందమూరి తారక రామారావుగారు, అక్కినేని నాగేశ్వరరావుగారు, సూర్యకాంతంగారు, వి. మధుసూదనరావుగారి శత జయంతి కావడం తెలుగు పరిశ్రమ పులకించి పోయే సంవత్సరం. మన మధ్య లేకపోయినా వారు పరిశ్రమకు చూపించిన మంచి మార్గాన్ని ఎప్పటికీ అనుసరిస్తూనే ఉంటాం'' అన్నారు శివాజీరాజా. ''మావయ్య విలువలతో జీవించారు. అదే విలువలను తన చిత్రాల ద్వారా పది మందికి పంచటానికి ప్రయత్నించారు'' అన్నారు నాని (మధుసూదనరావు మేనల్లుడు). ఈ కార్యక్రమంలో మధు ఫిల్మ్ ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపాల్ డా. జి. కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యక్ష దైవం సాయిబాబా



● రామలింగా రెడ్డి, సీత

షిర్డీ సాయిబాబా జీవితం నేపథ్యంలో రూపొందిన చిత్రం 'ప్రత్యక్ష దైవం షిర్డీ సాయి'. సాయిబాబాగా రామలింగా రెడ్డి నటించారు. కొండవీటి సత్యం దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో భానుచందర్, సీత ముఖ్య పాత్రలు పోషించారు. ఈ చిత్రం పాటల ప్రదర్శన హైదరాబాద్‌లో జరిగింది. విశ్రాంత ఇన్‌కమ్ టాక్స్ ప్రిన్సిపల్ ఛీఫ్ కమీషనర్ నరసింహప్ప అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఓ ముఖ్య అతిథిగా పాల్గొన్న దర్శకుడు ఓం సాయి ప్రకాశ్ మాట్లాడుతూ– ''సాయిభక్తుల అనుభవాలతో సినిమా తీయడం అభినందనీయం'' అన్నారు. ''యువతరంలో ఆధ్యాత్మికతను పెంపొందించాలనే ఆలోచనతో ఈ చిత్రాన్ని నిర్మించారు మచ్చా రామలింగారెడ్డి'' అన్నారు చీఫ్ కమిషనర్ నరసింహప్ప. ''యం.ఆర్. రెడ్డి మంచి భక్తిరస చిత్రాన్ని నిర్మించాలనుకోవడం అభినందనీయం'' అని ఇన్‌కమ్ టాక్స్ కమిషనర్ జీవన్ లాల్ అన్నారు. చిత్రదర్శకుడు కొండవీటి సత్యం, నిర్మాతలు వెంకట్, వి. సుబ్బారావు, సంగీతదర్శకులు కిషన్ కవాడియా, పాటల రచయిత బిక్కి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రింగా రింగా రోసే..



● సిమ్రన్, కార్తీక్ రాజు

కార్తీక్ రాజు, సిమ్రన్ చౌదరి, ఐరా హీరోహీరోయిన్లుగా నటించిన ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ 'అథర్వ'. మహేశ్ రెడ్డి దర్శకత్వంలో నూతలపాటి నరసింహం, అనసూయమ్మ సమర్పణలో సుభాష్ నూతలపాటి ఈ సినిమాను నిర్మించారు. త్వరలో తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది. కాగా ఈ చిత్ర సంగీతదర్శకుడు శ్రీ చరణ్ పాకాల పుట్టిన రోజు సందర్భంగా ఈ సినిమా నుంచి 'రింగా రింగా రోసే.. పిల్లా నిన్నే చూసే.. చిట్టిగుండె కూసే..' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు. శ్రీ చరణ్ పాకాల బాణీ అందించిన ఈ పాటకు కిట్టు విస్సాప్రగడ సాహిత్యం అందించగా, జావేద్ అలీ ఆలపించారు. మాస్టర్ రాజ్‌కృష్ణ కొరియోగ్రాఫర్. ఈ పాట విడుదల సందర్భంగా హీరో కార్తీక్ రాజు మాట్లాడుతూ– ''రింగా రింగా రోసే..' పాట అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాం'' అన్నారు. ''హీరో చిన్నతనం నుండి హీరోయిన్‌ను ప్రేమిస్తుంటాడు కానీ చెప్పలేకపోతాడు. చివరికి తన ఫీలింగ్‌ను ఈ పాటతో చెప్పే ప్రయత్నం చేస్తాడు'' అన్నారు మహేశ్ రెడ్డి. ''త్వరలోనే రిలీజ్ కానున్న మా సినిమాను ప్రేక్షకులు సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను'' అన్నారు సుభాష్. ''ఈ చిత్రంలో చాలా ఎమోషన్స్ ఉన్నాయి'' అన్నారు సిమ్రన్ చౌదరి.

ఆగస్టులో టీఎఫ్‌సీసీ నంది అవార్డులు



● సుమన్, మురళీ మోహన్, రామకృష్ణ గౌడ్, ప్రసన్నకుమార్, బి. గోపాల్

తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ (టీఎఫ్‌సీసీ) ఆధ్వర్యంలో 'టీఎఫ్‌సీసీ నంది అవార్డ్స్ సౌత్ ఇండియా 2023' వేడుక జరగనుంది. దుబాయ్‌లోని వరల్డ్ ట్రేడ్ సెంటర్లో ఆగస్టు 12న ఈ వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జ్యూరీ సభ్యులను సెలెక్ట్ చేసుకున్న సందర్భంగా సోమవారం పాత్రికేయుల సమావేశంలో టీఎఫ్‌సీసీ చైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ– ''2021, 22 సంవత్సరాల్లో విడుదలైన చిత్రాల వారు ఈ అవార్డుల కోసం టీఎఫ్‌సీసీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకు చివరి తేదీ జూన్ 15. తెలంగాణ ప్రభుత్వం నుండి నంది అవార్డ్స్‌కి సంబంధించిన లెటర్ పై మంత్రి శ్రీనివాస్ గౌడ్ గారు సంతకం చేసి ఇవ్వడం జరిగింది. అలాగే ఆంధ్ర ప్రభుత్వం సహకారం కూడా కోరనున్నాం. ఆగస్టు 12న దుబాయ్ ప్రిన్స్ చేతుల మీదుగా నంది అవార్డులు ఇవ్వనున్నాం'' అన్నారు. ''జ్యూరీ కమిటీకి నన్ను చైర్మన్‌గా ఉండమన్నారు. కానీ నేను జ్యూరీ మెంబర్‌గా ఉంటూ సపోర్ట్ చేస్తానని చెప్పాను. తెలంగాణ ప్రభుత్వ సహకారం తీసుకున్నట్లే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సహకారం కూడా తీసుకోవాల్సిన అవసరం ఉంది'' అన్నారు మురళీ మోహన్. సుమన్, బి. గోపాల్ తదితరులు మాట్లాడారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	318	62,346
నిఫ్టీ ▲	84	18,399

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	12,352	▲	67
డోజోన్స్	33,375	▲	74
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,777	▲	23
డాక్స్	15,917	▲	3
షాంఘై	3,311	▲	38
నికాయ్	29,626	▲	238

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారెట్)	62,894	▲	139
బంగారం (22 క్యారెట్)	57,653	▲	128
వెండి (కిలో)	73,400	▲	320

మైనస్‌లోకి టోకు ద్రవ్యోల్బణం

- దాదాపు మూడేళ్లలో మొదటిసారి
- ఏప్రిల్‌లో మైనస్ 0.92%
- కమోడిటీల రేట్ల తగ్గుదల ఎఫెక్ట్

న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా కమోడిటీ ధరల క్షీణతతో ఆహారం, ఇంధనం, ఇతరత్రా ముడి సరుకుల రేట్లు తగ్గిన నేపథ్యంలో టోకు ధరలు దాదాపు మూడేళ్లలో తొలిసారిగా మైనస్‌లోకి జారిపోయాయి. ఏప్రిల్‌లో 34 నెలల కనిష్టానికి దిగివచ్చాయి. టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం మైనస్ 0.92 శాతంగా నమోదైంది. చివరిసారిగా 2020 జూన్‌లో డబ్ల్యూపీఐ .. మైనస్ 1.81 శాతంగా నమోదైంది. ఇది గత 11 నెలలుగా తగ్గుదల బాటలోనే కొనసాగుతోంది. గతేడాది ఏప్రిల్‌లో బేస్ అధికంగా 15.38 శాతం స్థాయిలో ఉండటం కూడా ఏప్రిల్‌లో తాజా పరిస్థితికి కారణమని అధికారవర్గాలు తెలిపాయి. డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం ఈ మార్చిలో 1.34 శాతంగా ఉంది. టోకు ధరలు ఏటా క్షీణిస్తుండటాన్ని సాంకేతికంగా ప్రతిద్రవ్యోల్బణంగా వ్యవహరిస్తారు. '2023 ఏప్రిల్‌లో ద్రవ్యోల్బణం రేటు మందగించడానికి ప్రధానంగా ఆహారోత్పత్తులు, ప్రాథమిక లోహాలు, టెక్స్‌టైల్స్, ఆహారేతర ఉత్పత్తులు, రసాయనాలు.. రసాయన ఉత్పత్తులు, రబ్బర్.. ప్లాస్టిక్ ఉత్పత్తులు, పేపర్.. పేపర్ ఉత్పత్తుల ధరలు తగ్గడం కారణం' అని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ తెలిపింది.



రాబోయే రోజుల్లోనూ ఇలాగే..

కమోడిటీల ధరలు తగ్గే కొద్దీ రాబోయే రోజుల్లోనూ డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం మరింత తగ్గడం కొనసాగవచ్చని బార్‌క్లేస్ ఒక నివేదికలో తెలిపింది. టోకు, రిటైల్ ద్రవ్యోల్బణం రెండూ తగ్గుతున్నందున తదుపరి పాలసీ సమీక్షలో రిజర్వ్ బ్యాంక్.. వడ్డీ రేట్ల పెంపునకు మరికాస్త విరామం ఇచ్చే అవకాశం ఉందని పేర్కొంది. ప్రతిద్రవ్యోల్బణ ధోరణి వచ్చే 2–3 నెలలు కొనసాగవచ్చని, పూర్తి ఆర్థిక సంవత్సరానికి డబ్ల్యూపీఐ 1–2 శాతం శ్రేణిలో ఉండొచ్చని కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ చీఫ్ ఎకానమిస్ట్ రజని సిన్హా తెలిపారు. ఏప్రిల్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 18 నెలల కనిష్టమైన 4.70 శాతానికి తగ్గింది. గత నెల పాలసీ సమీక్షలో ఆర్‌బీఐ వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించింది. తాజా గణాంకాల్లోని మరిన్ని విశేషాలు..

- ఆహార, ఆహారయేతర, ఇంధన.. విద్యుత్, తయారీ ఉత్పత్తులు మొదలైన వాటన్నింటి ధరలు తగ్గాయి.
- మార్చితో పోలిస్తే ఆహారోత్పత్తుల ద్రవ్యోల్బణం 5.48 శాతం నుంచి 3.54 శాతానికి దిగి వచ్చింది. పండ్లు, పాలు .. గుడ్లు, మాంసం, చేపల ధరలు తగ్గాయి. కూరగాయల ద్రవ్యోల్బణం మైనస్ 1.50 శాతంగా నమోదైంది. బంగాళాదుంపల ధరల పెరుగుదల మైనస్ 18.66 శాతం, ఉల్లి మైనస్ 18.41 శాతం, గోధుమలు 7.27 శాతంగాను ఉంది.
- ఇంధనం, విద్యుత్ బాస్కెట్ ద్రవ్యోల్బణం 8.96 శాతం నుంచి 0.93 శాతానికి తగ్గింది.
- తయారీ ఉత్పత్తుల ద్రవ్యోల్బణం మార్చిలో 0.77% కాగా ఏప్రిల్‌లో మైనస్ 2.42%గా ఉంది.

ఎగుమతులు మూడో నెలా డౌన్

- ఏప్రిల్‌లో 12.7 శాతం క్షీణత
- 34.66 బిలియన్ డాలర్లకు పరిమితం
- 14 శాతం తగ్గిన దిగుమతులు

న్యూఢిల్లీ: భారత్ నుంచి ఎగుమతులు వరుసగా మూడో నెలా క్షీణించాయి. ఏప్రిల్‌లో 12.7 శాతం తగ్గి 34.66 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. కేంద్ర వాణిజ్య శాఖ సోమవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం దిగుమతులు కూడా వరుసగా అయిదో నెలా క్షీణించాయి. ఏప్రిల్‌లో 14 శాతం క్షీణించి 49.9 బిలియన్ డాలర్లకు తగ్గాయి. గత ఏప్రిల్‌లో ఇవి 58.06 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. భారత్‌కు ప్రధాన మార్కెట్లుగా ఉన్న అమెరికా, యూరప్‌లో డిమాండ్ అంతగా లేకపోవడం .. ఎగుమతులు మందగించడానికి కారణమైంది. పరిస్థితి మెరుగుపడటానికి మరికొద్ది నెలలు పట్టే అవకాశం ఉందని డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) సంతోష్ కుమార్ సారంగి తెలిపారు. 'యూరప్, అమెరికాలో డిమాండ్ క్షీణించింది. వచ్చే 2–3 నెలలు కూడా అంత ఆశావహంగా కనిపించడం లేదు.



అయితే, చైనా ఎకానమీ కోలుకుని.. యూరప్, అమెరికా మార్కెట్లలో కూడా కాస్త డిమాండ్ నెలకొనే అవకాశం ఉన్నందున ఆగస్టు–సెప్టెంబర్ తర్వాత నుంచి ఎగుమతులు మళ్లీ పుంజుకోవడానికి ఆస్కారం ఉంది' అని ఆయన పేర్కొన్నారు.

20 నెలల కనిష్టానికి వాణిజ్య లోటు ..

ఎగుమతులు, దిగుమతుల మందగమనంతో ఏప్రిల్‌లో వాణిజ్య లోటు 20 నెలల కనిష్టమైన 15.24 బిలియన్ డాలర్లకు తగ్గింది. చివరిసారిగా 2021 ఆగస్టులో వాణిజ్య లోటు ఇంతకన్నా తక్కువగా 13.81 బిలియన్ డాలర్లుగా నమోదు కాగా.. గతేడాది ఏప్రిల్‌లో ఇది 18.36 బిలియన్ డాలర్లుగా ఉంది. కమోడిటీల ధరలు, రత్నాభరణాల్లాంటి ఉత్పత్తులకు డిమాండ్ క్షీణించడంతో దిగుమతులు తగ్గినట్లు సారంగి వివరించారు. ఎగుమతులపరంగా రాబోయే రోజుల్లోనూ రత్నాభరణాలు, కొన్ని రకాల ఇంజినీరింగ్ ఉత్పత్తులు, దుస్తులపై ప్రభావం ఉండవచ్చన్నారు. ఎక్కువగా ఎగుమతులు చేసేందుకు ఆస్కారమున్న ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు, నూనె గింజల్లాంటి వాటిపై వ్యాపార వర్గాలు మరింతగా దృష్టి పెట్టాలని సూచించారు.

2022–23 గణాంకాల సవరణ..

గత ఆర్థిక సంవత్సరం గణాంకాలను వాణిజ్య శాఖ ఎగువముఖంగా సవరించింది. దీని ప్రకారం..

- 2022–23లో ఉత్పత్తులు, సర్వీసుల ఎగుమతులు 14.68 శాతం వృద్ధి చెంది 676.53 బిలియన్ డాలర్ల నుంచి 775.87 బిలియన్ డాలర్లకు చేరాయి. దిగుమతులు 17.65 శాతం పెరిగి 894.19 బిలియన్ డాలర్లకు చేరాయి. వాణిజ్య లోటు 118.31 బిలియన్ డాలర్లుగా నమోదైంది.
- ఉత్పత్తుల ఎగుమతులు 6.74% వృద్ధితో 450.43 బిలియన్ డాలర్లకు చేరగా, దిగుమతులు 16.47% పెరిగి 714 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.
- సేవల ఎగుమతులు 27.86 శాతం ఎగిసి 325.44 బిలియన్ డాలర్లకు, దిగుమతులు 22.54 శాతం పెరిగి 180 బిలియన్ డాలర్లకు చేరాయి.

నిప్పో బ్రాండ్ కొత్త లోగో ఆవిష్కరణ



న్యూఢిల్లీ: ప్రముఖ బ్యాటరీ ఉత్పత్తుల సంస్థ నిప్పో (ఇండో నేషనల్ లిమిటెడ్) బ్రాండ్ కొత్త లోగోని ఆవిష్కరించింది. జపాన్‌కు చెందిన మత్సుషిత ఎలక్ట్రిక్ ఇండస్ట్రియల్ కంపెనీతో పారిశ్రామికవేత్త పి ఓబుల్ రెడ్డి సంయుక్తంగా 1972లో ఇండో నేషనల్ లిమిటెడ్‌ను ఏర్పాటు చేశారు. 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిప్పో నూతన లోగో వినియోగదారులకు కొత్త అనుభూతిని ఇస్తుందని, కొత్త కస్టమర్లకు చేరువ కావడానికి కూడా సాయపడుతుందని కంపెనీ పేర్కొంది. నిప్పో బ్రాండ్‌తో తాము మార్కెట్లో మరింతగా విస్తరించనున్నట్లు సంస్థ ఎండీ ద్వారాకానాథ్‌రెడ్డి తెలిపారు. "50 ఏళ్ల స్వర్ణోత్సవ వేడుక జరుపుకుంటూ మేము ఉత్సాహవంతమైన, ముఖ్యమైన దశకు చేరుకున్నాం. మా ఉత్పత్తులకు సంబంధించి వినియోగదారులు అందించే అవకాశాలను సొంతం చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నాం"అని సంస్థ జాయింట్ ఎండీ ఆదిత్యరెడ్డి పేర్కొన్నారు.

5 నెలల గరిష్టానికి మార్కెట్

- 318 పాయింట్లు అప్
- 62,346 వద్దకు సెన్సెక్స్
- నిఫ్టీ 84 పాయింట్లు ప్లస్
- 18,399 వద్ద ముగింపు

ముంబై: ప్రపంచ మార్కెట్ల నుంచి సానుకూలతలు, ఉపశమించిన ద్రవ్యోల్బణం నేపథ్యంలో దేశీ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజూ దూకుడు చూపాయి. సెన్సెక్స్ 318 పాయింట్లు జంప్‌చేసి 62,346కు చేరింది. నిఫ్టీ 84 పాయింట్లు ఎగసి 18,399 వద్ద నిలిచింది. వెరసి గతేడాది డిసెంబర్ 14 తర్వాత తిరిగి మార్కెట్లు గరిష్టాలకు చేరాయి. ఆసియా, యూరోపియన్ మార్కెట్ల ప్రోత్సాహానికితోడు.. ఏప్రిల్‌లో టోకు ధరలు మైనస్‌కు చేరడంతో ఇన్వెస్టర్లకు హుషారొచ్చినట్లు మార్కెట్ నిపుణులు పేర్కొన్నారు. దీంతో లాభాలతో ప్రారంభమైన మార్కెట్లు మిడ్‌సెషన్‌కల్లా జోరందుకున్నాయి. సెన్సెక్స్ 535 పాయింట్లు పురోగమించి 62,563కు చేరింది. నిఫ్టీ 18,459ను తాకింది. విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు సైతం సెంటిమెంటుకు బలాన్నిస్తున్నట్లు నిపుణులు పేర్కొన్నారు.



రియల్టీ దూకుడు

ఎన్ఎస్ఈలో అన్ని రంగాలూ బలపడగా.. రియల్టీ 4.3 శాతం జంప్‌చేసింది. రిటైల్, టోకు ధరలు తగ్గడంతో వడ్డీ రేట్లకు చెక్ పడనున్న అంచనాలు ఇందుకు దోహదపడినట్లు నిపుణులు తెలియజేశారు. కాగా.. మీడియా, ఎఫ్ఎంసీజీ, బ్యాంకింగ్ 2–0.7 శాతం లాభపడ్డాయి. ఆయిల్ అండ్ గ్యాస్ యథాతథంగా నిలిచింది. రియల్టీ కౌంటర్లలో శోభా 11.5 శాతం దూసుకెళ్లగా.. డీఎల్ఎఫ్, మహీంద్రా లైఫ్, ప్రెస్టీజ్ ఎస్టేట్స్, ఒబెరాయ్, గోద్రెజ్ ప్రాపర్టీస్, లోధా 7.4–3.4 శాతం మధ్య జంప్ చేశాయి.

టాటా మోటార్స్ జోరు

నిఫ్టీ దిగ్గజాలలో హీరోమోటో, టాటా మోటార్స్ 3 శాతం పుంజుకోగా.. ఐటీసీ, టెక్ మహీంద్రా, హిండాల్కో, హెచ్‌యూఎల్, డాక్టర్ రెడ్డీస్, ఇన్ఫోసిస్, కోల్ ఇండియా, ఎల్అండ్‌టీ, ఎంఅండ్ఎం, ఇండస్ఇండ్, టాటా స్టీల్, విప్రో, ఐషర్, ఎస్‌బీఐ, ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 2–0.6 శాతం మధ్య బలపడ్డాయి. అయితే అదానీ ఎంటర్, సిప్లా, బీపీసీఎల్, గ్రాసిమ్, దివీస్ ల్యాబ్, మారుతీ, అదానీ పోర్ట్స్, టీసీఎస్ 3–0.7 శాతం మధ్య నీరసించాయి.

చిన్న షేర్లు ఓకే


మార్కెట్ల బాటలో చిన్న షేర్లకూ డిమాండ్ కనిపించింది. బీఎస్ఈలో మిడ్, స్మాల్ క్యాప్స్ 0.5 శాతం చొప్పున పుంజుకున్నాయి. ట్రేడైన షేర్లలో 1,856 లాభపడితే, 1,802 డీలాపడ్డాయి. నగదు విభాగంలో వారాంతాన రూ. 1,014 కోట్ల విలువైన స్టాక్స్ కొనుగోలు చేసిన విదేశీ ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) సోమవారం మరింత అధికంగా రూ. 1,685 కోట్లు ఇన్వెస్ట్ చేశారు. అయితే దేశీ ఫండ్స్ రూ. 191 కోట్ల విలువైన స్టాక్స్ మాత్రమే కొనుగోలు చేశాయి. ఈ నెల తొలి రెండు వారాలలో ఎఫ్‌పీఐలు రూ. 23,152 కోట్లు ఇన్వెస్ట్ చేయడం గమనార్హం! విదేశీ మార్కెట్లో బ్రెంట్ ముడిచమురు బ్యారల్ 0.25 శాతం బలపడి 74.34 డాలర్లకు చేరింది. డాలరుతో మారకంలో రూపాయి 13 పైసలు నీరసించి 82.31కు చేరింది.

సెన్సెక్స్, బ్యాంకెక్స్ డెరివేటివ్‌లు మళ్లీ ప్రారంభం

స్టాక్ ఎక్స్ఛేంజీ బీఎస్ఈ తాజాగా సెన్సెక్స్, బ్యాంకెక్స్ డెరివేటివ్‌లను సోమవారం పునఃప్రారంభించింది. ఈ కాంట్రాక్టులకు సంబంధించిన ఫ్యూచర్స్, ఆప్షన్స్ లాట్ సైజును తగ్గించడంతో పాటు ఎక్స్‌పైరీ రోజును కూడా గురువారం నుంచి శుక్రవారానికి మార్చినట్లు సంస్థ ఎండీ సుందరరామన్ రామమూర్తి ఒక ప్రకటనలో తెలిపింది. దీని ప్రకారం.. సెన్సెక్స్ ఫ్యూచర్స్, ఆప్షన్స్ లాట్ సైజు 15 నుంచి 10కి, బ్యాంకెక్స్ లాట్ సైజును 20 నుంచి 15కి తగ్గించారు. అధిక రాబడులిచ్చేందుకు ఆస్కారమున్న అత్యంత రిస్కీ సాధనాలుగా డెరివేటివ్స్‌ను పరిగణిస్తారు. 2000లో బీఎస్ఈ తొలిసారిగా సెన్సెక్స్–30 డెరివేటివ్స్ (ఆప్షన్స్, ఫ్యూచర్స్)ను ప్రవేశపెట్టింది.

నైమెక్స్ క్రూడ్ ఫ్యూచర్స్ షురూ

- నేచురల్ గ్యాస్‌లోనూ కాంట్రాక్టులు
- డెరివేటివ్స్‌కు తెరతీసిన ఎన్ఎస్ఈ



న్యూఢిల్లీ: స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్ఎస్ఈ తాజాగా రూపాయలలో నైమెక్స్ డబ్ల్యూటీఐ క్రూడాయిల్ కాంట్రాక్టులకు తెరతీసింది. కమోడిటీ డెరివేటివ్స్ విభాగంలో నేచురల్ గ్యాస్‌లోనూ రూపాయలలో ట్రేడయ్యే ఫ్యూచర్స్‌ను ప్రవేశపెట్టింది. ఈ ఏడాది మార్చిలో క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఇందుకు ఎన్ఎస్ఈని అనుమతించింది. దీంతో ఎనర్జీ బాస్కెట్‌లో ఎన్ఎస్ఈ మరిన్ని ప్రొడక్టులను జత చేసుకుంది. తాజా కాంట్రాక్టులతో కీలక ఎనర్జీ ప్రొడక్టులను ఒకే ప్లాట్‌ఫామ్‌పై ప్రవేశపెట్టడం ద్వారా మార్కెట్ పార్టిసిపెంట్లకు ప్రభావవంతమైన ట్రేడింగ్, హెడ్జింగ్ అవకాశాలను కల్పించినట్లయ్యింది.

విద్య, ఉద్యోగ సమాచారం

కృష్ణా జిల్లా డీఎంహెచ్‌వోలో 10 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టులు

మచిలీపట్నంలోని జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయం..ఉమ్మడి కృష్ణా జిల్లాలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన వివిధ ప్రభుత్వాసుపత్రుల్లో స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 10
» **పోస్టుల వివరాలు:** పీడియాట్రిషియన్–05, జనరల్ ఫిజిషియన్–01, ఎంవో డెంటల్–01, ఆడియాలజిస్ట్ కమ్ స్పీచ్ థెరపిస్ట్–01, డెంటల్ టెక్నీషియన్–01, డీఈఐసీ మేనేజర్–01.
» **అర్హత:** పోస్టును అనుసరించి ఎంబీబీఎస్, ఎండీ, బీడీఎస్, డిగ్రీ, డిప్లొమా, బీపీటీ, బీఎస్సీ నర్సింగ్ ఉత్తీర్ణులై ఉండాలి.
వయసు: 42 ఏళ్లు మించకూడదు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయం, పరాసుపేట, మచిలీపట్నం చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 16.05.2023.
» **వెబ్‌సైట్:** www.krishna.ap.gov.in

టిస్, ముంబైలో 19 టీచింగ్ స్టాఫ్ పోస్టులు

ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్(టిస్).. టీచింగ్ స్టాఫ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 19
» **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్.
» **విభాగాలు:** ఆర్ట్స్, హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్, సైకాలజీ, ఆర్థిక శాస్త్రం, భూగోళ శాస్త్రం, సామాజిక శాస్త్రం, పొలిటికల్ సైన్సెస్, లాంగ్వేజెస్, మేనేజ్‌మెంట్, ఇంజనీరింగ్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో పీజీ డిగ్రీ/పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి. నెట్/స్లెట్/సెట్ అర్హత సాధించాలి.
» **ఎంపిక విధానం:** పని అనుభవం, షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 16.05.2023
» **వెబ్‌సైట్:** www.tiss.edu

ఇంజనీర్లకు ఆర్మీ ఆహ్వానం

ఆర్మీ జాబ్స్

» టెక్నికల్ గ్రాడ్యుయేట్ కోర్సుకు ప్రకటన విడుదల
» రాత పరీక్ష లేకుండానే ఎంపికలు

బీటెక్ పూర్తి చేసిన అభ్యర్థులకు ఇండియన్ ఆర్మీ స్వాగతం పలుకుతోంది. ఇండియన్ మిలటరీ అకాడమీ(ఐఎంఏ), డెహ్రాడూన్.. శాశ్వత ప్రాతిపదికన 2024 జనవరిలో ప్రారంభించే 138వ టెక్నికల్ గ్రాడ్యుయేట్ కోర్సు(టీజీసీ)కు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరుతుంది. ఎంపిక ప్రక్రియలో విజయం సాధించిన వారికి శిక్షణ ఇచ్చి విధుల్లోకి తీసుకుంటారు. ఇలా కొలువు సొంతం చేసుకున్న వారికి ఆకర్షణీయ వేతనాలు లభిస్తాయి.

మొత్తం పోస్టుల సంఖ్య: 40 (సివిల్–11, కంప్యూటర్ సైన్స్–09, ఎలక్ట్రికల్–04, ఎలక్ట్రానిక్స్–06, మెకానికల్–08, మిసిలేనియస్–02)

అర్హతలు: సంబంధిత విభాగాల్లో ఇంజనీరింగ్ పూర్తిచేసుకున్న,అవివాహితులైన పురుష అభ్యర్థులు మాత్రమే దరఖాస్తుకు అర్హులు. ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. **వయసు:** జనవరి 01, 2024 నాటికి 20 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక విధానం: దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల మార్కులకు కట్ ఆఫ్ నిర్ణయిస్తారు. దాన్ని బట్టి షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి సర్వీస్ సెలక్షన్ బోర్డు(ఎస్ఎస్‌బీ).. బెంగళూరులో ఐదు రోజులపాటు రెండు దశల్లో సైకలాజికల్ పరీక్షలు, గ్రూప్ పరీక్షలు, ఇంటర్వ్యూలు నిర్వహిస్తుంది. మొదటి రోజు స్టేజ్–1 స్క్రీనింగ్(ఇంటెలిజెన్స్) పరీక్షలు ఉంటాయి. ఇందులో అర్హత సాధించిన వారినే స్టేజ్–2కి ఎంపిక చేస్తారు. వీరికి నాలుగు రోజులపాటు పలు విభాగాల్లో పరీక్షించి, అందులో రాణించవారికి మెడికల్ పరీక్షలు నిర్వహించి శిక్షణకు ఎంపిక చేస్తారు.

శిక్షణ ఇలా: ఎంపికైన అభ్యర్థులకు ఇండియన్ మిలిటరీ అకాడమీ(ఐఎంఏ), డెహ్రాడూన్‌లో శిక్షణ ఉంటుంది. కోర్సు కాలవ్యవధి 49వారాలు.శిక్షణలో చేరినప్పటి నుంచే లెఫ్టినెంట్ హోదా ఇస్తారు. షార్ట్ సర్వీస్ కమిషన్(ఎస్ఎస్‌సీ) నిబంధనల ప్రకారం–వేతనం అందుతుంది. ఆ సమయంలో నెలకు రూ. 56,100చెల్లిస్తారు.విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులు శాశ్వత కమిషన్ పరిధిలోకి వస్తారు.

వేతనాలు: శిక్షణ అనంతరం లెఫ్టినెంట్ హోదాతో విధుల్లో చేరిన వారికి లెవల్–10 ప్రకారం మూలవేతనం లభిస్తుంది. ఇలా ఎంపికైన వారికి ప్రతి నెల రూ.56,100తోపాటు మిలటరీ సర్వీస్ పే కింద రూ.15,500 అందుతాయి.వీటితోపాటు డీఏ, హెచ్ఆర్ఏ, ప్రోత్సాహకాలు దక్కుతాయి. ఈ కొలువులో చేరిన వారు తక్కువ వ్యవధిలోనే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చు. విధుల్లో చేరిన రెండేళ్ల తర్వాత కెప్టెన్, ఆరేళ్ల సర్వీస్‌తో మేజర్, పదమూడేళ్ల అనుభవంతో లెఫ్టినెంట్ కల్నల్ హోదాలను అందుకోవచ్చు.

ముఖ్యసమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **దరఖాస్తులకు చివరి తేదీ:** 2023, మే 17 మధ్యాహ్నం 3 వరకు.
» **వెబ్‌సైట్:** https://joinindianarmy.nic.in

అవుతారా.. ఆర్‌బీఐ ఆఫీసర్!

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ).. దేశంలో బ్యాంకింగ్ కార్యకలాపాలను నియంత్రించి, పర్యవేక్షించే కేంద్ర బ్యాంకు! ఇంతటి కీలక వ్యవస్థలో యువత పాల్పంచుకునే అవకాశం కల్పిస్తోంది ఆర్‌బీఐ! ఇందుకోసం గ్రేడ్–బి ఆఫీసర్ పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టింది! బ్యాచిలర్ డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో ఈ పోస్టులకు పోటీ పడొచ్చు. ఇటీవల కేంద్ర బ్యాంకు 291 గ్రేడ్ బీ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆ వివరాలు..

» 291 గ్రేడ్–బి ఆఫీసర్ పోస్ట్‌లకు ఆర్‌బీఐ నోటిఫికేషన్
» బ్యాచిలర్ డిగ్రీ, పీజీ అర్హతతో పోటీ పడే అవకాశం
» కొలువు సాధిస్తే..రూ.55,200 ప్రారంభ వేతనం
» రాత పరీక్షలు, ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా ఎంపిక



మూడు విభాగాలు.. 291 పోస్ట్‌లు

తాజా నియామక ప్రక్రియ ద్వారా బ్యాంకుకు చెందిన మూడు విభాగాల్లో 291 పోస్ట్‌లను భర్తీ చేయనుంది. ఆ వివరాలు..

- గ్రేడ్–బి ఆఫీసర్(జనరల్)–222 పోస్ట్‌లు.
- గ్రేడ్–బి ఆఫీసర్(డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్ అండ్ పాలసీ రీసెర్చ్–డీఈపీఆర్) –38 పోస్ట్‌లు.
- గ్రేడ్–బి ఆఫీసర్(డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ –డీఐఎస్ఎం)–31 పోస్ట్‌లు.

అర్హతలు

- **గ్రేడ్–బి ఆఫీసర్(జనరల్):** 60 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ లేదా 55 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణత ఉండాలి.
- **గ్రేడ్–బి ఆఫీసర్ డీఈపీఆర్:** క్వాంటిటేటివ్ ఎకనామిక్స్/మ్యాథమెటికల్ ఎకనామిక్స్ /ఫైనాన్షియల్ ఎకనామిక్స్/బిజినెస్ ఎకనామిక్స్/అగ్రికల్చరల్ ఎకనామిక్స్/ ఇండస్ట్రియల్ ఎకనామిక్స్ సబ్జెక్ట్‌తో ఎంఏ లేదా ఎమ్మెస్సీ ఎకనామిక్స్ ఉత్తీర్ణత ఉండాలి. (లేదా) ఫైనాన్స్ సబ్జెక్ట్ స్పెషలైజేషన్‌తో పీజీ ఉత్తీర్ణత లేదా పీజీడీఎం/ ఎంబీఏ పాసవ్వాలి. అన్ని కోర్సులకు సంబంధించి కనీసం 55 శాతం మార్కులు సాధించడం తప్పనిసరి.
- **గ్రేడ్–బి ఆఫీసర్ డీఐఎస్ఎం:** స్టాటిస్టిక్స్/మ్యాథమెటికల్ స్టాటిస్టిక్స్/మ్యాథమెటికల్ ఎకనామిక్స్ /ఎకనోమెట్రిక్స్/స్టాటిస్టిక్స్ అండ్ ఇన్ఫర్మాటిక్స్/ అప్లైడ్ స్టాటిస్టిక్స్ అండ్ ఇన్ఫర్మాటిక్స్ సబ్జెక్ట్ స్పెషలైజేషన్లతో 55 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణులవ్వాలి. లేదా ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్‌లో మాస్టర్ ఆఫ్ స్టాటిస్టిక్స్, అదే విధంగా ఐఐటీ ఖరగ్‌పూర్, ఐఐఎం కోల్‌కతలలో పీజీడీబీఏలలో 55శాతం మార్కులతో ఉత్తీర్ణత ఉండాలి.
- **వయసు:** మే 1, 2023 నాటికి 21–30 ఏళ్లు ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ

ఆర్‌బీఐ గ్రేడ్–బి ఆఫీసర్ పోస్ట్‌ల నియామకానికి మూడు దశల ఎంపిక ప్రక్రియను నిర్వహిస్తారు. అవి.. ఫేజ్–1 రాత పరీక్ష; ఫేజ్–2 రాత పరీక్ష; పర్సనల్ ఇంటర్వ్యూ.

మూడు విభాగాలకు వేర్వేరుగా

ఫేజ్–1, ఫేజ్–2లుగా నిర్వహించే రాత పరీక్ష మూడు విభాగాల(గ్రేడ్ బీ ఆఫీసర్ –జనరల్, గ్రేడ్–బి ఆఫీసర్ డీఈపీఆర్, గ్రేడ్ బి ఆఫీసర్ డీఐఎస్ఎం)కు వేర్వేరుగా ఉంటుంది.

గ్రేడ్–బి ఆఫీసర్(జనరల్) రాత పరీక్షలు

- గ్రేడ్–బి ఆఫీసర్(జనరల్) పోస్ట్‌లకు సంబంధించి ఫేజ్–1లో 200 మార్కులకు జనరల్ అవేర్‌నెస్,ఇంగ్లిష్ లాంగ్వేజ్,క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్ విభాగాల్లో ఆన్‌లైన్ విధానంలో పరీక్ష నిర్వహిస్తారు. ఒక్కో విభాగం నుంచి 50 ప్రశ్నలు అడుగుతారు. పరీక్షకు లభించే సమయం రెండు గంటలు.
- ఫేజ్–1 పరీక్షలో సెక్షన్ల వారీగా, మొత్తంగా నిర్దేశిత కటాఫ్ మార్కులను పొందిన వారితో మెరిట్ జాబితా రూపొందించి.. పోస్ట్‌ల సంఖ్యను అనుసరించి తదుపరి దశలో ఫేజ్–2 పరీక్ష నిర్వహిస్తారు.

మూడు వందల మార్కులకు ఫేజ్–2

- గ్రేడ్–బి ఆఫీసర్(జనరల్) పోస్ట్‌లకు రెండో దశలో నిర్వహించే ఫేజ్–2 రాత పరీక్ష.. మూడు పేపర్లలో మూడు వందల మార్కులకు ఉంటుంది.
- పేపర్–1 ఎకనామిక్ అండ్ సోషల్ ఇష్యూస్ 100 మార్కులు, పేపర్–2 ఇంగ్లిష్ రైటింగ్ స్కిల్స్ 100 మార్కులు, పేపర్–3 జనరల్ ఫైనాన్స్ అండ్ మేనేజ్‌మెంట్ 100 మార్కులకు జరుగుతుంది.
- పేపర్–1,పేపర్–3లలో ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ ప్రశ్నలు అడుగుతారు. ఆబ్జెక్టివ్ విధానంలో 1 మార్కు, రెండు మార్కులతో 30 ప్రశ్నలు ఉంటాయి. ఇలా మొత్తం 50మార్కులకు ఆబ్జెక్టివ్ ప్రశ్నలుంటాయి.
- మరో 50 మార్కులకు వ్యాసరూప సమాధానాలు రాయాల్సి ఉంటుంది. మొత్తం ఆరు ప్రశ్నలు అడుగుతారు. వీటిలో కనీసం నాలుగింటికి సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. రెండు ప్రశ్నలకు 15 మార్కులు చొప్పున, మరో రెండు ప్రశ్నలకు 10 మార్కులు చొప్పున కేటాయిస్తారు.

గ్రేడ్–బి ఆఫీసర్(డీఈపీఆర్).. మూడు పేపర్లు

- గ్రేడ్–బి ఆఫీసర్ పోస్ట్‌లకు తొలిదశలో రాత పరీక్ష, తదుపరి ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. తొలి దశ రాత పరీక్షలో మూడు పేపర్లు ఉంటాయి. –ప్రతి పేపర్‌కు 100 మార్కులు చొప్పున మొత్తం మూడు వందల మార్కులకు పరీక్ష ఉంటుంది.
- పేపర్–1లో ఎకనామిక్స్ నుంచి ఆబ్జెక్టివ్ విధానంలో బహుళైచ్ఛిక ప్రశ్నలు అడుగుతారు.
- పేపర్–2లో కూడా ఎకనామిక్స్ ఉంటుంది. ప్రశ్నలు డిస్క్రిప్టివ్ విధానంలో ఉంటాయి.
- పేపర్–3ని ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లో డిస్క్రిప్టివ్ విధానంలో నిర్వహిస్తారు.
- పేపర్–1కు రెండు గంటలు, పేపర్–2 మూడు గంటలు, పేపర్–3కు గంటన్నర సమయం ఉంటుంది.
- అభ్యర్థులు డిస్క్రిప్టివ్, ఆబ్జెక్టివ్ ప్రశ్నలకు కంప్యూటర్‌పైనే సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది.

పేపర్–1లో అర్హత సాధిస్తేనే

గ్రేడ్–బి ఆఫీసర్(డీఈపీఆర్)కు సంబంధించి పేపర్–1లో నిర్దేశిత కటాఫ్ మార్కులు సాధించిన వారికే పేపర్–2, పేపర్–3లకు అనుమతి లభిస్తుంది. ముందుగా పేపర్–1ను నిర్వహించి..కొద్ది రోజుల వ్యవధి తర్వాత పేపర్–2, 3లను నిర్వహిస్తారు.

గ్రేడ్–బి ఆఫీసర్(డీఐఎస్ఎం).. స్టాటిస్టిక్స్ పేపర్లు

గ్రేడ్–బి ఆఫీసర్(డీఐఎస్ఎం) పోస్ట్‌ల ఎంపిక విధానం డీఈపీఆర్ గ్రేడ్–బి ఆఫీసర్ మాదిరిగానే ఉంటుంది. మూడు పేపర్లుగా మూడు వందల మార్కులకు ఈ పరీక్ష నిర్వహిస్తారు. పేపర్–1, 2లలో స్టాటిస్టిక్స్ సబ్జెక్ట్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. పేపర్–3లో ఇంగ్లిష్ విభాగం ఉంటుంది. –పేపర్–1ను ఆబ్జెక్టివ్ విధానంలో, పేపర్–2, పేపర్–3లను డిస్క్రిప్టివ్ విధానంలో నిర్వహిస్తారు. –పేపర్–1లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకే పేపర్–2, పేపర్–3లకు అర్హత కల్పిస్తారు.

ఇంటర్వ్యూకు 75 మార్కులు

మూడు విభాగాల పోస్ట్‌ల(జనరల్, డీఈపీఆర్, డీఐఎస్ఎం)కు సంబంధించి రాత పరీక్షల్లో నిర్దేశిత కటాఫ్ మార్కులతో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులతో మెరిట్ జాబితా రూపొందిస్తారు. వారికి చివరి దశలో 75 మార్కులకు పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. పర్సనల్ ఇంటర్వ్యూ కంటే ముందు సైకోమెట్రిక్ టెస్ట్‌ను కూడా నిర్వహించే అవకాశముంది.

ఆకర్షణీయ వేతనం

అన్ని దశల ఎంపిక ప్రక్రియలో విజయం సాధించి కొలువు సొంతం చేసుకున్న వారికి ఆకర్షణీయ వేతనంతో కెరీర్ ప్రారంభం అవుతుంది. రూ.55,200– రూ.99,750 వేతన శ్రేణి లభిస్తుంది. వీటికి అదనంగా హెచ్ఆర్ఏ, డీఏ, ఫ్యామిలీ అలవెన్స్, గ్రేడ్ అలవెన్స్ వంటివి కూడా అందుతాయి.

పీజీ స్థాయి ప్రిపరేషన్

- ఆర్‌బీఐ గ్రేడ్–బి ఆఫీసర్ పోస్ట్‌లకు నిర్వహించే రాత పరీక్షల్లో మెరుగైన స్కోర్ సాధించడానికి అభ్యర్థులు తాము ఎంపిక చేసుకున్న పోస్ట్, అందుకు నిర్దేశించిన సబ్జెక్ట్‌లకు సంబంధించి పీజీ స్థాయిలో పూర్తి స్థాయి అకడమిక్ నైపుణ్యాలను సొంతం చేసుకోవాలి.
- ఆర్థిక, సామాజిక అంశాలు, జాతీయ ఆదాయం, తలసరి ఆదాయం, ఇండియన్ ఎకానమీ, గ్లోబలైజేషన్,భారత సామాజిక విధానం, ఆర్థిక వ్యవస్థ, ఆర్‌బీఐ, ఇతర ఆర్థిక సంస్థలు, ఆర్‌బీఐ విధులు, దేశంలో బ్యాంకింగ్ వ్యవస్థ, ఫైనాన్షియల్ మార్కెట్స్, పీపీపీ, కార్పొరేట్ గవర్నెన్స్, బడ్జెట్, ద్రవ్యోల్బణం, ఫిన్‌టెక్, మేనేజ్‌మెంట్ ప్రాథమిక అంశాలు, లీడర్‌షిప్, ఆర్గనైజేషనల్ బిహేవియర్ వంటి అంశాలపై అవగాహన పొందాలి.
- గ్రేడ్–బి ఆఫీసర్ డీఈపీఆర్ అభ్యర్థులు పీజీ స్థాయిలో ఎకనామిక్స్ పుస్తకాలతోపాటు ఆర్‌బీఐ ప్రచురణలు,వార్షిక నివేదికలు,బ్యాంకింగ్ రంగం తీరుపై విడుదలవుతున్న నివేదికలు, ద్రవ్య విధానం, ఎకనామిక్ సర్వేలను అధ్యయనం చేయాలి.
- గ్రేడ్–బి ఆఫీసర్ డీఐఎస్ఎం అభ్యర్థులు ప్రాబబిలిటీ, స్టాండర్డ్ డిస్ట్రిబ్యూషన్, శాంపిల్ థియరీ, ఎస్టిమేషన్, అనాలిసిస్ ఆఫ్ వేరియన్స్, టెస్టింగ్ ఆఫ్ హైపోథిసెస్, లీనియర్ మోడల్స్ అండ్ ఎకనామిక్ స్టాటిస్టిక్స్, న్యూమరికల్ అనాలిసిస్ అండ్ బేసిక్ కంప్యూటర్ టెక్నిక్స్ వంటి అంశాలపై పట్టు సాధించాలి.
- ఇంగ్లిష్‌కు సంబంధించి కాంప్రహెన్షన్, రీడింగ్, ప్యాసేజ్‌లను అర్థం చేసుకోవడం, భావ వ్యక్తీకరణలపై దృష్టి పెట్టాలి.
- గ్రేడ్–బి ఆఫీసర్ జనరల్..పేపర్–1లో ఉండే జనరల్ అవేర్‌నెస్ కోసం స్టాక్ జీకే అంశాలు, కరెంట్ అఫైర్స్‌పై అవగాహన పెంచుకోవాలి. అదే విధంగా హిస్టరీ, ఎకానమీ, జాగ్రఫీలపై ప్రత్యేక దృష్టి సారించాలి. ఇంగ్లిష్ లాంగ్వేజ్‌కు సంబంధించి గ్రామర్ అంశాలను పూర్తి స్థాయిలో చదవాలి. క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌లో అర్థమెటిక్ సంబంధిత అంశాలు(రేషియోస్, పర్సంటేజెస్, టైమ్ అండ్ వర్క్, టైమ్ అండ్ డిస్టెన్స్, రిలేషన్స్ తదితర)పై అవగాహన పొందాలి. రీజనింగ్‌కు సంబంధించి కోడింగ్, డీ–కోడింగ్, సిలాజిజమ్, నంబర్ సిరీస్‌లపై దృష్టి పెట్టాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** మే 9–జూన్ 9, 2023
- **ఆఫీసర్ డీఈపీఆర్, డీఐఎస్ఎం పరీక్ష కేంద్రాలు:** హైదారాబాద్
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.rbi.org.in

క్లుప్తంగా...

19న తుంగభద్ర బోర్డు భేటీ

- 2023–24 నీటి సంవత్సరంలో జలాల పంపిణీనే అజెండా

సాక్షి, అమరావతి: జూన్ 1 నుంచి ప్రారంభమయ్యే 2023–24 నీటి సంవత్సరంలో తుంగభద్ర జలాల పంపిణీయే అజెండాగా తుంగభద్ర బోర్డు ఈనెల 19వ తేదీన సమావేశమవుతోంది. హైదరాబాద్‌లోని జలసౌధలో తుంగభద్ర బోర్డు చైర్మన్ డీఎం రాయ్‌పురే అధ్యక్షతన జరిగే బోర్డు 219వ సర్వ సభ్య సమావేశంలో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ జలవనరుల శాఖల ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. 2022–23 నీటి సంవత్సరంలో తుంగభద్ర డ్యామ్ వద్ద నీటి లభ్యత.. మూడు రాష్ట్రాలకు దామాషా పద్ధతిలో పంపిణీ చేసిన వాటాలు.. వినియోగించుకున్న జలాలపై చర్చించనున్నారు. బోర్డు పరిధిలో తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ, దిగువ కాలువ ఆధునికీకరణపైనా చర్చిస్తారు.

ఈఏపీసెట్‌కు 93.93 శాతం

- ప్రశాంతంగా ముగిసిన తొలిరోజు పరీక్ష
- తూ.గోదావరిలో అత్యధిక శాతం ప.గోదావరిలో అత్యల్పం



అనంతపురంలోని పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న జింకా రంగజనార్దన

సాక్షి, అమరావతి/అనంతపురం: రాష్ట్రంలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఏపీ ఈఏపీసెట్–2023 తొలిరోజు పరీక్ష సోమవారం ప్రశాంతంగా ముగిసింది. తొలిరోజు పరీక్షకు 93.93 శాతం మంది హాజరయినట్లు ఉన్నత ఈఏపీ సెట్ చైర్మన్ ప్రొఫెసర్ రంగ జనార్దన, కన్వీనర్ ప్రొఫెసర్ సి.శోభాబిందు పేర్కొన్నారు. ఈఏపీ సెట్ పరీక్షలను సోమవారం నుంచి ఈనెల 19వ తేదీవరకు నిర్వహించనున్న సంగతి తెలిసిందే. రోజూ రెండు సెషన్లుగా ఉదయం, మధ్యాహ్నం ఈ పరీక్షను నిర్వహిస్తున్నారు. సోమవారం రెండు సెషన్లకు కలిపి 53,235 మంది హాజరు కావలసి ఉండగా 50,004 మంది హాజరయ్యారు. తూర్పు గోదావరి జిల్లాలో అత్యధికంగా 97.08 శాతం మంది, అతి తక్కువగా పశ్చిమగోదావరిలో 92.22 శాతం మంది పరీక్ష రాశారు. కాగా, జింకా రంగజనార్దన అనంతపురంలోని అనంతలక్ష్మీ ఇంజనీరింగ్ కళాశాల, కడపలోని కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం కళాశాలలోని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

ప్రభుత్వ శాఖల్లో న్యాయ వివాదాల సత్వర పరిష్కారం

ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వం ● లీగల్ మేనేజ్‌మెంట్ యూనిట్, లీగల్ మేనేజ్‌మెంట్ ఆర్గనైజేషన్ ఏర్పాటు

- ఎల్ఎంవోగా ప్రముఖ న్యాయ సేవల సంస్థ దక్ష సొసైటీ
- ఎల్ఎంయూలో సీఎస్ అధ్యక్షతన అడ్వైజరీ కమిటీ
- ఆర్థిక శాఖ ప్రత్యేక సీఎస్ అధ్యక్షతన ఎగ్జిక్యూటివ్ కమిటీ
- కేసుల సమీక్షకు అడ్వైజరీ కమిటీ రెండు నెలలకోసారి సమావేశం
- ఎగ్జిక్యూటివ్ కమిటీ 15 రోజులకోసారి భేటీ



సాక్షి, అమరావతి: వివిధ శాఖల్లో పెరిగిపోతున్న న్యాయ వివాదాలను వేగంగా పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. ఇందుకోసం లీగల్ మేనేజ్‌మెంట్ యూనిట్ (ఎల్ఎంయూ), లీగల్ మేనేజ్‌మెంట్ ఆర్గనైజేషన్ (ఎల్ఎంవో) పేరుతో రెండు ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేసింది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. న్యాయ కేసుల పరిష్కారానికి ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ లీగల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ (ఓఎల్‌సీఎంఎస్) ఏర్పాటు చేసిన తర్వాత నమోదవుతున్న కేసుల్లో అత్యధిక శాతం ఆర్థికపరమైనవే. వీటికి న్యాయపరంగా పాటించాల్సిన ప్రోటోకాల్స్, పరిష్కారం తదితర అంశాలపై ఉద్యోగులకు అవగాహన లేకపోవడం కారణంగా గుర్తించింది. ఈ సమస్య పరిష్కారానికి ఏపీ సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ సిస్టమ్స్ అండ్ సర్వీసెస్ (ఏపీసీఎఫ్ఎస్ఎస్) లీగల్ మేనేజ్‌మెంట్ యూనిట్, లీగల్ మేనేజ్‌మెంట్ ఆర్గనైజేషన్ సహాయం తీసుకోనున్నట్లు ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. ఎల్ఎంయూ, ఎల్ఎంవో విధివిధానాలను స్పష్టంగా పేర్కొన్నారు.

ఎల్ఎంయూ

సీనియర్, జూనియర్ న్యాయ విశ్లేషకులు, ప్రోగ్రామ్ మేనేజర్, డేటా ఎనలటిక్స్ సభ్యులతో లీగల్ మేనేజ్‌మెంట్ యూనిట్ ఏర్పాటు చేస్తారు. ఇది ఏపీసీఎఫ్ఎస్ఎస్‌కి గవర్నెన్స్ కన్సల్టెన్సీ వింగ్‌గా పనిచేస్తుంది. వివిధ శాఖల్లో న్యాయపరంగా ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటికి పరిష్కార మార్గాలతో పాటు అన్ని ప్రభుత్వ విభాగాల్లో ఓఎల్‌సీఎంఎస్‌ను సమర్థవంతంగా అమలు చేసేలా చర్యలు తీసుకుంటుంది. న్యాయ శాఖ అధికారుల సూచనలతో ప్రతి విభాగంలో లిటిగేషన్ మేనేజ్‌మెంట్ ప్రోటోకాల్స్, టెంప్లెట్స్, అధికారులకు సూచనలు ఇచ్చే వ్యవస్థ ఏర్పాటు చేస్తుంది. ఇందుకోసం ఎల్ఎంయూకు అడ్వైజరీ, ఎగ్జిక్యూటివ్ కమిటీలను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన అడ్వొకేట్ జనరల్ కో చైర్‌పర్సన్‌గా ఉండే ఈ అడ్వైజరీ కమిటీలో రెవెన్యూ, ఆర్థిక, పీఆర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, హోం, పాఠశాల విద్య, ఉన్నత విద్య ముఖ్య కార్యదర్శులు, ఫైనాన్స్, జీఏడీ కార్యదర్శులు, ఓఎల్‌సీఎంఎస్ నోడల్ ఆఫీసర్ సభ్యులుగా ఉంటారు. న్యాయ శాఖ కార్యదర్శి సభ్య కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఈ కమిటీ రెండు నెలలకు ఒకసారి సమావేశమై అన్ని విభాగాల్లో అమలవుతున్న ప్రాజెక్టులు, వాటి పనితీరు, న్యాయపరమైన ఇబ్బందులు వంటి వాటిని గుర్తించి పరిష్కరించాలి. రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అధ్యక్షునిగా వివిధ శాఖల విభాగాధిపతులతో కూడిన 12 మంది సభ్యులతో ఎగ్జిక్యూటివ్ కమిటీని ఏర్పాటుచేశారు. ఈ కమిటీ ప్రతి 15 రోజులకు ఒకసారి సమావేశమై పర్యవేక్షిస్తుండాలి.

ఎల్ఎంవో

సమస్యలను వేగంగా పరిష్కరించడానికి ఎల్ఎంయూ సహకారం అందిస్తుంది. న్యాయపరంగా కేసులు వచ్చినప్పుడు ఎలా వ్యవహరించాలి, అధికారులు, ప్రభుత్వ ప్లీడర్లు, ఏజీ కౌన్సిల్ ఆఫీసర్ల సమాచారం త్వరతగతిన చేరేలా ఈ వ్యవస్థ పనిచేస్తుంది. ఎల్ఎంవోగా ప్రముఖ న్యాయసేవల సంస్థ దక్ష సొసైటీ వ్యవహరించనున్నట్లు ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు.

స్పేస్ సైన్స్‌లో అపార అవకాశాలు

- సద్వినియోగం చేసుకొని శాస్త్రవేత్తలుగా ఎదగండి
- యువికా–2023ను ప్రారంభించిన ఇస్రో చైర్మన్ సోమనాథ్



మాట్లాడుతున్న షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): స్పేస్ సైన్స్‌లో అపార అవకాశాలున్నాయని.. విద్యార్థులంతా దీనిపై దృష్టి సారించి శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ సూచించారు. ఇస్రోకు చెందిన ఏడు సెంటర్లలో నిర్వహిస్తున్న యువికా–2023 కార్యక్రమాన్ని బెంగళూరులోని ఇస్రో ప్రధాన కార్యాలయం నుంచి వర్చువల్‌గా ఆయన ప్రారంభించారు. యువికాకు దేశవ్యాప్తంగా 353 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఎంపిక చేశారు. ఇందులో 56 మంది విద్యార్థులు శ్రీహరికోటలోని షార్ కేంద్రానికి సోమవారం విచ్చేశారు. ఈ సందర్భంగా ఇస్రో చైర్మన్ సోమనాథ్, షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ మాట్లాడుతూ.. భారత్ విద్యార్థులు తేలిక పాటి ఉపగ్రహాలు తయారు చేసే స్థాయికి ఎదగడం అభినందనీయమన్నారు. స్పేస్ సైన్స్‌కు వాణిజ్యపరంగా మంచి డిమాండ్ ఉండటంతో ప్రైవేట్‌గా అనేక అంతరిక్ష సంస్థలు ఆవిర్భవిస్తున్నాయని చెప్పారు. అందుకే విద్యార్థులు దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో షార్ అసోసియేట్ డైరెక్టర్ ఆర్.వెంకట్రామన్, షార్ కంట్రోలర్ శ్రీనివాసులురెడ్డి, గ్రూప్ డైరెక్టర్ గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మిగిలిన డీఎస్సీ-98 అభ్యర్థులకూ న్యాయం చేయండి

విద్యాశాఖ మంత్రి బొత్సకు అభ్యర్థుల వినతి

సాక్షి, అమరావతి: డీఎస్సీ–1998లో అర్హత సాధించిన 4,072 అభ్యర్థులకు ప్రభుత్వం కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగాలు కల్పించిందని, మిగిలిపోయిన 2,600 మందికి కూడా న్యాయం చేయాలని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను కోరారు. సోమవారం అభ్యర్థులు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావుతో కలిసి మంత్రిని విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. 25 ఏళ్లుగా తాము అనేక పోరాటాలు, నిరసనలు వ్యక్తం చేసినా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తప్ప మరెవరూ తమ గోడు పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు చేపట్టిన నియామకాల్లో రూల్ అఫ్ రిజర్వేషన్లు పాటించలేదని, దళిత, గిరిజన, బీసీ, వికలాంగులు, మహిళలకు అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. దీనిపై పరిశీలించి అర్హులైన మిగిలిన అభ్యర్థులకు కూడా న్యాయం చేయాలని మంత్రిని కోరారు.

పోలీస్ నియామక పరీక్షల్లో గ్రేస్ మార్కులు ఇవ్వాలి

ప్రభుత్వ నియామకాల్లో భాగంగా ఇటీవల నిర్వహించిన ఎస్ఐ, కానిస్టేబుల్ పరీక్షల్లో అభ్యర్థులకు 15 గ్రేస్ మార్కులు కల్పించాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు సమయం హేమంత్ కుమార్ కోరారు. సోమవారం విజయవాడలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రశ్నపత్రంలో పెద్దపెద్ద ప్రశ్నలు ఇవ్వడంతో వాటిని రాసే సమయం లేక ఎక్కువ మంది అభ్యర్థులు ఇబ్బందిపడ్డారని తెలిపారు.

'సహారా క్రెడిట్ కోఆపరేటివ్' ఎండీకి అరెస్టు వారెంట్

కర్నూలు(లీగల్): డిపాజిట్ మొత్తాన్ని వడ్డీతో సహా చెల్లించాలన్న తమ ఆదేశాలను అమలు చేయని సహారా క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ, స్టార్స్ మల్టీపర్పస్ కోఆపరేటివ్ సొసైటీ మేనేజింగ్ డైరెక్టర్, ప్రాంతీయ మేనేజర్లపై జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. కమిషన్ అధ్యక్షుడు కె.కిశోర్‌కుమార్, సభ్యులు ఎస్.నారాయణరెడ్డి, నజీమా కౌసర్‌లతో కూడిన బెంచ్ సోమవారం వీరికి నాన్‌బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. తదుపరి విచారణను జూన్ 6వ తేదీకి వాయిదా వేసింది. కాలపరిమితి ముగిసినా తమ డిపాజిట్ సొమ్మును చెల్లించడం లేదంటూ పలు వురు డిపాజిటర్లు గతేడాది కమిషన్‌ను ఆశ్రయించా రు. వీటిని విచారించిన అనంతరం.. డిపాజిటర్లకు 9 శాతం వడ్డీతో పాటు డిపాజిట్ మొత్తాన్ని చెల్లించాలని కమిషన్ ఆదేశించింది. అలాగే పరిహారంగా రూ.10 వేలు, కోర్టు ఖర్చులకు రూ.5 వేలు చెల్లించా లని ఈ ఏడాది ఫిబ్రవరిలో స్పష్టం చేసింది. ఈ ఆదేశా లను సహారా, స్టార్స్ సొసైటీలు అమలు చేయకపోవ డంతో మరోసారి డిపాజిటర్లు కమిషన్‌ను ఆశ్రయించారు.

జగజ్జననీ చిట్‌ఫండ్‌లో సీఐడీ సోదాలు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరంలో టీడీపీ నేత ఆదిరెడ్డి అప్పారావుకు చెందిన జగజ్జననీ చిట్‌ఫండ్ కంపెనీలో సీఐడీ మరోసారి సోదాలు నిర్వహించింది. సోమవారం తిలక్‌రోడ్డులోని జగజ్జననీ చిట్‌ఫండ్ కార్యాలయానికి సీఐడీ అధికారులు, సిబ్బంది చేరుకున్నారు. జగజ్జననీ సిబ్బందిని విచారించి.. పలు కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. రాత్రి వరకు కూడా సోదాలు కొనసాగుతూనే ఉన్నాయి.

ఆన్‌లైన్‌లో ఇంటర్ రీ వెరిఫికేషన్ ఫలితాలు

సాక్షి, అమరావతి: ఇంటర్మీడియెట్‌లో మార్కులు తక్కువగా వచ్చి రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకున్న వారి ఫలితాలను విడుదల చేశారు. ఫలితాలను ఆన్‌లైన్‌లో ఉంచినట్టు ఇంటర్ బోర్డు సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. విద్యార్థులకు మంగళవారం ఉదయం నుంచి http:// bie. ap. gov. in వెబ్‌సైట్‌లో పొందవచ్చు.

చందాదారుల భద్రతే లక్ష్యంగా 'ఈ-చిట్స్'

లాంఛనంగా ప్రారంభించిన మంత్రి ధర్మాన ప్రసాదరావు



ఈ-చిట్స్ ఎలక్ట్రానిక్ అప్లికేషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

సాక్షి, అమరావతి: చందాదారుల భద్రతే ప్రధాన లక్ష్యంగా రాష్ట్రంలో 'ఈ-చిట్స్' సేవలను అమల్లోకి తీసుకొస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు వెల్లడించారు. దీనికి సంబంధించిన ఎలక్ట్రానిక్ అప్లికేషన్‌ను వెలగపూడి సచివాలయంలో సోమవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. చిట్‌ఫండ్ కంపెనీల మోసాలకు సంబంధించి ఇటీవల కాలంలో దేశవ్యాప్తంగా పలు కేసులు నమోదవుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రజలు ఇటువంటి మోసాలకు గురికాకుండా చూసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఈ-చిట్స్ సేవలను అమల్లోకి తెచ్చిందన్నారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ రూపొందించిన ఈ నూతన ఎలక్ట్రానిక్ విధానాన్ని ఇకపై రాష్ట్రంలోని చిట్‌ఫండ్ కంపెనీలన్నీ తప్పనిసరిగా అనుసరించాల్సి ఉంటుందన్నారు. చిట్‌ఫండ్ లావాదేవీలను ఆన్‌లైన్ ద్వారానే నిర్వహించాల్సి ఉందని, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు కూడా ఆన్‌లైన్ విధానంలోనే సంబంధిత లావాదేవీలను పరిశీలించి ఆమోదిస్తారని తెలిపారు. 'ఈ-చిట్స్' విధానంవల్ల చిట్‌ఫండ్ కంపెనీల మోసాలను అరికట్టడమే కాక చందాదారులు నష్టపోకుండా సహకరిస్తుందని మంత్రి చెప్పారు.చిట్‌ఫండ్ కంపెనీల విషయంలో చందాదారులు కూడా ఎంతో అప్రమత్తంగా ఉంటూ తమ ప్రాంతాల్లో నడుస్తున్న చిట్‌ఫండ్ సంస్థలు రిజిస్టర్ అయ్యాయా? లేదా? అనే విషయాన్ని ముందుగా ఈ విధానంలో తెలుసుకోవచ్చన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో ఉండే అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్‌ని కూడా ఈ విషయంలో సంప్రదించవచ్చన్నారు. అదే విధంగా చిట్‌ఫండ్ కంపెనీల నుండి ఎదుర్కొనే ఎటువంటి సమస్యలైనా ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసే అవకాశం ఉంటుందని, ఆ సమస్యలను సత్వరమే అధికారులు పరిష్కరించే అవకాశం ఈ నూతన విధానం ద్వారా అమల్లోకి వచ్చిందన్నారు. ఇంకా అదనపు వివరాలను https:// echits.rs. ap.gov.in నుండి తెలుసుకోవచ్చని మంత్రి ధర్మాన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్ అండ్ ఐజీ వి.రామకృష్ణ, అడిషనల్ ఐజీ ఉదయభాస్కర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రేపు మహాయజ్ఞ అఖండ పూర్ణాహుతి

- హాజరుకానున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్ర చరిత్రలోనే కనివినీ ఎరుగని రీతిలో ప్రజలందరి సంక్షేమాన్ని కాంక్షిస్తూ దేవదాయ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అఖండ యజ్ఞం బుధవారం పూర్ణాహుతితో పరిసమాప్తం కానుంది. ఉదయం 11.38 గంటలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అఖండ పూర్ణాహుతి కార్యక్రమం జరుగు తుందని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ సోమవారం తెలిపారు. అఖండ మహా పూర్ణహుతి కార్యక్రమం అనంతరం భక్తులకు అన్న సంతర్పణ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అఖండ పూర్ణాహుతి సందర్భంగా 35 కౌంటర్లలో యజ్ఞ ప్రసాదం, అన్న ప్రసాదం అందిస్తామని వివరించారు. మంగళవారం ఉదయం 9 గంటల నుంచి 500 మంది మహిళల ఆధ్వర్యంలో సుహాసిని పూజ కొనసాగుతుందని.. సాయంత్రం లక్ష్మీ అమ్మవారికి లక్ష కుంకుమార్చన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. అమ్మవారికి అభిషేకం అనంతరం పరమ శివుడికి అత్యంత ప్రీతిపాత్రమైన నల్ల కలువలతో విశేష పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

నెయ్యి కొనుగోలుపై అసత్య ప్రచారం

మహా యజ్ఞంలో వినియోగించిన నెయ్యిపై కొందరు అవాస్తవాలను, అసత్యాలను ప్రచారం చేస్తున్నారని మంత్రి కొట్టు సత్యనారాయణ స్పష్టం చేశారు. ఎంతో విశేషం గల ఈ యజ్ఞంలో వాడే ద్రవ్యాలపై భక్తులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం సబబు కాదన్నారు. యజ్ఞంలో వినియోగించే పవిత్రమైన నెయ్యి భగవత్ సంకల్పంతో పొగ రూపంలో మేఘాలను చేరి సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలు సమృద్ధిగా పండుతాయని పురాణాల్లో చెప్పారని.. అంతటి పవిత్రమైన యజ్ఞంలో ధార్మిక పరిషత్, ఆగమ, అర్చక, వైదిక పండితుల సలహా మండలి సూచనలతో స్వచ్ఛమైన దేశీయ ఆవుల నుండి తయారు చేసిన నెయ్యిని వినియోగిస్తున్నామన్నారు. గతంలో హైదరాబాద్ శివారులో శ్రీరామానుజ సహస్రాబ్ది ఉత్సవాల సమయంలో శ్రీ చినజీయర్ స్వామి ఆశ్రమం ఆవు నెయ్యిని కొనుగోలు చేసిన సంస్థను, అప్పట్లో వారు చెల్లించిన ధర కంటే తక్కువకే తాము కొనుగోలు చేసినట్టు వివరించారు. పూర్తి పారదర్శక విధానంలో కొనుగోలు జరిగిందన్నారు. అధిక ధరకు నెయ్యి కొన్నామన్న వార్తలు పూర్తిగా అవాస్తవమన్నారు.

నేడు విశాఖలో ఎస్ఎల్‌బీసీ సమావేశం

మహారాణిపేట (విశాఖ దక్షిణ): విశాఖపట్నంలో మంగళవారం 223వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) సమావేశం జరగనుంది. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు జరిగే ఈ సమావేశంలో కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి డాక్టర్ భగవత్ కార్డ్, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి, లీడ్ బ్యాంకులతోపాటు పలు బ్యాంకుల అధికారులు పాల్గొంటారు.

'ఈనాడు' అసత్య యజ్ఞంలో 'వాస్తవాలే' సమిధలు

హిందూ ధర్మ పరిరక్షణకు చేపట్టిన యజ్ఞం పైనా అసత్య ప్రచారమే

- యజ్ఞంలో వాడే నెయ్యిని తక్కువ ధరకే కొన్నా తప్పుడు రాతలు
- చిన జీయర్ స్వామి ఆశ్రమం కొన్న యజ్ఞ నెయ్యి ధర కిలో రూ.1,500 పైనే
- దేవదాయ శాఖ కొన్నది రూ. 1,071కే
- ఒకే సంస్థ నుంచి బేరమాడి తక్కువకు కొన్నా 'ఈనాడు'కు తప్పేనట
- యజ్ఞాల్లో వాడే దేశీ ఆవు పాల నెయ్యికి, డెయిరీల పచ్చి పాల నెయ్యితో పోలిక
- ప్రసాదాల నెయ్యికి, యజ్ఞంలో వాడే నెయ్యికి తేడా ఉంటుందన్న ఆగమ పండితులు
- సీజీఎఫ్ నిధులను బాబు ప్రభుత్వం మళ్లించినా ఈనాడుకు ఒప్పే
- సీజీఎఫ్ నిధులు రూ. 10 కోట్లతో దేవదాయ శాఖ కమిషనర్ కార్యాలయం నిర్మించిన బాబు సర్కార్
- రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా హిందూ ధర్మ ప్రచారం చేస్తున్న జగన్ సర్కారు
- అదీ ఈనాడుకు తప్పే



సాక్షి, అమరావతి: వాస్తవాలన్నింటినీ సమిధలుగా మార్చి 'ఈనాడు' అసత్యాల యజ్ఞం చేస్తోంది. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ చూడని స్థాయిలో రాష్ట్రంలో సాగుతున్న అతి పెద్ద హిందూ ధార్మిక కార్యక్రమం పైనే ఓ అసత్య కథనాన్ని అల్లింది. సనాతన హిందూ సంప్రదాయం, ధర్మ ఔన్నత్యాన్ని భవిష్యత్ తరాలకి చాటి చెప్పేలా, పురాణాలలో చెప్పిన మహత్తర యజ్ఞాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేయిస్తుంటే 'ఈనాడు' ఏమాత్రం ఓర్వలేకపోయింది. పలువురు పీఠాధిపతుల సమక్షంలో అనేక మంది వేద పండితులు, వందలాది రుత్విక్కుల ఆధ్వర్యంలో విజయవాడలో అత్యంత భక్తి శ్రద్ధలతో జరుగుతున్న 'అష్టోత్తర శత కుండాత్మక చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహాయజ్ఞం' పైనా విషం చిమ్మింది. దానికి పెట్టే ఖర్చును ''దేవదాయ సొత్తే.. సమిధ'' అంటూ అబద్ధాలు అచ్చేసింది. హిందూ ధర్మ వ్యాప్తికి, దైవ కార్యక్రమాలకు దేవదాయ శాఖ డబ్బు కాకుండా మరే డబ్బును ఖర్చు చేస్తారన్న కనీస జ్ఞానాన్ని కూడా ప్రదర్శించలేకపోయింది ఆ పత్రిక. కేవలం దైవ, హిందూ ధర్మ ప్రచారాలకు మాత్రమే ఉపయోగించాల్సిన కామన్ గుడ్ ఫండ్ (సీజీఎఫ్) నిధులను చంద్రబాబు ప్రభుత్వం అడ్డగోలుగా ఖర్చు చేసినా కిమ్మనని ఈనాడు.. ఇప్పుడు ధర్మ ప్రచారానికి ఉపయోగించడమూ నేరమే అంటోంది. నాడు చంద్రబాబు సర్కారు ప్రభుత్వ ఖర్చుతో నిర్మించాల్సిన దేవదాయ శాఖ కమిషనర్ కార్యాలయం భవనానికి రూ.10 కోట్ల సీజీఎఫ్ నిధులు ఖర్చు చేసింది. ఇదంతా కళ్లప్పగించి చూస్తూ ఉండిపోయిన 'ఈనాడు'.. ఇప్పుడు సనాతన హిందూ ధర్మ పరిరక్షణతో పాటు దైవ కార్యక్రమాలకు ఖర్చు పెట్టడాన్ని తప్పుపడుతోంది. ఈనాడు కథనంలో అవాస్తవాలను దేవదాయ శాఖ కమిషనర్ బట్టబయలు చేశారు. వాస్తవాలను వివరించారు.

ఆ వాస్తవాలిలా ఉన్నాయి..

● **ఈనాడు ఆరోపణ:**
మహా యజ్ఞానికి ఉపయోగించే నెయ్యిని దేవదాయ శాఖ కిలో రూ. 1400లు పెట్టి కొంటోంది. మార్కెట్‌లో దాని ధర రూ. 600 – 650 మాత్రమే.

దేవదాయ శాఖ కమిషనర్ చెబుతున్న వాస్తవం :
కిలో రూ. 1,400 అన్నది పచ్చి అబద్ధం. యజ్ఞ నిర్వహణకు ఉపయోగించే పవిత్ర దేశీ ఆవు నెయ్యిని కొంటున్నది రూ. 1,071కే. శ్రీ రామానుజ సహస్రాబ్ది ఉత్సవముల సందర్భంగా హైదరాబాద్‌లో చిన జీయర్ స్వామి ఆశ్రమం నిర్వహించిన యజ్ఞానికి ఆ సంస్థ కొన్న ధరకన్నా దేవదాయ శాఖ కొన్న ఆవు నెయ్యి ధర చాలా తక్కువ. ఈ రెండు యజ్ఞాలకూ దేశీ ఆవు నెయ్యి సరఫరా చేసింది ఒకే సంస్థ. చిన జీయర్ స్వామి వారి ఆశ్రమం 15 లీటర్ల ఆవు నెయ్యి టిన్ను రూ. 24107.14కి కొనగా, దేవదాయ శాఖ బేరమాడి 15 లీటర్ల టిన్నును రూ. 16,071కే కొన్నది.

● **ఆరోపణ:**
దుర్గగుడి కొనే నెయ్యి ధరకన్నా యజ్ఞానికి ఎక్కువ ధర.

వాస్తవం: వివిధ ఆలయాలు కొనే నెయ్యి అత్యధికం ప్రసాదాల తయారీకి మాత్రమే వినియోగిస్తారు. యజ్ఞ కార్యక్రమాలకు ఉపయోగించే నెయ్యి పూర్తి భిన్నమైనది. యజ్ఞ యాగాదులకు వినియోగించవలసిన నెయ్యి పూర్తిగా స్వదేశీ ఆవు పాలను మరిగించి పెరుగు చేసి, ఆ పెరుగు నుండి తీసిన వెన్నను మరిగించి తయారు చేసిన నెయ్యి మాత్రమే అయి ఉండాలి.

● **ఆరోపణ:** యజ్ఞ సామగ్రిని అధిక ధరలకు కొన్నారు. దీక్షా వస్త్రాలకే రూ. 20 లక్షలు ఖర్చు చేశారు.

వాస్తవం: యజ్ఞ కార్యక్రమంలో పాల్గొనే వేద పండితులకు, రుత్విక్కులు, పరిచారికలు, భజంత్రీలకు కలిపి మొత్తం 688 మందికి ఒక్కొక్కరి మూడు దీక్షా వస్త్రాల చొప్పున మొత్తం 2064 అందజేయాలని నిర్ణయం జరిగింది. మహా యజ్ఞంలో సుమారు 15 మంది పీఠాధిపతులను ఆహ్వానించినందున హైందవ సంప్రదాయాన్ని అనుసరించి వారికి ఉపయోగించే వస్త్రాలు ఏక తానుతో చేసినవి అయి ఉండాలి. దీక్షా వస్త్రాల కొనుగోలుకు రూ. 11.35 లక్షలు ఖర్చు చేశాం. 'ఈనాడు'లో పేర్కొన్నట్టు రూ.20 లక్షలు కాదు.

● **ఆరోపణ:**
మహా యజ్ఞం నిర్వహణకు పెద్ద ఆలయాల నుంచి నిధులు సమీకరించారు.

వాస్తవం:
ఆలయాల ప్రథమ కర్తవ్యం సనాతన హిందూ ధర్మాన్ని ప్రోత్సహించటం, యజ్ఞ యాగాదులు నిర్వహించటం.

● **ఈనాడు ఆరోపణ:**
ప్రతి పనినీ అధికారులు దుర్గగుడికే అప్పగిస్తున్నారు

కమిషనర్ చెబుతున్న వాస్తవం:
మహా యజ్ఞం నిర్వహణకు వచ్చిన వివిధ శాఖల సిబ్బందికి, స్వచ్ఛంద సేవా సంస్థల వలంటీర్లకు మాత్రమే దుర్గమ్మ అమ్మవారి దేవస్థానం నుంచి భోజనాలు ఏర్పాటు చేశాం.

ఫ్యామిలీ డాక్టర్‌తో అద్భుత ఫలితాలు

వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని

- ఫ్యామిలీ డాక్టర్ అమలుపై క్షేత్రస్థాయిలో పరిశీలన
- వైద్య సేవలు అందుతున్న తీరుపై ప్రజల నుంచి వివరాల సేకరణ



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి రజిని

నాదెండ్ల: ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానం అద్భుత ఫలితాలు సాధిస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని కితాబిచ్చారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం అమలు తీరును పరిశీలించేందుకు సోమవారం ఆమె పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం తూబాడు గ్రామంలో క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. గ్రామానికి చెందిన నాయుడు కోటయ్య, గొల్లలమూడి తేరేజమ్మ, దావల మరియమ్మ తదితరులు తీవ్ర అనారోగ్యంతో చికిత్స పొందుతుండగా.. మంత్రి రజని వారిళ్లకు వెళ్లారు. వారికి అందుతున్న వైద్యసేవపై ఆరా తీశారు. ఫ్యామిలీ డాక్టర్ మీ ఇళ్లకే వచ్చి వైద్యం చేస్తున్నారా, కావాల్సిన మందులిస్తున్నారా, నెలలో ఎన్నిసార్లు వస్తున్నారు, ఏం పరీక్షలు చేస్తున్నారు అంటూ ప్రశ్నించారు.

'ప్రతినెలా రెండుసార్లు వస్తున్నారు'

వైద్యులు ప్రతినెలా రెండుసార్లు తమ ఇళ్లకే వచ్చి వైద్యం అందిస్తున్నారని నాయుడు కోటయ్య, గొల్లలమూడి తేరేజమ్మ, దావల మరియమ్మ, వారి కుటుంబ సభ్యులు మంత్రి రజనికి వివరించారు. బీపీ, ఇతర అవసరమైన పరీక్షలు చేస్తున్నారన్నారు. గతంలో ఇలా ఎప్పుడూ లేదని, ప్రభుత్వ వైద్యుడే తమ ఇళ్లకు వచ్చి వైద్యం చేయడాన్ని నమ్మలేకపోతున్నామని ఆనందం వ్యక్తం చేశారు. ఎంఎల్ హెచ్‌పీ, ఏఎన్ఎంలు కూడా నిరంతరం రోగులను పర్యవేక్షిస్తున్నారని చెప్పారు.

రికార్డులు పక్కాగా నిర్వహించండి

రోగులకు అందిస్తున్న వైద్యానికి సంబంధించి రికార్డులు పక్కాగా నిర్వహించాలని మంత్రి రజని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఓపీ సమయంలో ప్రతి రోగి ఆరోగ్య వివరాలు ఈహెచ్ఆర్‌లో నమోదయ్యేలా చొరవ చూపాలన్నారు. ఇళ్లకు, స్కూళ్లకు వెళ్లి ఆరోగ్య సేవలందించే సమయంలో రోగులు, పిల్లలతో ఆప్యాయంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తూబాడు గ్రామంలో ఈ ఒక్కరోజే ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ఏకంగా 266 మందికి ఓపీ సేవలు అందించామని చెప్పారు. ఈ స్థాయిలో గ్రామస్తులకు వైద్య సేవలు గతంలో ఎప్పుడూ అందలేదన్నారు. జగనన్న పరిపాలనలో తీసుకొచ్చిన గొప్ప సంస్కరణల్లో ఫ్యామిలీ డాక్టర్ విధానం ఒకటని ప్రశంసించారు. మంత్రి స్థానిక వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌కు వెళ్లి 104 వాహనం ద్వారా అందిస్తున్న వైద్య సేవలను కూడా పరిశీలించారు. అందుతున్న వైద్య సేవలపై ప్రజల స్పందనను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో వైద్య సిబ్బంది అందిస్తున్న సేవలను కూడా మంత్రి పరిశీలించారు. చిన్నారులకు నిర్వహిస్తున్న పరీక్షలను పరిశీలించారు.

ప్రజా స్పందన అద్భుతం

ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానంపై పూర్తిస్థాయిలో ఆరా తీశానని చెప్పారు. వైద్యులు అందిస్తున్న సేవలపై ప్రజల్లో అద్భుతమైన స్పందన కనిపిస్తోందని చెప్పారు. ఇప్పటివరకు ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 1.20 కోట్ల మందికి వైద్య సేవలు అందించామని చెప్పారు.

చంద్రబాబుపై చర్యలు తప్పవు

జగనన్న రాష్ట్ర ప్రజలకు ఎంతో మంచి చేస్తుంటే చంద్రబాబు జీర్ణించుకోలేకపోతున్నారని మంత్రి రజని ఎద్దేవా చేశారు. ఆయన ఎప్పుడూ నీచమైన రాజకీయాలే చేస్తుంటారని ధ్వజమెత్తారు. చంద్రబాబు ఇప్పుడు ఉంటున్న ఇంటిని అక్రమంగా నిర్మించారని తేలిందని చెప్పారు. దీన్ని అటాచ్ చేయాల్సిందిగా సీఐడీ ప్రభుత్వాన్ని కోరిందన్నారు. ఇలాంటి చీకటి కోణాలు ఎన్ని ఉన్నా దర్యాప్తులో బయటకు వస్తాయని, ప్రతి ఒక్క దానిపై చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. మంత్రి వెంట డీఎంహెచ్‌వో శోభారాణి, తదితరులు ఉన్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943